ఎన్ని సుగుణాలున్నా దయాగుణం ఒక్కటి లేకపోతే అవి నిష్ప్రయోజనాలనే చెప్పాలి. తప్పుచేయడం మానవలక్షణమైతే దాన్ని క్షమించి మంచి మార్గంలో పెట్టడం దివ్య లక్షణమవుతుంది. ఎన్ని అపరాధాలు చేసిన వాళ్ళనయినా భగవంతుడికి చేరువ చేసేది ఆయనలోని ఈ దయాగుణమే.

విశిష్టాద్వైత మతప్రవర్తకులైన ఆచార్యులలో భగవద్రామానుజుల తర్వాత అంతటివారుగా ప్రశస్తి పొందినవారు శ్రీ వేదాంతదేశికులు. వారు విశిష్టాద్వైత తత్త్వాన్ని విశదీకరిస్తూ పలు గ్రంథాలు రచించారు.

శ్రీ వేదాంతదేశికులు శ్రీ వేంకటేశ్వరస్వామి ఘంటావతారంగా ప్రసిద్ధి గన్నవారు. సకల తంత్ర స్వతంత్రులుగా, కవితార్కిక కేసరిగా కీర్తికెక్కినవారు.

వారు శ్రీ వేంకటేశ్వరస్వామివారి దయాగుణాన్ని 'దయాదేవి'గా అభివర్ణిస్తూ 108 శ్లోకాలను 'దయాశతకం' అన్న పేరుతో రచించారు. ఇందులో భగవంతుని దయ పెక్కువిధాలుగా వర్ణింపబడింది.

శ్రీరస్తు

శ్రీమద్వేదాంతదేశిక విరచితమైన

# దయాశతకము

ఆంధ్ర టీకా తాత్పర్య సమేతము

టీకాతాత్పర్య రచయిత

**శబ్దవంగీశవంశ్యులు, కోళియాలం శఠకోపాచార్యులు**

న్యాయ మీమాంసోభయ శిరోమణి, శ్రీవేంకటేశ్వర
సంస్కృత కళాశాలా న్యాయ మీమాంసాధ్యాపకులు
తిరుపతి

ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు**
**తిరుపతి**

**2016**

# DAYASATAKAMU

***A Commentary***

*By*

**K. Satagopacharyulu**

T.T.D. Religious Publication Series No. 1185
© All Rights Reserved

*First Print:* 2016

*Copies:* 2000

*Published by*
**Dr. D. SAMBASIVA RAO,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Office of the Editor-in-Chief,
T.T.D, Tirupati.

*Printed at*
***Tirumala Tirupati Devasthanams Press,***
Tirupati.

## ముందుమాట

సకల కల్యాణగుణాలకూ నిలయమైనవాడు భగవంతుడు. జ్ఞానం, బలం, ఐశ్వర్యం, వీర్యం, శక్తి, తేజస్సు – అనేవి షడ్గుణాలు. ఈ ఆరుగుణాల వల్లనే దేవుడు భగవంతుడుగా ప్రసిద్ధుడయ్యాడు.

ఈ గుణాలే కాక ఇంకా ఎన్నో గుణాలు భగవంతునిలో ఉన్నాయి. వాటిలో అన్నింటికంటే మేలైన గుణం దయ. అట్టి దయ సమగ్రంగా వుండడంవల్లనే 'దయానిధి'గా దేవుడు వినుతికెక్కాడు.

ఆ భగవానుడే కలియుగంలో శేషాచలంమీద శ్రీ వేంకటేశ్వరుడు అన్న అర్చామూర్తిగా వెలుగొందుతున్నాడు. కలియుగ ప్రత్యక్షదైవంగా ఈ దేవుడు కీర్తింపబడుతున్నాడు.

కవులు ఎన్నో విధాల భగవంతుణ్ణి వినుతిస్తూ గ్రంథాలు వ్రాశారు. పురాణాలలో శ్రీ వేంకటేశ్వరస్వామి చరిత్ర విపులంగా వివరింపబడివున్నది. భగవంతుని కల్యాణగుణాలను కవులు తమ తమ రచనలలో ఎడనెడా వర్ణించియున్నారు.

విశిష్టాద్వైత మతప్రవర్తకులైన ఆచార్యులలో భగవద్రామానుజుల తర్వాత అంతటివారుగా ప్రశస్తి పొందినవారు శ్రీ వేదాంతదేశికులు. వారు విశిష్టాద్వైత తత్త్వాన్ని విశదీకరిస్తూ పలు గ్రంథాలు రచించారు.

శ్రీ వేదాంతదేశికులు శ్రీ వేంకటేశ్వరస్వామి ఘంటావతారంగా ప్రసిద్ధి గన్నవారు. సకల తంత్ర స్వతంత్రులుగా, కవితార్కిక కేసరిగా కీర్తికెక్కినవారు.

వారు శ్రీ వేంకటేశ్వరస్వామివారి దయాగుణాన్ని 'దయాదేవి'గా అభివర్ణిస్తూ 108 శ్లోకాలను 'దయాశతకం' అన్న పేరుతో రచించారు. ఇందులో భగవంతుని దయ పెక్కువిధాలుగా వర్ణింపబడింది. 'ప్రపత్తి' అంటే శరణాగతి అందరికీ అందుబాటులో నున్న తత్త్వం. తద్ద్వారా భగవంతుని

అనుగ్రహాన్ని సులభంగా పొందవచ్చు. ఆ విషయం గూడా ఇందులో చక్కగా నిరూపింపబడింది. శ్రీమాన్ శఠకోపాచార్యస్వామివారు అతిరమణీయమైన వ్యాఖ్యను ఈ శతకానికి రచించి లోకోపకారం కావించారు.

ఇంతకుముందు రెండుసార్లు ముద్రితమై ఇప్పుడు దుర్లభమైపోయిన ఈ శతకాన్ని తృతీయ ముద్రణగా భక్తులకు అందిస్తున్నాము. దీన్ని చదివి పాఠకులు భగవద్దయకు పాత్రులు కాగలరని విశ్వసిస్తున్నాము.

సదా శ్రీవారి సేవలో....

**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి.

# FOREWORD

I have perused with very great interest the annotated Telugu rendering with meaning and paraphrase of Dayasatakam of Sri Vedanta Desika, by Sriman Kozhialam Sathagopachariar, Lecturer, Sri Venkateswara Oriental College, Tirupati. Besides his being double siromani in Tarka and Meemamsa and specialised in Vedanta, Sriman Sathagopachariar has the additional advantage of having had instruction in Vedanta under his Holiness Sri Kozhialam Swamigal. He was able to bring out not only the superficial meaning of the Dayasatakam which students of Vedanta may in general draw, but he has brought out the 'goodharthas' or the inner meanings which he learnt under the feet of his Acharya in the traditional method. Sriman Sathagopachariar has thus enabled the general public who can read Telugu to understand and appreciate the full force and the beneficient effect of the work.

Dayasatakam can easily be said to be the very essence of the writings of Sri Vedanta Desika. The doctrine of surrender has been emphasised and enlarged by Sri Vedanta Desika as the surest means of attaining salvation, even superior to Bhakti as it is possible for every individual. In Dayasatakam he goes a further step of surrendering himself not to the will of God, but even to the hill in which Sri Venkateswara dwells. He starts with the description of the hill as the personification or solidification of the sweet sugar juice of 'daya' mercy or compassion of the Lord.

The beauty of the sataka lies in this that the author elevates one of the qualities of the Lord to the position

of His foremost consort. In describing the importance of Daya or mercy as a quality Sri Desika states that there may be thousand qualities which the Lord may possess as gnana, Aisvarya etc., but in the absence of 'daya', all these good qualities would be of no avail. Strength and other qualities which the Lord possesses may be used or abused and it is only compassion or mercy which tempers the other qualities and converts them into useful attributes of the Lord. Therefore Sri Vedantadesika rightly gives 'daya' the position of the highest attribute of the Lord.

If ever man were to practice 'daya' in his daily relation with other beings, there would not be conflicts in this world. It is the quality of mercy that distinguishes a man from the beast. All wars arise out of conflicts in the mind and heart and so long as the seeds of conflict remain there, wars cannot be put an end to by mere reduction of armaments. The moment the seeds of conflicts are removed and when hatred gives place to love, discord yields to harmony and competition gives place to co-operation in all human relations, there will be eternal peace on the globe. Man has therefore to purify and transform himself from a beasty into a higher being. That can be done only by developing the single virtue of having mercy or compassion.

A study of this work of Sri Vedanta Desika can enable a man to get transformed to superior person in this world itself. Hitherto the importance of the sataka of Desika has not known to all but only to a few who belong to his Sampradaya.



I am glad that the Tirumala-Tirupati Devasthanams published in their monthly bulletins the Tamil commentary of the Sataka previously by the same author and now the Telugu edition is published. I am happy to know that commentary in Kannada language by Sriman Narasimhachari of Tumkur was also published in the bulletins. Sri D. Ramaswami Iyengar, Advocate, is writing at present a series on Dayasataka in English also, so that this great work may reach larger sections of the people. May this work live long and may it grow in usefulness.

**M. ANANTHASAYANAM IYENGAR,**

Camp: TIRUPATI

*Speaker, Lok Sabha,*

NEW DELHI.

# ముందుమాట

పరమ పురుషార్థమైన మోక్షాన్ని సాధించుకోవడానికి నిర్దేశించబడ్డ మార్గాలలో భక్తిమార్గం సర్వోత్తమం. ఈ భక్తిమార్గాన్ని చేరుకోవడానికి ప్రపత్తి–సర్వ సమర్పణబుద్ధి ప్రధానమైన ఉపాయం. ప్రపత్తివైపు ఆకర్షించేది భగవంతుడి కల్యాణగుణాలలో విశిష్టమైన దయాగుణం.

ఎన్ని సుగుణాలున్నా దయాగుణం ఒక్కటి లేకపోతే అవి నిష్ప్రయోజనాలనే చెప్పాలి. తప్పుచేయడం మానవలక్షణమైతే దాన్ని క్షమించి మంచి మార్గంలో పెట్టడం దివ్య లక్షణమవుతుంది. ఎన్ని అపరాధాలు చేసిన వాళ్ళనయినా భగవంతుడికి చేరువ చేసేది ఆయనలోని ఈ దయాగుణమే.

లోకంలో కూడా విజ్ఞానులను, వివేకవంతులను సైతం మానవోత్తములుగా, బహుజనా మోద పాత్రులుగా రూపొందించ గలిగింది దయాగుణం మాత్రమే. అలాంటి మహితాత్ముల మహనీయ దయాప్రవాహంలో అవగాహనతో అపరాధులు తమ మాలిన్యాన్ని ప్రక్షాళితం చేసుకుని పవిత్రమార్గాన పయనించ గలుగుతారు. లౌకికులైన మహాత్ముల దయకే ఇంత ప్రాధాన్యముంటే సర్వనియామకుడైన శ్రీమన్నారాయణుడి దయా విశేషానికి ఇంకెంత ప్రాముఖ్యముంటుందో చెప్పనవసరం లేదు.

శ్రీమద్వేదాంతదేశికులు స్వీయజీవితంలో ఎన్నో కష్టసుఖాలను ఎదుర్కొని ధీరోదాత్తుడుగా భావితరాలకు ఆదర్శమూర్తిగా నిలిచిన విద్వద్భక్తుడు. ఆ జ్ఞాన స్వరూపుడు తిరుమలకు విచ్చేసి శ్రీ వేంకటేశ్వర స్వామిని సందర్శించి ఈ అమోఘమైన దయాశతకాన్ని రచించి లోకానికి ప్రసాదించాడు. తిరుమలకొండ వర్ణనతో ప్రారంభమైన ఈ శతకం అనేక వేదాంత విషయాలను వివరించి దయాపారమ్య ప్రబోధంతో భరతవాక్యం పలుకుతున్నది.

తామరతంపరగా అనేక భాషలలో వెల్లివిరిసిన శ్రీ వేంకటేశ్వర సాహిత్యంలో శ్రీ మద్వేదాంతదేశికుల దయాశతకం అనర్ఘమణి కిరీటాయమానం. శ్రీ శరకోపాచార్యులుగారు ఈ గ్రంథానికి ప్రతి పదార్థ తాత్పర్య సహితమైన వ్యాఖ్యానం వ్రాశారు. ఎన్నో సంప్రదాయబద్ధమైన వివరాలను వ్యాఖ్యాత హృదయంగమంగా పొందుపరచారు.

పునర్ముద్రణ పొందుతున్న ఈ శతకరాజం నిరంతర భగవద్దయా గుణానుసంధానంతో పఠితలలో దయ, సహనంలాంటి సద్గుణసంపత్తిని పెంపొందించి ఉత్తమాదర్శ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపకరించగలదని మా విశ్వాసం.

**పి. వి. ఆర్. కె. ప్రసాద్**

తిరుపతి — కార్యనిర్వహణాధికారి

ఆగస్టు 1,1981 — తిరుమల తిరుపతి దేవస్థానములు

# భూమిక

**"యదీయచరితం సతాం సుచరితవ్యవస్థాపకం**
**యదీయవచనం పరం సకలసంశయోన్మూలనమ్।**
**యదీయకరుణా గతిస్సకలధర్మశూన్యాత్మనాం**
**స నశ్శరణమస్త్వసౌ సకలతన్త్ర నిర్వాహకః॥"**

ఒక ఉత్తమప్రబంధకర్తయొక్క గ్రంథాన్ని ముద్రించి ప్రకటించునప్పుడు వారి జీవితచరిత్రను భూమికగా రాయడం ప్రాచీనపద్ధతి. అందుకు ముఖ్యకారణమేమన: ఈ ప్రబంధాన్ని విరచించిన వారెవరు? వారే సంప్రదాయానికి సంబంధించినవారు? వారి ఇతరగ్రంథాలేవి? వారి జీవితచరిత్ర ఎలాంటిది? మొదలగు నానావిషయాలను తెలుసుకొని ప్రబంధాన్ని చదివినయెడల దాని తత్త్వార్థం బాగా బోధపడటానికి, రసానుభవానికి చాల అనుకూలంగా ఉంటుంది. అందువల్ల పరమాచార్యులగు శ్రీమన్నిగమాంతమహాదేశికుల వారియొక్క స్వానుభవ పరీవాహరూపాలైన పలు ప్రబంధాలలో ఒక్కొక్క పదం సైతం వేదాంతనిర్ణీతాలైన పలు విశేషార్థాలను వెల్లడిస్తున్నది. కాబట్టి ఆ అవతారమూర్తియొక్క విభవచరిత్ర చక్కగా తెలియనియెడల తత్ప్రబంధాలలో అర్థానుభవం, రసానుభవం సంపూర్ణంగా కలుగుటకు వీలు గాదు. కావున వారి జీవితచరిత్ర సంగ్రహంగా రాయబడుతున్నది.

## శ్రీదేశికావతారం

**"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత!**
**అభ్యుత్థానమధర్మస్య తదాఽఽత్మానం సృజామ్యహమ్"**

అను గీతావాక్యోక్తరీతిగా ప్రపంచోజ్జీవనం ఉద్దేశంగా గైకొని సర్వేశ్వరుడు ప్రథమతః మత్స్యకూర్మాది దశావతారాలను ధరించాడు. పిదప "పొయ్‌గై ఆళ్వార్" మొదలగు పదిమంది ఆళ్వార్లరూపాన విలక్షణమైన

ఒక అభినవ దశావతారాన్ని ధరించాడు. ఈ అభినవ దశావతారాలలో భగవద్భక్తిపరీవాహరూపాలైన ద్రవిడదివ్యప్రబంధాలద్వారా ప్రాచీనమైన విశిష్టాద్వైతసంప్రదాయాన్ని ప్రపంచానికి వెల్లడించాడు. తదుపరి భగవద్రామానుజాచార్యుల రూపంతో అవతరించి పలుప్రకారాలుగా చెదరిపోయిన వైదికమతాన్ని చక్కజేసి సంస్కృతమయాలైన శ్రీభాష్యాది నవగ్రంథాల ద్వారా తత్సిద్ధాంతాన్నే స్థిరీకరించాడు. నిజమైన తత్త్వహితపురుషార్థాలను శ్రీభాష్యాది గ్రంథాలలో చక్కగా తెలిసేటట్లు చేసిన మహోపకృత్యమే ఆ అవతారసారం. ఈ భాష్యకారావతారంలో కొన్ని కారణాలవలన ద్రవిడ భాషామయమైన గ్రంథాలు అవతరించలేదు.

అటు పిమ్మట ఈ విశిష్టాద్వైత సంప్రదాయానికి ఇతర తరాలవాళ్లు కలిగించే తొందరలను శమింపజేయడానికి; ఈ సంప్రదాయంలో ఈశ్వరకోటి ప్రవిష్టయైన మహాలక్ష్మియొక్క స్వరూపస్వభావాలను నిరూపించడానికి; సంస్కృతమయమైన వేద వేదాంతస్మృతీతిహాస పురాణ శ్రీభాష్యాది గ్రంథాలు పరమవైదికమతమైన విశిష్టాద్వైత సిద్ధాంత ప్రతిపాదన చేస్తున్నాయో; అట్లే ఆళ్వార్లు రచించిన ద్రవిడవేదాంతమని చెప్పబడే ఈ ప్రబంధాలుకూడా సంస్కృతవేదాంతమని వ్యవహరింపబడే పూర్వోక్తవేదాంత గ్రంథాలతో సమానయోగక్షేమాలని; ఉభయవేదాంతాల వ్యవహార విషయాలై విశిష్టాద్వైత సంప్రదాయ ప్రవిష్టులకు అత్యంత ఆదరణీయంగా నిలుస్తున్నాయనే విషయాన్ని బాగా స్థాపించడంకోసం; ఇలా పలుకార్యాలుగల ఈ సంప్రదాయంలో ప్రబంధరచనమూలంగా, ఉపదేశమూలంగా అనుష్ఠానమూలంగా ప్రపంచానికి తెలియజేయడంకోసం మరల మరొక అవతారం తత్కాలపు ప్రపంచపరిస్థితినిబట్టి అత్యవసరమయింది. ఆ అవతారవిశేషమే మన నిగమాంత మహాదేశికులు.

ఇప్పటికి దాదాపు 689 సంవత్సరాలకు పూర్వం ఒక "విభవ" వత్సరాన (1268 A.D.) "పురట్టాశి" నెల "శ్రవణ" నక్షత్రంలో కాంచీనగరానికి



సమీపాన ఉండే దీపప్రకాశసన్నిధి దగ్గర "తూప్పుల్" అని వ్యవహరింపబడే దివ్యక్షేత్రంలో విశ్వామిత్ర గోత్రానికి చెందిన "అనంతసూరి" అను విప్రోత్తమునికి, "తోతారంబ" అను అతని ధర్మపత్నికి పుత్రరత్నంగా అవతరించిన మహాపురుషులు వీరు. "పురట్టాశి శ్రవణం" వేంకటాచలపతి అయిన శ్రీనివాసునియొక్క జన్మనక్షత్రం, తద్బ్రహ్మోత్సవ అవభృథదినం. ఆ దినం అవతరించిన ఈ దివ్యశిశువునకు ఆ శ్రీనివాసుని తిరునామమైన "వేంకటనాథుడ"ను పేరును పెద్దలు నిర్ణయించారు. శ్రీనివాసావతారమే ఈ శిశువని వారి అభిప్రాయం. అదేగాక ఆ వేంకటేశుని ఘంటయొక్క, శ్రీభాష్యకారులయొక్క అవతారమే వీరని కూడా వారి జీవితకాలంలోనే లోకస్తులు పలుకారణాలనుబట్టి వ్యవహరించేవారు ఆచార్యులే తమ సంకల్పసూర్యోదయమనే నాటకంలో "ఉత్ప్రేక్ష్యతే బుధజనైరుపపత్తిభూమ్నా ఘంటా హరేస్సమజనిష్ట యదాత్మనేతి" ఇత్యాది వాక్యాలలో స్పష్టీకరించారు. వీరి పితామహులు "పుండరీకాక్ష సోమయాజులు". వీరి తల్లిగారు శ్రీభాష్యకారుల ముఖ్యశిష్యులైన "కిడాంబి ఆచ్చాన్" అను ఉత్తమపురుషుని వంశంలో ఉద్భవించినవారు. ఆ వంశంలో పుట్టిన "కిడాంబి అప్పుళ్ళార్" (వాదిహంసాంబుద ఆత్రేయ రామానుజాచార్యులు) అని ప్రసిద్ధిజెందిన స్వాములవారు వీరికి మేనమామ. వారి దగ్గరే సకల వేదవేదాంగ వేదాంతాది సర్వశాస్త్రాలను ఇరువది యేండ్లకు లోపలే అభ్యసించారు. ఈ విషయం "వింశత్యబ్దే విశ్రుత నానావిధ విద్యః" అని పూర్వోక్తనాటకంలోనే చెప్పబడింది.

## ప్రాచార్యుల అనుగ్రహం పొందుట

వేంకటనాథునికి ఐదవ సంవత్సరం ప్రాయంలోనే వీరి మేనమామ ఆత్రేయ రామానుజాచార్యులు స్వాచార్యులగు వాత్స్యవరదాచార్యుల (నడాదూర్ అమ్మాళ్) దగ్గర వేదాంత పఠనంకోసం వెళ్లినపుడు తమ మేనల్లుడైన మన ఆచార్యులను కూడా ఆ గోష్ఠికి పిలుచుకొని పోయారు.

వారు అక్కడికి వెళ్లినపుడు వాత్స్యవరదాచార్యులవారి వేదాంత కాలక్షేపగోష్ఠి కంచిలోని వరదరాజస్వామిగుడియందలి హస్తిగిరి అనే కొండపై జరుగుతూ ఉండింది. దాని చిహ్నం ఇప్పుడు కూడా అక్కడ కనిపిస్తుంది. ఆత్రేయ రామానుజాచార్యులు మేనల్లునితో వెళ్లినపుడు వారు (వాత్స్యవరదాచార్యులు) ఈ బాలుడెవరని అడిగారు. తన మేనల్లుడని వారు సమాధానం ఇచ్చారు. అప్పుడు ప్రసక్తానుప్రసక్తంగా కొంతసేపు వేదాంతోపన్యాసం నిలిపి కుశలప్రశ్నాది సంభాషణ సాగించారు. తరువాత మరల ఉపన్యాసం ప్రారంభించినపుడు ముందు వదలిన సందర్భం ఎవరికీ జ్ఞప్తికి రాలేదు. అప్పుడు ఐదేండ్ల బాలుడైన మన ఆచార్యులు గోష్ఠిలో ప్రవేశించినపుడు జరుగుతూ ఉండిన విషయవాక్యసందర్భం "ఇది" అని విస్పష్టంగా చెప్పారు. ఈ అద్భుత బుద్ధిశక్తిని చూచిన పరమాచార్యులగు వాత్స్యవరదాచార్యులు "ఈ బాలుడు మనసంప్రదాయంలో మహాచార్య పదవికి రాగలడని తలంచి:–

**"ప్రతిష్ఠాపితవేదాంతః ప్రతిక్షిప్తబహిర్మతః।**
**భూయాస్త్రైవిద్యమాన్యస్త్వం భూరికల్యాణభాజనమ్॥**

(వేదాంతాలకు సమీచీనమైన అర్థాన్ని ప్రపంచంలో స్థాపించి దుర్వాదుల మతాన్ని సమూలంగా నశింపజేసి త్రైవిద్యమాన్యుడవై నీవు అపరిమిత మంగళాస్పదుడవుకమ్ము!) అని శ్లోకం చెప్పి అనుగ్రహించారు. శిష్యులైన రామానుజాచార్యులను సంబోధించి "మీరితనికి సర్వశాస్త్రాలను ఉపదేశించి మన సిద్ధాంత ప్రవర్తకులలో గొప్పదగు ఆచార్యపదవిని ఇతడు పొందునట్లు చేయాలి. నేను వార్ధక్యంతో అశక్తుడనయ్యాను. కావున నేనే సాక్షాత్తుగా ఉపదేశించుటకు సాధ్యంకాదని నియమించారు. ఆ మహనీయుల ఆశీర్వాద బలంవల్లనే మన ఆచార్యులు 20 సంవత్సరాలలోనే సర్వవిద్యలను తమ మేనమామ రామానుజాచార్యులనుండి గ్రహించి సర్వవిద్యాధిష్ఠాన దేవతగా రూపొందారు.



## విద్యాభ్యాసం

తగిన సమయంలో విద్యాభ్యాసం ప్రారంభించి మేనమామ రామానుజాచార్యులనుండి ద్రావిడ సంస్కృతోభయభాషలలో గల సమస్త శాస్త్రగ్రంథాలను, సకలకళలను అతిత్వరలో మన ఆచార్యులు అధిగమించారు. అన్ని గ్రంథాలకంటె భగవద్రామానుజమునులయొక్క శ్రీభాష్యాది శ్రీసూక్తులయందు ఆచార్యులకు అత్యంతవ్యామోహం. "యతిప్రవరభారతీరసభరేణ, నీతం వయః" అని, "నిర్విష్టం యతి సార్వభౌమవచసా మావృత్తిభిర్యౌవనమ్" అని తదాదిగాగల నిజవాక్యాలతో సామాన్యజనులవలె ఆభాసవిషయాలలో రసానుభవం పొందకుండా శ్రీభాష్యకారుల శ్రీసూక్త్యనుభవంతోనే తమ యౌవనాన్ని గడిపినట్లు స్పష్టమవుతుంది.

## శ్రీమదహీంద్రపురానికి వేంచేయుట

తమ ఆచార్యులు ఉపదేశించిన గరుడమంత్రాన్ని ఆవృత్తిచేసి సిద్ధిపొందడానికి తగిన స్థలమైన "అహీంద్రపురం" (తిరువయిందిరపురమ్– (South Arcot District) వెళ్లి అక్కడ గరుడ నదీతీరంలో ఉండే ఔషధాద్రిపై సనియమంగా ఆ మంత్రాన్ని జపించి శ్రీమద్వైనతేయసాక్షాత్కారం పొందారు. తరువాత ఆ వైనతేయుడు ఉపదేశించిన హయగ్రీవమంత్రాన్ని కూడా అక్కడనే ఆవృత్తిచేశారు. తత్ఫలంగా హయగ్రీవుడు ప్రసన్నుడై ఆచార్యులను విశేషానుగ్రహంతో కటాక్షించాడు. ఈ విషయంలో కృతజ్ఞతావిష్కరణ రూపంగా "గరుడపంచాశత్", "హయగ్రీవ స్తోత్రం" అనే స్తోత్రగ్రంథాలను రచించారు. ఆ దివ్యదేశంలోనే వేంచేసి ఉండిన దాససత్య దేవనాథుల విషయంగా సంస్కృతప్రాకృత ద్రావిడభాషలలో వేదాంతార్థగర్భితాలైన స్తోత్రగ్రంథాలను రచించారు. ఈ సందర్భంగా దాదాపు పదునైదు సంవత్సరాలవరకు అక్కడే ఉండినట్లు తెలియవస్తున్నది.

## గార్హస్థ్యం

తగిన వయస్సులో స్వసమాన కులోద్భవయైన "తిరుమంగై" అను కన్యకను ధర్మపత్నిగా స్వీకరించి గృహస్థాశ్రమ ధర్మాలను చక్కగా అనుష్ఠిస్తూ వచ్చారు. చక్కగా ఆచరిస్తే సన్యాసాశ్రమంకంటె గృహస్థాశ్రమం గొప్పదనే శాస్త్రార్థాన్ని స్వానుష్ఠానముఖంగా నిరూపించారు.

## వేదాంతాదిప్రవచనాలు

స్వగ్రామ సమీపంలో ఉండే కాంచీక్షేత్రంలోను, తత్పరిసరాలలో ఉండే అనేక దివ్యక్షేత్రాలలో వేంచేసి ఉండిన నానాభగవన్మూర్తులను సేవించి తత్తన్మూర్తి విషయంగా రమణీయమైన పలుస్తోత్రాలను రచించారు. తమను ఆశ్రయించిన బహుశిష్యబృందాలకు పలుమారు వేదాంత గ్రంథాలను ప్రవచిస్తూ స్వగ్రామంలో పాంచకాలిక ప్రక్రియలచే భగవంతుని ఆరాధిస్తూ ఉండేవారు. "తత్త్వటీకా" అనే శ్రీభాష్యవ్యాఖ్యానం చేసే సందర్భంలో ఇరువదియెనిమిదవ సారి శ్రీభాష్య ప్రవచనం చేస్తుండినట్లు, "సంకల్ప సూర్యోదయం" అనే నాటకం రచించినపుడు ముప్పదిసార్లు శ్రీభాష్యప్రవచనం పూర్తి అయినట్లు "ప్రవచనవిధావష్టావింశే జయధ్వజపట్టికా" అని, "త్రింశద్వారంశ్రావితశారీరకభాష్యః" అని ఆయా గ్రంథాలలో ఉన్న ఆచార్యుల వాక్యాలవలన స్పష్టంగా తెలుస్తున్నది.

## అద్భుతకృత్యాలు

జ్ఞానానుష్ఠానవైరాగ్య గృహస్థధర్మాదులలో అద్వితీయులుగా పేరెన్నికగన్న మన ఆచార్యులయొక్క కీర్తి దిగంతాలకు పాకింది. ఆచార్యులయొక్క సర్వకళాప్రవీణత విషయంలో అసూయపడిన కొందరు తమతమ కళాపాండిత్యాన్ని ఆచార్యులదగ్గర చూపించి భంగపడినారు. ఒకానొక సమయంలో ఒక మంత్రవాది ఆచార్యులను వాదానికి పిలిచాడు. అతనితో వాదించడానికి స్వామి సమ్మతించలేదు. వెంటనే అతడు ఒక గుంటలో



ఉన్న నీటినంతటిని తాగడం ప్రారంభించాడు. అతని మంత్రబలంచేత అతడు తాగిన నీళ్ళు ఆచార్యుల ఉదరంలో ప్రవేశించి అది ఉబ్బనారంభించింది. ఈ సూక్ష్మం తెలుసుకొన్న ఆచార్యులు తమ మంత్రశక్తితో సమీపంలో ఉండిన ఒక స్తంభాన్ని గోటితో గీకి తద్ద్వారా మంత్రవాది తాగుతున్న నీటిని పారిపోవునట్లు చేశారు. వీరి శక్తిని తెలుసుకొన్న మంత్రవాది ఆచార్యుల అపరాధక్షమనుకోరి వెళ్లాడు. ఇట్టి అద్భుతకృత్యాలు జరిగినట్లు గురుపరంపరాప్రభావగ్రంథంనుండి తెలుస్తున్నది.

ఒక శిల్పియొక్క ప్రార్థనపై ఆచార్యులు తన చేతులారకట్టిన ఒక బావి ఇప్పుడు కూడా శ్రీమదహీంద్రపురంలో "దేశికన్ తిరుమాళిహై" అనే చోట కనిపిస్తుంది. తత్పరిపాలకులు దానినిప్పటికీ చాలా గౌరవంతో కాపాడుతూ వస్తున్నారు.

ఆచార్యులు తమ శరీరయాత్రను కేవలం ఉంఛవృత్తితో గడుపుతూ విరక్తులై ఉండిరి. అప్పుడు స్వామి ప్రభావజ్ఞులు, విజయనగరరాజుకు ప్రధానమంత్రి అగు మాధవాచార్యులనబడే శ్రీవిద్యారణ్యస్వామివారు మన ఆచార్యులకు తమ ఆస్థానంలో ప్రధాన విద్వత్పదవిని ఇప్పించాలని అనుకొని ఆ రాజుద్వారా సమస్త మర్యాదలతో ఆహ్వానం పంపినారు. పరమ విరక్తులగు మన ఆచార్యులు రాజసేవ అనే పారతంత్ర్యాన్ని మనస్సులోనైనా స్మరించలేక వైరాగ్యపంచకమనే ఐదు శ్లోకాలను ఆ ఆహ్వానానికి సమాధానంగా వ్రాసి పంపారు. దానిలో నశ్వరమైన ఈ ప్రాకృత ధనంమీద తనకు ఈషణ్మాత్రమైనా ఆశలేదని, నిరపాయమైన ధనంజయస్యందన భూషణమైన ధనం నాకు ఉందని, ఖ్యాతిలాభపూజలలో తనకెంతమాత్రం ఆశలేదని, ఉంఛవృత్తిచేతనే తనదేహయాత్ర చాలా ఆనందంగా గడుస్తున్నదని తెలిపినారు. ఇట్టి విరక్తాచార్యుల దగ్గరకువచ్చి పరప్రేరితుడైన ఒక బ్రహ్మచారి స్వవివాహార్థం ధనం యాచించాడు. అప్పుడాచార్యులు "కనకధారాస్తవ" మను శ్రీస్తుతిని చేస్తూ,

**"యోగారంభత్వరితమనసో యుష్మదైకాన్త్యయుక్తం**
**ధర్మం ప్రాప్తుం ప్రథమమిహ యే ధారయంతే ధనాయామ్।**
**తేషాం భూమేర్ధనపతిగృహే దంబరాదంబుధేర్వా**
**ధారా నిర్యాంత్యధికమధికం వాంఛితానాం సమానామ్॥"**

అనే శ్లోకం రచించగా ఆకసంనుండి కనకవర్షం కురిసింది. ఆ బ్రహ్మచారి స్వవస్త్రంలో దానిని మూటగట్టుకొని తీసుకొనివెళ్లాడు. స్వయంగా ఉంఛవృత్తితో జీవించే ఆచార్యులు పరార్థమై అపేక్షితాధికంగా కనకవర్షం కూడా వర్షింపజేయడానికి శక్తికలిగి ఉండిరని ఈ చరిత్రచే తెలుస్తున్నది.

## ప్రతివాదులను జయించుట

కంచిలోను, శ్రీరంగంలోను రెండు మూడుసార్లు దేవాలయంలో సంస్కృతేతరభాషలో ఉన్న ద్రవిడప్రబంధాలను మాయావాదులు అనుసంధించుట కూడదని, అది అపభ్రంశభాష అని తదనుసంధానౌచిత్యాన్ని స్థాపించేవరకు దేవాలయంలో పూజను జరుపనీయమని మహాకోలాహలం చేశారు. ఆ సమయంలో ఎందరో విద్వాంసుల ప్రార్థనను అనుసరించి ఆ రెండు నగరాలలో మన ఆచార్యులే ఆయా సందర్భాలలో బహుదినాలు మాయావాదులతో వాదించి మాయావాదాన్ని ఖండించి విశిష్టాద్వైతసిద్ధాంత సంప్రదాయాలను స్థాపించి యథాపూర్వకంగా దేవాలయపూజను కొనసాగింపజేశారు. ఆ వాదసమయంలో జరిగిన వాదసారాంశాన్నే "శతదూషణీ" అనే బహుప్రౌఢమైన వేదాంతవాదగ్రంథంగా పిదప ఆచార్యులు నిర్మించారు. ఇట్టి వాదాలు అనేక పర్యాయాలు జరిగినట్లు తెలుస్తున్నది.

## బిరుదుల ప్రాప్తి

ఇట్లు వైదికసిద్ధాంతాన్ని గ్రంథముఖంగా, అనుష్ఠానముఖంగా, ప్రవచనముఖంగా, పలువిధాలుగా స్థాపిస్తున్న మన ఆచార్యులకు



శ్రీరంగనాథుడు, తత్పత్ని రంగనాయిక "వేదాంతాచార్యులు", "సర్వతంత్ర స్వతంత్రులు" అని బిరుదులు (అర్చకముఖంగా) ప్రసాదించారు. అద్భుతమైన సహస్రపద్యాత్మకమైన "పాదుకాసహస్ర" మనే రంగనాథ పాదుకావిషయ సంబంధమైన స్తోత్రరత్నాన్ని ఆచార్యులు ఒక ముహూర్తకాలంలోనే పూర్తి చేశారు. వారి శాస్త్రకవితాసామర్థ్యాన్ని గమనించిన శ్రీరంగక్షేత్రస్థులగు విద్వాంసుల అభిప్రాయాన్ని అనుసరించి రంగనాథుడే పెద్దసదస్సులో "కవితార్కికసింహ", "సమస్యాసహశ్రీ" అనే బిరుదులు ప్రసాదించాడు. ఈ విషయాలు ఆచార్యుల గ్రంథాలలో అక్కడక్కడ కనిపిస్తున్నాయి.

## బహుప్రబంధ నిర్మాణం

శ్రీరంగనాథుడు ప్రసాదించిన "వేదాంతాచార్యులు" అనే బిరుదుకు అన్వర్థంగా "అధికరణసారావళి" అనే ఐదువందల స్రగ్ధరా వృత్తాలతో కూడిన శ్రీభాష్యసారార్థమైన ఉత్తమ గ్రంథాన్ని, తత్తాత్పర్య వివరణరూపమైన "అధికరణ దర్పణ" మనే గ్రంథాన్ని ఆచార్యులవారు రచించారు. ఈ విషయం ఆ గ్రంథారంభపద్యంలో ''....తేన దేవేన దత్తాం వేదాంతాచార్య సంజ్ఞామవహిత బహువిత్సార్థ మన్వర్థయామి'' అను వాక్యంలో స్పష్టపరచబడింది. ఇట్లే తదితర శాస్త్రకారుల సిద్ధాంతాలను పరిశీలించి విశిష్టాద్వైతసిద్ధాంతాన్ని ప్రమాణయుక్తంగా 'తత్త్వముక్తాకలాపం' అనే గ్రంథంలో స్థాపించారు. ఈ గ్రంథంకూడా ఐదువందల స్రగ్ధరాశ్లోకాలతో ఉంది. దీనికి "సర్వార్థసిద్ధి" అనే వ్యాఖ్యానం కూడా వారే రచించారు.

ఈ విధంగా "న్యాయసిద్ధాంజనం","శతదూషణీ" ఇత్యాది స్వతంత్ర గ్రంథాలను, "తత్త్వటీకా","గీతా భాష్యతాత్పర్యచంద్రికా","రహస్యరక్షా","గీతార్థ సంగ్రహరక్షా" ఇత్యాది వ్యాఖ్యానగ్రంథాలను; సంప్రదాయార్థస్థిరీకరణపరంగా "సచ్చరిత్రరక్షా","నిక్షేపరక్షా","పాంచరాత్రరక్షా" మొదలగు గ్రంథాలను; దక్షిణభారతదేశంలోగల పలు భగవన్మూర్తుల విషయాలైన "దయాశతకం"

మొదలగు పలు స్తోత్రగ్రంథాలను; శ్రీ భాష్యకారుల విషయమైన "యతిరాజసప్తతి", శుద్ధ ద్రవిడభాషలో "అమృతాస్వాదినీ" మొదలైన ఇరువదినాల్గు పద్యమయమైన ద్రవిడ ప్రబంధాలను; సంస్కృతద్రావిడోభయ భాషామయమైన మణిప్రవాళ భాషలో దాదాపు ముప్పదిరెండు గ్రంథాలను; ఇంకా మీమాంసాది సామాన్య శాస్త్రకారులపద్ధతిని పరిష్కరించి వేదాంతవిరుద్ధంగా "సేశ్వరమీమాంసా" అనబడే జైమినిసూత్ర వ్యాఖ్యానాన్ని, "మీమాంసా పాదుకా" అనబడే స్వతంత్ర మీమాంసాగ్రంథాన్ని, గౌతమప్రణీత న్యాయసూత్రార్థ పరిష్కారకమైన ''న్యాయపరిశుద్ధి" అనే గ్రంథాన్ని, ''యాదవాభ్యుదయం",''హంససందేశం",''సుభాషితనీవీ",''సంకల్ప సూర్యోదయం","పాదుకాసహస్రం","మొదలగు కావ్యనాటక గ్రంథాలను; ఇలా బహుపద్ధతులలో బహుగ్రంథాలను ఒక మానవ జీవితకాలంలో చేయడానికి వీలుగాని విధంగా భగవదవతారభూతులైన ఆచార్యులు రచించారు.

## పుత్రోత్పత్తి

ఆచార్యులు శ్రీరంగంలో వేంచేసి ఉండినపుడు వారికి పుత్రసంతానం "నళ" సంవత్సరం "ఆవణి" నెలలో "రోహిణీ" నక్షత్రంలో కలిగింది. (A.D. 1316 ఆగస్టు 11-వతేదీ.) అప్పుడు ఆచార్యులకు 48 వత్సరాలు. ఆ పుత్రునికి "వరదాచార్యులు" అని నామకరణం చేశారు.

## ప్రకీర్ణం

ఒకప్పుడు అక్షోభ్యమునికి, విద్యారణ్యమునికి సంభవించిన ద్వైతాద్వైతవాదంలో ఆచార్యులు మాధ్యస్థ్యం వహించి "అసినా తత్త్వమసినా పరజీవప్రభేనా! విద్యారణ్య మహారణ్యమక్షోభ్యమునిరచ్ఛినత్'' అని తీర్పుచేసినట్లు ఐతిహ్యం ఉంది.

ఉత్తరదేశంలో ఉండిన "సర్వజ్ఞ సింగప్పదు" మన ఆచార్యుల గుణాలను విని వారిపాదాలను ఆశ్రయించాలనుకొని స్వనగరమైన "వేంకటగిరి"కి



రమ్మని ప్రార్థించాడు. ఆచార్యులవారు అక్కడికి వెళ్లకపోయినా పరమాస్తికుడైన అతనిమీద దయతో "సుభాషితనీవీ" అనే నీతిగ్రంథం, "తత్త్వసందేశం", "రహస్య సందేశం", "రహస్యసందేశవివరణం" అనే మూడు గ్రంథాలను మణిప్రవాళశైలిలో రచించి తమ శిష్యునిద్వారా సర్వజ్ఞసింగప్పదుకు పంపారు.

కొన్ని కారణాలవల్ల శ్రీరంగాన్ని వదలి ఆచార్యులు మైసూరురాజ్యంలోని "తిరునారాయణపురం"లో కొంతకాలం, "సత్యమంగలం" అని ఇప్పుడు పిలువబడే కావేరీతీరంలోని సత్యాకాలంలో చాలకాలం నివసించినట్లు తెలుస్తున్నది. అక్కడ స్వామి కుమారుడగు వరదాచార్యులు, బ్రహ్మతంత్ర స్వతంత్ర స్వాములు ఆచార్యులదగ్గర వేదాంతాది శాస్త్రాధ్యయనం చేసి ఎన్నో సంవత్సరాలు అక్కడనే ఉండినట్లు చారిత్రకులు భావిస్తున్నారు.

సుమారు A.D. 1327వ సంవత్సరం మహమ్మదీయులు శ్రీరంగంపై దండెత్తి గుడిని పాడుచేశారు. అప్పుడు ఆ నగరవాసులైన శ్రీవైష్ణవులు మూలమూర్తిని శిలాచ్ఛాదనంతో సంరక్షించి ఉత్సవమూర్తిని ఎలాగో దేశాంతరానికి గొనిపోయి కాపాడినారు. ఆ ఉత్సవమూర్తి పలుచోట్ల వేంచేసి ఉండి కడపట "తిరుపతి"లో కూడా కొంతకాలం ఉండినట్లు తెలుస్తున్నది. ఆ సమయంలో శ్రీరంగంలో ఉండిన "సుదర్శనభట్టాచార్యులు" స్వనిర్మితమైన శ్రీ భాష్యవ్యాఖ్యానమగు "శ్రుతప్రకాశిక" అనే అద్భుత గ్రంథాన్ని, తన ఇద్దరు కుమారులను ఆచార్యులకు అప్పగించి "క్షేమంగా ఉండగల దేశానికివెళ్లి అక్కడ ఈ గ్రంథాన్ని, కుమారులను కాపాడి క్షేమంగా ఉండమని వారిని దీవించి కాలగతిచెందారు. అప్పుడే స్వామి సత్యాకాలానికి వేంచేశారు. అప్పుడు శ్రీరంగంలో చాల కాలంవరకు తిరువారాధనలు నిలిచిపోయాయి. ఆ సమయంలో ఆచార్యులు ఎంతో బాధపడి "అభీతిస్తవం" అనబడే 'రంగనాథస్తవం' రచించారు. మరల రంగనాథోత్సవమూర్తిని శ్రీరంగానికి తీసికొని వచ్చి యథాపూర్వంగా పూజాది కైంకర్యాలు జరిపించిన

"గొప్పణార్య"ని రెండు శ్లోకాలలో ఆచార్యులు శ్లాఘించారు. ఆ శ్లోకాలే ఇప్పుడు శ్రీరంగంగుడిలో ఉన్న శిలలో చెక్కబడి కనిపిస్తున్నాయని చెపుతారు.

జ్ఞానానుష్ఠాన వైరాగ్యభక్తి నిధులైన వేదాంత దేశికాచార్యులు ప్రపంచంలో ఒక 100 సంవత్సరాలకు పైగానే ఉండినారు. వార్ధక్యదశలో రచించిన "రహస్యత్రయసార" మనే గ్రంథమహత్త్వం వర్ణనాతీతం. సర్వవేదాంతార్థ రహస్యాలు ఇందులో ఇమిడి ఉన్నాయి. ఏతత్సంరక్షణార్థమై అవతరించిన "విరోధపరిహారం" అనే గ్రంథమే ఆచార్యుల చివరికృతిగా ఉండవచ్చు.

## అవతారసమాప్తి

ఇట్టి ప్రభావశాలి, మహాపురుషుడు అగు ఆచార్యులు తమ అవతారాన్ని ముగించుకొని ఒక "సౌమ్య" సంవత్సరం, కార్తికమాసాన తిరుకార్తికదినాన (14-11-1369) శ్రీ వైకుంఠానికి వేంచేశారు. వేంకటాచలపతి అయిన శ్రీనివాసునియొక్క అవతార దినమైన భాద్రపదశ్రవణంలో అవతరించి "తిరుమంగయాళ్వార్" అవతారదినమైన కార్తికమాసం తిరుకార్తికదినాన అంతర్ధానం అయ్యారు.

ఆచార్యులు రచించిన సంస్కృత-ద్రావిడ-మణిప్రవాళ భాషామయాలైన గ్రంథాల పట్టిక.

## స్తోత్ర గ్రంథాలు

1. హయగ్రీవస్తోత్రమ్
2. దశావతారస్తోత్రమ్
3. భగవద్ధ్యానసోపానమ్
4. గోపాలవింశతిః
5. శ్రీస్తుతిః
6. భూస్తుతిః
7. గోదాస్తుతిః
8. న్యాసదశకమ్



9. అభీతిస్తవః
10. దయాశతకమ్
11. వరదరాజపంచాశత్
12. వేగాసేతుస్తోత్రమ్
13. అష్టభుజాష్టకమ్
14. కామాపికాష్టకమ్
15. పరమార్థస్తుతిః
16. శరణాగతిదీపికా
17. దేవనాయకపంచాశత్
18. అచ్యుతశతకమ్
19. దేహళీశస్తుతిః
20. న్యాసతిలకమ్
21. రఘువీరగద్యమ్
22. షోడశాయుధస్తోత్రమ్
23. సుదర్శనాష్టకమ్
24. గరుడదండకః
25. గరుడపంచాశత్
26. యతిరాజసప్తతిః
27. న్యాసవింశతిః
28. తద్వ్యాఖ్యా
29. వైరాగ్యపంచకమ్

## కావ్యనాటకాలు

30. సుభాషితనీవీ
31. యాదవాభ్యుదయః
32. హంససందేశః
33. పాదుకాసహస్రమ్
34. సంకల్పసూర్యోదయనాటకమ్

## వేదాంత గ్రంథాలు

35. ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళిః
36. ద్రవిడోపనిషత్సారః
37. మీమాంసాపాదుకా
38. సేశ్వరమీమాంసా
39. శతదూషణీ
40. అధికరణసారావళిః
41. శ్రీభాష్యవ్యాఖ్యా-తత్త్వటీకా
42. న్యాయపరిశుద్ధిః
43. న్యాయసిద్ధాంజనమ్
44. తత్త్వముక్తాకలాపః
45. (తద్వ్యాఖ్యా) సర్వార్థసిద్ధిః
46. గీతాభాష్యతాత్పర్యచంద్రికా
47. ఈశావాస్యోపనిషద్భాష్యమ్
48. గీతార్థసంగ్రహరక్షా
49. శ్రీ పాంచరాత్రరక్షా
50. సచ్చరిత్రరక్షా
51. నిక్షేపరక్షా
52. చతు
53. స్తోత్ర
54. గద్య } రహస్యరక్షా
55. అధికరణదర్పణః (లుప్తః)

## అనుష్ఠానగ్రంథాలు

56. భగవదారాధనవిధిః
57. యజ్ఞోపవీతప్రతిష్ఠావిధిః

### రహస్యగ్రంథాలు

58. సంప్రదాయపరిశుద్ధిః
59. తత్త్వపదవీ
60. రహస్యపదవీ
61. తత్త్వనవనీతమ్
62. రహస్యనవనీతమ్
63. తత్త్వమాతృకా
64. రహస్యమాతృకా
65. తత్త్వసందేశః
66. రహస్యసందేశః
67. రహస్యసందేశవివరణమ్
68. తత్త్వరత్నావళిః
69. తత్త్వరత్నావళీప్రతిపాద్య సంగ్రహః
70. రహస్యరత్నావళిః
71. రహస్యరత్నావళీ హృదయమ్
72. తత్త్వత్రయ చుళకమ్
73. రహస్యత్రయ చుళకమ్
74. అభయప్రదానసారః
75. రహస్యశిఖామణిః
76. అంజలివైభవమ్
77. ప్రధానశతకమ్
78. ఉపకారసంగ్రహః
79. సారసంగ్రహః
80. మునివాహనభోగః
81. మధురకవిహృదయమ్ (లుప్తమ్)
82. పరమపదసోపానమ్
83. పరమతభంగః
84. హస్తిగిరిమాహాత్మ్యమ్
85. శ్రీమద్రహస్యత్రయసారః
86. సారసారః
87. విరోధపరిహారః

### ద్రావిడ ప్రబంధాలు

88. అమృతరంజనీ
89. అధికారసంగ్రహః
90. అమృతాస్వాదినీ
91. పరమపదసోపానమ్
92. పరమతభంగః
93. హస్తిగిరిమాహాత్మ్యమ్
94. అడైక్కలప్పత్తు
95. అర్థపంచకమ్
96. శ్రీవైష్ణవదినచర్యా
97. తిరిచ్చిన్నమాలై
98. పన్నిరునామమ్
99. తిరుమంత్రచ్చురుక్కు
100. ద్వయచ్చురుక్కు
101. చరమశ్లోకచ్చురుక్కు
102. గీతార్థసంగ్రహః
103. ముమ్మణిక్కోవై
104. నవమణిమాలా



105. }
106. } (లుప్తాః)
107. }
108. }
109. ఏశల్ (లుప్తః)
110. ప్రబంధసారః
111. ఆహారనియమః
112. నిగమపరిమళః (లుప్తః)

ఆచార్యులు తాను రచించిన ఇన్ని గ్రంథాలలో భగవద్రామానుజ సిద్ధాంతమని ప్రసిద్ధిచెందిన అతిప్రాచీనమైన, వైదికమార్గావలంబి అయిన, నమ్మాళ్వార్ ప్రభృత్యాచార్య శ్రేష్ఠులచే ప్రచారానికి కొనిరాబడిన విశిష్టాద్వైతసిద్ధాంత సంప్రదాయాన్నే పలు ప్రక్రియలలో కొంచెం కూడా పరస్పర విరోధం లేకుండా అద్భుతంగా ప్రతిపాదించారు. కావ్యనాటకాదులలో కూడా ఈ నియమమే పాటింపబడింది.

## విశిష్టాద్వైత సిద్ధాంతసారం

ఇక్కడ నాథముని మొదలగు పరమాచార్యులచే ప్రవర్తితమైన విశిష్టాద్వైతసిద్ధాంతసారం సంగ్రహంగా తెలియజేయబడుతున్నది.

ముముక్షువులకు అవశ్యజ్ఞాతవ్యమైనవి తత్త్వం, హితం, పురుషార్థం అనబడే ఈ మూడు విషయాలే.

### తత్త్వం

వీనిలో తత్త్వం: 1. చేతనం 2. అచేతనం 3. ఈశ్వరుడు అని త్రివిధం.

జ్ఞానవంతుడగు జీవాత్మ చేతనుడనబడతాడు. ఇతనికి జ్ఞానం ఒక గుణంగా ఉంటుంది. దీనికి ధర్మభూతజ్ఞానమని పేరు. ధర్మియగు జీవాత్మ జ్ఞానమయుడే. కావున ఆ ఆత్మ ధర్మిభూతజ్ఞాన మనబడుతుంది. ఈ జీవాత్మ తనకుతానే ఎప్పుడూ ప్రకాశిస్తూ ఉంటుంది. తనను "నేను" అని ఎరిగినపుడు ధర్మభూతజ్ఞానసహాయం అవసరంలేదు. ఆత్మేతర సమస్త వస్తుపరిజ్ఞానం చేతకూడా ఎరుగబడుతుంది. జీవుడు అణువుగాను, ఆనంద స్వరూపుడుగాను

ఉంటాడు. అతడు శరీరేంద్రియాదులకంటె భిన్నుడు. ఉత్పత్తి వినాశరహితుడు. భగవంతునికి సర్వదా శేషుడు. ఇట్టి జీవాత్మలసంఖ్యేయాలు. వీరు 1. బద్ధులు, 2. ముక్తులు 3. నిత్యులు అని త్రివిధాలుగా ఉంటారు. అనాది కర్మబంధంచేత ఈ సంసారంలో పరిభ్రమిస్తూ ఉండేవారు బద్ధులు. ఈ కర్మభూమిలో సదాచార్య సంబంధంద్వారా భక్తిప్రపత్తులలో అన్యతరమైన మోక్షోపాయాన్ని అనుష్ఠించి మోక్షం పొందినవారు ముక్తులు. భగవంతునివలె ఎప్పుడూ కర్మసంబంధం లేకుండా మోక్షలోకంలో ఆ భగవంతునికే కైంకర్యాలు చేస్తూ భగవత్తత్త్వాన్ని అనుభవిస్తూ ఉండే అనంత గరుడ విష్వక్సేనాదులు నిత్యులు.

## అచేతనం

జ్ఞానశూన్యమైన వస్తువు అచేతనమనబడుతుంది. ఈ అచేతనంవలన ఏర్పడు ఫలం ఈశ్వరసంకల్పాధీనంగా చేతనుడనుభవిస్తాడు. ఈ అచేతనం 1. త్రిగుణం, 2. కాలం, 3. శుద్ధసత్త్వం అని త్రివిధంగా ఉంటుంది.

## త్రిగుణం

దీనిని మూలప్రకృతి అంటారు. ఇది సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలు కలిగి ఉంటుంది. కనుక త్రిగుణమనబడుతుంది. ఈ ప్రకృతి సతతపరిణామశీలంగా ఉంటుంది. ఈ మూడు గుణాలు సమంగా ఉండునప్పుడు మహాప్రళయం ఏర్పడుతుంది. ఆ గుణాలు హెచ్చుతక్కువలుగా ఉన్నపుడు ఈ ప్రకృతి "మహాన్" అనే తత్త్వంగా మారుతుంది. ఆ మహత్తత్త్వంనుండి "అహంకార" మనే తత్త్వం కల్గుతున్నది. ఆ యహంకారం సాత్త్విక-రాజస-తామసభేధాలతో త్రివిధమవుతుంది. వానిలో సాత్త్వికాహంకారంనుండి ఏకాదశేంద్రియాలు (పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, మనస్సు) సంభవిస్తున్నాయి. తామసాహంకారం తన్మాత్రలద్వారా పంచభూతాలను కలుగజేస్తున్నది. తత్క్రమమిది;



తామసాహంకారంనుండి క్రమంగా శబ్దతన్మాత్ర-ఆకాశం, స్పర్శతన్మాత్ర-వాయువు, రూపతన్మాత్ర-తేజస్సు, రసతన్మాత్ర-జలం, గంధతన్మాత్ర-పృథివి. "తన్మాత్ర" అంటే పూర్వరూపం పూర్తిగా నశించకుండా, ఉత్తరరూపం పూర్తిగా కలుగకుండా ఉండే మధ్యమావస్థ. ఈ అవస్థలో ఉండే తత్త్వానికి "తన్మాత్ర" అని పేరు. రాజసాహంకారం మిగిలిన రెండు అహంకారాలు తమకార్యాలు చేయునపుడు సహాయంగా ఉంటాయి. ప్రాపంచికాలైన అచేతనపదార్థాలన్నీ (శరీరాదులు) ఈ పంచభూతమయాలే.

## కాలం

ఇది విభుడుగా ఉంటుంది. జడమైన వస్తువిది. దీనిలో సత్త్వాదిగుణాలు లేవు. భూతభవిష్యద్వర్తమానాదివ్యవహారాలకు ఇదే కారణం, నిమిషం, గడియమొదలు యుగాంతాది విభాగాలన్నీ ఈ కాలానికి సంబంధించినవే. ఈ కర్మలోకంలో ఉండే పరిణామాలన్నీ (భగవత్సంకల్పాధీనంగా) ఈ కాలంవల్ల ఏర్పడునవే. ఈ కాలకృతపరిణామం వైకుంఠలోకంలో లేదు. అక్కడ అది కేవల భగవత్సంకల్పంతోనే ఏర్పడుతుంది.

## శుద్ధసత్త్వం

రజస్తమః సంబంధంలేకుండా కేవల సత్త్వగుణానికి మాత్రం ఆధారమైన ఒక విలక్షణమగు ద్రవ్యమిది. ఇది శ్రీ వైకుంఠలోకంలో ఉంటుంది. ఇది కొన్ని సమయాలలో ఈ ప్రాకృతలోకంలో కూడా భగవద్విగ్రహాదుల రూపంగా అవతరిస్తుంది. వైకుంఠములో ఉండే అందరి శరీరాలు, మండప గోపురప్రాకారాది సకలవస్తువులు ఈ శుద్ధసత్త్వద్రవ్యమయాలే.

ధర్మభూత జ్ఞానమనేది కూడా ఒక అచేతనద్రవ్యంగా లెక్కింపబడవలసి ఉంది. అయినా చేతనమనడంవల్ల విశేషణంగా చైతన్యమనే ధర్మభూతజ్ఞానం ఉండుటచేత పృథగ్గణనం చేయలేదు.

## ఈశ్వరుడు

శ్రీమన్నారాయణుడే సర్వేశ్వరుడు. ఇతడు ఎప్పుడూ ఎలాంటి మార్పు లేనివాడు. జ్ఞానానందస్వరూపి. త్రివిధపరిచ్ఛేదరహితుడు. అనగా ఈ దేశంలోనే ఉంటాడు. ఈ కాలంలోనే ఉంటాడు. ఈ వస్తుస్వరూపంగానే ఉంటాడు అనే నియమం లేకుండా సర్వదేశాలలోను, సర్వకాలాలలోను, సర్వవస్తువులుగాను ఉంటాడు. ఈ పరమాత్మలో ఎలాంటి దోషంలేదు. చేతనాచేతనమైన ప్రపంచమంతా ఇతనికి శరీరంగా ఉంటుంది. ఇతడు ముముక్షువులకు ఉపాయంగాను, ఫలంగాను ఉంటాడు. సర్వప్రపంచానికి సృష్టి-స్థితి-సంహారకర్త, సర్వోత్కృష్టుడు, సర్వాధారుడు, సర్వనియామకుడు, సర్వస్వామి. స్వాశ్రితుల సర్వకర్మలను నశింపజేయువాడు, సర్వవేద ప్రతిపాద్యుడు, సర్వాంతర్యామి, సర్వశబ్దవాచ్యుడు, సర్వకర్మసమారాధ్యుడు, సర్వఫలప్రదుడు. బ్రహ్మరుద్రాదులందరూ ఈయనకు కింకరులే. ఇతడు స్వస్వరూపంచేత, విగ్రహంచేత, గుణాలచేత, స్వేతర సమస్తవస్తువులకంటె ఉత్కృష్టుడు. సహజంగానే సకలకల్యాణగుణాకరుడు. అవాప్తసమస్తకాముడు. మహాలక్ష్మి ఇతనితో సర్వధా సహభావం కలిగి ఉంది. ఇతని విగ్రహం పరవ్యూహవిభవాంతర్యామ్యర్చాభేధాలతో పంచవిధంగా ఉంటుంది. వీటిలోని అర్చామూర్తికి వేంకటాచలంలో వేంచేసి ఉన్న శ్రీనివాసమూర్తి మొదలు తత్తద్దివ్య దేశాలలో ఉన్న భగవద్విగ్రహాలు భక్తుల వాంఛనుసారంగా పరిగ్రహింపబడు ఆయా విగ్రహాలు (సాలగ్రామశిల దీనిలోనిదే).

మహాలక్ష్మికూడా ఈ ఈశ్వరతత్త్వంలో చేరినదే. ఆమె ఈ మహావిష్ణువువలె సర్వవ్యాపినియై మనకు ఉపాయంగాను, ఫలంగాను నిలుస్తున్నది. ఈ మహాలక్ష్మికి పురుషకారకృత్యం అధికం. పురుషకారం అంటే ఫలమునొసగు వానిని సమీపించుటకు ఫలేచ్ఛువగు పురుషునిచే ఉపాయంగా వరింపబడిన మరొక చేతనుడు.



## హితం

ఇక్కడ హితమంటే మోక్షానికి సాధనంగా అనుష్ఠించే ఉపాయం. అది భక్తి ప్రపత్తి భేదంగా ద్వివిధంగా ఉంటుంది. ఇందు భక్తియోగం నానావిధంగా ఉంటుంది. దీనిని మోక్షం పొందువరకు అనుష్ఠిస్తూనే ఉండాలి. దీనికి కర్మయోగం, జ్ఞానయోగం, ఆత్మావలోకనం అంగాలు. ఇది చిరకాలసాధ్యం. ఏతదంగాలను అనుష్ఠించుట చాల కఠినం. ఈ కాలంలో భక్తియోగాన్ని అనుష్ఠించే అధికారి లేడనే చెప్పాలి. దీనినే అష్టాంగయోగమంటారు.

## ప్రపత్తి

భక్తియోగంలో అశక్తులుగా ఉండువారు ప్రపత్తిని మోక్షోపాయంగా పరిగ్రహిస్తారు. ఈ ప్రపత్తినే భరన్యాసం, శరణాగతి, భరసమర్పణం అని వివిధ పేర్లతో చెపుతారు (ఈ భక్తి ప్రపత్తులు రెండూ మోక్షాన్నేగాక త్రివర్గమనబడే ధర్మార్థకామాలను కూడా ఇవ్వగలవు). ఈ ప్రపత్తి షడంగయోగమనబడుతుంది. అనగా 1.ఆనుకూల్యసంకల్పం, 2. ప్రాతికూల్య వర్జనం, 3. మహావిశ్వాసం 4. గోప్తృత్వవరణం, 5. కార్పణ్యం అనే ఐదంగాలతో కూడిన 6. ఆత్మసమర్పణం (అంగి). దీని నొక ఫలాన్నుద్దేశించి ఒకసారే అనుష్ఠించాలి. ఒకే ఫలంకోసం బహుపర్యాయాలు అనుష్ఠించుట కూడదు. దీనికి జాత్యాది నియమాలు లేవు. అన్ని ప్రాణులు అనుష్ఠించవచ్చు. మోక్షార్థంగా ప్రపత్తిచేసిన వాని మహిమ చాల ఉత్కృష్టం. ఈ ప్రపత్తియొక్క స్వరూపాదులు మన దయాశతక వ్యాఖ్యానంలో అక్కడక్కడ బాగా నిరూపింపబడి ఉన్నాయి. ఈ ప్రపన్నునికి మరణ సమయంలో దేశకాలాది నియమాలు లేవు. వీని నిర్యాణసమయాన హార్దుడగు ఈశ్వరుడు వీనిని సుషుమ్నా నాడిద్వారా అర్చిరాది మార్గంలో వైకుంఠలోకానికి తీసికొనిపోతున్నాడు. ఇట్టి ప్రపత్తిమార్గాన్ని పరిష్కరించి ప్రకటీకరించుట ఆచార్య కృత్యాలలో ప్రధానమైన ఒక విషయం.

## పురుషార్థం

మోక్షమే పరమపురుషార్థం. మోక్షమనగా పరమపదమనబడు వైకుంఠలోకానికి వెళ్లి అక్కడ పరిపూర్ణ బ్రహ్మానుభవం పొందడం. ఆ బ్రహ్మానుభవం పరీవాహరూపంగా భగవత్కైంకర్యాన్ని పలువిధాలుగా ఆచరించి దానిలో చేరిపోతుంది. ఆ మోక్షలోకానికి చెందిన పిదప అప్రాకృతమగు భగవచ్ఛరీరంతో సమానమైన శరీరం, గుణాష్టకాలు సంభవిస్తాయి. సర్వగుణ విగ్రహ విభూతి విశిష్టుడైన శ్రీమన్నారాయణానుభవం, తత్కైంకర్యం పూరిపూర్ణ బ్రహ్మానుభవమనబడు పరమ పురుషార్థం.

## దయాశతకావతరణం

మన ఆచార్యులవతరించిన సమయంలో కింద చెప్పబడిన మోక్షోపాయమైన ప్రపత్తిమార్గంలో పలువురికి పలువిధాలైన సందేహాలు, భ్రమలు ఉండినాయి. కనుక ఆ సందేహాలను పోగొట్టి నిస్సంశయ విపర్యయంగా ఆత్మోజ్జీవనానికి ఈ కాలం వారికి ప్రధానంగా అనుష్ఠేయమగు ఈ ప్రపత్తిమార్గాన్ని స్థాపించవలసిన నిర్బంధమేర్పడింది. ఆచార్యుల అవతారకృత్యాలలో చాలా ప్రధానంగా వారిచే స్వీకరింపబడినాయి. సంప్రదాయ గ్రంథాలలో పూర్తిగా–సంస్కృతమయ వేదాంత గ్రంథాలలో ప్రసక్తమైన చోట్ల–ఈ ప్రపత్తిమార్గాన్ని ప్రమాణయుక్త్యాదులతో చాల దృఢంగా స్థాపించారు.

స్తోత్రగ్రంథాలన్నింటిలోను ప్రాయశః ఈ విషయముంటుంది. “దయాశతక” మనే ప్రకృత ప్రబంధం ఈ ప్రపత్తిని నిరూపించుటకే అవతరించిందని చెప్పవలసి ఉంది. స్తోత్రారంభంలో ఉండే “ప్రపద్యే” అను ప్రథమ పదమే దీనిని సూచిస్తున్నది. మోక్షార్థమైన ప్రపత్తి అనగా భగవంతునియొద్ద “కర్మ–జ్ఞాన–భక్తియోగాదులను అనుష్ఠించుటకు నాకు



శక్తి సామర్థ్యాలు, క్షమ లేవు. నీవు తప్ప నాకు వేరుగతి లేదు. ఇక నీకు అనుకూలుడుగా ఉంటాను. (అనగా శాస్త్రవశ్యుడుగా ఉంటాను) ప్రతికూలుడను కాను. నారక్షణలో నిన్నే వరించాను” అని విన్నవించి వానిని ఆశ్రయిస్తే నిశ్చయంగా కాపాడుతాడన్న మహావిశ్వాసంతో వాని చరణారవిందాలపై అస్మదాత్మ–భర–ఫలసమర్పణం చేయుటయే. ఇక్కడ భరసమర్పణమంటే నాకు కర్మజ్ఞానభక్త్యాదులు చేయుటకు శక్తిలేదు కనుక ఆ భక్తియోగస్థానంలో పరమదయతో నీవే నిలిచి ఆ భక్తియోగానికి ఏర్పడి ఉన్న మోక్షఫలాన్ని నాకు అనుగ్రహించమని వేడుకొనుటయే.

ఇట్లు వేడుకొనినయెడల ఆ పరమపురుషుడు పరమదయాళువు కనుక ఆ దయచే ఆ భక్తియోగస్థానంలో స్వయంగా నిలిచి వీడు వేసిన భరమును స్వీకరించి స్వయంగా మోక్షోపాయమవుతున్నాడు. దీనిచేతనే వానిని “సిద్ధోపాయుడ”ని చెపుతారు. ఇట్టి ప్రపత్తిలో భగవద్దయచేతనే ప్రధానపురుషార్థం కలుగుతుంది. కావున దయకే ప్రాధాన్యమీయవలసి ఉంది. కావుననే ఆ భగవద్దయనే చేతనసమాధిలో నిలిపి శరణాగతి కుద్దేశ్యురాలినిగా చేసి “దయాశతక”మను స్తోత్రాన్ని ఆరంభించి ఆ స్తోత్రంలో ప్రపత్తిని ఆచార్యులు చక్కగా నిరూపించారు.

## ప్రధాన ప్రతిపాద్యార్థం

పరహితప్రావణ్యమే భగవద్దయయొక్క స్వరూపం. ప్రపంచంలో గల సర్వచిదచిత్తులయొక్క స్వరూపస్థితి, ప్రవృత్తులు అన్నీ భగవత్సంకల్పం చేతనే సంభవిస్తున్నాయి. భగవత్సంకల్పాధీనమైన సర్వవిషయాలలో దయాసంబంధం పూర్ణంగా ఉన్నదను ఈ సిద్ధాంతం ఈ స్తోత్రంలో ప్రధానంగా ప్రతిపాద్యమవుతున్నది. “పరదుఃఖ దుఃఖిత్వం దయా” అని, “పరదుఃఖ నిరాచికీర్షా దయా” అని పలుగ్రంథాలలో పూర్వాచార్యులచే దయాస్వరూపం నిర్వచించబడి ఉంది. సర్వచిదచిత్తులయొక్క స్వరూపస్థితి,

ప్రవృత్తులు భగవద్దయచే ఏర్పడుతున్నాయని సిద్ధాంతీకరిస్తే జీవరాశిలో చేరినట్టి అనాఘ్రాత దుఃఖితులైన నిత్యసూరులయొక్క స్వరూపస్థితి, ప్రవృత్తులు దయాధీనాలని తేలుతుంది. దయాస్వరూపం పరదుఃఖ దుఃఖిత్వ రూపమని, పరదుఃఖనిరాచికీర్ష అని చెప్పినయెడల పూర్వోక్త నిత్యులకు ఏమాత్రం దుఃఖసంబంధం లేనందున వారి విషయంలో భగవద్దయకు సంబంధం ఉండదు. అట్లైతే పూర్వోక్త సిద్ధాంతానికి విరోధమేర్పడుతుంది. కనుక 'పరహిత ప్రావణ్యమే' దయాస్వరూపమని నిష్కర్ష చేయవలసి ఉందని ఆచార్యుల అభిప్రాయం. ఈ విషయాన్ని

**"పరహితమనుకంపే! భావయన్త్యాం భవత్యాం" (ద/36)**

ఇత్యాది సందర్భాలలో స్పష్టీకరించి ఉన్నారు. సర్వచేతనాచేతనాల స్వరూపస్థితి ప్రవృత్తులు దయాధీనాలనే విషయాన్ని

**"త్రివిధ చిదచిత్సత్తాస్థేమ ప్రవృత్తినియామికా**
**వృషగిరివిభోరిచ్ఛా సా త్వం పరైరపరాహతా" (ద/71)**

అను శ్లోకంలో స్థాపించి ఉన్నారు

ఈ స్తోత్రంలో ప్రథమ దశకమందు ఆచార్యపరంపరను, ఆళ్వార్లను, భగవన్మహిమలను, శ్రీనివాసుని నమస్కరించి స్తోత్రప్రారంభప్రతిజ్ఞ చేస్తున్నారు. ఆళ్వారులు, ఆచార్యులు భగవద్దయారూపులగుటచేత, భగన్మహిమలు, భగవంతుడు దయాకార్య ప్రధాన నిర్వాహకుడగుటచేత ఆయనను స్తుతించుట దయాస్తోత్రసంగతమే. ఇది ఈ వ్యాఖ్యానంలో బాగా నిరూపింపబడి ఉంది.

ద్వితీయ దశకంలో భగవద్గుణాలన్నింటిలో దయ ఉత్కృష్టమని, భగవంతుడు దయాపరవశుడని, పరబ్రహ్మమగు భగవంతునికి ఉపనిషత్తులలో చెప్పబడిన జగజ్జన్మస్థితిప్రళయకారణత్వం భగవద్దయకే సమన్వయపడునని, కావున ఆ దయయే స్తోత్రవ్యమని నిరూపించారు.



తృతీయదశకంలో దయచే భగవంతునికి చేయబడు ఉపకారాలు వర్ణింపబడుతున్నాయి.

తురీయ దశకంలో దయాజితుడగు అపరాధచక్రవర్తిని భగవత్సమీపానికి కొనిపోయి అక్కడ భగవత్సభలో ఈ అపరాధచక్రవర్తి మోచనార్థమై దయాదేవియను వావదూక సమీచీనయుక్తి ప్రమాణపురస్సరంగా వాదించు ప్రక్రియ అద్భుతంగా నిరూపింపబడుతున్నది.

పంచదశకంలో కులశేఖరాళ్వార్ మొదలగు మహనీయుల సూక్తుల ననుసరించి వేంకటగిరియందు జంగమంగానైనా, స్థావరంగానైనా జన్మ ప్రార్థింపబడింది.

షష్ఠదశకంలో భగవద్దయయందు సాక్షాత్తుగా ప్రపత్తిని అనుష్ఠించి ఈ ప్రపత్త్యంగాలను కూడా నిరూపించారు.

ప్రపన్నునికి కావలసిన నిర్భయత్వదార్ఢ్యంకొరకు దయయొక్క నిరంకుశ నిరతిశయప్రభావం సప్తమదశకాన వర్ణింపబడుతున్నది.

అష్టమదశకమందు దయాస్వరూపం, జీవవశీకరణంలోని ఉపకార పరంపర మొదలగునవి వర్ణింపబడుతున్నాయి.

నవమదశకంలో దయాఘనుడగు భగవంతుని అర్చావతారాలు, మత్స్యకూర్మాది దశావతారాలు అనుసంధింపబడుతున్నాయి.

దశమదశకంలో "నేను నిన్ను తిరస్కరించినా, అడ్డగించినా, కుళింగశకునివలె సాహసికుడుగా ఉండినా నన్ను బంధించి తీసుకొనిపోయి ముక్తానుభూతిని నాకిచ్చుటనే ఇప్పించవలె"నని స్వాభీష్టఫలాన్ని దయాదేవియందు ప్రార్థిస్తున్నారు.

నైచ్యానుసంధానం, భగవదర్పణం (సాత్త్వికత్యాగం), ఫలశ్రుతి మొదలగు విషయాలు ఉపరితనాష్టశ్లోకిలో ప్రతిపాద్యాలు.

వీనిలో మొదటి యేబది శ్లోకాలలో దయాప్రభావాన్ని ప్రకటించి, అట్టి ఉత్తమ ప్రభావయగు దయాదేవియందు షష్ఠదశకంలో "తిరువాయ్‌మొళి"లో నమ్మాళ్వార్లు షష్ఠశతకంలో శ్రీనివాసునియందు ప్రపత్తి ననుష్ఠించినట్లు స్వయంగా ప్రపత్తిననుష్ఠించి, తదుత్తర దశకత్రయంలో ప్రపన్నున కుత్తరకాలంలో అనుసంధేయాలైన దయాకార్యాలను విశదీకరించి, అన్తిమదశకంలో స్వాభీష్టప్రార్థనచేసి స్తోత్రాన్ని పూర్తిచేశారు.

ఇందులోని పదిదశకాలలో వరుసగా 1. అనుష్టుప్, 2. ఆర్యా 3. ఔపచ్ఛందసికము (మాలభారిణీ), 4. మాలినీ, 5. మందాక్రాన్తా, 6. నర్దటకమ్ (కురరీరుతమ్), 7. శిఖరిణీ, 8. హారిణీ, 9. పృథ్వీ, 10. వసంతతిలకా (సింహోన్నతా, ఉద్ధర్షిణీ) అను వృత్తాలు ఉపయోగింపబడినాయి. 101 మొదలు 104 వరకు వసంతతిలక, 105-6లలో మాలిని, 107-8లలో శార్దూల విక్రీడితం ఉపయోగింప బడినాయి.

ఇందు 5,6,7,8,9 దశకాలలో ఒక్కొక్కపాదానికి 17 అక్షరాలుగల భిన్నభిన్న వృత్తాలు పరిగ్రహింపబడుట ఒకచిత్రం. అనుదినం త్రిసంధ్యలలో జపించవలసిన గాయత్రీ మహామంత్రముయొక్క ఆవృత్తిసంఖ్య ఈ స్తోత్రంలోని శ్లోకసంఖ్యతో సమానమగుటచే తదావృత్తి ఫలంకూడా ఈ స్తోత్రపాఠకులకు ఏర్పడునని ఆచార్య వివక్షితం కావచ్చు. మరియు అష్టోత్తరశత దివ్యస్థానాలలో ఉండు భగవన్మూర్తులయొక్క దర్శనంతో ఏర్పడు ఫలంకూడా ఈ స్తుతి పాఠకులకు కల్గునని చెప్పవచ్చు. భగవంతునికి సంగ్రహార్చనలు అష్టోత్తరశతనామాలచేతనే చేస్తున్నారు. ఈ స్తోత్రంలో గల ఒక్కొక్క శ్లోకంనుండి ఒకొక్క నామాన్ని ఉద్ధరించి ''దయాऽ ష్టోత్తరశతనామావళి"ని కల్పించి దయాదేవికి అర్చన చేయవచ్చునని ప్రతిశ్లోకంలో దయను సంబోధించి స్తుతించిన ఆచార్యుల ఆశయము



కావచ్చు. ఇదిగాక ఆచార్యులు అనేక దివ్యదేశాలలో అనేక భగవన్మూర్తులను సేవించి నా నా స్తోత్రాలను చేశారు. అయినా అట్టి స్తోత్రాలలో లేని ఒక నూతనప్రక్రియ దయాశతకంలో కనిపిస్తున్నది. అదేమన-ఆ స్తోత్రాలలోవలె భగవంతుని నేరుగా సంబోధింపక, భగవద్గుణమగు దయను సంబోధించి దానినే స్తుతించారు. ఇక్కడ అంతరాశయమేమంటే విగ్రహం, విభూతి, గుణం – ఇవి లేని కేవల భగవత్స్వరూపం శశవిషాణతుల్యమే. కావున ఆ విగ్రహ – విభూతి – గుణవిశిష్టుడైన భగవంతుడే ఉపాస్యుడు. వాటివల్లనే భగవంతునికి ఉత్కర్ష కలుగుతుందని కూడా చెప్పవచ్చు. వాటికికూడా గుణం చాలా ప్రధానం. ఈ విషయాన్ని దహరాది బ్రహ్మవిద్యలలో ఉపనిషత్తులు స్పష్టీకరించాయి. ఆ గుణాలలో కూడా "దయ" అనే భగవద్గుణమే చాలా ప్రధానతమం. ఆ గుణానికే మిగిలిన గుణాలన్నీ భగవానునితో సహ కింకిరభావం అవలంబిస్తున్నాయి అనే ఈ ఉపనిషత్తుల హృద్గతమైన రహస్యార్థాన్ని స్పష్టీకరించుటయే ఆచార్యోద్దేశం. ఈ దయలేనిచో భగవంతుడు భగవత్పదవాచ్యుడు కాలేడు. మనకుద్దేశ్యుడును గాలేడు. కాన వేదాది సర్వవైదిక గ్రంథ బృందాలు భగవద్దయాప్రభావ ప్రతిపాదకాలే అను పరమసిద్ధాంతం ఈ స్తోత్రం ద్వారా ఆచార్యులు ప్రపంచానికి ప్రకటించారు.

ఇట్టి మహోన్నత ప్రభావశాలిని అయిన దయాదేవియొక్క సామ్రాజ్యాన్ని "కలౌ వేంకటనాయకః" అని చెప్పబడినట్లు మన వేంకటాచలపతియగు శ్రీనివాసునిలోనే ఈ కలికాలంలో చూస్తున్నాం. లక్షలకొలది జనులు ప్రాణాలకంటె గొప్పదగు ధనాన్ని గణింపక కానుకగా సమర్పించి తమ తమ అభీష్టాలను ప్రత్యక్షంగా భగవంతునితో మాటలాడి పొందుతున్నారుగదా! అట్లు సంపాదింపబడిన ధనములచే వేలకొలది జీవరాసులను మాతాపితరులవలె సాక్షాత్తుగా కాపాడుటను ఇక్కడ చూస్తున్నాం కదా! కావుననే ఆచార్యులు ప్రత్యక్షంగా ఈ దేవతయందే దయాదేవి అందరికి కనబడుతున్నది గాన ఈ మూర్తిలోనే ఆ దయాదేవిని స్తుతించారు.

## ఉపసంహారం

ఇలా ఈ ప్రబంధంయొక్క పరిపూర్ణ రసానుభవం కలగడంకోసం వక్తృ వైలక్షణ్య విషయవైలక్షణ్య ప్రబంధవైలక్షణ్యాది సర్వవైలక్షణ్యాలను సంగ్రహంగా నిరూపించాం. దీనినిబట్టి ప్రకృతాచార్యులయొక్క సంప్రదాయాన్ని, మనోభావాన్ని, పరోపకార చింతను బాగుగా గ్రహించి గ్రంథగౌరవాన్ని గుర్తించి సంగ్రహరుచులమైన మేము చెప్పని విషయాలనుకూడా స్వయంగా అవహితులై గ్రహింతురుగాక!

## కృతజ్ఞతానివేదనం

దయాశతకవ్యాఖ్యానమను ఈ కైంకర్యాన్ని మితజ్ఞుడనగు నాకు శ్రీనివాసుని అంతర్యామిగా నిలిపి తద్ద్వారా రచింపచేసిన శ్రీ భగవద్దయాదేవికి, తదధీనుడగు శ్రీనివాసమూర్తికి నా ప్రణతి. సహస్ర పూర్వమైన కృతజ్ఞతను సమర్పిస్తున్నాను. ఇందులో ఏవేని గుణాలు కనబడినయెడల అవన్నీ మదాచార్యపాదుల అనుగ్రహంతో ఏర్పడినవని, దోషాలన్నీ స్వకీయాలని వాచకులు తెలుసుకోవాలి. ఈ వ్యాఖ్యాన రచనా ప్రవృత్తికి ముఖ్యకారణం శ్రీనివాసుని విషయంలో ఏ కొద్దియైన వాచిక కైంకర్యం ఉండాలనే అభిసంధి, ప్రకృత ప్రబంధాచార్యులైన దేశికులవారి చరణారవిందాలపైగల నిరవధికభక్తి. అంతేగాని పాండిత్యప్రకర్ష ప్రకటన కాదను విషయం కూడా పాఠకులు గ్రహింప ప్రార్థితులు. చివర ముఖ్యమైన ఒక విషయం చెప్పి విరమిస్తాను. తిరుపతి శ్రీ వేంకటేశ్వర సంస్కృతకళాశాలలో ప్రస్తుతం సాహిత్యశాస్త్రాదులను ఉత్తమకక్ష్యలో అధికరిస్తూ ఆంధ్రాదిభాషలలో సయితం కవిత్వరచనాపర్యంతమైన సామర్థ్యం కలవాడు, వినయాదిగుణసంపన్నుడు అగు అస్మత్ప్రియశిష్యుడైన సముద్రాల లక్ష్మణయ్య ఈ దయాస్తోత్రవ్యాఖ్యానరచనలో ఆమూలాగ్రం మాతోకూడా ఉండి ముద్రణార్హమగు ప్రతిని రాసి తోడ్పడినందుకు ఈ దయాస్తోత్ర



ప్రతిపాద్యుడగు పరమపురుషుడు అతనికి ఆయురారోగ్యైశ్వర్యాది సంపత్తులను, విశిష్టమైన అత్యధికమైన పాండిత్యమును, తత్ఫలమైన ఆత్మగుణాలను ప్రసాదించవలెనని శ్రీనివాస చరణారవిందాలను ప్రార్థిస్తున్నాం. మేమును హృదయ పూర్వకంగా ఆశీర్వదిస్తున్నాం.

తిరుపతి, ఇట్లు
22-2-58 విద్వజ్జనవశంవదః

**కో. శఠకోపాచార్యః**
న్యాయమీమాంసాధ్యాపకః,
శ్రీ వేంకటేశ్వర సంస్కృత కళాశాల.

శ్రీరస్తు

శ్రీమద్వేంకటనాథాయ నమః

# దయాశతకం

## శ్రీవేదాన్తదేశిక విరచితం

## (ఆంధ్ర టీకా తాత్పర్య సహితం)

శ్రీమాన్ వేంకటనాథార్యః కవితార్కిక కేసరీ।

వేదాంతాచార్యవర్యో మే సన్నిధత్తాం సదా హృది॥

**శ్లో॥ ప్రపద్యే తం గిరిం ప్రాయః శ్రీనివాసానుకంపయా ।**
**ఇక్షుసారస్రవన్త్యేవ యన్మూర్త్యా శర్కరాయితమ్ ॥ 1**

**ప్రతిపదార్థం :** ఇక్షుసార స్రవన్త్యేవ= చెరకురసమయమై నదివలె ఉన్న, శ్రీనివాసానుకంపయా= శ్రీనివాసునియొక్క దయచేత, ప్రాయః= తరచుగా, యన్మూర్త్యా= ఏ వేంకటాద్రియొక్క ఆకారంచే, శర్కరాయితం= చక్కెరగా ఆచరింపబడెనో (గులకరాళ్లుగా ఆచరింపబడెనో), తం= ఆ, గిరిం= వేంకటగిరికి, ప్రపద్యే= నమస్కరిస్తున్నాను.

**అవతారిక:** ఆళ్వారులని, ఆచార్యులని ప్రసిద్ధిచెందిన వైష్ణవ సాంప్రదాయకులలో అగ్రగణ్యులు, ద్రావిడ సంస్కృతభాషలలో నిరుపమ పండితులు, వేదాంతాది శాస్త్రాలలో ఉభయభాషలలోనూ శతాధిక గ్రంథకర్తలు, దక్షిణదేశంలోని పలు పుణ్యక్షేత్రాలకు అరిగి అచటగల భగవన్మూర్తులను సేవించి తదానంద ప్రవాహరూపంగా పలుస్తోత్రాలను రచించి తద్ద్వారా వెనుకటివారలమైన మనబోటివారు తెలుసుకొని అనుష్ఠింపదగిన బహువిషయాలను ఉపదేశించినవారు, "వేదాంతాచార్య" "కవితార్కికసింహ" మొదలగు అనేక బిరుదులు పొందినవారు అగు

"శ్రీ వేదాంతదేశికు"లను ఆచార్యులు తిరుమలకు వేంచేసి, శ్రీనివాసుని సందర్శించి స్తోత్రం చేయునప్పుడు, ఇతరక్షేత్రాలలో సంభవించని ఒక క్రొత్త ప్రక్రియను అవలంబించి స్తుతించారు.

అదెట్లన ఇతర క్షేత్రాలలో, ఏ భగవానునినైనా, ఏ దేవినైనా, ఏ ఆచార్యులనైనా స్తుతించునపుడు, వారలనే సంబోధించి వారి గుణాలను స్తుతించారు. ఇక్కడ అలా కాక భగవంతునికిగల అసంఖ్యేయ గుణాలలో అతి ప్రధానమైన "దయ" అనెడి గుణాన్నే సంబోధించి, ఆ గుణాన్నే సచేతనంగా (భగవద్దివ్యమహిషిగా) భావించి శతాధిక శ్లోకాలతో స్తుతించారు.

ఇట్లు భగవానుని పేర్కొనక, అతనిలోని ప్రధానగుణాన్ని పేర్కొని స్తుతించడం "దహరా" ది బ్రహ్మవిద్యలలోని ఉపనిషత్తులలో చెప్పబడిన మార్గాన్ననుసరించి ఏర్పడింది.

ఈ శతకంలో భగవంతుని అసంఖ్యేయ గుణాలలో దయాగుణాన్నే ప్రధానంగా స్వీకరించడానికి ముఖ్యకారణాలను గ్రంథకర్తయే పైన సవిశదంగా నిరూపించారు. ఏ దయాగుణం లేకుంటే భగవంతునిలో గల ఇతర గుణాలు గుణాలు కాకపోవుటయేగాక దోషాలుగా పరిణమిస్తాయో, ఆ దయాగుణానికి ప్రాధాన్యం ఇవ్వడం సమంజసమే గదా? కావున భగవంతునికి అత్యంత ప్రియురాలైన దయాదేవిని స్తుతిస్తే, ఆమెకు కింకరులగు ఇతరగుణాలు, సాక్షాద్భగవానుడు మనకు వశ్యులు అవుతారని వేరుగా చెప్పనవసరం లేదు.

ఇతరక్షేత్రాలలో భగవద్దయకు ప్రాధాన్యమివ్వక మన శ్రీనివాసునియందే ప్రత్యేకంగా ప్రాధాన్యం ఇవ్వడానికి కారణం అందరికి తెలిసిందే. ఏలన "కలౌ వేంకటనాయకః" అని పురాణాలు ఉద్ఘోషించినట్లు ఈ కలియుగంలో మనవంటి లక్షలాది కర్మబద్ధులతో నేరుగా మాట్లాడి వారివారికున్న అనేకవిధ ఆర్తులను వారి ప్రార్థనల ననుసరించి అప్పుడే



పోగొట్టి వారిచే సమర్పింపబడిన విశేష ద్రవ్యాలతో అనేక జీవులను తల్లిదండ్రులవలె కాపాడటం ఏ దయాదేవియొక్క సామ్రాజ్యచిహ్నమో, అట్టి దయాదేవియొక్క ఆధిపత్యాన్ని ఇంత ఉన్నత స్థితిలో ఈ అఖండ బ్రహ్మాండంలో ఈ వేంకటాద్రియందు తప్ప మరియొక ప్రదేశంలో దర్శింపవీలగునా? ఈ విషయాన్ని ఆచార్యులు "బద్ధాదరః" (బద్ధేషు ఆదరః యస్య సః) అను ఒకపదంతో సూచించారు.

ఇట్లు దయాదేవిని సంబోధించి నిర్మింపబడిన ఈ శతకంలో ప్రతిపద్యం బహు విశేషార్థాలను, వేదాంతరహస్యార్థాలను గూఢంగా ప్రతిపాదిస్తున్నదని గొప్ప గొప్ప విద్వాంసులు చెప్పగా వింటున్నాం. అట్టి విశేషార్థాలేగాక సాధారణ శ్లోకార్థాలుకూడా వివిధ వేదాంతార్థాలను ఉన్నతంగా బోధిస్తున్నాయి.

"ప్రపత్తి" అను శరణాగతిశాస్త్రార్థాన్ని నిరూపించడమే ఈ శతకానికి ప్రధానోద్దేశమని చెప్పవచ్చు. క్లుప్తమైన ఉపాయాన్ని అనుష్ఠించడానికి సామర్థ్యం లేనందువలన తన కభీష్టమైన ఫలాన్ని పొందలేక పోయినపుడు, తత్ఫలప్రదుని పాదాలను ఆశ్రయించి "ఓ స్వామీ! నాకా ఉపాయాన్ని అనుష్ఠించుటకు శక్తిసామర్థ్యాలు లేవు. కావున అకించనుడను, అనన్య గతికుడను అగు నాయందు దయ ఉంచి మీరు ఉపాయస్థానంలో నిలిచి తత్ఫలాన్ని నాకు దయచేయాలి" అని ప్రార్థించుటయే ప్రపత్తి అనబడుతుంది. ఇట్టి ప్రపత్తి గుణాధికుడైన ఉత్తమ పురుషుని దగ్గర అనుష్ఠించిన యెడల నిశ్చయంగా ఫలప్రాప్తిని చేకూర్చుననుటలో విభీషణ–ద్రౌపది మొదలగు మహాభక్తుల శరణాగతియే ఉదాహరణంగా కనిపిస్తుంది. కావున ప్రపత్తి ఫలించుటలో ముఖ్యస్థానం దయాగుణానికే ఉన్నదికదా!

సామాన్య మనుష్యాదులదయకే ఇంతటి విశేషమున్నప్పుడు సర్వప్రపంచ నిర్మాత, రక్షకుడు అగు పరమాత్మయొక్క దయకెంతటి విశేషం ఉంటుందో

పాతకులూహించుకొందురుగాక! ఆ భగవద్దయచేత ప్రపంచానికి ఏర్పడే బహువిధాలైన ఉపకారాలను ఈ స్తోత్రంలో ఆచార్యులు చక్కగా ప్రతిపాదించారు. వేయేల? లోకంలో భగవత్సంకల్పం లేకుండా ఒక చిన్న పనికూడా జరుగదు. భగవత్సంకల్పంవలన జరిగే పనులన్నీ దయాకార్యాలే అనే సిద్ధాంతాన్ని నిరూపిస్తూ ప్రపన్నుల విషయంలో దయాదేవి చేసే గొప్ప ఉపకారాలను నిరూపించుటయే ఇక్కడ ప్రధాన కృత్యం.

ఈ శతకంలో భిన్నభిన్నవృత్తాలలో భిన్నభిన్నార్థ ప్రతిపాదకాలైన దశకాలు, ఫలశ్రుతిరూపంలో చివర ఎనిమిది (8) శ్లోకాలు రచింపబడి ఉన్నాయి. ఆయా విషయాలు ఆయా ప్రకరణాలలో నిరూపింపబడతాయి.

ప్రథమంగా వైదికవృత్తమైన "అనుష్టుప్" ఛందస్సుచే ఏర్పడిన ప్రథమదశకంలో ఇష్టదేవతానందనం, గురుపరంపరానమస్కారం నిర్వహిస్తున్నారు.

**తాత్పర్యం :** ఈ ప్రథమ శ్లోకంలో ప్రపత్తి ప్రాధాన్యద్యోతకమైన "ప్రపద్యే" అను పదాన్ని ప్రయోగిస్తూ వేంకటపర్వతానికి నమస్కరిస్తున్నారు. చెఱకురసమయమైన నది ప్రవహించి ఘనీభావం పొందితే (గడ్డగట్టిపోతే) శర్కరగా (చక్కెరగా) పరిణమించునట్లు, శ్రీనివాసునియొక్క అనగా లక్ష్మీవిశిష్టుడైన నారాయణునియొక్క (చెఱకురసపునదివలెనున్న) దయాప్రవాహమే ఏ వేంకటాచలరూపంగా ఘనీభావదశను పొంది శర్కరామయంగా (గులకరాళ్లరూపంగా) ఉన్నదో అట్టి వేంకటగిరికి నమస్కరిస్తాను.

దయాదేవి ఈ పర్వతరూపంలో ఉండుటచే ఈ పర్వతాన్ని సందర్శించిన వారందరు సాక్షాద్భగవద్దయాదేవిని సందర్శించిన వారవుతారు. కనుక దీనిని దయాస్వరూపంగానే భావించి ఆచార్యులు నమస్కరించారు. అందుచే దయాశతకంలో పర్వతవందనం అసంగతమని భావించకూడదు.



భగవద్దయకు పావనత్వం, ఆశ్రితక్షేమప్రదత్వం మొదలగు గుణాలు ఏవేవి కలవో, ఆ గుణాలన్నీ ఈ పర్వతానికి కూడా ఉన్నాయని ఊహించాలి.

**శ్లో॥ విగాహే తీర్థబహుళాం శీతలాం గురుసంతతిమ్ ।**
**శ్రీనివాసదయాంభోధిపరీవాహపరంపరామ్ ॥ 2**

**ప్రతి :** తీర్థబహుళామ్= తీర్థకరులైన ఆచార్యులచే నిండిన (రేవులచే నిండిన), శీతలామ్= శమదమాద్యాత్మ గుణసంపన్నమైన (చల్లనైన), గురు సంతతిమ్= గురుపరంపర అనే (ఎక్కువ ప్రవాహం కల్గిన), శ్రీనివాసదయాంభోధి పరీవాహపరంపరామ్= శ్రీనివాసునియొక్క దయ అనే మహాహ్రదం (మడుగు) నుండి ప్రవహించు ధారాపరంపరను, విగాహే= అవగాహన చేస్తున్నాను. (మునుగుతున్నాను).

**అవ :** దయాస్వరూపమైన వేంకటాద్రికి నమస్కరించి సర్వఫలప్రదమైన గురుపరంపరావందనం ఆచరిస్తున్నారు.

**తా :** శఠకోపముని, నాథముని, యామునముని మొదలగు పావనతమ పరమాచార్యులచే నిండిన, శమదమదయాదిగుణపూర్తి కల్గిన ఆచార్యపరంపర అనెడి శ్రీనివాసునియొక్క దయ అనే జలాశయంనుండి ప్రవహించే గొప్ప కాలువలో స్నానం చేస్తున్నాను.

అనగా అట్టి గురుపరంపరకు త్రికరణయుక్తంగా నమస్కరిస్తున్నానని భావం. ప్రపంచంలో సన్మార్గం తెలియక సర్వజనులు బాధపడు సమయాన సర్వేశ్వరుడగు శ్రీనివాసుడు మిక్కిలి దయతో పైన చెప్పబడిన ఆచార్యపరంపరను అవతరింపజేసి, వారిద్వారా వైదిక సత్సంప్రదాయాన్ని (ప్రపత్తిమార్గం మొదలైనవి) ప్రవర్తింపజేసి సర్వులకు తరుణోపాయం కలిగించాడు. కావున ఈ ఆచార్యపరంపర శ్రీనివాసునియొక్క దయా ప్రవాహపరంపరయే అని ఆచార్యుల అభిప్రాయం.

ఇంతేగాక తాపార్తుడు గొప్ప ప్రవాహంలో స్నానంచేసి తాపశాంతి పొందదలిస్తే రేవులద్వారా దిగి ఎట్లభీష్టం పొందగలడో, అట్లే సంసారతాపార్తుడు శ్రీనివాసదయాప్రవాహమందు అవగాహించి శ్రేయస్సును పొందదలిస్తే పైజెప్పిన ఆచార్యులనెడి రేవుల మార్గాననే దిగాలి. అనగా వారిచే ప్రదర్శింపబడిన మార్గాన్ని అనుసరించినప్పుడే శ్రీనివాసుని దయను పొందగలడు. ఈశ్వరుడెంత దయావంతుడైనా సరియైన త్రోవలో పోవువానికే తద్దయ లభించగలదని భావం. ఆచార్యులయొక్క ఆత్మగుణ పూర్తిని "శీతలాం" అను పదంతో తెలియపరచారు.

ఈ దశకంలో దయను సంబోధించక దయాకార్యమైన ఆచార్యాది వ్యక్తులకు నమస్కరించుటచే కార్యముఖంగా దయాదేవియే స్తుతింపబడినందున నీ దశమునకు స్తోత్రాసాంగత్యాన్ని శంకింప కూడదు.

**శ్లో కృతినః కమలావాసకారుణ్యైకాన్తినో భజే ।**
**ధత్తే యాత్సూక్తిరూపేణ త్రివేదీ సర్వయోగ్యతామ్ ॥ 3**

**ప్రతి :** కమలావాసకారుణ్యైకాన్తినః= ఒకే ఒక శ్రీనివాసదయనే శరణంగా కలిగినటువంటి, కృతినః= సమర్థులను (సుకృతులను) అనగా ఆళ్వారులను, భజే= సేవిస్తున్నాను, త్రివేదీ= మూడు వేదాలును, యత్సూక్తిరూపేణ= ఏ ఆళ్వార్లయొక్క దివ్యసూక్తి రూపంచేత (దివ్య ప్రబంధరూపంచే), సర్వయోగ్యతామ్= అందరు అధికరించుయోగ్యతను, ధత్తే= ధరిస్తున్నదో.

**అవ :** గురుపరంపరావందనానంతరం ఆ ఆచార్యులవలెనే వైష్ణవ సంప్రదాయంలో అతిపూజ్యులైన ఆళ్వార్లకు ఈ శ్లోకంలో నమస్కరిస్తున్నారు.

**తా :** ఋగ్యజుస్సామరూపమైన వేదం సంస్కృతభాషలో ఉండడంవలన కొంతమందికి మాత్రమే జాత్యాదినియమాన్ని అనుసరించి అధికారం కలుగుతున్నది. ఆ వేదాలలో ఉండే రహస్యార్థాలనే ద్రావిడ దివ్యప్రబంధంద్వారా ఆళ్వార్లు ప్రకటించారు. కనుక వేదమే ఈ ద్రావిడ



ప్రబంధరూపంగా అవతరించిందని సంప్రదాయం. ఈ ద్రావిడ ప్రబంధం ఎలాంటి జాత్యాదినియమం లేకుండా సర్వాధికారం కలది. ఈ మహోపకారం ఆళ్వార్లవల్లనే ఏర్పడింది. ఈ ఆళ్వార్లు పరమపురుషుని దయనే శరణంగా అవలంభించినవారు. అనగా ప్రపత్తిమార్గాన్ని అనుష్ఠించినవారు. ఈ ప్రపత్తిలో దయకు ఉన్న ప్రాధాన్యం ముందే తెలియజేయబడింది. అట్టి ప్రపత్తిని తాము అనుష్ఠించుటయేగాక ప్రాపంచిక జనులకు కూడా ఈ అర్థాన్ని ప్రబంధంద్వారా వెల్లడించారు.

ఈ విధంగా దయాదేవియొక్క ప్రాధాన్యాన్ని ఉపదేశానుష్ఠానాలతో ప్రపంచానికి తెలియజేసినారు కావున ఈ దయాస్తోత్రంలో వారికి నమస్కరించడం ఎంతో సమంజసంగా ఉంది.

**శ్లో పరాశరముఖాన్ వన్దే భగీరథనయే స్థితాన్ ।**
**కమలాకాన్తకారుణ్యగఙ్గాప్లావితమద్విధాన్ ॥ 4**

**ప్రతి :** కమలాకాన్తకారుణ్య గఙ్గాప్లావితమద్విధాన్= రమారమణుడైన శ్రీనివాసునియొక్క దయ అనెడి గంగచే తడిసిన నాబోటివారిని గలిగిన, (అత ఏవ= కనుకనే) భగీరథనయే= భగీరథ న్యాయంలో, స్థితాన్= ఉన్నట్టి, పరాశరముఖాన్= పరాశరుడు మొదలగు మహర్షులకు, వన్దే= నమస్కరిస్తున్నాను.

**అవ :** బహువిధాలుగా అంతరంగులైన ఆళ్వారులకు నమస్కరించి వేదోపబృంహణ రూపమైన విష్ణుపురాణ, భారత, భాగవత, రామాయణాది ఇతిహాసపురాణ నిర్మాతలగు పరాశర, పారాశర్య, శుక, వాల్మీకి మొదలగు మహర్షిప్రవరులకు (యోగులకు) నమస్కరిస్తున్నారు.

**తా :** భగీరథుడు తన ప్రయత్నంతో స్వర్గస్థమైన గంగను భూలోకానికి రాజేసి తత్ప్రవాహంతో కపిలకోపాగ్నిదగ్ధులైన సగరపుత్రులను తడిపి వారికి సద్గతిని కలుగజేశాడు. అట్లే పరాశరాది పరమర్షులు గొప్ప యోగమహిమతో

విష్ణుపురాణ, రామాయణాది గ్రంథాలను రచించి తద్ద్వారా భగవదాజ్ఞాతిలంఘనం (భగవద్భాగవతాపచారాదులు) అనే క్రూరాగ్నిచే దగ్ధులై భగవదనుగ్రహానికి దూరస్థులైన నాబోటివారిని లక్ష్మీకాంతుడైన పరమపురుషునియొక్క దయ అనే దివ్యగంగాప్రవాహంతో తడిపి (భగవద్దయకు పాత్రులనుజేసి) సద్గతి కర్హులను జేసినారు.

రామాయణాది దివ్యగ్రంథ పఠనంతో వేలకొలది జనులు భగవద్దయకు పాత్రులై తమ తమ అభీష్టాలను నెరవేర్చుకొంటున్నారనడం సర్వ ప్రత్యక్షవిదితమే. కావున అట్టి దయాదేవీకటాక్షప్రసారాన్ని ప్రపంచానికి అందజేసిన పురాణరత్ననిర్మాతలైన మహర్షులకు నమస్కారం ఈ దయాస్తోత్రంలో చేయడం సమంజసమే.

**శ్లో అశేషవిఘ్న శమనమనీకేశ్వరమాశ్రయే ।**
**శ్రీమతః కరుణామ్భోధౌ శిక్షాస్రోత ఇవోత్థితమ్ ॥** **5**

**ప్రతి :** శ్రీమతః= శ్రియఃపతియైన శ్రీనివాసునియొక్క, కరుణామ్భోధౌ= దయ అనెడి గొప్ప జలాశయమందు, ఉత్థితమ్= ఉదయించినట్టి, శిక్షాస్రోత ఇవ (స్థితం)= శిక్షాప్రవాహంవలె ఉన్నట్టి, అశేష విఘ్నశమనమ్= సమస్త విఘ్నాలను నాశనం చేయగలిగినట్టి, అనీకేశ్వరమ్= భగవత్సేనాపతియగు విష్వక్సేనుని, ఆశ్రయే= ఆశ్రయిస్తున్నాను.

**అవ :** గ్రంథం ద్వారా ఉపకరించిన ఆళ్వారులకు, మహర్షులకు నమస్కరించి తదనంతరం ఉపదేశకపరంపరలో ఆళ్వారులకు కూడా ఆచార్యులైనట్టివారికి, దివ్యదంపతులకు, అనంతరం ఆచార్యపీఠం అలంకరిస్తున్న భగవత్సేనాపతియగు విష్వక్సేనునికి నమస్కరిస్తున్నారు.

**తా :** పెద్ద చెఱువులో పరిపూర్ణంగా నిండి ఉన్న నీరు ఒక కాలువద్వారా ప్రవహించి క్షేత్రాలలోని సస్యాలను సంరక్షిస్తుంది. అట్లే శ్రీనివాసునియొక్క అపారకృప అనే పెద్ద జలాశయంలో పుట్టిన ఒక శిక్షాస్రోతస్సే (కల్పితమైన కాలువయే) విష్వక్సేనుడు. ఆ కాల్వరూపంగా ప్రవహించిన దయ అనే జలం శరణాగతులు అనే సస్యాలను సంరక్షిస్తున్నది. అనగా విష్వక్సేనునివద్ద సకలోపదేశాలను పొందిన నమ్మాళ్వార్లు ప్రపత్తి శాస్త్రాన్ని ప్రకాశపరచి శరణాగతులను వృద్ధిపరచిరని భావం. ఇట్టి శరణాగతులపై భగవద్దయ ప్రవహించుటకు ప్రథమకారణుడు విష్వక్సేనుడగుటవలన అతనిని శిక్షాస్రోతస్సని నిరూపణ చేయబడింది. ఆ విష్వక్సేనుడు అశేష విఘ్నశమనుడు. అనగా వారు వారు కోరిన ఫలాలకు సంభావితమైన సమస్త విఘ్నాలను నాశనంచేసి ఆ ఫలప్రాప్తిని కలుగజేసేవాడు. మరియు భగవత్సేనాపతి. సకలలోకనిర్వహణ భారాన్ని విష్వక్సేనునియందే భగవంతుడు ఉంచినాడని సంప్రదాయం. అట్టి విష్వక్సేనుడు భగవద్దంపతులకు తరువాత ఆచార్యుడుగా ఉన్నవాడై స్ఖలన మేర్పడినపుడు స్ఖలితులను శిక్షించి సరియగు త్రోవలో నడిపిస్తున్నాడు. ఇదే సదాచార్యలక్షణం. ఈ శిక్ష దయాకార్యం. ఈ అభిప్రాయంచేత ఇతనిని శిక్షాస్రోతస్సుగా ఆచార్యులు నిరూపించారు. అట్టి విష్వక్సేనుని దయాస్తోత్రమనే ఈ శ్రేయస్కరమైన గొప్ప కార్యంలో సంభావితమైన సర్వవిఘ్నశమనార్థం ఆశ్రయించుట జరిగింది. శ్రీనివాసునియొక్క దయ అనే మడుగునుండి బయలుదేరినది కనుక విష్వక్సేనుడను శిక్షాస్రోతస్సు కూడా దయారూపమే కావున ఇతని వందనం దయావందనంలోనే పర్యవసిస్తున్నది.



**శ్లో సమస్తజననీం వన్దే చైతన్యస్తన్యదాయినీమ్ ।**
**శ్రేయసీం శ్రీనివాసస్య కరుణామివ రూపిణీమ్ ॥** **6**

**ప్రతి :** చైతన్యస్తన్యదాయినీమ్= జ్ఞానమనే స్తన్యం ఇస్తున్న, శ్రీనివాసస్య= శ్రీనివాసునికి, శ్రేయసీమ్= శ్రేయస్కారిణియైన, రూపిణీమ్= మూర్తీభవించిన, శ్రీనివాసస్య కరుణామివ రూపిణీమ్= శ్రీనివాసునియొక్క దయారూపంవలె ఉన్న, సమస్త జననీమ్= జగన్మాతయగు మహాలక్ష్మికి, వన్దే= నమస్కరిస్తున్నాను.

**అవ :** విష్వక్సేనునికి నమస్కరించిన పిమ్మట ఆ విష్వక్సేనునకు కూడా ఆచార్యురాలు, జగన్మాత అగు శ్రీ మహాలక్ష్మికి నమస్కరిస్తున్నారు.

**తా :** ఒకతల్లి తనబిడ్డకు పరమహితమైన స్తన్యము నిచ్చి ఏ ప్రకారంగా ఆ బిడ్డను పుష్టియుక్తంగా చేస్తుందో అట్లే సమస్త ప్రజలకు తల్లియైన శ్రీ మహాలక్ష్మికూడా చైతన్య (అర్థపంచకం మొదలగు సారతమ విషయకజ్ఞానం) మనే స్తన్యమిచ్చి ఆత్మలకు నిత్యమైనటువంటి పుష్టిని కలుగజేస్తున్నది. అనగా జీవాత్మలు మహాలక్ష్మి దయచేత అర్థపంచకజ్ఞానం కలిగి మోక్షోపాయాన్ని అనుష్ఠించి మోక్షం పొందుతున్నవని తాత్పర్యం. ఇదే ఆత్మకు కలిగే నిత్యమగు పుష్టి. ఈ మహాలక్ష్మి అందరికి శ్రేయస్కారిణియేగాక సాక్షాత్పరమ పురుషునకు కూడా శ్రేయస్కారిణియట. శ్రీనివాసుడు తన పేరులో కూడా వియోగాన్ని సహించక ఆమెను తనతో చేర్చుకొని ఉన్నాడు. సర్వకాలాలలో ఆమె సాన్నిధ్యం వలననే సర్వులు నిర్భయంగా శ్రీనివాసుని ఆశ్రయించి క్షేమాన్ని పొందుతున్నారు. నిగ్రహం ఎలాంటిదో తెలియదు కనుక ఆ లక్ష్మి "అజ్ఞాత నిగ్రహా" అని ప్రసిద్ధి చెందింది. శ్రీనివాసునియొక్క అంతాదయ ఈ మహాలక్ష్మి రూపంతో (తల్లి రూపంతో) ఆవిర్భవించి ఉన్నదట. తల్లికున్న దయకంటె ఎక్కువదయ వేరొకచోట చూడలేము కదా? అట్టి జగన్మాతకు నమస్కరిస్తున్నారు.

పరమపురుషుడైన నారాయణునినుండి సర్వవేదాంతార్థాలను స్వయం శిష్యురాలుగా గ్రహించి తాను విష్వక్సేనున కుపదేశించి ఆ పరంపరద్వారా వైష్ణవసంప్రదాయకులకందరికి పరమపురుషుని తర్వాత ఆచార్యపదవిని అలంకరించి శ్రీమహాలక్ష్మి లోకానికి పరమోపకారం చేయడం పరమదయ చేతనే జరుగుతున్నది కావున ఆమెను దయారూపంగానే భావించి ఈ స్తోత్రంలో నమస్కరించడం యుక్తం.

**శ్లో॥ వందే వృషగిరీశస్య మహిషీం విశ్వధారిణీమ్ ।**
**తత్కృపాప్రతిఘాతానాం క్షమయా వారణం యయా ॥ 7**



**ప్రతి :** యయా= ఏ క్షమాదేవిచే (భూదేవిచే), తత్కృపాప్రతిఘాతానామ్= ఆ శ్రీనివాసునియొక్క దయా విఘ్నాలకు, వారణం= నివారణం, భవతి= అవుతున్నదో, వృషగిరీశస్య= శ్రీనివాసునియొక్క, మహిషీమ్= దేవియగు, (తాం= ఆ) విశ్వధారిణీం= భూదేవికి, వన్దే= నమస్కరిస్తున్నాను.

**అవ :** గడచిన శ్లోకంలో మహాలక్ష్మికి నమస్కరించారు. ఈ శ్లోకంలో ఆ లక్ష్మీదేవికి చేదోడు వాదోడుగా ఉండి చేతనోజ్జీవన విషయంలో ఉపకరిస్తున్న శ్రీనివాసునికి, లక్ష్మీదేవివలె పత్నిగా ఉన్న భూదేవికి నమస్కరిస్తున్నారు. కుడిప్రక్కనున్న శ్రీదేవివలె ఎడమప్రక్కనున్న భూదేవి పై శ్లోకంలో నమస్కరింపబోతున్న నీళాదేవికంటె సన్నిహితవతి కనుక ఆమెకంటే ముందే భూదేవికి నమస్కరిస్తున్నారు.

**తా :** "క్షమ" అనే పదం ఓర్పుగుణాన్ని, భూదేవిని చెపుతున్నది. సర్వచరాచరాలను ధరిస్తున్న భూమికధిదేవత అయిన భూదేవి క్షమాగుణంగానే భావింపబడుతున్నది. భగవానుని దయ సహజంగానే సమస్త చేతనులలో ప్రవహించడానికి సిద్ధంగా ఉంది. అట్టి ప్రవాహాన్ని చేతనులు చేస్తున్న అపరాధాలు అడ్డగిస్తున్నాయి. దయాప్రవాహానికి విఘ్నం ఇదే. ఇట్టి విఘ్నాన్ని ఈ క్షమ పోగొడుతున్నది. అపరాధాలను సహించగలిగినవానికి ఏర్పడే దుష్ఫలం లేదని భావం. దయాదేవియొక్క ఒక భాగమే క్షమ. కావున ఈ స్తోత్రంద్వారా క్షమావందనం తప్పక చేయదగిందే.

కింద చెప్పబడిన శ్రీదేవి, పైన చెప్పబడనున్న నీళాదేవి ఇక్కడ చెప్పబడిన భూదేవి చేతనోజ్జీవన విషయంలో పరమదయతో నిర్వహించే ఉపకారాలు ఎలా అంటే నీళాదేవి చేతనుల దోషాలను భగవంతుని నేత్రాలకు కనుపడకుండా చేస్తున్నది. ఒకవేళ కొన్ని దోషాలు కనబడినా క్షమాదేవి ఆ దోషాలను ఓర్చుకొనేటట్లు చేస్తున్నది. దోషాలను ఓర్చుకొన్నప్పటికి చేతనులయందు ఉదాసీనభావం భగవంతునికి కలుగవచ్చు. ఆ సమయాన

శ్రీదేవి (మహాలక్ష్మి) ఆ ఉదాసీన భావాన్ని పోగొట్టి స్వజనాభిమానాన్ని కలుగజేసి దయాప్రవాహం పారునట్లు ఏర్పాటు కావిస్తున్నది. కావున ఈ దయాప్రవాహం పారుటకు పై ముగ్గురు పత్నులును కారణభూతులే. ఈ భావంచేతనే వీరికి ఇక్కడ నమస్కరించడం జరిగింది.

**శ్లో॥ నిశామయతు మాం నీళా యద్భోగపటలై ర్ధ్రువమ్ ।**
**భావితం శ్రీనివాసస్య భక్తదోషేష్వదర్శనమ్ ॥ 8**

**ప్రతి :** యద్భోగపటలైః= ఏ నీళాదేవియొక్క భోగసమూహాలచే (భోగములనే నేత్రదోషాలచే), శ్రీనివాసస్య= శ్రీనివాసునికి, భక్తదోషేషు= భక్తులయొక్క దోషాలయందు, అదర్శనం= చూపులేకుండుట, ధ్రువం= నిశ్చయంగా, భావితం= కలుగజేయబడిందో, సా నీళా= ఆ నీళాదేవి, మాం= నన్ను, నిశామయతు= కటాక్షించుగాక!!!

**అవ :** భూదేవికి నమస్కరించిన పిమ్మట ఆ భూదేవివలెనే భగవద్దివ్య మహిషిగాను, చేతనసంరక్షణబద్ధశ్రద్ధురాలుగాను ఉంటూ ఆ భూదేవికి ఎడమపక్కనగల నీళాదేవియొక్క కటాక్షం కోసం ప్రార్థిస్తున్నారు.

**తా :** భూదేవివలె నీళాదేవియు నిత్యసూరిచేతనరూపిణి అయిన భగవన్మహిషి. ఆ నీళాదేవి విశేషభోగాలను తన నాయకుడగు శ్రీనివాసునికి కలుగజేస్తున్నది. అట్టి తరుణీభోగాలచేత పటలమనే ఒకవిధమైన నేత్రరోగం శ్రీనివాసునికి సంభవించినదేమోనని, దానివల్ల చేతనులు చేసే అపరాధాలు కనబడవేమోనని కవి ఉత్ప్రేక్షిస్తున్నాడు. ఎందుకంటే స్వతః సర్వజ్ఞుడగు పరమపురుషునికి కూడా ఆశ్రితులు చేసే సహస్రాధికాపరాధాలు కనిపించడం లేదట. అనగా శ్రీదేవీ భూదేవులవలె ఈమెకూడా చేతనులు చేసే అపరాధాలను పరమపురుషుడు క్షమించేవిధంగా తన విభ్రమ విలాసాదిభోగాలతో ఈశ్వరుని వశీకరించుకొని ప్రజలమీద పరమదయను చూపిస్తున్నదని భావం. అట్టి దయావతియైన నీళాదేవీకటాక్షం తనకు ఈ



స్తోత్రరచనాసందర్భంలో అత్యావశ్యకమని తలచి ఆ కటాక్షాన్ని ఈ శ్లోకంలో ప్రార్థించారు.

**శ్లో॥ కమప్యనవధిం వందే కరుణావరుణాలయమ్ ।**
**వృషశైలతటస్థానాం స్వయంవ్యక్తిముపాగతమ్ ॥ 9**

**ప్రతి :** అనవధిం= ఏ విధమైన పరిచ్ఛేదం (కొలత) లేనట్టి, వృషశైలతట స్థానామ్= వేంకటాద్రియొక్క చరియ ప్రదేశాలలో నివసించేవారికి, స్వయంవ్యక్తిమ్= స్వయంవ్యక్తిని, ఉపాగతం= పొందినట్టి, కమపి= సర్వలోక విలక్షణంగా ఉన్న ఒక, కరుణావరుణాలయమ్= దయాసముద్రానికి, వందే= నమస్కరిస్తున్నాను.

**అవ :** ఆచార్యపరంపరలో శ్రీదేవివరకు నమస్కరించి ఆ ప్రసంగంలో తత్తుల్యంగా జగన్మాతలగు భూదేవి, నీళాదేవులకు నమస్కరించి గురుపరంపరలో ప్రథమాచార్యుడు, ప్రకృత స్తోత్రవిషయమైన దయకు ఆశ్రయభూతుడు అగు వేంకటాద్రీశునికి నమస్కరిస్తున్నారు.

**తా :** శ్రీనివాసుని ఒక దయాసముద్రంగా రూపిస్తున్నారు. అట్టి దయాసముద్రుడగు శ్రీనివాసునికి దేశకాలవస్తువులచే పరిచ్ఛేదం (కొలత) లేదు. అనగా ఒక దేశమందే, ఒక కాలమందే, ఒక వస్తువునందే ఉన్నాడనుట లేదు. సర్వదేశాలలోను, సర్వకాలాలలోను, సమస్త వస్తువులలోను ఉన్నాడని భావం. కావుననే ప్రసిద్ధ సముద్రంకంటె ఈ దయాసముద్రం విలక్షణమైంది. మరియు వృషగిరి తటప్రదేశంలో నివసించేవారికి ఇతర ప్రార్థనాపేక్ష లేకుండా స్వయంగానే ప్రత్యక్షమవుతున్నాడు. అనగా చేతనులయందు పరమదయచే వారికి స్వయంగానే దర్శనం ఇస్తున్నాడని భావం. ఆగమశాస్త్ర ప్రసిద్ధమైన స్వయంవ్యక్తమైన ప్రధానక్షేత్రాలలో వేంకటాచలం ప్రథమగణ్యమని భావం. ఈ శ్రీనివాసమూర్తి సైద్ధార్షమానుషాదిప్రతిష్ఠానిరపేక్షమై స్వయమావిర్భూతమని పరమ తాత్పర్యం. ఇతనిలో ఉన్న దయ అనే గుణాన్నే

చేతన సమాధిలో ఈ శతకంలో స్తోత్రం చేయబోతున్నారు. అట్టి అపారదయకు ఆశ్రయుడైన ఈ దయాసముద్రమనే శ్రీనివాసునికి ఇక్కడ నమస్కరించడం అత్యన్తావశ్యకం.

**శ్లో॥ అకించననిధిం సూతిమపవర్గత్రివర్గయోః।**
**అంజనాద్రీశ్వరదయామభిష్టౌమి నిరంజనామ్ ॥ 10**

**ప్రతి :** అకించననిధిమ్= అకించనులకు నిధిగాఉన్నట్టి, అపవర్గత్రివర్గయోః= మోక్షానికి, ధర్మార్థకామాలకు, సూతిమ్= ఉత్పత్తికారణంగాను, నిరంజనామ్= దోషములేకుండాను ఉన్న, అంజనాద్రీశ్వరదయామ్= వేంకటాధీశునియొక్క దయను, అభిష్టౌమి= స్తోత్రం చేస్తున్నాను.

**అవ :** ఆళ్వార్లకు, ఋషులకు, ఆచార్యపరంపరకు నమస్కరించి ప్రకృత ప్రబంధానికి ప్రధానప్రతిపాద్య అయిన దయాదేవికి నమస్కరించి గ్రంథప్రతిజ్ఞ చేస్తున్నారు.

**తా :** శ్రేయస్సాధనమైన ఎలాంటి ఉపాయం లేకుండా కేవలం ఈశ్వరుని పాదారవిందాలనే నమ్ముకొని ఉన్నవారు అకించనులు. అట్టివారికి ఈ దయాదేవి నిధిగా ఉంది. నిధివలె పరమభోగ్యమని భావం. అపవర్గమనే మోక్షంగాని, త్రివర్గమనబడే ధర్మార్థకామాలుగాని (చతుర్విధ పురుషార్థాలు) ఈ దయాదేవి అనుగ్రహంవల్ల పొందబడుతున్నాయి. అట్టి దయాదేవి ఎలాంటి పక్షపాతాది దోషాలు లేకుండా ఉంది. అంజనపర్వతమనే వేంకటపర్వతానికి అధీశ్వరుడగు శ్రీనివాసునియొక్క అలాంటి దయను ఈ శతకంలో స్తోత్రం చేస్తున్నానని ప్రబంధార్థ ప్రతిజ్ఞను ఇక్కడ ప్రారంభిస్తున్నారు.

అంజనపర్వతానికి అధిపతి అయినవాని పత్నికి కొంచెంకూడా అంజనం లేదనే శబ్దచిత్ర మిక్కడ ధ్వనిస్తున్నది. (అంజనం= కాటుక)

ఇక్కడనుండి సాక్షాద్దయయే ప్రస్తావింపబడుతున్నది. కనుక స్తోత్రసాంగత్యం చెప్పనవసరంలేదు.



ఇక్కడ దయను "అకించననిధిమ్" అనుటచే ఫలరూపత్వం, "సూతిమపవర్గ త్రివర్గయోః" అనుటచే ఫలసాధనత్వం, "అంజనాద్రీశ్వరదయామ్" అనుటచే స్వరూపం, "నిరంజనామ్" అనుటచే అబాధ్యత్వం స్ఫురిస్తుండడంవల్ల పూర్వోత్తరద్విరూపమైన శారీరకచతురధ్యాయీ ప్రతిపాద్యార్థాలు జగత్కారణుడగు పరమపురుషుని ఆశ్రయించిన ఈ దయాదేవికిని సమంజసములవుతున్నట్లు తాత్పర్యమై ఉంటుందని పెద్దల అభిప్రాయం.

*ప్రథమ దశకం సంపూర్ణం*

*శ్రీమద్వేదాంతగురవే నమః*

# ద్వితీయ దశకం

**శ్లో॥ అనుచరశక్త్యాదిగుణామగ్రేసరబోధ విరచితాలోకామ్ ।**
**స్వాధీనవృషగిరీశాం స్వయంప్రభూతాం ప్రమాణయామి దయామ్ ॥**

**ప్రతి :** అనుచరశక్త్యాదిగుణామ్= తనను వెంబడించి వస్తున్నటువంటి భగవత్కల్యాణ గుణాలైన శక్తి మొదలగువానిని కలిగినట్టి, అగ్రేసరబోధ విరచితాలోకామ్= ముందుబోతున్న జ్ఞానమనే గుణంతో చేయబడిన ప్రకాశం కల్గినట్టి (ఆలోక శబ్దమనే ఉపచారోక్తిని కల్గినట్టి), స్వాధీన వృషగిరీశామ్= తన అధీనం కావించుకొనబడిన వేంకటేశుని కల్గినట్టి, స్వయంప్రభూతామ్= (కనుకనే) తానే సర్వేశ్వరిగా ఉన్నట్టి, దయామ్= దయాదేవిని, ప్రమాణయామి= ప్రమాణీకరిస్తున్నాను. (శరణంగా నిశ్చయిస్తున్నాను.)

**అవ :** గ్రంథారంభానికి ముందు అవశ్యం అనుష్ఠింపదగిన గురుదేవతావందన, గ్రంథప్రతిజ్ఞాది విషయాలను గత దశకంలో చెప్పి సాక్షాద్దయాస్తోత్రాన్ని ఇక్కడనుండి ప్రారంభిస్తున్నారు.

ఈ దశకంలో అసంఖ్యేయమైన భగవద్గుణాలలో దయాగుణానికి ఉండే ప్రాధాన్యాన్ని ప్రతిపాదిస్తూ ఈ దయయే జగత్సృష్టి సంహార పాలనాదులలో ప్రధానకారణం అవుతున్నదని నిరూపిస్తున్నారు.

కింది శ్లోకంలో "అంజనాద్రీశ్వరదయా" అని సామాన్యంగా ఉద్దేశింపబడిన దయ ఈ శ్లోకంలో "స్వాధీనపతికా" అని విశేషాకారంతో నిరూపిస్తున్నారు.

**తా :** అత్యున్నతమైన ఐశ్వర్యస్థితిలో ఉండే ఒక స్వాధీనపతిక అయిన (తన భోగాదులచే నాయకుని తన అధీనం కావించుకొన్న నాయిక) రాజమహిషి తానొక కార్యాన్నుద్దేశించి బయలుదేరేటప్పుడు ఆమెయొక్క ఐశ్వర్యస్థితికి తగినట్లు ముందొక పరిచారిక కరదీపికను ధరించి "ఇతః ఇతః ఆలోకయతు



దేవీ" అని ఉపచారోక్తిపూర్వకంగా త్రోవచూపిస్తుండగా, తన ఆజ్ఞను శిరసావహించి తత్క్షణమే నెరవేర్చు సామర్థ్యంగల మరికొందరు పరిచారికలు వెంబడించిరాగా, తాను మధ్యలో అతిగంభీరంగా పోయి తన కభిప్రేతమైన కార్యాన్ని ఆ పరిచారికలద్వారా ఎలా నెరవేర్చుకొంటుందో, అట్లే ఈ శ్రీనివాసదయ అనే సార్వభౌమమహిషి తన పనిని నెరవేర్చుచున్నదనే ఒక చిత్రాన్ని కవి ఇక్కడ ప్రదర్శింపజేస్తున్నారు.

పలువిధాలైన అపరాధాలతో నిండిన ఒకజీవుని ఈశ్వరుడు రక్షించు తరుణంలో మొదట ఆ జీవునియొక్క దైన్యస్థితిని అనన్యగతికత్వాన్ని తెలుసుకోవడం, తదనన్తరం ఆ రక్ష్యజీవునియందు దయోద్రేకమేర్పడడం, తదుపరి తన శక్త్యాదులచే ఆ జీవుని రక్షించడం జరుగుతున్నది. ఇక్కడ ముందు వెనుక ఉన్న జ్ఞాన శక్త్యాదులకంటె మధ్యలో ఉన్న దయయే ప్రధాన విషయమని వేరుగా చెప్పనవసరం లేదు. దయ ప్రవహింపవలసిన స్థలాన్నే ఆ జ్ఞానం చూపిస్తున్నది. దయకు అభిప్రేతమైన కార్యాలనే శక్త్యాదులు నిర్వహిస్తున్నాయి. కావుననే ఈ దయను భగవత్కల్యాణ గుణాలన్నిటిలోను ప్రధానంగా పట్టమహిషీ స్థానంలో, "స్వాధీనపతిక" రూపంలో వర్ణించడం జరిగింది. ఎట్టి గుణాలు దయకు స్వాధీనాలో, అట్లే భగవంతుడుకూడా దయాదేవికి స్వాధీనుడే. దయకు పరవశుడయ్యే ప్రపంచంలోని సర్వకార్యాలను సర్వేశ్వరుడు నిర్వహిస్తున్నాడు. అందుచే ఈ దయాదేవి అందరికిని ప్రభువవుతున్నది. అట్టి దయాదేవిని నేను ప్రమాణీకరిస్తున్నానని (శరణంగా నిశ్చయిస్తున్నానని) తాత్పర్యం.

ఈ శ్లోకంలో "ప్రమాణయామి" అనే పదాన్ని ఆలోచించి చూస్తే శాస్త్రీయమైన మరొక భావం గోచరిస్తున్నది. ఈ స్తోత్రంలో అక్కడక్కడ పలుశ్లోకాలలో ఇలాంటి తాత్పర్యాలున్నాయి. అవి కేవలం శాస్త్రజ్ఞులకే రుచిస్తాయి. కనుక అట్టి అర్థాలను విశేషంగా రాయదలచలేదు. ప్రదర్శనార్థం ఈ శ్లోకానికి రాస్తున్నాం.

ప్రత్యక్ష అనుమాన ప్రమాణాలచే తెలుసుకోవడానికి వీలుగాని అలౌకిక పదార్థాలను (ఈశ్వరాదులను) వేదమనే శబ్దప్రమాణం తెలియజేస్తున్నది. కనుక ఇతర ప్రమాణాలకంటె ఆ వేదప్రమాణమే గొప్పది. ఈ విషయంలో శబ్దప్రమాణానికి గల మరికొన్ని ఆకారాలనుకూడా ఈ శ్లోకంద్వారా తెలియజేస్తున్నారు.

**అనుచరశక్త్యాదిగుణామ్ :** శక్తి లక్షణా మొదలగు వృత్తులు శబ్దశ్రవణానన్తరం శ్రోతకు కలుగుతున్నాయి. కనుక శబ్దం శక్తి లక్షణాదివృత్తులను తన వెనుక కలిగి ఉంది.

**అగ్రేసరబోధవిరచితాలోకామ్ :** "అర్థం బుద్ధ్వా శబ్దరచనా" అనెడి రీతిలో శబ్దోచ్చారణకు ముందు అర్థబోధమావశ్యకం కనుక శబ్దం తనకుముందు అర్థజ్ఞానంవల్ల ఏర్పడే ప్రకాశాన్ని కలిగి ఉంది.

**స్వాధీనవృషగిరీశామ్ :** ఇది వేదమనే శబ్ద ప్రమాణానికి మాత్రం సంబంధించిన విషయం. ఒక వేదంచేతనే ఈశ్వరుని ఎరుగగలం. దీనినే "శాస్త్రయోనిత్వాత్" అనే బ్రహ్మసూత్రంలో శ్రీవ్యాసుడు సిద్ధాంతీకరించాడు. కావున శ్రుతి పతిని తనకు స్వాధీనపరచుకొన్నదని భావం.

**స్వయంప్రభూతామ్ :** కావుననే అన్ని ప్రమాణాలకంటె వేదమనే శబ్దప్రమాణమే చాల ప్రధానం (ప్రమాణప్రభువు). అట్టి శ్రుతిని ప్రమాణీకరిస్తున్నానని తాత్పర్యం.

**శ్లో॥ అపి నిఖిలలోకసుచరిత ముష్టింధయ దురితమూర్ఛనాజుష్టమ్ ।**
**సంజీవయతు దయే మామంజనగిరినాథరంజనీ భవతీ ॥ 12**

**ప్రతి :** హే దయే= ఓ దయాదేవీ!, అంజనగిరినాథరంజనీ= అంజన పర్వతానికి అధిపతియైన శ్రీనివాసుని (తన గుణచేష్టితాదులచే) రంజింపజేయు, భవతీ= నీవు, నిఖిల లోక సుచరిత ముష్టింధయ దురితమూర్ఛనాజుష్టమపి= సమస్త జనులయొక్క పుణ్యాలను ఒకే ఒక ముష్టిచే పానంచేసెడి సామర్థ్యంగల పాపాలచే సంభవించు మూర్ఛావస్థను పొందినవాడనైనప్పటికి, మామ్= నన్ను, సంజీవయతు= ఉజ్జీవింప జేయుదువుగాక!



**అవ :** కింది శ్లోకంలో సర్వోత్కృష్టయగు దయాదేవిని శరణు పొందినారు. ఈ శ్లోకంలో అట్టి దయాదేవివద్ద తన అభీష్టంకోసం ప్రార్థిస్తూ తన పాపాలయొక్క ప్రాబల్యాన్ని, దయాదేవికి కల పాపవిధ్వంసకశక్తిని తెలియబరస్తున్నారు.

**తా :** అంజనపర్వత మనబడే వేంకటగిరికి అధిపతియైన శ్రీనివాసుని తన గుణచేష్టితాదులతో సంతోషింపజేసే ఓ దయాదేవీ! నీవు సర్వప్రపంచంలో ఉన్న పెద్దలచే చిరకాలంనుండి చేయబడినట్టి, చేయబడుచున్నట్టి, చేయబడనున్నట్టి సమస్త పుణ్యాలను ఒక్కపిడికిటచే అణచి, ఆ పుణ్యాలయొక్క వీర్యాలను కొద్దిగానైనా తలనెత్తనీయక అడ్డగించి తన వీర్యాన్నే విశేషంగా ప్రసరింపజేసి సర్వప్రాణులను హింసించు బలం కలిగినట్టి, ఎంతో గొప్పవయినట్టి, ఎన్నో పర్యాయాలు నాచే చేయబడిఉన్న పాపాలచే మూర్ఛితుడనైన నన్ను ఉజ్జీవింపజేయుమని ప్రార్థిస్తున్నారు.

ఇచ్చట "మూర్ఛనాజుష్టమ్" "సంజీవయతు" మొదలగు పదాలచే మూర్ఛనుపోగొట్టు సంజీవని అను ఓషధివలె ఈ దయాదేవి ఉన్నదని సూచితమైంది. ఆ ఓషధి గిరినాథునియందు (పర్వత శ్రేష్ఠమునందు) ప్రకాశిస్తూ ఉంటుంది. మూర్ఛ అనే వ్యాధిచే పీడింపబడి శవతుల్యుడై కృత్యాకృత్య పరిజ్ఞానం కొద్దిగాకూడా లేనివానిని ఉజ్జీవింపజేసి సర్వకార్యాలలోనూ వానికి ఉత్తమజ్ఞానాన్ని ఆ ఓషధి ఎలా ప్రసాదిస్తుందో అట్లే ఈ దయాదేవికూడా తీవ్రతమమైన పాపాలచే పీడితులై, అవశ్య జ్ఞాతవ్యాలైన తత్త్వహిత పురుషార్థాల జ్ఞానం పూర్ణంగాలేక, తాను జీవించినా

మృతునితో సమానుడుగాను, విషయభోగ మాత్రలోలుడుగాను ఉండి మరల మరల పాపాలనే చేస్తున్నవానిని కూడా ఉజ్జీవింపజేస్తున్నదని భావం.

ఇట్టి పాపాలను తొలగించుటకు ప్రాయశ్చిత్త కర్మలు ఉండినా, ఆ ప్రాయశ్చిత్తాలను నిర్దుష్టంగా అనుష్ఠించుటకు మన జీవితకాలం చాలదు. అట్టి శక్తిసామర్థ్యాలు మనకు లేవు. కావున ఆ పాపాలను ఈ దయాదేవి మూలంగానే పోగొట్టుకోవాలి. అనగా దయాపరవశుడైన పరమపురుషుడు "క్షమించితిని, ఇక ఆ పాపాలకు ఫలముల నియ్యను" అని సంకల్పించునట్లు చేయడమని భావం. ఇట్టి పాపాలచే ఏర్పడిన మూర్ఛను పోగొట్టి తత్త్వహిత పురుషార్థాలలో మంచి పరిజ్ఞానాన్ని కలుగజేసి సంరక్షింపదగిన సామర్థ్యం దయాదేవికే కలదని నిశ్చయించి, ఆమె నిక్కడ ఈ రీతిగా ప్రార్థించడం జరిగింది.

ఇక్కడ పాపానికి ఇచ్చిన విశేషణాన్ని పర్యాలోచిస్తే ఆ పాపస్వభావం చక్కగా బోధపడుతుంది. "ఏకః పాపాని కురుతే ఫలం భుంక్తే మహాజనః" అని పురాణం. ఒకడు దుస్సహమైన పాపాలను ఆచరిస్తే అనేకులు పాపఫలం అనుభవిస్తారు. ఒకడు ఘోరపాపం చేస్తే ఆ పాపఫలం వాడు, వానితో కూడినవారు, వానిఊరిలో, వానిదేశంలో ఉండువారందరూ అనుభవిస్తారు. ఇట్టి పాపం ముందు కిందచెప్పిన సమస్త పుణ్యాలుకూడా ఏమీ చేయలేవని భావం.

లోకక్షేమానికై అవతరించిన ఈ పరమాచార్యులు తన పాపాలు ఇలా ఉన్నాయని చెప్పడం మనబోటివారిని బాగుజేసి సన్మార్గంలో ప్రవేశపెట్టుటకే (మన పాపాలను తలచి హృదయం ద్రవించగా పరమపురుషుని శరణుపొంది వాని దయకు మనం పాత్రులమగుటకే) అని భావించాలి.

ఈ శ్లోకంలో పూర్వార్థంలో "మూర్ఛనాదుష్టమ్" అని, ఉత్తరార్థంలో "సంజీవయతి" అని పాఠాన్తరాలు ఉన్నాయి. ఈ పాఠాలలోకూడ విశేషంగా అర్థభేదం లేదు.



**శ్లో॥ భగవతి దయే భవత్యా (త్యాం) వృషగిరినాథే సమాప్లుతే తుంగే ।**
**అప్రతిఘ మజ్జనానాం హస్తాలంబో మదాగసాం మృగ్యః ॥ 13**

**ప్రతి :** భగవతి దయే= పూజ్యురాలగు ఓ దయాదేవీ! తుంగే= అందరికంటె ఉన్నతుడైన, వృషగరినాథే= వేంకటగిరినాథుడగు శ్రీనివాసుడు, భవత్యాం= నీ ప్రవాహంలో, సమాప్లుతే= పూర్తిగా మునిగిపోతుండగా, అప్రతిఘ మజ్జనానామ్= అడ్డంలేకుండా మునిగిపోవుతున్నటువంటి, మదాగసామ్= నాయొక్క పాపాలకు, హస్తాలంబః= కరావలంబం, మృగ్యః= దుర్లభం.

**అవ :** కింది శ్లోకంలో అతిఘోరమైన తన పాపాలను తలచి మిక్కిలి కంపితులయినారు. ఈ శ్లోకంలో ఆ పాపాలు అంత క్రూరమైనవైనా శ్రీనివాసుని ఆశ్రయించి ఉండడంచేత, అవి దయాప్రవాహంలో శ్రీనివాసునితోపాటు మునిగిపోతున్నప్పుడు వానికి హస్తావలంబం ఇచ్చువారు లేనందున వాని సామర్థ్యం కించిత్తుగూడ ఫలించదని ఆచార్యులు తనను తాను ఒకవిధంగా సమాశ్వాసపరచుకొంటున్నారు.

**తా :** ఒకడొక పెద్ద ప్రవాహంనుండి తనను సంరక్షించుకొనగోరితే ఒక ఉన్నతమైన ప్రదేశానికి వెళతాడు. ఆ ప్రవాహం అతనికి ఆశ్రయమై ఉన్న ప్రదేశాన్ని ఏమీ చేయలేకపోయినపుడు ఆతడు సంరక్షించబడునని వేరుగాచెప్ప నవసరంలేదు. అట్లుగాక ఆ ప్రవాహం మితిమీరి ప్రవహించి ఆతనికి ఆశ్రయమై ఉన్న ఆ ఉన్నత ప్రదేశాన్ని కూడా పొరలించి కొట్టుకొనిపోవునట్లు చేస్తే, ఇక అతని గతినిగూర్చి ఏమి చెప్పాలి? అలాగే దయాప్రవాహం మితిమీరి పొరలునప్పుడు లోకంలోని అన్ని వస్తువులకంటె ఉన్నతుడైన శ్రీనివాసుడే ఆ ప్రవాహంలో మునిగిపోతుండగా, అతనిని ఆశ్రయించి ఉన్న మన పాపంకూడా మునిగిపోవు ననడంలో ఏమాత్రం సందేహం లేదుగదా? ఆ పాపాలకు హస్తావలంబం లేనందున తామియ్యదలచిన దుష్ఫలాలను ఇవ్వకుండానే నశించిపోతాయని కవి హృదయం.

మనం చేసే పాపాలు శ్రీనివాసుని ఆశ్రయించి ఉండడం ఎలాగంటే ఇతర మతాలలోవలె కాకుండా మన మతంలో పుణ్యపాపాలయొక్క స్వరూపాన్ని శాస్త్రాలద్వారా మనపెద్దలు చక్కగా నిరూపించి ఉన్నారు. ఈశ్వరునియొక్క ప్రీతి కోపాలే పుణ్యం పాపం అనబడతాయి. శాస్త్రనిషిద్ధాలైన పనులను మనంచేసేటప్పుడు మనపై భగవానునికి కోపం కలుగుతున్నది. వెంటనే భగవంతుడు “ఈ నిషిద్ధకార్యం ఆచరించిన వాడు దానికి తగిన పరిహారం చేయకపోతే తప్పక దండిస్తాను” అని సంకల్పించుకొంటాడు. భగవంతునియొక్క ఈ కోపమే ఆ నిషిద్ధకార్యం ఆచరించినవానియొక్క పాపమనబడుతుంది. ఇట్టి కోపాన్ని కలుగజేసే నిషిద్ధకార్యాలను కూడా పాపాలని వ్యవహరిస్తున్నాం. ఇలాగే సత్కార్యాచరణతో భగవంతునికి కలిగే ప్రీతి పుణ్యమని చెప్పబడుతున్నది. పైన చెప్పబడిన పాపాలకు శాస్త్రోక్తాలైన పరిహారాలలో భగవంతుని చరణాల నాశ్రయించి “తెలియక తప్పుచేశాను. పరమకారుణికుడవైన నీవు నన్ను క్షమించాలి” అని చెప్పి శరణాగతి పొందడం ఉత్తమ పరిహారం. అలా మనం చేస్తున్నప్పుడు భగవంతునియొక్క దయ అనే గుణం తలయెత్తి మహాప్రవాహంగా పొంగి భగవంతునే ముంచుతున్నది. అంటే తనకధీనుని కావించుకొంటుందని భావం. అప్పుడు మనం ముందుచేసిన నిషిద్ధాచరణలచే భగవంతుని హృదయంలో ఏర్పడిన కోపమనే పాపాలు ముందు మనకివ్వదలచిన దుష్ఫలాలను ఇవ్వడానికి శక్తిలేనివై (దయచే కోపం అణగిపోయినయెడల) నశించిపోతున్నాయి. ఈ వేదాంత రహస్యార్థాన్నే ఆచార్యులిక్కడ ఈ విధంగా చిత్రించారు.

లోకంలో కూడా భృత్యుడు తప్పుచేస్తే యజమాని కోపంతో వానిని దండించాలనుకొంటాడు. కాని ఏకారణంతోనయినా మరల వానియందు దయకలిగితే ముందు తాను ఇవ్వాలనుకొన్న దండనను ఇవ్వకపోవుటయేగాక పైగా వానికి కొన్ని సౌకర్యాలనుకూడా కల్పించుట అనుభవసిద్ధమేగదా! ఇదంతా ఆ యజమాని దయాధీనమే. భగవంతుని విషయంలోకూడా ఈ న్యాయమే.



**శ్లో॥ కృపణజనకల్పలతికాం కృతాపరాధస్య నిష్క్రియామాద్యామ్ ।**
**వృషగిరినాథదయే! త్వాం విదన్తి సంసారతారిణీం విబుధాః ॥ 14**

**ప్రతి :** హే వృషగిరినాథదయే= ఓ వృషపర్వతమనే వేంకటగిరి కధిపతియగు శ్రీనివాసునియొక్క దయాదేవీ!, విబుధాః= శాస్త్రమెరిగిన పెద్దలు, కృపణజనకల్పలతికామ్= దీనజనులపాలిటి కల్పలతగాను, కృతాపరాధస్య= చేయబడినట్టి అపరాధానికి, ఆద్యాం నిష్క్రియామ్= ముఖ్యమైన ప్రాయశ్చిత్తంగా ఉన్న, త్వాం= నిన్ను, సంసారతారిణీమ్= సంసారసాగరాన్ని దాటింపజేయుదానినిగా, విదన్తి= నిశ్చయిస్తున్నారు.

**అవ :** కింది శ్లోకంలోని శ్రీనివాసునియొక్క దయాప్రవాహంలో హస్తావలంబనం ఇచ్చేవారులేక మన పాపాలు మునిగిపోవుతున్నాయని, అందుచే ఆ పాపాలు తమ ప్రాబల్యం చూపించడానికి శక్తిలేనివవుతున్నాయని ప్రతిపాదించారు. ఆ దయాప్రవాహంలో పాపాలు మునగడం అంటే ఏమిటి? అలా మునుగుటచే కలిగే ప్రధానఫలమేమి? ఈలాంటి ప్రశ్నలకు శాస్త్రరీతిగా సమాధానాలు ఇస్తున్నారు.

**తా :** పాపాలు దయాప్రవాహంలో మునిగిపోయి తమ శక్తులను పోగొట్టుకొనుటెట్లనగా ఒక ప్రాయశ్చిత్త కర్మను చేస్తే అది ఎలా మనం ముందుచేసిన పాపంయొక్క కీడును నాశం చేస్తుందో, అట్లే ఈ భగవద్దయకూడా మనబోటి దీనజనులు చేసే అపరాధాల కీడును నాశనం చేస్తున్నది. తెలిసో, తెలియకో మనచే చేయబడుతున్న పలువిధాలైన అపరాధాలయొక్క శక్తిని అణచిపెట్టుటకు ప్రాయశ్చిత్తాలనే పలుకర్మలు శాస్త్రంలో విధింపబడి ఉన్నాయి. అట్టి ప్రాయశ్చిత్తాలకు నిష్క్రియలని పేరు. (చేసిన పాపాలయొక్క శక్తిని పోగొట్టుక్రియలు) ఇట్టి నిష్క్రియలను ఆచరిస్తే ముందు మనంచేసిన అపరాధాలచే ఏర్పడిన భగవానునియొక్క కోపం అణిగిపోతున్నది. ఇట్టి ప్రాయశ్చిత్తాలు చేయడానికి జ్ఞానం, శక్తి, ద్రవ్యం

మొదలగు సామగ్రి కావాలి. ఇవి లేనివాడు అపరాధం చేస్తే, ప్రాయశ్చిత్తం చేయడానికి వీలుకానందున వానికిన్ని సదుపాయాలు కలుగజేయదలచిన శాస్త్రాలు భగవత్సన్నిధిలో 'నేను అపరాధాలు చేశాను. వానికి శాస్త్రోక్తాలైన ప్రాయశ్చిత్తాలను అనుష్ఠించుటకు శక్త్యాదులు నాకు లేవు. అందుచే నా అపరాధాలను క్షమించి ఆ ప్రాయశ్చిత్తం చేస్తే ఎలా నీ కోపం, నిగ్రహసంకల్పం అణగిపోవునో, అట్లే నీ దయచే నన్నుకూడా ప్రాయశ్చిత్తం అనుష్ఠించినవానివలె భావించి నాయందున్న కోపం, నిగ్రహసంకల్పం అణిగించుకోవాలి' అనురీతిగా శరణాగతి చేసినయెడల భగవంతునికున్న కోపం అణగి, దయ ఉద్రేకించి ఈ కృపణుని, జ్ఞానశక్తిహీనుని విషయంలో కూడా కల్పలతవలె కోరిన ఫలాలను ఇస్తున్నది అని ప్రతిపాదిస్తున్నాయి.

కావుననే కృపణుని విషయంలో ప్రాయశ్చిత్తం చేసేపనిని ఈ దయాదేవియే చేస్తున్నది కనుక దీనినికూడా ఒక నిష్క్రియ (ప్రాయశ్చిత్తం)గా చెప్పుట కద్దులేదు. క్రియారూపాలైన ప్రాయశ్చిత్తాలకంటె భగవంతునియొక్క జ్ఞానరూపమైన ఈ దయకు నిష్క్రియత్వం సమంజసమనే అభిప్రాయంతోనే "ఆద్యాం, నిష్క్రియాం" (ముఖ్యమైన నిష్క్రియగా) అని వ్యవహరించారు.

ప్రాయశ్చిత్తం చేసేవాడుకూడా భగవద్దయకోసం ఎదురు చూడవలసినవాడే. కృపణునికి సాధనం, సాధ్యం, రెండూ దయయే అవుతుంది అనే శాస్త్రార్థం ఇక్కడ వెల్లడింపబడుతున్నది.

ఇట్లు ఆయా పాపాలను ధ్వంసంచేసే సామర్థ్యం కల్గిన ఈ దయాదేవినిగురించి, బహుదుఃఖమయమైన ఈ సంసారానికి కారణాలైన సర్వపాపాలకు ప్రాయశ్చిత్తాలుగా విధింపబడిన కర్మయోగ, జ్ఞానయోగ, భక్తియోగాదులను ఆచరించుటకు జ్ఞానశక్త్యాదులు లేనివాడు ముందుజెప్పినట్లు శరణాగతిని అనుష్ఠించినయెడల ఈ దయాదేవి ఆ భక్తియోగం మొదలగు ప్రాయశ్చిత్తాలు చేసేపనిని చేసి సంసారకారణాలైన



కర్మలను తొలగించి, సంసార సాగరాన్ని దాటించి, మోక్షమనే ఉత్తమపురుషార్థాన్ని ఇస్తున్నది అని శ్రీ భగవద్రామానుజులు మొదలగు ఉత్తమవిద్వాంసులు నిర్ణయించి ఉన్నారని పండిత తాత్పర్యం.

**శ్లో॥ వృషగిరిగృహమేధిగుణాః బోధబలైశ్వర్యవీర్యశక్తిముఖాః ।**
**దోషా భవేయు రేతే యది నామ దయే! త్వయా వినాభూతాః ॥ 15**

**ప్రతి :** హేదయే= ఓ దయాదేవీ! బోధబలైశ్వర్యవీర్యశక్తిముఖాః= జ్ఞానం, బలం, ఐశ్వర్యం, వీర్యం, శక్తిమొదలగు, ఏతే= ఈ, వృషగిరిగృహమేధిగుణాః = వేంకటపర్వతాన ఉండు గృహస్థుడగు శ్రీనివాసునియొక్క గుణాలు, త్వయా= నీచేత, వినాభూతాః= విడిచిపెట్టబడినవిగా (నీ సంబంధం లేనివిగా), యదినామన్యుః= ఐనచో, దోషాః= దోషాలుగా, భవేయుః= కాగలవు (పరిణమించగలవు).

**అవ :** భగవంతునియందు జ్ఞానం మొదలగు అనేక గుణాలుండగా దయా గుణాన్నే స్తోత్రంచేయుటకు కారణమేమి? అను ప్రశ్నకు సరియైన సమాధానం ఈ శ్లోకంలో చూపబడుతున్నది. కింది శ్లోకంలో దయాదేవి జీవులుచేసే అపరాధాలకు ప్రాయశ్చిత్తంగా ఉండి వారికిచేయగల మహోపకారం వర్ణింపబడింది. ఈ శ్లోకంలో సాక్షాద్భగవంతునికే దయాదేవిచేత ఒనరింపబడుతున్న ఉపకారం వర్ణింపబడుతున్నది.

**తా :** "భగవాన్" అనేపదానికి "జ్ఞానశక్తి బలైశ్వర్య వీర్య తేజాంస్యశేషతః। భగవచ్ఛబ్దవాచ్యాని వినా హేయైర్గుణాదిభిః॥" అను ప్రమాణాన్ని అనుసరించి ఈ జ్ఞానం మొదలగు గుణాలను కలిగినవాడు అని అర్థం. మనకు మంచిని కలుగజేయువాటిని గుణాలని, చెడు కలుగజేయువాటిని దోషాలని తలస్తున్నాం. కిందచెప్పబడిన జ్ఞానం మొదలగు గుణాలు మనబోటి అపరాధిజీవులయందు మంచిని కలుగజేస్తే అవి గుణాలు కావడానికి సందేహం లేదు. అట్లుగాక చెడునే కలుగజేస్తే గుణాలు కాకపోవుటయేగాక

దోషాలుగా కూడా పరిణమిస్తాయి. అప్పుడు జ్ఞానం మొదలైనవానిని గుణాలని వ్యవహరించడానికి వీలులేనందున "ఈ గుణాలు కలిగినవాడే భగవంతుడు" అని ప్రమాణాలు చెప్పినట్లు సర్వేశ్వరుని "భగవాన్" అని చెప్పదగదు. జ్ఞానం మొదలైనవి సర్వేశ్వరునియందున్నప్పటికి అవి గుణాలుగా ఉండినప్పుడే ఈశ్వరునికి "భగవాన్" అని పేరు స్థిరపడుతుంది. అవి దోషాలుగా మారినపుడు ఆ పేరు వానికి తగదు. ఇదియే ముందు చెప్పబడిన ప్రమాణానికి తాత్పర్యం. అందుచేత దయాదేవి ఏమిచేస్తున్నదనగా ఆ జ్ఞానం మొదలయిన వానితో తాను కలసిమెలసి తన సంబంధంచేత వానిని దోషాలుగా పరిణమించనీయకుండా గుణాలుగాచేసి (మనబోటి జీవులకు హితకారులను చేసి) భగవంతునికి "భగవాన్" అను పేరును స్థిరపరస్తున్నది. ఇక్కడ ముఖ్యమైన తాత్పర్యం ఇదే.

దయాదేవీ సంబంధంచేత పూర్వోక్తజ్ఞానాదులు గుణాలు కావడం, ఆమె సంబంధం లేకుంటే అవి దోషాలు కావడం ఎలాగంటే భగవంతునికి జ్ఞానమనేది సర్వకాలాలలో సర్వవస్తువులను, సర్వప్రకారాలచేత తత్త్వంగా తెలియడం.

**బలమనునది :** సర్వకాలాలలోను సర్వపదార్థాలను కించిత్తు కూడా శ్రమలేకుండా ధరించడం.

**ఐశ్వర్యమనునది :** సర్వలోకాలలోని చేతనాచేతనాలను, వస్తువులను నియమించడం.

**వీర్యమన్నది :** (ఈశ్వరుడు) తానే సర్వవస్తువులుగా పరిణమించి, అన్ని వస్తువులను ధరించి, అన్ని వస్తువులలోను అంతర్యామిగా ఉండి నియమించి వానిలో ఉన్న, వానిచే కలుగుచున్న ఏవిధమైన వికారాలు లేకుండా ఉండడం. (జడత్వపరిణామిత్వాజ్ఞత్వ దుఃఖిత్వాది రాహిత్యం).

**శక్తియనునది :** ఎవరిచేతనైనా చేయ సాధ్యంకాని పనిని తాను తలచినచో చేసి ముగించడం.



**తేజస్సునది :** తనను తప్ప మిగిలినవారిని జయించడం.

ఈ గుణాలు దయాసంబంధం లేనపుడు అపరాధులమైన మనయొక్క వేలకొలది అపరాధాలను ఈశ్వరునకు చక్కగా బోధించి, ఎవరిచేతను నివారించడానికి వీలులేనట్లుగా ఈశ్వరుడు తలచిన క్షణంలోనే కలుగజేసి పెద్దగోతిలో పడదోశాడు. అప్పుడు మనకు పూర్ణంగా చెడునే కలుగజేయుటచే ఇవి దోషాలుగా మారిపోతాయి.

అలా కాకుండా ఈ గుణాలతో దయాదేవికి సంబంధమేర్పడి ఉంటే, ఒక్కొక్క గుణంతో ఆ దయాదేవి చేరి వానిని చెడుగను చేయనీయక జీవసంరక్షణ కార్యంలోనే ఉంచి వానిమూలంగా మనకు పరమహితాన్ని కలుగజేసి, వానికి గుణాలు అనే పేరును సార్థకపరచి తద్వారా ఈశ్వరునికి కూడా "భగవాన్" అనే పేరును స్థిరపరస్తున్నది. కింద చెప్పినట్లు ఈ గుణాలయొక్క స్వరూపాన్ని పరామర్శించి చూస్తే దయాదేవి సంబంధం లేనప్పుడవి చేటుచేయడానికి ఉపయోగపడతాయని, ఆమె సంబంధం ఉంటే మంచినే కలుగజేస్తాయని అందరికి స్పష్టంగా తెలుస్తుంది.

ఇట్లు ఈ గుణాలకు దయాదేవి సంబంధం ఏర్పడడానికి మూలకారణం మహాలక్ష్మియొక్క నిత్యసంబంధమే అని తెలియపరచుటకొరకై "వృషగిరి గృహమేధి" అనే పదంచేత శ్రీనివాసుని మహాలక్ష్మి సంబంధంగల గృహస్థుడుగా నిర్దేశింపబడింది.

ఇందుచేత ఏ దయాగుణసంబంధంవలన మిగిలిన గుణాలన్నీ దోషాలుగా పరిణమించకుండా గుణాలుగానే ఉంటాయో అట్టి దయయే అన్ని గుణాలలోను ముఖ్యమైంది కనుక, దానినే చేతనసమాధిలో స్తోత్రంచేయడానికి ఆచార్యులు పూనుకొన్నారని ఊహించాలి.

**శ్లో॥ ఆసృష్టిసంతతానామపరాధానాం నిరోధినీం జగతః ।**
**పద్మాసహాయకరుణే! ప్రతిసంచరకేళిమాచరసి ॥ 16**

**ప్రతి :** హే పద్మాసహాయకరుణే!= ఓ శ్రీనివాసదయాదేవీ! (త్వం= నీవు), ఆసృష్టి= సృష్టికాలం మొదలు, సంతతానాం= వృద్ధిచెందిన, జగతః= ప్రపంచంయొక్క, అపరాధానామ్= అపరాధాలను (శాస్త్రోల్లంఘనాలను), నిరోధినీం= అడ్డగించదగు, ప్రతిసంచరకేళిమ్= మహాప్రళయమనే లీలను, ఆచరసి= అనుష్ఠిస్తున్నావు.

**అవ :** భగవంతునియొక్క జ్ఞానం మొదలుగాగలిగిన గుణాలను తనకు అనుకూలం చేసుకొని దయాదేవి ఆచరించు సామ్రాజ్యప్రభావం ఇంతవరకు వివరింపబడింది. తరువాత భగవంతునిచే చేయబడుతున్నవిగా వేదాలలో ప్రతిపాదింపబడిన సృష్టి సంహారం మొదలైన వ్యాపారాలు కూడా భగవంతుని దయచేతనే ఏర్పడుతూ ఉన్నాయని నిరూపించదలచిన ఆచార్యులు ఉపనిషత్తులు అవలంబించిన మార్గాన్ని అనుసరించి మొదట ప్రళయమనే ప్రపంచనాశనం దయాదేవియొక్క కృత్యమే అని ఈ శ్లోకంలో విశదీకరిస్తున్నారు.

**తా :** బాలురు తమ దుశ్చేష్టలచే సహింపరాని ఉపద్రవాలను కలుగజేసి, తద్ద్వారా తమ శరీరాలను క్లేశపరచుకొని తమ తల్లి మొదలగు వారికిని మనఃక్లేశం కలుగజేసేటప్పుడు, ఆ తల్లి ఆ బిడ్డలను కొంతకాలం నిద్రపుచ్చినయెడల ముందుచేసిన దుశ్చేష్టలను మరచి శ్రమపరిహారం పొందుదురనే తలంపుతో వారిపైగల దయచేత ఎట్లు వారిని నిద్రింపజేస్తుందో, అలాగే ఈశ్వరుడొసంగిన శరీరేంద్రియాలను పొందిన ఈ జీవాత్ములు సృష్టికాలం మొదలు ఏకధారగాచేసే అపరాధాలతో తమను సంసారమనే మహాగర్తంలో పడవేసుకొని, తద్ద్వారా సర్వేశ్వరునికి కూడా మనఃక్లేశం కలుగజేస్తున్నప్పుడు ఆ సర్వేశ్వరుడు "ఈ జీవులు కొంతకాలమైనా ఇట్టి అపరాధాలు చేయకుండా సంసారదుఃఖం అనుభవించకుండా ఉందురుగాక" అని తలచి వీరిమీద పరమదయచేతనే ప్రళయం కలుగజేస్తున్నాడు.



ఆ ప్రళయకాలంలో కరణకళేబరాలనబడే శరీరేంద్రియాలు లేకపోవుటచే అపరాధాలు చేయడానికి, తద్ద్వారా సంసారదుఃఖాలు అనుభవించడానికి వీలులేక ఈ జీవులు నిద్రదశను (అచేతన సమానదశను) పొందుతున్నారు. ఇంక "కొంతకాలమైనా దుఃఖరహితులగుదురుగాక" అనే దయామూలమగు ఈశ్వరేచ్ఛచే కలుగుతున్నది కనుక, ఆచార్యులు ఇక్కడ "ప్రతిసంచరకేళి" అనే ప్రళయాన్ని దయాకార్యంగా నిరూపించి పైన చెప్పబడిన శాస్త్రార్థాలను ప్రకటించారు.

ఇంతేకాక ఈ శ్లోకంలో ఆచార్యులు తమ సర్వతంత్రస్వాతంత్ర్యానికి తగినట్లు భరతునినాట్యశాస్త్రంలో ఉన్న కొన్ని సూక్ష్మాంశాలను పొందుపరచి వర్ణించారని కొందరు మేధావులు చెప్పినారు. అది యెట్లన: "సృష్టి, సంతతానాం, ప్రతిసంచరకేళి" అనే ఈ పదాలు క్రమేణా 1. నర్తకి రంగంమీద నృత్యంచేయడం ప్రారంభించే సమయం, 2. పక్కవాద్యాలను, 3. రంగంమీద నర్తకి వెనుకకు వెనుకకే పోయి నృత్యం ముగించుకోవడం అనేవి నాట్యశాస్త్రంలో ప్రసిద్ధం కాబట్టి ఈ పదాలనుబట్టి ఈ శ్లోకానికి మరొక అర్థం వివరిస్తున్నారు.

మిగుల నేర్పరియగు ఒక నర్తకి నాట్యంచేయ నారంభించిన సమయంనుండి, పక్కవాద్యాలు చేసే పొరబాటులను సహించలేక, ఆ వాద్యాల అపరాధాలను అడ్డగింపదలచి సభ్యులకు వైరస్యం ఏర్పడకుండా వాద్యకారులమీదగల దయచేత మెల్లగా వెనుకకు వెనుకకే నడచి తన నర్తనాన్ని ఎలా ముగించుకొంటుందో, (దీనినే ప్రతిసంచరకేళి అంటారు) అట్లే ఈ దయాదేవియొక్క ప్రళయలీలలు ప్రవర్తిస్తున్నాయి. ఈ అర్థంలో కూడా ఈ శ్లోకంలోని పదాలన్నీ సమన్వయం కావడం వ్యుత్పన్నులకు వేరుగా చెప్పనవసరంలేదు.

**శ్లో॥ అచిదవిశిష్టాన్ ప్రళయే జంతూనవలోక్య జాతనిర్వేదా ।**
**కరణకళేబరయోగం వితరసి వృషశైలనాథకరుణే! త్వమ్ ॥ 17**

**ప్రతి :** వృషశైలనాథకరుణే= వృషపర్వతనాథుడగు శ్రీనివాసునియొక్క దయాదేవీ!, త్వం= నీవు, ప్రళయే= ప్రళయకాలమందు, అచిదవిశిష్టాన్= జ్ఞానశూన్యాలైన అచేతనాలతో సదృశాలైన, జంతూన్= చేతనులనెడు జీవులను, అవలోక్య= చూచి, జాతనిర్వేదా= అనుతాపం కలిగినదానివై, కరణకళేబరయోగమ్= ఇంద్రియాలు, శరీరం వీనియొక్క సంబంధాన్ని, వితరసి= ఇస్తున్నావు.

**అవ :** కింది శ్లోకంలో ప్రళయమనే సర్వనాశంకూడా దయాకృత్యమేనని నిరూపించి ఈ శ్లోకంలో ప్రళయానంతరం సంభవించే సృష్టి దయాకార్యమేనని ప్రతిపాదిస్తున్నారు.

**తా :** ప్రళయకాలంలో జీవులు స్వర్ణకారుని వద్దగల మైనపు ఉండయందు బంగారపు కణాలవలె ప్రకృతి అనే అచేతనపు వస్తువులో తగులుకొని, శరీరేంద్రియాల లేమిచే జ్ఞాన క్రియాదులులేక ఉన్నారు. ఇట్లు బహుకాలం గడుస్తున్నది. అప్పుడాదశలో ఉన్న జీవులను చూచి భగవానునికి మరల దయ కలుగుతున్నది. "అయ్యో! ఈ జీవులుకూడా మంచితెలివిని పొంది సత్కర్మలను అనుష్ఠించి సద్గతినిపొంది ఉత్తమలోకంలో నిత్యసూరి గోష్ఠితో బ్రహ్మానందం పొందదగినవారేగదా! అన్యాయంగా ఇంతకాలం తమ దుశ్చేష్టతచే ఆ ఆనందం పొందక ఉన్నారే. ఈ ప్రళయంలో విశేషించి శరీరేంద్రియాదులు లేనందున, జ్ఞానం కలిగి తద్ద్వారా సత్కర్మలను అనుష్ఠించుటకు వీలులేకుండా ఉన్నారే. వీరికి మరల శరీరేంద్రియాదులను, మంచి ఉపకరణాలను ఇస్తే ఒకవేళ సద్గతిని పొందగలరేమోగదా" అని యోచించి, భగవానుడు వీరికి పరమదయతో శరీరేంద్రియాదులను ప్రదానం చేస్తున్నాడు. ఇదే సృష్టి అనబడుతున్నది. మేలుకొని ఉండు బాలుని ఉపద్రవాలు సహించక వానిని నిద్రపుచ్చినను, ఆ బిడ్డ చాలకాలం భుజించక ఆకలితోనే నిద్రిస్తున్నప్పుడు ఆ తల్లి వాడులేచినచో మరల ఉపద్రవాలు కలుగజేస్తాడేమో అను తలంపు కలిగియున్నను మాతృప్రేమచే ప్రేరితయై



చాలకాలం ఆకలితో నిద్రిస్తున్నాడే అని పరితాపంతో బలవంతంగా వానిని లేవదీసి వానినెట్లు భుజింపజేస్తుందో, అట్లే దయాదేవికూడా మన విషయంలో ప్రవర్తించుననే శాస్త్రార్థం ఈ ప్రకరణానికి పిండితార్థం.

**శ్లో॥ అనుగుణదశార్పితేన శ్రీధరకరుణే సమాహిత స్నేహా !**
**శమయసి తమః ప్రజానాం శాస్త్రమయేన స్థిరప్రదీపేన ॥ 18**

**అర్థం :** శ్రీధరకరుణే!= ఓ శ్రీనివాసదయాదేవీ! త్వం= నీవు, సమాహిత స్నేహా= (ప్రజలయందు) ఉంచబడిన ప్రీతి కలిగినదానవై, (ప్రమిదలో పోయబడిన నూనెగలగినదానవై), అనుగుణదశార్పితేన= యుక్తమగు వయస్సులో లేక సత్త్వగుణం తలయెత్తి శ్రద్ధగలిగిన సమయంలో ఇవ్వబడిన, (మంచి వత్తియందు ముట్టించబడిన), శాస్త్రమయేన= శాస్త్రరూపమైన, స్థిరప్రదీపేన= నాశరహితదీపంచే, ప్రజానామ్= జనులయొక్క, తమః= అజ్ఞానమును (చీకటిని), శమయసి= నశింపజేస్తున్నావు.

**అవ :** పై రెండు శ్లోకాలచే సృష్టి, పాలన, సంహారాలనే ఈశ్వరుని కృత్యత్రయమందు ప్రళయం సృష్టి అనే రెండు కృత్యాలు దయాదేవిచే ఏర్పడినవేనని వర్ణించారు. ఇక్కడ మధ్యలోని పాలనంకూడా దయాకృత్యమేనని నిరూపిస్తున్నారు.

**తా :** ఒకనిని కాపాడడం అంటే, వానికి మంచి జ్ఞానం కలుగజేయడమే. దీనినే పెద్దలు–

**"న దేవా దండమాదాయ రక్షన్తి పశుపాలవత్ ।**
**యం హి రక్షితుమిచ్ఛన్తి బుద్ధ్యా సంయోజయన్తి తమ్ ॥"**

అని చెప్పారు. దేవతలు ఒకరిని కాపాడదలస్తే పశుపాలకులు పశువులను కట్టెతో కాపాడునట్లుగాక, ఆ మనుష్యునికి మంచి తెలివిని కలుగజేస్తున్నారని భావం. అలాగే ప్రకృత శ్లోకంలో కింద చెప్పినట్లు శరీరేంద్రియాలను పొందిన జీవులు వాటిచే మంచి జ్ఞానక్రియలు పొందుదురని తలచిన భగవంతుడు,

వీరికి ఇది మంచిది ఇది చెడ్డది అని తెలియజేయడానికి శాస్త్రమనే స్థిరమైన, సత్ప్రకాశవంతమైన కరదీపాన్ని మిక్కిలి ప్రీతితో ఆచార్యమూలంగా ఇవ్వగా వీరు అజ్ఞానంలో మునిగి నాశం పొందకుండా దేవుడు కాపాడుతున్నాడను శాస్త్రార్థం నిరూపింపబడుతున్నది. ఆ శాస్త్రమనే దీపాన్ని తగిన సమయంలో అనగా సత్త్వగుణం తలయెత్తిన సమయంలో ఆచార్యులు ఇస్తున్నారు.

ఒకతల్లి తనబిడ్డ చీకటిలో దారితెలియక కష్టపడుతున్నప్పుడు ఒక ప్రమిదలో నూనె పోసి మంచి వత్తివేసి గాలికి ఆరిపోకుండా దీపం ముట్టించి వానికిచ్చి నడవదగిన, తగని త్రోవలను ఎలా చూపిస్తుందో, అట్లే దయామాత జీవాత్మ అనే ప్రమిదలో భగవదనుగ్రహమనే నూనె పోసి యుక్తకాలమనే వత్తితో శాస్త్రమనే దీపం ముట్టించి అజ్ఞానమనే అంధకారాన్ని పోగొట్టి సన్మార్గంలో ప్రవర్తింపజేస్తున్నదను ఈ అర్థాన్ని శ్లేషపదాలను ప్రయోగించి ఆచార్యులిచట చిత్రించినారు. విశేషణ పదాలకుండే అర్థద్వయం ప్రతిపదార్థంలో చూపబడింది. ఇక్కడ శాస్త్రమనే పదం సృష్ట్యారంభకాలంలో చతుర్ముఖ బ్రహ్మకు సర్వేశ్వరు డుపదేశించిన వేదాన్ని, వాల్మీకి, పరాశరాది మహర్షులు, ఆళ్వార్లు కావించిన వేదోపబృంహణమైన రామాయణ-విష్ణుపురాణ-ద్రావిడ ప్రబంధాలు మొదలగు సకల వైదిక మతగ్రంథాలను కూడా చెపుతుంది.

**శ్లో॥ రూఢా వృషాచలపతేః పాదే ముఖకాన్తి పత్రలచ్ఛాయా ।**
**కరుణే! సుఖయసి వినతాన్ కటాక్షవిటపైః కరాపచేయఫలైః ॥ 19**

**ప్రతి :** హేకరుణే= ఓ దయాదేవీ! వృషాచలపతేః= శ్రీనివాసునియొక్క (పెద్ద పర్వతంయొక్క), పాదే= పాదాలయందు (చరియ ప్రదేశాలలో), రూఢా= పుట్టినటువంటి, ముఖకాన్తి పత్రలచ్ఛాయా= శ్రీనివాసునియొక్క ముఖమండలశోభ అనే దట్టమైన ఆకులచే ఏర్పడిన, (త్వం= నీవు), వినతాన్= (ఆ శ్రీనివాసునియొక్క పాదాలను) ఆశ్రయించినవారిని, కరాపచేయఫలైః= చేతులతో కోయదగిన పురుషార్థాలనే పండ్లను కలిగిన, కటాక్షవిటపైః=



శ్రీనివాసునియొక్క కటాక్షాలనే కొమ్మలచే, సుఖయసి= సుఖాన్ని కలిగిస్తున్నావు.

**అవ :** కింది శ్లోకంలో దయాదేవి శాస్త్రమనే దీపంతో ప్రజలకు మంచిజ్ఞానం కలుగజేసే విధం వర్ణించబడింది. ఈ శ్లోకంలో ఆ శాస్త్రాలవలన కలిగిన జ్ఞానంతో భగవంతుని ఆశ్రయించినవారు తాముకోరిన పురుషార్థాలు అనే ఫలాలను పొందడం ఈ దయాదేవి అనుగ్రహంచేతనే అని ప్రతిపాదిస్తున్నారు.

ఈ శ్లోకంలో ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాలలో త్రివర్గమని చెప్పబడు మూడు పురుషార్థాలు ఈ దయాదేవి వలననే లభిస్తున్నాయని ప్రతిపాదించి, పై 20-వ శ్లోకంలోకూడా అపవర్గమనే నాలుగవ పురుషార్థంసైతం ఆ దయాదేవిచేతనే లభిస్తున్నదని నిరూపించి ఈ రెండవ దశకం పూర్తిచేస్తున్నారు. పై శ్లోకంలో మోక్షాన్ని ప్రత్యేకంగా చెప్పడంవలన ఈ శ్లోకంలో తదితరమైన మూడు పురుషార్థాలను గురించి చెపుతున్నారని అంగీకరించడం యుక్తం.

**తా :** ఒక ఇంద్రనీలమణిమయమైన పెద్దపర్వతంయొక్క చరియ ప్రదేశంలో పుట్టి, దట్టంగాను మనోహరంగాను ఉన్న ఆకులచే ఏర్పడిన విస్తారమైన నీడ కలిగిన ఒక కల్పవృక్షం ఆ చరియ ప్రదేశంలో ఉండి ఆ నీడలో పరుండినవారు పరుండిన సమయమందే తమ చేతులతో కోసుకొనదగిన పండ్లు కలిగిన కొమ్మలచే (కొమ్మలు వంగి పరుండియున్న వారి చేతులలో పండ్లు స్వయంగానే వచ్చి నిలిచి కోసుకొనుట కనుకూలంగా) వారిని (పండ్లను యిచ్చి) ఎలా సంతోషింపజేస్తాయో అట్లే ఈ దయాదేవియొక్క స్థితి అని కవి చిత్రిస్తున్నారు.

దయాదేవి ఆ శ్రీనివాసునియొక్క పాదాలను ఆశ్రయించిన వారికి ఇంద్రనీలపర్వతంవలె ఉన్న అతనియొక్క పాదాలు అనే చరియప్రదేశంలో ఉద్భవించి, అతని ముఖవిలాసమనే ఆకులను కలిగి, దానిచే విస్తారమైన

నీడను యిచ్చునదై, తమ చేతులచేతనే కోసుకోదగిన (అతిసులభంగా పొందతగిన) ధర్మార్థకామాలనే పలుపండ్లను అర్పింపదగిన ఆతనియొక్క కటాక్షాలనే కొమ్మలచేత సంతోషింపజేస్తున్నది.

సర్వేశ్వరుని దయకు ప్రథమోత్పత్తిస్థానం అతని పాదారవిందమే. ఎలాంటి అపరాధి అయినా అతని పాదాలను ఆశ్రయించినయెడల తత్‌క్షణమే అతడు వీడు చేసిన అపరాధాలన్నిటిని మరచిపోతున్నాడు. దయ ఉద్భవిస్తున్నది. దయ కలిగిన వెంటనే దానికి సూచకంగా అతని ముఖంమీద ఒక విలక్షణమైన శోభ (ప్రసన్నత) కలుగుతుంది. తదనంతరం ఆ దయ అపేక్షితఫలాలను ప్రసాదిస్తుంది. ఈ శాస్త్రార్థాన్ని ఇక్కడ తెలుసుకోవాలి. మొదట చెట్లు పుట్టుట, మరల చిగురులు కలుగుట, తర్వాత పెద్దకొమ్మలు, వాటిలో పండ్లు కలుగుట, వానిచే ప్రజలు సుఖపడుట తెలిసిన విషయమే కదా!

లోకంలో చెట్లలో ఉన్న పండ్లను ఉన్నత పురుషులు తమ చేతుల నెత్తి కోయాలి. ఈ దయావృక్షంయొక్క కొమ్మలు అనే భగవత్కటాక్షంవలన పండిన పురుషార్థమనే పండ్లను వంగినవారే పొందుతారు. ఆ కటాక్షాలనే కొమ్మలు వంగియున్న ఈ పురుషుని చేతులలో పండ్లను కోసుకోవడానికి అనుకూలంగా స్వయంగానే వచ్చి నిలుస్తాయి. ఇలా ఈ వృక్షం విలక్షణ స్వభావం కలదనే అర్థం సహృదయాహ్లాదకరంగా అవగతమవుతున్నది.

**శ్లో॥ నయనే వృషాచలేన్దోః తారామైత్రీం దధానయా కరుణే ।**
**దృష్టస్త్వయైవ జనిమానపవర్గమకృష్ట పచ్యమనుభవతి ॥ 20**

**ప్రతి :** హే కరుణే= ఓ దయాదేవీ!, వృషాచలేందోః= వృషపర్వతంమీద చంద్రునివలె ప్రకాశిస్తున్న శ్రీనివాసునియొక్క, నయనే= నేత్రాలయందు, తారామైత్రీం= తారామైత్రిని, దధానయా= వహిస్తున్న, త్వయా= నీచేత, దృష్టః= కటాక్షింపబడిన, జనిమానేవ= జంతుసామాన్యమే, అకృష్టపచ్యమ్= దున్నకనే పండగల, అపవర్గమ్= మోక్షమను ఫలాన్ని, అనుభవతి= అనుభవిస్తున్నది.



**అవ :** కింద శ్లోకంలో త్రివర్గమనే దర్మార్థకామాలు దయచేతనే కలుగుతున్నాయని నిరూపించి, అపవర్గమనే మోక్షంకూడా ఆ దయచేతనే లభిస్తున్నదని ఈ శ్లోకంలో తెలుపుతున్నారు.

**తా :** దయాదేవి శ్రీనివాసునియొక్క నేత్రాలలోగల తారామైత్రిని పొంది ఉన్నది. తారామైత్రి అనగా ప్రథమదర్శనంనుండి కలిగే అవ్యాజమైన స్నేహం. నేత్రాలలో ఉండు కనుగ్రుడ్లతోటి స్నేహమని చెప్పవచ్చు. శ్రీనివాసుని కటాక్షమేర్పడునప్పుడు ఆ నేత్రాలలోని కనుగ్రుడ్లతో కలిసియున్న దయాసంబంధంవలన దయాలింగిత కటాక్షమే ప్రవహిస్తుందిగాని, కోపాది తదన్యగుణాలతో కూడిన కటాక్షం ప్రసరించదు. ఇట్టి దయాలింగిత కటాక్షం ఏ జీవునికి తన జననకాలంలో ఏర్పడుతున్నదో, వాడు మోక్షవిషయంలో విశేషమైన ఆస్థకలిగి తద్ద్వారా సదాచార్య సంబంధం మొదలైన సోపానాలను అధిరోహించి మోక్షం పొందుతున్నాడు. ఆ మోక్షం కూడా వీని విషయంలో అకృష్టపచ్యంగా (దున్నుట మొదలగు పరిశ్రమలు లేకయే ఫలమును మాత్రం బొందుట) ఏర్పడుతున్నది.

లోకంలో ఫలం అనుభవించేవారందరూ స్వయంగా కృషిచేయాలనే నిర్బంధం లేదు. ఒకడు చేసిన కృషియొక్క ఫలాన్ని మరొకడు పలుకారణాలచే అనుభవిస్తున్నాడు గదా! అలాగే ప్రపన్నుడు తాను కృషి చేయకపోయినా (భక్తియోగాద్యుపాయానుష్ఠానం లేకపోయినా) వీనికొరకు భగవంతుడు తానే ఆ కృషినిచేసి (పరమదయచే భక్తియోగాద్యుపాయ స్థానంలో నిలిచి) వీనికి ఆఫలాన్ని లభింపజేస్తున్నాడు. ఆహా! ఎంతటి ఆశ్చర్యకరమైనది ఆ దయాప్రభావం! అనే శాస్త్రార్థం గమనింపదగి ఉంది.

ఇట్లు ప్రపన్నుని విషయంలో మాత్రం ఈ శ్లోకాన్ని యోచన చేయాలనే నిర్బంధం లేదు. భక్తుడు, ప్రపన్నుడు వీరిద్దరి విషయాలలో యోచన

చేయవచ్చు. భక్తుడు తాను చేసే భక్తియోగమనేకృషి, మోక్షమనే మహాఫలాన్ని బట్టి చూచినపుడు కృషిగానే అనుకోవడానికి అర్హమైనదిగా ఉంది. లేక భక్తుడు కూడా ఒక విధంగా (అంగ ప్రపత్తివిషయంలో) ప్రపన్నుడే కనుక ముందుచెప్పినట్లు ఉపాయాన్తరస్థానంలో భగవంతుడు నిలువవలసి ఉంది. అందుచే ఇద్దరూ అకృష్టపచ్యమగు ఫలం అనుభవిస్తున్నారనడం యుక్తమే.

**శ్లో॥ "జాయమానం హి పురుషం యం పశ్యేన్మధుసూదనః ।**
**సాత్త్వికస్స తు విజ్ఞేయః స వై మోక్షార్థచింతకః ॥" 20**

అను ప్రమాణవచనం ఆచార్యులవారి హృదయంలో ఉంది.

"ఇందోః తారామైత్రీం" అనే పదవిన్యాసంవలన చంద్రునికి తన ప్రియురాండ్రగు తారల యందు (నక్షత్రాలయందు) ప్రేమ ఉండుట యుక్తమే అనే ఒక అర్థం తోస్తుంది. "అకృష్టపచ్యం" అను పదానికి అకారవాచ్యుడగు పరమపురుషునిచే కృషిచేయబడి ఫలించిన ఫలం అని అర్థమగుటచే పై దశకారంభంలో చెప్పబోతున్న అర్థం (శ్రీనివాసుడొకరైతు) సూచిత మవుతున్నది.

*రెండవదశకం సమాప్తం*

*శ్రీమతే నిగమాంత మహాదేశికాయ నమః*

# మూడవ దశకం

**శ్లో॥ సమయోపనతైస్తవ ప్రవాహైరనుకంపే! కృతసంప్లవా ధరిత్రీ ।**
**శరణాగతసస్యమాలినీయం వృషశైలేశకృషీవలం ధినోతి ॥ 21**

**ప్రతి :** హే అనుకంపే= ఓ దయాదేవీ!, తవ= నీ యొక్క, సమయోపనతైః= తగిన సమయంలో పారుతున్న, ప్రవాహైః= ప్రవాహాలచే, కృతసంప్లవా= తడుపబడినట్టియు, (అత ఏవ= కనుకనే) శరణాగతసస్యమాలినీ= శరణాగతులనే సస్యపరంపరను కలిగిన, ఇయం= ఈ, ధరిత్రీ= భూమి, వృషశైలేశకృషీవలమ్= వృషపర్వతానికి యజమానుడైన శ్రీనివాసుడను రైతును, ధినోతి= సంతోషింపజేస్తున్నది.

**అవ :** కింది దశకంలో 'పరబ్రహ్మ'కు లక్షణంగా చెప్పబడిన సృష్టి పాలన సంహారాలు దయాదేవి వలననే కలుగుతున్నవని బహుకారణాలతో నిరూపింపబడి తద్వారా దయకు గల మహోన్నత ప్రభావం వర్ణింపబడింది. ఈ దశకంలో అట్టి దయచే జీవులకు, పరమాత్మకు సంభవిస్తున్న కొన్ని ఉపకారాలు వర్ణింపబడుతున్నాయి.

కింది శ్లోకంలో స్వయంకృషిచేయకుండానే ఫలాన్ని మాత్రం దయాదేవి కటాక్షంవలన జీవుడనుభవిస్తున్నాడని చెప్పు ప్రకరణంలో కృషిచేసేవాడు అకారవాచ్యుడగు పరమపురుషుడే అని తెలియజేసి, శ్రీనివాసుడను పరమపురుషుని ఒక రైతుగా రూపించారు. ఈ శ్లోకంలో ఆ రైతు ఏమి పైరు చేస్తున్నాడు? నీటి సౌకర్యమెలా కలుగుతున్నది? అలా పైరుచేయుటచే ఏ ఫలాన్ని పొందుతున్నాడు? ఇత్యాదిగా గల విషయాలను దయాస్తోత్రముఖతః విశదీకరిస్తున్నారు. ఈ విశదీకరణంవలన జీవునికి, పరమపురుషునికి దయచే ఏర్పడు ఉపకారం నిరూపితమవుతున్నది. ఇట్లే ఈ స్తోత్రంలో ఒక్కొక్క దశకంలోని, ప్రాయశః కడపటి శ్లోకంలో సంగ్రహంగా చెప్పిన విషయాన్నే ఉత్తరదశక ప్రారంభంలో విశదీకరించడం ఆచార్యులు స్వీకరించిన మార్గమని భక్తపాఠకులు తెలుసుకోవాలి.

**తా :** వేలకొలది ఎకరాలను సాగుచేసే రైతుకు, తగిన సమయంలో మంచి జలప్రవాహం ఉద్భవించుటచే పైరు పుష్టిగా పెరిగి వెన్నులబరువుకు వంగిపోయనప్పుడు ఆ భూమి ఎలా అమితమగు సంతసాన్ని కలుగజేస్తుందో, అట్లే శరణాగతులనే సస్యమును ఈ ప్రాకృత ప్రపంచంలో పైరు చేయగోరిన వేంకటగిరి శిఖరానగల శ్రీనివాసుడను రైతుకు జీవుల సుకృతాలు పరిపాకం పొందు సమయంలో దయాప్రవాహం పుట్టి ప్రవహించగా తలవంగిన బహుశరణాగతులు కలిగిన ఈ భూమి అమందానందాన్ని కలిగిస్తున్నది. ఇది ఇక్కడ కవిచిత్రం.

భక్తి మొదలగు యోగాలు సులభంగా మోక్షం ఇవ్వలేవు. కావున జనులెక్కువగా ఆ యోగంలో ప్రవర్తించుట లేదు. ఈ విషయం తెలిసిన భగవంతుడు సులభంగా మోక్షం ఇవ్వగల శరణాగతిమార్గాన్ని (ప్రపత్తిని) ఉపదేశించి, తద్ద్వారా సర్వజనులను శరణాగతులనుచేసి సద్గతిని ఇవ్వదలచాడు. ఈ ప్రపత్తిమార్గాన్ని అవలంబించినవారికి తమ కర్మలను నిశ్శేషంగా తొలగించుకోవడానికి భగవద్దయ తప్ప వేరొక ఉపాయం లేదు. అందుచేతనే ఆ దయ తగిన సమయంలో ఏర్పడి వీరికి క్రమక్రమంగా కడుమేలును కలుగజేసి కడపట సర్వకర్మక్షయం చేసి మోక్షం ఒసగుతున్నది. దీనిచే ఈశ్వరుడు తన అభిప్రాయం నెరవేరుటచే సంతసిస్తున్నాడు. ఇది ఇక్కడ శాస్త్రార్థం.

"సమయోపనతైః" అనే పదంలో సమయపదానికి సిద్ధాంతమని అర్థం. అందుచే "యతిపతియామునప్రభృతయః ప్రథయన్తి" అని పై జెప్పబోవు రీతిలో భగవద్దయను ఈ ప్రపంచానికి తీసుకొనివచ్చి దానిచే ఎందరో ప్రజలు మేలుబొందునట్లు చేసింది మన రామానుజసిద్ధాంతమే అనే అర్థంకూడా గోచరిస్తుంది. "భగవద్రామానుజులు మొదలైన ఆచార్యు లవతరించిన తరువాతనే ఈ ప్రపంచంలో ప్రపన్నులెక్కువయ్యారు" అని శ్రీ దేశికులవారే "నిక్షేపరక్ష" అను స్వీయగ్రంథంలో ప్రస్తావించారు.



వేల ఎకరాలు సాగుచేసిన రైతు అవి పండిన సమయంలో చక్కగా చూడగోరెనేని మిట్టప్రదేశం ఎక్కి నిలుచునట్లు, శ్రీనివాసుడుకూడా తిరుమలను ఎక్కి నిలిచి ఉన్నాడని "వృషశైలేశ కృషీవలం" అనే పదం స్ఫురింపజేస్తున్నది.

రైతుయొక్క ప్రియనాయిక మాలలచేత తన్ను విశేషంగా అలంకరించుకొని తన ప్రియనాయకుని ఎలా సంతోషపరస్తుందో, అలాగే భూదేవికూడా శరణాగతసస్య మాలలతోనే తన్ను విశేషంగా అలంకరించుకొని తన ప్రియుడగు పరమపురుషుడను రైతును సంతసింపజేస్తున్నదని ఉత్తరార్థంచేత ధ్వనిస్తున్నది.

**శ్లో॥ కలశోదధిసంపదో భవత్యాః కరుణే! సన్మతిమంథ సంస్కృతాయాః ।**
**అమృతాంశమవైమి దివ్యదేహం మృతసంజీవన మంజనాచలేందోః ॥**
**22**

**ప్రతి :** హే కరుణే! = ఓ దయాదేవీ!, అంజనాచలేందోః= అంజనపర్వతమనే తిరుమలయందు చంద్రుడుగా ప్రకాశిస్తున్న శ్రీనివాసునియొక్క, మృతసంజీవనమ్= మరణించినవారిని సంజీవింపజేయు, దివ్యదేహం= దివ్యమంగళ విగ్రహాన్ని (శరీరాన్ని), కలశోదధి సంపదః= క్షీరసాగరంయొక్క సంపత్తిని కలిగినట్టి, సన్మతిమంథ సంస్కృతాయాః= భగవంతుని సంకల్పమనే కవ్వంతో చిలుకబడిన, భవత్యాః= నీయొక్క, అమృతాంశం= అమృతాంశంగా, అవైమి= తెలుసుకొంటున్నాను.

**అవ :** కింది శ్లోకంలో శరణాగతగోష్ఠిని చూచి శ్రీనివాసుడు ఎంతో సంతోషిస్తున్నాడని చెప్పినారు. ఈ శ్లోకంలో ఆ శరణాగతులు ప్రపత్తిచేయడానికి ప్రధానావలంబమైన అర్చామూర్తికూడా దయాసారాంశమే అని నిరూపించి దీనిచే ఈశ్వరునికి శరీరలాభాన్ని, జీవులకు అవలంబనాన్ని నిరూపిస్తున్నారు.

**తా :** దేవాసురులు క్షీరసముద్రాన్ని మందరమనే కవ్వంతో చిలికినప్పుడు చంద్రుడు మొదలగు పలుపదార్థాలు ఉద్భవించిన పిమ్మట వారికి ప్రధానోద్దేశ్యమైన అమృతం ఉద్భవించింది. అట్లే పాలసముద్రానికి సమమైన దయను సన్మతితో, అంటే భగవానుని సంకల్పంతో చిలికినప్పుడు ప్రాపంచికాలైన బహుపదార్థాలు పుట్టిన తరువాత, పాలయొక్క సారమైన వెన్నవలె దయాసారాంశంగాను అమృతరూపంగాను ఆవిర్భవించింది. శ్రీనివాసునియొక్క (అర్చామూర్తి) దివ్యమంగళవిగ్రహం (భగవంతుని దివ్యాత్మస్వరూపం కూడా దీనికి వెనుకటిదే) అని కవిహృదయం. ప్రసిద్ధామృతంవలె ఈ దివ్యమంగళవిగ్రహం కూడా మృతసంజీవనమే. సంసారాగ్నిదగ్ధులగు జీవులు ఈ అమృతరూపమైన దివ్యమంగళ విగ్రహంయొక్క దర్శనంతోనే (పానంచేయగనే) పురుజ్జీవనం పొందగలరు.

ఒక అర్చామూర్తివద్దనే పెద్దలు శరణాగతిని అనుష్ఠిస్తూ ఉంటారు. ఆ మూర్తిలేనిచో వారికి అవలంబం ఉండదు. దీనిని గురించి ఆలోచించిన భగవంతుడు పరమదయతో అతిసుందరమైన అర్చావిగ్రహాన్ని తన సంకల్పంతో పరిగ్రహించి ప్రపత్తి చేయదలచిన వారికి అనుకూలమయ్యే విధంగా సర్వసులభుడై ఈ తిరుమలలో నిల్చి ఉన్నాడని శాస్త్రార్థం.

మాధుర్యం, గాంభీర్యం, కలతనందనితనం, అమృతం పొందడం మొదలగు ఈ ఆకారాలచే పాలసముద్రంతో సమమైంది దయాసముద్రం. "సన్మతిమంథ" అనే పదానికి సచ్ఛబ్దార్థమగు భగవంతునియొక్క మతిపదార్థమైన సంకల్పం కవ్వంచేతనేనని అర్థం కింద చెప్పబడింది. ఇదిగాక వేరువిధంగా వర్ణించడం కూడా ఉంది. సత్పదంవలన శుకాదిమహర్షులు, ఆళ్వార్లు మొదలైన బ్రహ్మవిదులు చెప్పబడుతున్నారు. వారియొక్క మతి అంటే ప్రార్థన. అట్టి పెద్దలయొక్క ప్రార్థనల ననుసరించి ఇట్టి అర్చాసమాధిని తాను పొందుతున్నాడని పురాణసంప్రదాయాది సిద్ధం. అథవా సన్మతి అనడంవల్ల కవి తనయొక్క బుద్ధినే "సర్వం సహ నిశితధియా" అని తానే చెప్పినట్లు వివక్షిస్తున్నారు. నా యొక్క తీక్షణమైనబుద్ధిచే చిలికి



చూచినప్పుడు దయాక్షీరసముద్రంనుండి సారాంశంగా ఉద్భవించింది భగవానుని అర్చాదివ్యమంగళవిగ్రహమే అని ఇక్కడ అర్థం చెప్పవలసి ఉంది.

"అంజనాచలేందోః" కాటుకపర్వతంమీద చంద్రోదయం ఎంతో ఆకర్షణీయం. పాలసంద్రంనుండి ఉద్భవించిన చంద్రాది పదార్థాలలో అమృతమే ముఖ్యతమమైనట్లు, పయోనిధినుండి ఉద్భవించిన పదార్థాలలోకెల్ల శ్రీనివాసుని దివ్యమంగళవిగ్రహమే ముఖ్యతమమైనదని ఈ శ్లోకాలలోని ప్రధాన భావం.

**శ్లో॥ జలధేరివ శీతతా దయే! త్వం వృషశైలాధిపతేః స్వభావభూతా ।**
**ప్రళయారభటీనటీం తదీక్షాం ప్రసభం గ్రాహయసి ప్రసత్తిలాస్యమ్ ॥ 23**

**ప్రతి :** హే దయే!= ఓ దయాదేవీ! జలధేః= సముద్రానికి, శీతతేవ= శైత్యంవలె, వృషశైలాధిపతేః= వేంకటాద్రీశునికి, స్వభావభూతా= స్వభావభూతయగు, త్వం= నీవు, తదీక్షాం= ఆ శ్రీనివాసునియొక్క సంకల్పమగు, ప్రళయారభటీనటీమ్= ప్రళయమను ఉద్దండతాండవమాడు నర్తకిని, ప్రసభం= బలత్కారంతో, ప్రసత్తిలాస్యమ్= సుకుమారనర్తనను (సృష్టిని), గ్రాహయసి= స్వీకరింపజేస్తున్నావు.

**అవ :** కింది శ్లోకంలో శ్రీనివాసునికి దివ్యమంగళ విగ్రహంకూడా దయాదేవిచే ఏర్పడుతున్నదని నిరూపించుటచే అతడు సర్వవిధాల దయాధీనుడని తేలుతున్నది. అట్లైనచో అతడు సర్వప్రపంచాన్ని నాశంచేసే ప్రళయకాలంలో, సృష్టికాలంలో హిరణ్యాది సంహరణ సమయంలో ఉగ్రకోపానికి లోబడుట తగునా? అనే సందేహానికి ఈ శ్లోకంలోను, పై శ్లోకంలోను సమాధానం ఇవ్వబడుతున్నది.

జలానికి చల్లదనం స్వభావసిద్ధమైన గుణం. సముద్రంలో ఈ గుణం చక్కగా కనబడుతుంది. నీటిని కాగబెట్టినప్పుడు దానిలో కొన్ని నిమిషాల తాత్కాలికమైన ఔష్ణము నిలిచినా, వెంటనే తన స్వభావసిద్ధమగు చల్లదనం పొందుతున్నది. అట్లే దయ శ్రీనివాసునియొక్క స్వాభావికగుణం. ఏవో కొన్ని కారణాలచే కోపం తాత్కాలికంగా కొంతకాలం ఉన్నప్పటికి వెంటనే ఆ

కోపాన్ని ఈ స్వభావగుణమైన దయ అణిగించి తానే పైకివచ్చి నిలుస్తుంది. దీనినే కవి ఇక్కడ మిక్కిలి సుందరంగా చిత్రిస్తున్నారు.

**తా :** ఒకనర్తకి తన శరీరాన్ని క్లేశపరచుకొని, ప్రేక్షకులు భయపడే విధంగా ఉద్దండతాండవం చేసినపుడు, ఆమెకు యజమానురాలు ఆమెను నిర్బంధంతో అణచిపెట్టి ప్రేక్షకులకు వైరస్యం కలుగకుండా, నాట్యం ఆపివేయకుండా మెల్లగా ఆ ఉగ్రనాట్యాన్నే సుకుమార నర్తనంగా మార్చి నర్తకికి క్లేశంలేకుండా, ప్రేక్షకులుకూడా తృప్తిపొందే విధంగా ఏర్పాటుకావిస్తుందో, అట్లే దయాదేవి భగవంతుని సంకల్పమనే నర్తకి సర్వప్రపంచనాశనమనే ఉద్దండతాండవం చేస్తున్నపుడు బలాత్కారంగా ఆ సంకల్పనర్తకిని ఆ తాండవంనుండి మరలించి (భగవానుడు నిర్దయుడని తలచి ప్రాపంచికులతనిని వదలిపోకుండా) సృష్టి అనే సుకుమారలాస్యాన్ని ప్రవర్తింపజేస్తున్నది.

భగవంతుడు జీవులుచేసే అనంతాపరాధాలచే విసుగుజెంది జగత్తును సంహరించినప్పటికి, తాత్కాలికమైన ఆ కోపమణగిన పిమ్మట స్వభావసిద్ధమైన దయచే మరల నా జీవులకు శరీరేంద్రియాదిసమస్తోపకరణాలను ఇవ్వగల సృష్టిని ప్రారంభిస్తున్నాడను శాస్త్రార్థమిక్కడ తెలుసుకోవాలి.

దీనిచే ఈశ్వరునికి కోపిష్టి, నిర్దయుడు అను అపవాదమేర్పడక పోవడం, జీవులకు సృష్టికాలంలో శరీరేంద్రియాద్యుపకరణ లాభం ప్రయోజనమని తెలియదగి ఉన్నది. "ఆ సృష్టి" అనే కింది దశకంలోని శ్లోకంలో ప్రళయాన్ని దయాకార్యంగా వర్ణించారు. ఇక్కడ ప్రళయంలో దయాదేవికిగల వైముఖ్యం సూచింపబడింది. ఇది పారమార్థికంగా పరికించినపుడు ప్రళయంకూడా పరమదయాకార్యమే. అది ఇక్కడ నిరూపింపబడింది. అట్లుగాక లోకదృష్టిలో సర్వలోకనాశనరూపమైన ప్రళయాన్ని కోపకార్యంగా తలంచినా దయాదేవి ఉపయోగించే ప్రక్రియ ఇక్కడ నిరూపింపబడి ఉన్నదని తెలియాలి.

**శ్లో॥ ప్రణతప్రతికూలమూలఘాతీ ప్రతిఘః కోఽపి వృషాచలేశ్వరస్య ।**
**కలమే యవసాపచాయనీత్యా కరుణే! కింకరతాం తవోపయాతి ॥ 24**



**ప్రతి :** హే కరుణే!= ఓ దయాదేవీ!, ప్రణతప్రతికూలమూలఘాతీ= ఆశ్రితులయొక్క విరోధులను సమూలంగా ఉన్మూలనం చేస్తున్న, కోఽపి= విలక్షణమైన, వృషాచలేశ్వరస్య= శ్రీనివాసునియొక్క, ప్రతిఘః= కోపం, కలమే= వరిపైరునందు, యవసాపచాయనీత్యా= కలుపుదీయున్యాయంగా, తవ= నీకు, కింకరతామ్= కింకర భావాన్ని, ఉపయాతి= పొందుతున్నది.

**అవ :** కింది శ్లోకంలో ప్రళయకాలాన కలుగు భగవానుని కోపాన్ని దయాదేవి అణచే విధానం వర్ణింపబడింది. ఈ శ్లోకంలో సృష్టికాలాననే కొన్ని సమాయాలలో (హిరణ్య రావణాద్యాశ్రితవిరోధీ సంహారసమయంలో) సంభవిస్తున్న భగవంతుని కోపం దయాదేవికి కింకరభావం పొందుతున్నదని వర్ణింపబడుతున్నది.

**తా :** ఈ శ్లోకంలో పొందుపరచబడిన చిత్రం అతిరమణీయంగా ఉంది. ఇంతకుముందే ఈ దశకారంభంలో శ్రీనివాసుని ఒక రైతుగా నిరూపించి ఉన్నారు. దాని ననుసరించి ఇక్కడ కూడా ఒక దృష్టాంతం ఇవ్వబడుతున్నది.

ఒక రైతు తాను పెట్టిన పైరును చక్కగా కలుపు మొదలైనవి లేకుండా ఫలభరితంగా చేయదలచెనేని, మొదట పనివారిని బెట్టి కలుపును సమూలంగా తీయించి ఆ పైరును ఎలా పరిరక్షిస్తాడో, అట్లే శ్రీనివాసుడను రైతుయొక్క పైర్లుగానున్న ఆశ్రితులను సంరక్షింపదలచిన శ్రీనివాసుని మహిషియగు దయాదేవి ఆ ఆశ్రితులకు విరోధులైన హిరణ్యరావణాదులు అనే కలుపును తన పనివాడైన శ్రీనివాసుని కోపంద్వారా సమూలంగా పెరికివైచి వారికి భద్రత కలుగజేస్తున్నది.

పైరు ఒకటి అయినా, దాని కలుపు అనేకంగా ఉంటుంది. అట్లు భగవదాశ్రితుడొక్కడైనా తద్విరోధివర్గం అనంతంగా ఉంటుంది. పైరుపెట్టి కడపటివరకు కాపాడడంలో ఎంత శ్రమ ఉందో, దానిలో సహస్రాంశం గూడా కలుపు తీయడంలో లేదు. నఖాలతోనో, లేక చిన్న పరికరాలతోనో దానిని తీసివేయ వీలవుతుంది. అట్లే భాగవతవిరోధులను తొలగించడం

భగవంతునికి అనాయాస సాధ్యం. ఈ విధంగా సాగుబడిలో ఉన్న పలు విధాలైన గుణాలు ప్రకృత విషయంలో ఆలోచింపదగి ఉన్నాయి.

భగవంతుడు సాధువులను తనదయచే సంరక్షిస్తున్నాడు. అనగా తాను అవతరించి, వారితో కలిసిమెలసి, వారి సుఖదుఃఖాలలో తోడ్పడి, వారి వర్ణాశ్రమధర్మాలను చక్కగా నిర్వర్తింపజేసి, వారిని సంతోషింపజేసి తానును సంతోషిస్తున్నాడు. ఇలాంటి సంరక్షణ తద్విరోధివర్గనాశనం ఏర్పడనంతవరకు చక్కగా నెలకొనదు. అందువల్ల ఆశ్రితులమీద దయచేత తద్విరోధివర్గంలో కోపంకల్గిన వారిని ధ్వంసంచేసే సందర్భం ఏర్పడుతున్నది. "పరిత్రాణాయ సాధూనాం" అనే గీతాశ్లోకంలో చెప్పినట్లు ఆశ్రితసంరక్షణమే భగవంతునికి ప్రధానోద్దేశం. దానికి ఆన్తరీయకంగా ఏర్పడే విరోధినాశనం అనే శాస్త్రార్థం కూడా పూర్వోక్త దృష్టాన్తంచేత స్పష్టంగా ఎరుగదగి ఉంది.

దీనిచే భగవంతునికి సాధువులతో సంగమం, ఆశ్రితులకు స్వవిరోధి నాశనం లాభమని తెలుసుకోవాలి.

**శ్లో॥ అబహిష్కృతనిగ్రహాన్ విదన్తః కమలాకాన్తగుణాన్ స్వతంత్రతాదీన్ ।**
**అవికల్పమనుగ్రహం దుహానాం భవతీమేవ దయే! భజన్తి సన్తః ॥25**

**ప్రతి :** హే దయే!= ఓ దయాదేవీ! స్వతంత్రతాదీన్= స్వాతంత్ర్యం మొదలగు, కమలాకాన్తగుణాన్= శ్రీనివాసుని గుణాలను, అబహిష్కృతనిగ్రహాన్= బహిష్కరింపబడనట్టి నిగ్రహ (దండించుట) మనే గుణం కలిగినటువంటి వాటినిగా, విదన్తః= తెలుసుకొంటున్న, సన్తః= పెద్దలు, అవికల్పం= వికల్పానికి అవకాశంలేకుండా (అనవరతం ఒకరీతిగానే), అనుగ్రహం= అనుగ్రహాన్నే, దుహానాం= పిండుతున్న, (కలుగజేస్తున్న), భవతీమేవ= నిన్నే, భజన్తి= సేవిస్తున్నారు.

**అవ :** ఇంతకుముందు పూర్వం శ్రీనివాసుడు అన్నివిధాల దయా పరతంత్రుడని నిరూపించినప్పుడు అతనికి కొన్ని సమయాలలో కోపమేర్పడుట తగునా? అనే ప్రశ్నకు కింద రెండు శ్లోకాలలో సమాధానం



చెప్పారు. ఈ శ్లోకంలో "ఇట్లు నేను దయకు పరత్వం చెప్పడం స్వకపోలకల్పితం కాదు. పెద్దల అనుష్ఠానం దీనికి తగుప్రమాణమే అవుతున్న" దని నిరూపిస్తున్నారు.

**తా :** ఒకడు మనకు పొసగనివాడని తెలుసుకొంటే వానిని మనం బహిష్కరిస్తున్నాం. అనగా వానితో ఎలాంటి వ్యవహారాలను పెట్టుకోం. అట్లే శ్రీనివాసునియందున్న నిగ్రహాన్ని అనగా అపరాధులను దండించడం అనే గుణాన్ని దయాదేవి పూర్ణంగా బహిష్కరిస్తున్నది. శ్రీనివాసునియొక్క ఐశ్వర్యానికి చేరిన స్వాతంత్ర్యం, జ్ఞానం మొదలగు గుణాలు నిగ్రహానుగ్రహ అభయ సాధారణాలు కనుక నిగ్రహాన్ని పూర్తిగా బహిష్కరించకుండా దానిని కూడా కొన్ని సమయాలలో స్వీకరిస్తున్నాయి. మనబోటి అపరాధులకు నిగ్రహమో, దానిని కొన్నివేళల ఆదరించు స్వాతంత్ర్యాది గుణాలో కానివిగా ఉంటాయి. కావుననే దూడకు పరమవాత్సల్యంతో పాలను స్రవింపజేయుధేనువువలె, ఎప్పుడూ నిగ్రహానికి అవకాశమివ్వకుండా అనుగ్రహాన్నే స్రవింపజేసే దయాదేవినే వివేకవంతులైన పెద్దలు శరణంగా పొందుతున్నారు.

అజ్ఞాతనిగ్రహ అని ప్రశంసింపబడిన మహిషి కావున దయాదేవి దండించడం అనే నిగ్రహాన్ని కొద్దిగానైనా సహించదు. ఈశ్వరునియొక్క ఇతరగుణాలు అలాంటివి కావు. అపరాధులను దండించుటకు కూడా అవి కొన్నివేళలలో తోడ్పడుతున్నాయి. అందువలన, ఆ గుణాలను అవలంబించినయెడల అపరాధులమైన మనం దండననుండి తప్పించుకొంటామనే నిశ్చయం లేదు. దయను అవలంబిస్తే ఆమె నిగ్రహానికి ఎప్పుడూ అవకాశం ఇవ్వదు కావున మనం సుఖంగా దండననుండి తప్పించుకొనగలమనే రహస్యం తెలిసిన పెద్దలు ఆ దయాదేవినే శరణు పొందుతున్నారనడం ఇక్కడ శాస్త్రార్థం.

దయను శరణుపొందుటచే దండనలేక తప్పించుకోవడం జీవులకు లాభం. ఈ దయాసంబంధంవలన ఆశ్రితులచే నిగ్రహంవలె

బహిష్కరింపబడక స్వీకరింపబడడం ఈశ్వరునికి కలిగే లాభమని ఊహింప వీలవుతుంది.

**శ్లో॥ కమలానిలయస్త్వయా దయాళుః కరుణే! నిష్కరుణా నిరూపణే త్వమ్।**
**అత ఏవ హి తావకాశ్రితానాం దురితానాం భవతి త్వదేవ భీతిః ॥26**

**ప్రతి :** హే కరుణే= ఓ దయాదేవీ!, కమలానిలయః= శ్రీనివాసుడు, త్వయా= నీ చేత (నీ సంబంధంచేత) దయాళుః= దయగలిగినవాడుగా, (భవతి= అగుచున్నాడు) నిరూపణే= చక్కగా ఆలోచించినయెడల, త్వమ్= నీవు, నిష్కరుణా= దయలేని దానివిగా (అనిపిస్తున్నావు), అత ఏవ హి= కావుననేగదా, తావకాశ్రితానామ్= నిన్ను చేరినవారి నాశ్రయించిన, దురితానామ్= పాపాలకు, త్వదేవ= నీ నుండియే, భీతిః= భయం, భవతి= కలుగుతున్నది.

**అవ :** కింది శ్లోకంలో దయాదేవి ఆశ్రితనిగ్రహాన్ని బహిష్కరిస్తూ ఉన్నదని, కనుకనే పెద్దలా దయాదేవిని శరణు పొందుతున్నారని చెప్పబడిన విషయం ఈ శ్లోకంలో తగిన కారణంతో విశదీకరిస్తున్నారు.

**తా :** ఓ దయాదేవీ! శ్రీనివాసుడు దయాళువు అనే పేరు పొందడం నీ సంబంధమతనికి కలుగుటచేతనే. ఇట్లుండగా నిపుణనిరూపణం చేసినప్పుడు నీ దగ్గర కించిత్తు కూడా దయలేదని తేలుతున్నది. నీ దగ్గర దయాసంబంధం లేకున్నా, నీ సంబంధంతో పరులను దయాళువులుగా చేస్తూ ఉన్నావు. ఇది ఒక వేడుకగా ఉంది. లోకంలో ఒకరిని ఎప్పుడు నిర్దయుడంటాం? వానియొద్ద కేగుటకు భయంతో జనులందరు కంపితులయినప్పుడుకదా! అట్లే ఈ దయాదేవిని చూచి దయాశ్రితులగువారిని ఆశ్రయించిన పాపాలు "మమ్ము దయాదేవి మింగివేయు" నని మిక్కిలి భయంతో వణకుతున్నాయి. ఆ విషయంలో నీవు నిర్దయురాలివవుతున్నావు. శ్రీనివాసుని ఒద్ద కూడా ఆ పాపాలకు అంతటి భీతి లేదు. వానిని ఆశ్రయించి వాని హృదయంలో అవి ధైర్యంతో కూర్చొని ఉన్నాయి. కావుననే సాధువులు తమ పాపాలను అంతరింపజేయడానికి ఆ శ్రీనివాసునికూడా వదలి, వాటికి భయప్రదవగు



నిన్నే శరణు పొందుతున్నారు" అని ఇలా దయాదేవిని దయారహిత అని నిందించు వ్యాజంతో తదితర భగవద్గుణాలకు లేని ఉత్కర్ష దయకే ఉందని నిరూపించి ఆచార్యులిక్కడ స్తుతిస్తున్నారు.

"భగవతి దయే!" అను పదమూడవ శ్లోకంలో చెప్పిన విధంగా పాపమనేది అపరాధుల విషయంలో భగవంతునికి కలుగు కోపమనే ఒకజ్ఞాన విశేషమే. ఆ జ్ఞానం భగవానుని ఆశ్రయించి ఉండునుగాక! ఆ పాపాలకు అతనియొద్ద భయం లేదు. దయ ఊటలూరినయెడల ఆ కోపమనే జ్ఞానవిశేషం మరుగునపడిపోతుంది. కాన ఆ పాపమనే కోపానికి దయకడ భయమవుతుంది. అపరాధులమగు మనం భగవంతుని దయ ఊటలూరునట్లు శరణు పొందినయెడల ఆ అపరాధాలు కలిగించే దండనలు మనలను పొందకుండా దయాదేవి ఆటంకం కలుగజేస్తున్నది. దయకు తన్నాశ్రయించిన అపరాధులను, వారి నాశ్రయించియున్న అపరాధాలను (పాపాలను) ఒకేసారి రక్షించుట సాధ్యం కాదు. తన్నాశ్రయించిన పాపులను రక్షింపగోరితే వారి పాపాలను తుదముట్టించవలసి ఉంటుంది. అనగా తత్పాపంచేత కలిగే ఫలాలను వారికి అందనీయ కూడదు. ఆ పాపాలనే రక్షించదలచినట్లయితే ఆశ్రితుల చేతులను వదలి పాపాలచే కలుగు ఫలాలను (దండాలను) వారికి అందించాలి. ఇవి రెండూ ఒకే సమయంలో చేయవీలు గాదు. గనుక దయాదేవి తన స్వరూపానికి తగినట్లు తనకు ఆశ్రితాశ్రితులకంటె సాక్షాత్తుగా తన్నాశ్రయించు వారు అంతరంగులు కావున అపరాధులైన మనబోటి ఆశ్రితులను కాపాడి ఆశ్రితాశ్రితములైన పాపాలను బహిష్కరించుట యుక్తం. పై శాస్త్రార్థం, తర్కన్యాయాదులు ఇక్కడ విక్షితాలు.

ఇక్కడ ఈశ్వరునికి దయాళువు అనే పేరు సార్థకం కావడం, జీవులు నిర్భయంగా దయాదేవియొద్ద అణగి ఉండగలగడం లాభాలని భావించాలి.

**శ్లో॥ అతిలంఘితశాసనేష్వభీక్ష్ణం వృషశైలాధిపతిర్విజృంభితోష్మా ।**
**పునరేవ దయే! క్షమానిదానైః భవతీమాద్రియతే భవత్యధీనైః ॥ 27**

**ప్రతి :** హే దయే= ఓ దయాదేవీ!, అభీక్ష్ణం= ఎల్లప్పుడు, అతిలంఘిత శాసనేషు= భగవదాజ్ఞను మీరినవారియందు, విజృంభితోష్మా= వృద్ధిచెందిన

కోపంకల, వృషశైలాధిపతిః= శ్రీనివాసుడు, పునః= మరల, భవత్యధీనైః= నీ కధీనమైన, (నీచే ఏర్పడదగిన) క్షమానిదానైః= ఓర్పుయొక్క కారణాలచే, భవతీమేవ= నిన్నే, ఆద్రియతే= ఆదరిస్తున్నాడు.

**అవ :** 23, 24-వ శ్లోకాలలో భగవంతునికి ప్రళయకాలంలోను, సృష్టికాలంలోని కొన్ని సమయాలలోను, కోపం గలిగినప్పుడు దయాదేవి ఉపయోగపడే ప్రక్రియను నిరూపించి, తద్వారా సర్వకాల సర్వావస్థలయందు ఈశ్వరునికి దయాపరవశత్వం కలదనే విషయాన్ని పై రెండు (25,26) శ్లోకాలలో నిరూపించారు. ఆ రెండు సమయాలలోనేగాక సృష్టికాలంలో ఎల్లప్పుడు మనవంటి అపరాధులు కృత్యములను చేయక, అకృత్యాలను ఆచరించి ఈశ్వరాజ్ఞా రూపములైన శ్రుతి స్మృతులను ఉల్లంఘించినప్పుడు పరమేశ్వరునికి సమధికమగు సంతాపంకలిగి కోపం కలుగుతూనే ఉన్నది. అప్పుడు కూడా దయాదేవి ఉపయోగపడే ప్రక్రియను నిరూపిస్తూ ఈ శ్లోకంలో ఈశ్వరునియొక్క సార్వకాలిక దయాపారవశ్యాన్ని స్థాపిస్తున్నారు.

**తా :** "వేదం, దాని ననుసరించిన శ్రుతిస్మృతులే నాఆజ్ఞ. వీటినుల్లంఘించు వాడు నాకు ద్రోహి" అని భగవదుక్తి. అట్టి భగవంతుని ఆజ్ఞను మీరి మాటిమాటికి అతనికి చేతనులు అధికంగా కోపం కలుగజేస్తున్నారు. అట్టి సమయంలో ఆ కోపాగ్నిచే భగవంతునికి విశేష సంతాపం కలుగుతున్నది. వెంటనే ఆ తాపం అంతరింపజేసికొనదగు ఆవశ్యకత ఏర్పడుతున్నది. దానికి రెండు మార్గాలున్నాయి. మొదటిది తన జ్ఞానబలాదుల సహాయంతో అపరాధులను దండించడం. అపుడు కోపమణగిపోతుంది. రెండవది దయనాదరించి ఓర్పును చేపట్టడం. అప్పుడుకూడా కోపాగ్ని శమించిపోతుంది. వీటిలో రెండవమార్గాన్నే భగవానుడవలంబిస్తున్నాడు. ఇక్కడ ఓర్పుకు కారణమైన దయను భగవానుడు ఆదరించుట అనగా 'చేతనులకు తమకు తెలియకుండానే కొన్ని సమయాలలో యాదృచ్ఛికసుకృతం మొదలగు పుణ్యాలు కలగడం, తదనంతరం సోపానక్రమంగా సదాచార్య సంబంధంద్వారా ప్రపత్తి మొదలగు ప్రాయశ్చిత్త సంబంధం ఏర్పడడం భగవద్దయచేతనే. ఇట్లు దయచే ఏర్పడిన ప్రపత్త్యాద్యుపాయాలను చేతనులు అనుష్ఠించునపుడు భగవంతుని కోపం శమించి అపరాధులను దండించక అతడు ఓర్పు చూపుతున్నాడు' అనుటయే. అందువల్ల భగవంతునికి కోపమేర్పడినపుడు దయాదేవి జీవులకు యాదృచ్ఛిక సుకృతం మొదలగు ప్రథమసోపానంద్వారా భగవంతునియొద్ద ప్రపత్తి చేయువరకు ఉన్న పరిస్థితులను క్రమక్రమంగా కల్పించి వారిమీద భగవంతుని కేర్పడిన కోపాన్ని ఉపశమింపజేసి, దండనను తొలగించి వారికి ఉత్తమపురుషార్థం లభించునట్లు చేయుచున్నదను శాస్త్రార్థం ఏర్పడుతున్నది.



భగవంతునికి మనస్సంతాపం ఉపశమించడం, జీవులకు తమయందు దయా పక్షపాతమేర్పడడం ఇక్కడ ఫలాలని తెలుసుకోవాలి.

**శ్లో॥ కరుణే దురితేషు మామకేషు ప్రతికారాన్తరదుర్జయేషు ఖిన్నః ।**
**కవచాయితయా త్వయైవ శార్ఙ్గీ విజయస్థానముపాశ్రితో వృషాద్రిమ్॥**
**28**

**ప్రతి :** హే కరుణే!= ఓ దయాదేవీ!, మామకేషు= నాదైన; దురితేషు= పాపాలు, ప్రతికారాంతర దుర్జయేషు సత్సు= ఉపాయాంతరాలచే జయించుటకు వీలుకానప్పుడు, ఖిన్నః= మనోవేదనగలవాడైన, శార్ఙ్గీ= శార్ఙమను ధనుస్సును ధరించిన శ్రీనివాసుడు, కవచాయితయా= కవచముగానున్న; త్వయైవ= నీతోడనే, వృషాద్రిమ్= ఈ తిరుమలను, ఉపాశ్రితః= ఆశ్రయించి ఉన్నాడు.

**అవ :** కింది శ్లోకంలో జీవులు ఆచరించే పాపాలవలన భగవంతునికి మనోవ్యథ కలుగుతున్నదని చెప్పిన విషయాన్ని ఈ శ్లోకంలో ఆచార్యులు తనను దృష్టాంతంగా చేసి నిరూపిస్తున్నారు. అందరి పాపాలకంటె తన పాపాలు మిక్కిలి ఎక్కువగా ప్రబలంగా ఉన్నందున వీటిని జయించు విషయంలో ఈశ్వరుడు మిక్కిలి విచారం పొంది కడకొక మార్గం కనిపెట్టిఉన్నాడని చెపుతున్నారు.

**తా :** తన పాపాన్ని గురించి “అపి నిఖిలలోక” అను 12–వ శ్లోకంలో చెప్పారు. అపరాధియందు మొదట ప్రభువుకు కోపం కలుగుతుంది. ఇట్టి అపరాధం చేసినవాడు పుత్రునివంటి ఆప్తుడైతే వానికి అపరాధఫలమైన దండన తప్పించు విషయంలో ఇకపై ఇట్టి అపరాధం సంభవించకుండా ఉండడానికి ఉపాయం కనిపెట్టడంలో ఆ కోపమే చింతగా మారుతుంది. అదేవిధంగా “అనుభవితుం” అనే 34–వ శ్లోకంలో తాను చెప్పబోవునట్లు తన పాపాలు ఏవిధంగానూ నశించనివి కనుక “వాటిని ఎలా జయించగలం – అనగా వాటిచే సంభవించే దండననుండి ఎలా కాపాడగలం” అను విషయంలో మిక్కిలి విచారం కలిగిన శ్రీనివాసుడు శార్ఙ్గమను ధనుస్సును ధరించి, తాను (కవి) చేసే పాపాలు తీక్ష్ణాగ్రములైన బాణాలవలె హృదయవేదన కలిగించేవి కాకుండా దయ అనే దృఢమైన కవచాన్ని ధరించి, వారు వారు కోరిన విషయంలో జయమివ్వగల క్షేత్రప్రభావంతో కూడిన వృషగిరి అనే తిరుమలను చేరి తన పాపాలను జయించడం (మన్నించుట) కోసం వేచి ఉన్నాడని ఇక్కడ కవి ఉత్ప్రేక్ష.

వాస్తవంగా శ్రీనివాసుడు అందరి పాపాలను పోగొట్టి సద్గతిని కలిగించడానికి చాలకాలానికి ముందే ఈ తిరుమలకు చేరి ఉన్నప్పటికి, ఇతరుల పాపాలను జయించుటకు ఇంత ప్రయత్నం అవసరంలేదు. తన పాపాలే మిక్కిలి గొప్పవి కనుక వీటిని జయించుటకే పరమపురుషుడు ఇంత ప్రయత్నంతో ఇక్కడ వేంచేసి ఉన్నాడు అని ఆచార్యుల అభిప్రాయం.

ఒక రాజు తన శత్రువులను జయించుటకు వీలులేని సందర్భంలో తన శరీరాన్ని రక్షించగల ఒక కవచాన్ని, ధనుస్సును ధరించి ఒక పర్వతగుహలో నివసిస్తూ, ఆ శత్రువును జయించుటకు తగిన సమయంకోసం ఎలా నిరీక్షిస్తూ ఉంటాడో, అట్లే శ్రీనివాసుని స్థితికూడా అని కవిచిత్రం.

పరమపురుషుడు పరమదయచే అర్చాసమాధిని పొంది పర్వతశిఖరం మీద ఉంచిన దీపంవలె ఈ తిరుమలలో ప్రకాశిస్తున్నాడు. ఇతని ఉద్దేశం ఏమనగా – ఇట్టి పుణ్యక్షేత్రాలలో తాను సన్నిహితుడై ఉన్న యెడల అపరాధులైన



జీవులు ఒకప్పుడైనా ఇక్కడికి వచ్చి ఈ క్షేత్రప్రభావంచేత తనలో భక్తి ఏర్పడి తనను ఆపాదచూడం ఒకమారైనా సేవించినయెడల వారి సర్వపాపాలు తొలగి సద్గతిని పొందగలరు. కాబట్టి ఇలాంటి అవతారాలకు దయయే మూలకారణం. అట్లు ఆ అపరాధిజీవుడు తనను సేవించినప్పుడు తాను చేసిన పాపాలను గురించి హృదయం ద్రవించి క్షమించమని కోరతాడు. తరువాత ఇలాంటి పాపాలు చేయడు. ఇట్టి పరిస్థితి ఏర్పడిన యెడల జీవుల పాపాలను ఈశ్వరుడు దయాకవచంతో జయించుట అనే ఈ భావంతోనే సర్వేశ్వరుడిక్కడ వేంచేసి ఉన్నాడని శాస్త్రార్థం.

“త్వయైవ విజయస్థానం” అనే సమభివ్యవహారంవలన ఈ తిరుమల విజయస్థానం కావడానికి (విశేష ప్రభావశాలి అగుటకు) కారణం దయాదేవి అని పెద్దలు చేసిన వ్యాఖ్యానం సత్యం. అట్లే “వృషాద్రిమ్” అనే పదం కూడా గమనింపదగినదే.

ఈశ్వరునికి జీవుల పాపాలను జయించడం, జీవులకు పాపాలు తొలగడం ఇక్కడ ఫలమని ఊహించాలి.

**శ్లో॥ మయి తిష్ఠతి దుష్కృతాం ప్రధానే మితదోషానితరాన్ విచిన్వతీ త్వమ్।**
**అపరాధగణై రపూర్ణకుక్షిః కమలాకాన్తదయే! కథం భవిత్రీ ॥ 29**

**ప్రతి :** హే కమలాకాన్తదయే= ఓ శ్రీనివాసునిదయాదేవీ!, దుష్కృతాం= పాపులలో, ప్రధానే= అగ్రగణ్యుడగు, మయి= నేను, తిష్ఠతి సతి= ఉండగా, మితదోషాన్= స్వల్పదోషంకల, ఇతరాన్= వేరుజీవులను, విచిన్వతీ= వెదకుతున్న, త్వం= నీవు, అపరాధగణైః= పాపవర్గాలచే, అపూర్ణకుక్షిః= కడుపునిండనిదై, కథం= ఎట్లు! భవిత్రీ= జీవించగలవు.

**అవ :** కింది శ్లోకంలో చెప్పినరీతిగా తన పాపాలు అసంఖ్యేయాలు–ఎన్నో విధాలైనవి. అట్టి పాపాలుగల తన్నే మొదట రక్షించాలి. లేనిచో హే దయాదేవీ! నీ స్వరూపానికే హాని కలుగుతుంది. అని దయతో మాట్లాడడంలో తాను మహాపాపినని, తనను అవశ్యం కాపాడవలసిన బాధ్యత దయకున్నదని ఆచార్యులీ శ్లోకంలో ప్రతిపాదిస్తున్నారు.

**తా :** "హే దయాదేవీ! నీయొక్క పెద్దకడుపు నిండునట్లు పెద్ద పరిమితిగల, రుచికరమైన వివిధ అహారాలవలె ఉండు పలుపాపాలను పలుమారుచేసి అపరాధులలో అగ్రగణ్యుడని పేరుపొందిన నేను నీ యెదుట ఆ పాపాలు అనే ప్రభూతాహారాలను ధరించి నిలచిఉండగా, నీ కడుపును కొంచమైనా నిండించలేని కొద్దిపాపాలేగల ఇతరులను నీవు వెదకికొని పోయినయెడల, వారి కొద్ది పాపాలే నీకు ఆహారంగా అవుతాయి. కాన కడుపునిండకుండా ఎలా నీవు ఆత్మధారణం చేయగలవు? పూర్ణాహారం కదా జీవనహేతువు! కాని నన్ను కాపాడనియెడల నీవే కడుపునిండకపోవడంతో జీవించలేక కష్టపడతావు! అందువల్ల ఈ స్థితిలో నీవే దయనీయమైనదశ (నా దయను ఎదురుచూచు దశ)ను పొంది ఉన్నావు." అని దయాదేవి మహిమను ఆచార్యులు విశదీకరిస్తున్నారు.

దయాదేవియొక్క పూర్ణస్వరూపం ఉత్కృష్టమైన రీతిలో ఎప్పుడు ప్రకాశిస్తుందనగా-ఏ ఉపాయంతోనూ కడతేరుటకు వీలులేక పెద్ద పెద్ద పాపాలను ఆచరించి అధోగతిలో మునిగిపోయే పరిస్థితిలో ఉండువానిని రక్షించునప్పుడే కదా! అటుగాక స్వల్పాపరాధమే గలవానిని రక్షించునప్పుడు దయాదేవికి అట్టి గొప్పప్రభావ మేర్పడదు. కాబట్టి అట్టి మహాపాపిని (దయకు ఉత్తమమైన పాత్రమును) వెదకునప్పుడు తనకే ప్రథమస్థానం లభించాలని కవి హృదయం.

ఎంత పెద్ద పాపాలనైనా ఒక చిన్న వ్యాజంచేత శ్రీనివాసుడు తన దయచే క్షమిస్తాడు. పెద్దపాపాలు ఆచరించితిమే ఇక మనకు గతిలేదు అని భయపడి వానివద్దకు పోకుండా తొలగవద్దు అనే శాస్త్రార్థాన్ని నిరూపించడానికి దయాదేవి ఈ రీతిగా ఇక్కడ స్తుతింపబడింది. ఇట్లుగాక, దయాదేవికి ఆహారంగా అనేక పాపాలను అడుగడుగున మనం ఆచరించి, ఆమెకు సమర్పించి, ఆమె అనుగ్రహానికి పాత్రులం కావాలి అనే తాత్పర్యం ఇక్కడ స్వీకరించినయెడల సర్వశాస్త్రాలతోను విరోధం ఏర్పడుతుంది.



**శ్లో॥ అహమస్మ్యపరాధచక్రవర్తీ కరుణే! త్వం చ గుణేషు సార్వభౌమీ ।**
**విదుషీ స్థితిమీదృశీం స్వయం మాం వృషశైలేశ్వరపాదసాత్కురు త్వమ్॥**
**30**

**ప్రతి :** హే కరుణే= ఓ దయాదేవీ! అహం= నేను, అపరాధ(ధి) చక్రవర్తీ= అపరాధములకెల్ల చక్రవర్తిగా, అస్మి= ఉన్నాను, త్వం చ= నీవును, గుణేషు= సద్గుణములయందు, సార్వభౌమీ= పట్టపురాణిగా ఉన్నావు, ఈదృశీం= ఇటువంటి, స్థితిం= మన యిర్వురిపరిస్థితిని, విదుషీ= ఎరుగుతున్న, త్వం= నీవు, మాం= నన్ను, స్వయం= స్వయంగానే, వృషశైలేశ్వరపాదసాత్కురు= తిరుమల కధీశుడైన శ్రీనివాసుని పాదారవిందాలయొక్క సేవకునిగా ఒనరించు.

**అవ :** కింది రెండు శ్లోకాలలో చెప్పిన విధంగా మహాపాపియైన తనకు దయాదేవి ఇవ్వదగిన ఫలం ఈ శ్లోకంలో ప్రార్థించి ఈ దశకాన్ని ముగిస్తున్నారు.

**తా :** ఓ దయాదేవీ! నేను అపరాధములకెల్ల చక్రవర్తిని. నీవును భగవద్గుణాలకెల్ల సార్వభౌమివి. నా పరిపాలనకు లోబడిన పాపాలు ఎలా లెక్కకు మిక్కుటాలో, అట్లే నీ ఆధిపత్యానికి లోబడిన భగవద్గుణాలుకూడా అసంఖ్యేయంగా ఉన్నాయి. స్వతంత్రంగా ఇద్దరు చక్రవర్తులొక్కదేశానికి ఉండడం ఎల్లప్పుడూ హానికరంగా ఉంటుంది. కావున మన ఇర్వురియొక్క బలాబలాలను స్వయంగా ఎరిగిన నీవు నీ సార్వభౌమత్వానికి తగినట్లు నన్ను జయించి అనగా నా పాపాలకు ఫలాలను ఇవ్వకుండా క్షమించి నీ భర్తయగు వేంకటాధీశ్వరుని పాదారవిందమునందు నన్ను చేర్చాలి. ఇదియే నేను కోరే ఫలం.

అతిసమర్థురాలైన ఒక సార్వభౌమునిపత్ని తన భర్తకు విరోధియైన రాజును జయించి వానిని తన భర్తయొక్క పాదారవిందాలకడ జీవగ్రాహంగా ఎలా చేర్చుతుందో, అట్లే దయాదేవికూడా ఇక్కడ అలా చేయడానికి ప్రార్థింపబడుతున్నది.

సార్వభౌమి బలహీనుడగు ఒక చిన్న రాజును జయిస్తే విశేషంగా మహిమ కలుగదు. తనతో సమానుడైన బలశాలి అయిన ఒక పెద్ద చక్రవర్తిని ఓడిస్తే విశేషమైన ప్రఖ్యాతి కలుగుతుంది. కావుననే ఆచార్యులిక్కడ తనను చక్రవర్తిగా నిరూపించుకొన్నారు. అపరాధచక్రవర్తి అనే పదానికి రెండు మూడు రకాల అర్థం చెపుతారు. 1. అపరాధమనే చక్రం తిప్పువాడు (అపరాధచక్రం వర్తయతి), 2. అపరాధ సమూహం మధ్య వర్తిలు వాడు (అపరాధచక్రే= సమూహ, వర్తతే), 3. అపరాధాలకు అధిపతి.

దయాసార్వభౌమి తాను ముందు ప్రవేశించి పిదప తనకు పరికరాలుగా ఉన్న భగవద్గుణాలను ప్రేరేపించి ఈ అపరాధిని జయిస్తున్నది అనగా తత్పాపఫలాలైన దండనలనుండి వీనిని రక్షిస్తున్నది. జయింపబడిన వానిని స్వస్థలానికి తీసుకొనిపోవునట్లు వీనినికూడా దయాదేవి తనకు స్వస్థలమైన తిరుమలకు తీసుకొనిపోతున్నది.

“వృషశైలేశ్వరపాదసాత్కురు” అనే పదంవలన పై దశకంలో ప్రార్థింపబడనున్న వేంకటాద్రి సానుప్రదేశ నివాసం సూచింపబడింది. ఇప్పుడు “వృషశైలేశ్వర” అనే పదంచేత పర్వతేశ్వరమగు తిరుమల, “పాద” పదంచేత సానుప్రదేశం వివక్షితాలు. ఇట్టి జయమునే “కరుణే దురితేషు.....విజయస్థానం” అను 28వ శ్లోకంలో ప్రస్తావించారు.

ఇక్కడ ఈశ్వరునికి ప్రతిపక్షియగు అపరాధిజయం, జీవునికి ఈశ్వరపాదారవిందప్రాప్తి ఫలాలని ఎన్నదగును.

*తృతీయదశకం సమాప్తం*
*శ్రీమతే నిగమాంతమహాదేశికాయ నమః*

# చతుర్థ దశకం

**శ్లో॥ అశిథిలకరణేఽస్మిన్నక్షతశ్వాసవృత్తౌ**
**వపుషి గమనయోగ్యే వాసమాసాదయేయమ్ ।**
**వృషగిరికటకేషు వ్యంజయత్సు ప్రతీతైః**
**మధుమథనదయే! త్వాం వారిధారావిశేషైః ॥ 31**

**ప్రతి :** హే మధుమథనదయే= మధువనే రాక్షసుని మథించినట్టి ఓ శ్రీనివాసుని దయాదేవీ! అస్మిన్= ఈ, వపుషి= శరీరం, అశిథిలకరణే= పట్టువీడని ఇంద్రియాలు గలదిగా, అక్షతశ్వాసవృత్తౌ= ఎడతెగని నిట్టూర్పులు గలదిగా, (అత ఏవ= కనుకనే) గమనయోగ్యే సతి= సంచారక్షమంగా ఉన్న సమయమందే, ప్రతీతైః= ప్రసిద్ధంగా ఎరుగబడిన, వారిధారావిశేషైః = తీర్థధారలచే, త్వాం= నిన్ను (నీ స్వభావాన్ని), వ్యంజయత్సు= గుర్తుచేస్తున్న, వృషగిరికటకేషు= తిరుమల చరియలలో, వాసం= నివాసాన్ని, అసాదయేయమ్= పొందెదను.

**అవ :** కింది దశకాలలో శ్రీనివాసుని గుణాలలోని దయయే అత్యుత్కృష్టగుణం కావడంచేత, ఆ దయాదేవికి సర్వేశ్వరుడెప్పుడూ పరతంత్రుడై ఉండుటచేత అతిపాపియైన తన్ను ఆ దయాదేవి జయించి, వేంకటాధీశ్వరుని పాదారవింద పరిసరాన చేర్చవలెనని ప్రార్థించారు. అట్లు ప్రార్థిస్తూ గతదశకం చివరి శ్లోకంలో వేంకటాద్రి సానుప్రదేశాన తనకు వాసమపేక్షితమని సూచించారు. ఈ దశకంలో – ఈ శరీరవియోగానంతరం భగవత్పాదారవిందాలకడ కైంకర్యంచేయడం తనకు ఎలా అభిమతమో, అట్లే ఈ దేహముందువరకు కూడా అతిప్రభావోపేతమై ఉత్తమ దివ్య దేశమైన తిరుమల చరియలయందు నివాసం తనకు అభిమతం కావున దానినికూడా దయాదేవియే అనుగ్రహించాలని ప్రార్థించి, ఆ తిరుమల సమీపప్రదేశాలలోని మాహాత్మ్యాన్ని తెలియజేసి కింది దశకంలో చెప్పిన విధంగా దయాదేవి తనను జయించి

తెచ్చిన పిమ్మట పాపాలనుండి కాపాడుటకై భగవానునియొక్క న్యాయస్థలంలో స్వయంగా న్యాయవాదం చేసినట్లు ఒక విలక్షణ వైచిత్రితో వర్ణిస్తున్నారు. ఈ ప్రథమశ్లోకంలో వేంకటాద్రిలో నివసించడాన్ని కోరుతున్నారు.

**తా :** వేంకటాద్రిమీద వివిధ పవిత్రమైన సెలయేళ్లు ప్రవహిస్తున్నాయి. వాటి ప్రభావం పురాణాలలో విశేషంగా ప్రతిపాదింపబడి ఉన్నది. ఆ పుణ్యతీర్థ ప్రవాహినులు తమను సేవించువారికి తమలో ఉన్న మాధుర్యశైత్య పాపతాపహరత్వాదిగుణాలచే తమకు సమమైన భగవద్దయా ప్రవాహాన్ని గుర్తు చేస్తున్నాయి. భగవానుని దయయే ఈ పుణ్యతీర్థప్రవాహరూపంతో ప్రవహిస్తున్నదా! అనిపిస్తున్నది. అట్టి జలరామణీయకం, స్థలరామణీయకం కల అత్యుత్తమ క్షేత్రమైన తిరుమలచరియలయందు ఈ శరీరానికి ఇంద్రియాలమూలంగా, ప్రాణవాయువుమూలంగా ఎట్టి శైథిల్యం సంభవించకపూర్వమే దృఢంగా ఉండునపుడే నేను వసించెదనని, శరీరేంద్రియాలకు శైథిల్యమేర్పడిన పిమ్మట ఇట్టి చరియప్రదేశాలను చేరి, నిత్యకర్మలను అనుష్ఠించుట సాధ్యంకాదు కనుక సమీచీనస్థితిలో ఉన్నపుడే అట్టివాసం పొందెదనని ప్రార్థిస్తున్నారు.

"తిరువాయిమొళి"లో (కిళరొళి)లో నమ్మాళ్వార్లు ఆశించిన విషయమే ఇక్కడ ఆచార్యుని హృదయంలోకూడా ఉన్నదని భావించాలి.

**శ్లో॥ అవిదిత నిజయోగక్షేమ మాత్మానభిజ్ఞం**
**గుణలవరహితం మాం గోప్తుకామా దయే! త్వమ్ ।**
**పరవతి చతురైస్తే విభ్రమైః శ్రీనివాసే**
**బహుమతిమనపాయాం విందసి శ్రీధరణ్యోః ॥ 32**

**ప్రతి :** హే దయే= ఓ దయాదేవీ! అవిదిత నిజయోగక్షేమమ్= ఎరుగబడని తన యోగక్షేమాలు కలవాడును, ఆత్మానభిజ్ఞమ్= స్వీయస్వరూపం ఎరుగనివాడును, గుణలవరహితం= గుణలేశంకూడా లేనివాడు అగు, మాం= నన్ను, గోప్తుకామా= రక్షింపదలచిన, త్వం= నీవు, శ్రీనివాసే= శ్రీనివాసుడు, చతురైః= సమర్థములైన, తే= నీయొక్క, విభ్రమైః= విలాసాలచే, పరవతిసతి= (నీకు) పరవశుడగుచుండగా, శ్రీధరణ్యోః= శ్రీదేవీ భూదేవులయొక్క, అనపాయాం= స్థిరమైన, బహుమతిమ్= బహుమానాన్ని, విందసి= పొందుతున్నావు.



**అవ :** కింది శ్లోకంలో వేంకటాద్రి ప్రాప్తిని అపేక్షించారు. అక్కడ చేరిన తరువాత తనకై దయాదేవి న్యాయవాదం చేయు ప్రక్రియను పై శ్లోకంలో ప్రస్తావించనున్నారు. ఏ విధమైన గుణలేశం కూడా లేని తనను కాపాడుటకై దయాదేవి అట్లు ప్రయత్నించే సమయంలో ఏర్పడు ఒక పరిస్థితిని ఈ శ్లోకంలో వివరిస్తున్నారు.

**తా :** ఇదివరకు పొందని ఒక వస్తువును కొత్తగా పొందుటకు యోగమని, పొందిన వస్తువును తగురీతిలో రక్షించి ఉపయోగించుకొనుట క్షేమమని శాస్త్రకారులు నిరూపించారు.

పాపాలను తొలగించుకొని మోక్షం పొందాలని ఆశపడువానికి సదాచార్య సమాశ్రయణమూలంగా లభించే తత్త్వహిత పురుషార్థ వివేకాన్ని యోగంగా, లబ్ధమైన వివేకాన్నిబట్టి తన కనురూపమైన హితాన్ని అనుష్ఠించి పురుషార్థం పొందడాన్ని క్షేమంగా పెద్దలు బోధించారు.

అలాంటి యోగక్షేమాలు నా కేవో నే నెరుగను. దానిని ఎరుగుటకు ఆత్మస్వరూపజ్ఞానం ముఖ్యకారణం. స్వీయస్వరూప మిట్టిదని తత్త్వంగా తెలిసిన పిమ్మటనే దానికి సంబంధించిన యోగక్షేమాలను ఎరుగదగును. అట్టి ఆత్మజ్ఞానం నాకు లేదు. ఈ ఆత్మజ్ఞానం పొందాలనుకొంటే సత్త్వగుణోద్రేకం కలిగి దానివలన సంభవించే ఆత్మగుణాలు కలిగి ఉండాలి. అట్టి గుణాలలో ఒక లేశంకూడా నా దగ్గరలేదు. ఓ దయాదేవీ! ఇటువంటి నన్ను కాపాడడానికి నీవు ప్రయత్నించి నీ మధురాప విలాసాదులచేత నీ

నాయకుడైన శ్రీనివాసుని స్వాధీనపరచుకొనే సమయాన నీ సపత్నులైన శ్రీదేవీ భూదేవులు నీ సామర్థ్యాన్ని, ఆశ్రితసంరక్షణ దీక్షిత్వాన్ని, భర్తయైన శ్రీనివాసుని వశీకరించుకొను ప్రక్రియను కన్నులార కాంచి నీయందు స్థిరమైన, విలక్షణమైన బహుమానం ప్రదర్శిస్తున్నారని దయాదేవిని స్తుతిస్తున్నారు.

స్త్రీలు తమ సవతులనుండి స్థిరమగు బహుమతిని పొందడం చాల అరుదు.

ఈశ్వరుడు, అతని సతులు మొదలైన సమస్తపరివారం చేతన సంరక్షణ దీక్షలో శ్రద్ధగలవారు. తదర్థమే వారు వివిధమార్గాలలో పలుతెరగుల ప్రయత్నిస్తున్నారు. అట్లుండ ఈ చేతనసంరక్షణ విషయంలో దయాదేవికే ప్రథమస్థానం ఇవ్వాలి. దయాదేవి లేనిచో మహాపరాధులైన సంసారులు (ఈశ్వరుని కోపమణగి) ఉజ్జీవించుటకు వేరు గతి లేదు కావున శ్రీ భూదేవులు కూడా బహుమానించు స్థితిలో దయకు ప్రాధాన్యం కలదనే శాస్త్రార్థం ఇక్కడ వివక్షితం.

**శ్లో॥ ఫలవితరణదక్షం పక్షపాతానభిజ్ఞం**
**ప్రగుణమనువిధేయం ప్రాప్య పద్మాసహాయమ్।**
**మహతి గుణసమాజే మానపూర్వం దయే త్వం**
**ప్రతివదసి యథార్హం పాప్మనాం మామకానామ్ ॥ 33**

**ప్రతి :** హే దయే= ఓ దయాదేవీ! త్వం= నీవు, ఫలవితరణదక్షమ్= ఆయా పనులకు తగిన ఫలాలను ఒసగు సామర్థ్యం కలిగినట్టియు, పక్షపాతానభిజ్ఞమ్= పక్షపాతం తెలియనట్టియు, ప్రగుణం= ఉత్కృష్టములగు గుణాలు కలిగినట్టియు, అనువిధేయం= అందరికి ఆశ్రయింపతగిన సౌలభ్యం కలిగినట్టియు, (ప్రగుణమను విధేయం= ఉత్కృష్టమగు అష్టాక్షర్యాది మంత్రాలచే వశీకరింప తగినవాడునగు,) పద్మాసహాయమ్= లక్ష్మీపతియగు పరమపురుషుని, ప్రాప్య= పొంది, మహతి= గొప్పదైన, గుణసమాజే= జ్ఞానం మొదలగు గుణాలయొక్క సమాజమందు, మానపూర్వం= ప్రమాణపూర్వకంగా, మామకానాం= మదీయాలైన, పాప్మనామ్= పాపాలను గురించి, యథార్హమ్= తగురీతిగా, ప్రతివదసి= ప్రతివాదం చేస్తున్నావు.



**అవ :** దయాదేవి తన పాపాలను గురించి ప్రతివాదం చేసే ప్రక్రియను ఈ శ్లోకంలో ప్రతిపాదిస్తున్నారు. లోకంలో ఇరువురికి వివాదం సంభవించినపుడు అర్హుడైన న్యాయవాదికడకేగి వారి వారి వాదాలను వారిరువురు ప్రతిపాదిస్తారు. సర్వవిధయోగ్యతలు కలిగినవాడగు ఆ న్యాయాధిపతి రెండు వాదాలను విని తగిన తీర్మానం చేయడం అనుభవసిద్ధమైన విషయం. అట్లే ఇక్కడ కూడా ఒక విచారం ప్రవర్తిల్లుతున్నదని కవి చిత్రిస్తున్నారు.

**తా :** న్యాయాధిపుడు ఆయా పనులకు తగురీతిగా ఫలాలను ఇవ్వడంలో సమర్థుడుగా ఉండాలి. ఏ పక్షంమీదా అభిమానం చూపకుండా నిష్పక్షపాతుడుగా ఉండాలి. ఉత్తమగుణపూర్ణుడుగా అందరిచేత నిర్భయంగా ఆశ్రయింపబడి తమ తమ వాదాలను విశదీకరించుటకు సులభుడుగా ఉండాలి. న్యాయసభలో నిష్పక్షపాతులు, మహనీయులు అయిన మేధావులు ఉండాలి. అట్టి సందర్భంలో వారి ప్రతివాదులు తమ తమ వాదాలను ప్రతిపాదించినపుడు సభ్యులగు పెద్దల అభిమతాన్ని అనుసరించి న్యాయాధిపతి తీర్పుచేస్తాడు. అట్లే ఇక్కడ జీవునియొక్క (కవియొక్క) పాపౌఘమే వాదివర్గం. ప్రతివాది దయాదేవి. భగవానుని జ్ఞానబలాది గుణవర్గమే సభ్యసమాజం. లక్ష్మీసహాయుడైన శ్రీనివాసుడు న్యాయాధిపతి. ఇట్టి సభలో వాదులైన పాపాలు, "నాభుక్తం క్షీయతే కర్మ కల్ప కోటిశతైరపి" (కల్పకోటి కాలమైనా చేసిన కర్మలకు ఫలాలను అనుభవింపనిచో ఆ కర్మలు నశింపవు). అను ప్రమాణాలను అనుసరించి, ఈ సంసారియగు జీవుడు తానుచేసిన కర్మలకు ఫలాలను అనుభవించియే తీరాలి. వాటిని తొలగించుటకు వేరు ఉపాయం లేదు. కావున వీడు కావించిన పాపాలకు

తగు దండనలను ఇవ్వాలని వాదిస్తున్నాయి. ఈ వాదానికి దయాదేవి చేసే ప్రతివాదం పై శ్లోకంలో వర్ణింపబడనున్నదని కొందరి అభిప్రాయం. ఈ శ్లోకంలోనే ప్రతివాదప్రక్రియలను కొన్నింటిని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. దానిని ఇక్కడ ప్రతిపాదిస్తున్నాం.

**దయాదేవి చేయు ప్రతివాదం ఏమంటే :** ఈ జీవుడు బహువిధాలైన పాపాలను ఆచరించెననడం వాస్తవం. కాని శాస్త్రాలలో "నాభుక్తం క్షీయతే కర్మ" అని చెప్పబడిన విషయం ప్రపన్నునియందు అన్వయించదు. ప్రపత్త్యాది బ్రహ్మవిద్యలకు సంబంధించినవానిని తద్విద్యాప్రభావంతో అభ్యుపగత ప్రారబ్ధమనెడు కర్మ తప్ప శేషించిన సర్వకర్మలు "ప్రారబ్ధేతర పూర్వపాప మఖిలం ప్రామాదికం చోత్తరం" అని చెప్పబడిన ప్రకారం బంధించవని శాస్త్రాలు, భగవానుడు చెప్పి ఉండడంచేత అట్టి కర్మలకు ఫలాలను ఇవ్వక ప్రపన్నుడైన వీనికి మోక్షం ఒసగి కాపాడాలని చెప్పడమే. ఈ దయావాదం విని మహాగుణాలు ఈ వాదమే యుక్తియుక్తంగా ఉన్నదని చెప్పగా పక్కన ఉన్న మహాలక్ష్మి ఆమోదించి పరమపురుషుడగు నీతిపతి దయాదేవి మాటననుసరించి తీర్పుచెప్పి జీవుని వదలివేస్తున్నాడు. ఈ శాస్త్రార్థమిచట వివక్షితమై ఉంది.

అనువిధేయ శబ్దానికి ప్రాడ్వివాకుడు అనే అర్థం కలదని కొందరు చెపుతారు.

"మహతి గుణసమాజే" అను ఈ సప్తమీ విభక్తికి అనాదరం, నిర్ధారణం మొదలగు అర్థాలను వివక్షించి రసవత్తరములైన కొన్ని అర్థాలను కూడా వ్యాఖ్యానిస్తున్నారు.

**శ్లో॥ అనుభవితుమఘౌఘం నాలమాగామికాలః**
**ప్రశమయితుమశేషం నిష్క్రియాభిర్న శక్యమ్ ।**
**స్వయమితి హి దయే త్వం స్వీకృత శ్రీనివాసా**
**శిథిలితభవభీతిః శ్రేయసే జాయసే నః ॥** **34**



**ప్రతి :** హే దయే= ఓ దయాదేవీ!, అఘౌఘం= పాపసమూహాన్ని, అశేషం= నిశ్శేషంగా, అనుభవితుమ్= అనుభవించుటకు, ఆగామికాలః= రానున్న కాలం, నాలం= చాలదు, నిష్క్రియాభిః= ప్రాయశ్చిత్తాలతో, ప్రశమయితుమ్= పోగొట్టుటకు, అశక్యం= సాధ్యము కాదు, ఇతి= అని ఇట్లు వాదించి, స్వయం= తానే, స్వీకృత శ్రీనివాసా= వశీకరించుకొనబడిన శ్రీనివాసుని గలిగిన, త్వం= నీవు, శిథిలితభవభీతిః సతీ= వదలు గావించబడిన సంసారభీతి కలదానవై, నః= మాయొక్క, శ్రేయసే= శ్రేయస్సుకొరకు, జాయసే హి= (కారణంగా) అవుతున్నావు గదా!

**అవ :** దయాదేవి చేస్తున్న ప్రతివాదం ఇక్కడ వర్ణింపబడుతున్నది.

**తా :** పాపాలను తొలగించుటకు రెండుమార్గాలు ఉన్నాయి. మొదటిది పాపఫలాలను అనుభవించడం. రెండవది ప్రాయశ్చిత్తం చేసుకోవడం. ఈ రెండు ఉపాయాలు శాస్త్రసిద్ధములైనా, ఈ జీవుని విషయంలో సాధ్యం కానివి. వీడు చేసిన, చేస్తున్న పాపాలు అనంతం కావున, భవిష్యత్కాలంలో పూర్తిగా ఫలాలను అనుభవించినా ఆ కర్మలు నశించవు. కాలం అనంతమైనప్పటికి వీని కర్మ తొలగదు. శాస్త్రోక్తప్రకారంగా చక్కని రీతిలో ప్రాయశ్చిత్తాలను అనుష్ఠించి, ఆ పాపాలను తొలగించుకోవడం అసాధ్యం.

అసాధ్యమైన విషయంలో ఏమి చేయాలి? కావున, "నా పాదాల నాశ్రయించిన వానిని (ప్రపన్నుని) క్షమించి పరిరక్షించెద" అని తాము చెప్పినట్లుగా వీని అపరాధాన్ని క్షమించి కాపాడుటయే ఇపుడు చేయదగినది, సాధ్యమైనది అయిన కార్యంగా ఉన్నదని ప్రతిపాదించి స్వగుణాలచే శ్రీనివాసుని వశీకరించి, మహాపరాధులమగు మాశ్రేయస్సుకొరకు నీవు పాటుపడుతున్నావు. ఆహా! నీ వెంతటి వాత్సల్యం కలదానవోగదా!

ఈ శ్లోకంలో, "స్వీకృత శ్రీనివాసా" అనే పదంచేత దయాదేవి శ్రీనివాసుడను నీతిపతిని తనపక్షానికి అనుకూలునిగా వశీకరించుటకు కింద

చెప్పినట్లు బహువిధాలుగా వాదించి పాటుపడుతున్నదని భావింప బడుతున్నది.

దయాదేవి చేసే ప్రతివాదప్రక్రియ ఇచట చెప్పబడుటలేదు. అది పూర్వశ్లోకంలోనే చెప్పబడినదనుకొంటే 'ఇతి' అను పదానికి "ఇట్లాలోచించి" అనే అర్థం చెప్పుకోవాలి. అప్పుడు మొత్తం శ్లోకాన్ని కవియొక్క వాక్యమని భావించవచ్చు.

**శ్లో॥ అవతరణవిశేషైరాత్మ లీలాపదేశైః**
**అవమతి మనుకంపే! మందచిత్తేషు విందన్ ।**
**వృషభశిఖరినాథస్త్వన్నిదేశేన నూనం**
**భజతి శరణభాజాం భావినో జన్మభేదాన్ ॥ 35**

**ప్రతి :** హే అనుకంపే!= ఓ దయాదేవీ!, వృషభశిఖరినాథః= శ్రీవేంకటాచలాధీశుడగు శ్రీనివాసుడు, త్వన్నిదేశేన= నీ ఆజ్ఞవలన, ఆత్మలీలాపదేశైః= తనయొక్క లీలలను వ్యాజంగా కలిగిన, అవతరణ విశేషైః = ఆయా అవతారాలచే, మందచిత్తేషు= మందబుద్ధికలిగిన వారియందు, అవమతిమ్= అవమానాన్ని, విందన్= పొందుతూ, శరణభాజాం= శరణాగతులయొక్క, భావినః= (అనుభవించుటకు) నిశ్చయంగా కలుగనున్న, జన్మభేదాన్= ఆయా జన్మాలను, భజతి= పొందుతున్నాడు, నూనం= ఇది నిశ్చయం.

**అవ :** కింది శ్లోకంలో దయాదేవి చేసే ప్రతివాదప్రక్రియ వివరింపబడింది. ఆ వాదంచే ఏర్పడిన నిశ్చయమేమంటే, శరణు పొందినవారియొక్క పాపాలకు దండనగా తత్పాపఫలాన్నిచ్చి, దుఃఖాలను అనుభవింపజేయుట తగదు. తత్పాపాలను క్షమించుటయే ఇప్పటికి సాధ్యమని తలచాలి. అట్టి యెడల వారుచేసిన పాపాలకు గతియేమి? అవి పలుజన్మాలను ఇచ్చి తీరాలి గదా! అనే ప్రశ్నకు శాస్త్రీయ సమాధానమిది–మన సిద్ధాంతంలో పుణ్యపాపాలనేవి



భగవానుని అనుగ్రహ నిగ్రహాలే. అదియు కడపట, "ఈ పాపం చేసినవాడు ఈ విధమైన ప్రాయశ్చిత్తాది పరిహారాలు చేయనియెడల ఈ జన్మను పొంది, ఇలా కష్టపడుగాక" అను భగవంతునియొక్క సంకల్పంలో పర్యవసానం పొందుతుంది. ఇది పుణ్యానికి సమానమైందే. అందువల్ల శరణాగతి అనే సర్వకర్మపరిహారం చేసిన శరణాగతుని విషయంలో పూర్వోక్త భగవత్సంకల్పంచేత కలుగనున్న ఏ ఒక జన్మకూడా కలుగదు. ఇట్టి పరిహారం ఆచరించని వారియందే భగవానునియొక్క పూర్వోక్తసంకల్పం సిద్ధిస్తుంది. కావున కర్మమనేది జన్మం ఇవ్వగల శక్తితో కూడినదై, ఈ శరణాగతుని విషయాన ప్రవర్తించుటలో న్యాయం లేదు.

తత్త్వమీరీతిగా ఉండినా కవి ఈ శ్లోకంలో వేడుకకై ఒక ఉత్ప్రేక్షను ఉపయోగించి తద్వారా పూర్వోక్తప్రశ్నకు (జన్మలు ఇవ్వదగిన కర్మల కేమిగతి?) సమాధానం ఇస్తూ దయాదేవిని పొగడుతున్నారు. కనుక ఈ శ్లోకంలో చెప్పబడిన విషయం చమత్కారోక్తియేగాని తత్త్వార్థం కాదు.

**తా :** భగవంతుడు మత్స్యకూర్మ మనుష్యాద్యనేకరూపాలతో అవతరిస్తున్నాడు. ఈ అవతారాలకు లీలలే ప్రయోజనాలని శాస్త్రాలు సిద్ధాంతీకరిస్తున్నాయి. కాని ఇక్కడ ఉన్న రహస్యం వేరని కవి ఉత్ప్రేక్షిస్తున్నాడు. కింద చెప్పబడిన విధంగా శరణాగతుని పాపాలు, వాని కవశ్యం కలుగవలసియున్న జన్మలు ఒసగరాదని దయాదేవి వాదంచే తీర్మానమైన పిదప ఆ కర్మలకేమి గతి? అని ప్రశ్న జనించినపుడు ఈ దయాదేవి తనకు సర్వస్వాధీనుడు, భర్త అగు శ్రీనివాసుని చూచి, "ఈ శరణాగతునికి మారుగా వాడు పొందవలసి ఉండిన జన్మలను తామే పొంది ఆ కర్మలను తొలగింతురుగాక!" అని ఆజ్ఞాపిస్తున్నది. ఆ ఆజ్ఞను నెరవేర్చడానికి సర్వేశ్వరుడు మత్స్యంగా, కూర్మంగా, సింహంగా, మనుష్యుడుగా నానా జన్మలెత్తి ఆయా జన్మలలో, "అవజానన్తి మాం మూఢాః" అను గీతోక్తి ప్రకారం మూఢులగు రావణ శిశుపాలాదు లొనరించు అవమానాలను కూడా సహించి, ఆ శరణాగతుని కర్మలను తొలగిస్తున్నాడు.

ఒక స్త్రీ మాటలను విని ఇలా ఎన్నో విధాల పరిభవం పొందుతున్నాడే! అని లోకస్థులు పరిహసించకుండా ఉండడానికి భగవానుడు తనలీలార్థం అవతరించునట్లు శాస్త్రాలలో ప్రకటింపబడి ఉంది. లోకంలో ఒకనికి మరొకడు ప్రభువుగా (జామీనుగా) నిలిచిన యెడల, మొదటివాడు తానుచేయవలసిన దానిని చేయనియెడల జామీనుగా నిలిచినవాడు దానిని చేసి తీరవలసినదేగదా! ఆ న్యాయాన్ని అనుసరించి శరణాగతుడగు జీవుని వదలించుటలో మూర్ధన్యంగా నిలిచిన దయాదేవి వాడు పొందవలసిన జన్మలు పొందుటకు వీలులేని పరిస్థితులు సంభవించినపుడు తనవాడైన భగవంతుడే ఆ జన్మలను పొందునట్లుచేసి ఆ శరణాగతుని వదలిస్తూ ఉంది. ఈ ప్రకారంగా దయాదేవి ఇక్కడ పొగడబడుతున్నది.

ఇక్కడ "అవతరణవిశేషైః" అనడంవల్ల రామకృష్ణాది రూపాలైన విభవావతారాలు మాత్రమేగాక, పలు దివ్యదేశాలలో పలువిధాల అవతరించిన అర్చావతారాలను కూడా వివక్షింపవలసి ఉంటుంది. విభవావతారాలకంటె అర్చావతారంలో మందబుద్ధి కృతమగు అవమానం అత్యధికం. ఈ అవతారంలో కూడా దయాదేవి ఆజ్ఞయే కారణం. సాధుసంరక్షణాది లీలలు ఇక్కడా సమానాలే. ఇలా నానా హేతువులచే అర్చావతారాలను కూడా ఇక్కడ వివక్షింపవచ్చునని తోస్తున్నది.

"శరణభాజామ్" అనుటకు మారు "చరణభాజామ్" అనే పాఠం ఉంది. అప్పుడు మంత్రంలో ఉండు చరణపదం ఇక్కడ ఆచార్య హృద్గతమైనదని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

**శ్లో॥ పరహితమనుకంపే! భావయన్త్యాం భవత్యాం**
**స్థిరమనుపధి హార్దం శ్రీనివాసో దధానః ।**
**లలితరుచిషు లక్ష్మీభూమినీలాసు నూనం**
**ప్రథయతి బహుమానం త్వత్ప్రతిచ్ఛన్దబుద్ధ్యా ॥ 36**



**ప్రతి :** అనుకంపే= ఓ దయాదేవీ!, పరహితం= ప్రతికూల జీవులకు కూడా హితమునే, భావయన్త్యాం= భావిస్తున్న, భవత్యాం= నీ యందు, స్థిరం= స్థిరముగను, అనుపధి= నిరుపాధికముగను ఉన్న, హార్దం= ప్రీతిని, దధాన= వహిస్తున్న, శ్రీనివాసః= శ్రీనివాసుడు, లలితరుచిషు= మనోజ్ఞ కాంత్యుపేతలైన, లక్ష్మీభూమినీలాసు= శ్రీభూనీళాదేవులయందు, త్వత్ప్రతిచ్ఛందబుద్ధ్యా= నీ ప్రతిబింబాలనే తలంపుతో, బహుమానం= ఆదరాన్ని, ప్రథయతి= విస్తరిస్తున్నాడు (ప్రకాశపరస్తున్నాడు).

**అవ :** కింది శ్లోకంలో దయాదేవి ఆజ్ఞచే సర్వేశ్వరుడు పడే అవస్థలు వర్ణింపబడినాయి. అట్లు తనను పలువిధాలైన శ్రమలకు లోనుకావించిన దయాదేవియందు ఈశ్వరునికి ఏదైనా కొంచెం మనఃక్లేశం ఉందా! అనగా ఇక్కడ ఒక ఆశ్చర్యం కలదని కవి నిరూపిస్తున్నారు. దయాదేవియందు మనఃక్లేశంలేక, విశేషప్రేమను ఆమెయందు చూపడమే కాక తన వక్షఃస్థలమునందును, ఇరు పార్శ్వములందును సర్వదా సన్నిహితులై యుండు శ్రీదేవి, భూదేవి, నీళాదేవులయందుగూడ వారు ఆ దయాదేవియొక్క ప్రతిబింబములనే బుద్ధిచే విశిష్టమగు బహుమానం చేస్తున్నాడు. ఇది నిశ్చయం. ఇది దయాదేవియొక్క ఎంతటి మహిమో! అను ఈ విధమైన ఉత్ప్రేక్షచే పై సందేహానికి (దయాదేవి యందేమైన మనఃక్లేశం గలదా?) సమాధానం చెపుతూ ఈ శ్లోకంలో దయాదేవిని కీర్తిస్తున్నారు.

**తా :** దయాదేవి సర్వకాలాలలోను ప్రతికూలంగానే ఆచరిస్తున్న సంసారుల విషయంలో హితమునే చింతిస్తూ, చేస్తూ ఉన్నది. కావున ఆమెయందు శ్రీనివాసుడు స్థిరమైన, అవ్యాజమైన ప్రేమను కలిగి ఉన్నాడు. ఇలా ఉండగా ఈ దయాదేవికున్న పరహిత చింతనమనే గుణాన్ని శ్రీ భూ నీళాదేవులలో చూచినప్పుడు, "ఓహో! వీరు దయాదేవి ప్రతిబింబాలే! బింబగత గుణాలేకదా ప్రతిబింబంలో కనపడతాయి." అని తలచి దయాదేవి యందువలె వారియందు విశేష బహుమానాన్ని ప్రదర్శించి తన వక్షఃస్థలమునందును,

ఇరు పార్శ్వములలోను వారిని ఉంచుకొన్నాడు. ఈ రీతిగా దయాదేవిని భగవానుడు కొనియాడుతున్నాడని కవి చమత్కారోక్తి ఇట గ్రాహ్యం. సర్వేశ్వరుని సతులెల్లరు చేతన సంరక్షణ విషయంలో ఏకాభిప్రాయంతో పరమదయగలిగి పరమపురుషునికి పురుషకారం చేసి చేతనుని రక్షిస్తున్నారను శాస్త్రార్థమిక్కడ వివక్షితం.

ఈ శ్లోకంలో "పరహితమనుకంపే భావయన్త్యాం భవత్యాం" అనునది గ్రంథాంతరంలో "పరహితప్రావణ్యం దయా" అని ఆచార్యులు చేసిన నిష్కర్షను గుర్తు చేస్తున్నది.

"స్థిరమనుపధి హార్దం" (ఆద్యంతరహితం, నిర్వ్యాజం అగు ప్రీతిని) అనుటచే "జలధేరివ శీతతా" అని ముందు చెప్పబడిన ప్రకారం సర్వేశ్వరునికి దయ స్వాభావికగుణమని తెలుస్తున్నది.

**శ్లో॥ వృషగిరిసవిధేషు వ్యాజతో వాసభాజాం**
**దురితకలుషితానాం దూయమానా దయే! త్వమ్ ।**
**కరణవిలయకాలే కాన్దిశీకస్మృతీనాం**
**స్మరయసి బహులీలం మాధవం సావధానా ॥ 37**

**ప్రతి :** హే దయే!= ఓ దయాదేవీ!, వృషగిరిసవిధేషు= తిరుమలకు సమీప ప్రదేశాలలో, వ్యాజతః= ఏదో ఒక నెపంతో, వాసభాజామ్= నివసిస్తున్న, దురితకలుషితానామ్= పాపాలచే కలతజెందినవారికొరకై, దూయమానా= చాలా పరితపిస్తున్న, త్వం= నీవు, కరణవిలయకాలే= ఇంద్రియాలు లయంపొందు సమయంలో (మరణకాలంలో), కాందిశీకస్మృతీనామ్= లోపించి పోయిన స్మృతి కలిగినవారికి, బహులీలమ్= అనేక లీలలు కలిగిన, మాధవమ్= శ్రీనివాసుని, సావధానా (సతీ)= మిక్కిలి జాగ్రతగల దానివై, స్మరయసి= స్మరింపజేస్తున్నావు.



**అవ :** కింది శ్లోకంలో ప్రతికూలురయందు కూడా దయాదేవి హితాన్నే ఆలోచిస్తున్నదని సామాన్యంగా చెప్పబడిన విషయాన్ని ఈ శ్లోకంనుండి ఈ దశకాంతంవరకు ఆమెచేసే కొన్ని హితాలను స్పష్టంగా నిరూపిస్తూ విశదీకరిస్తున్నారు. ఈ శ్లోకంలో ఈ దశకప్రతిపాద్యార్థాలలో ఒకటైన తిరుమలయొక్క ప్రభావాన్ని, తత్పరిసర నివాసులయొక్క మహిమను ప్రతిపాదించినట్లు అవుతున్నది.

**తా :** తిరుమల ప్రాంతప్రదేశాలలో ఉదరపోషణాదులగు ఏవో కారణాల ననుసరించి నివసిస్తున్న మహాపాపుల విషయాలలో కూడా భగవద్విషయవాసనా మహిమచే వారి అంత్యకాలంలో (సర్వేంద్రియాలు లోపించి స్మృతితప్పిపోయి ప్రాణం పోయే తరుణంలో) దయాదేవి మిగుల జాగ్రత్త కలిగినదై జగద్వ్యాపారాది బహువిధలీలలయందు ప్రవర్తించి ఉన్న శ్రీనివాసుని స్మరింపజేస్తున్నది. అనగా పాపులకు భగవద్విషయికమగు అంతిమ స్మృతిని కలుగజేస్తున్నదని భావం.

**"దుష్టేంద్రియవశాచ్చిత్తం నృణాం యత్కల్మషైర్వృతమ్ ।**
**తదన్తకాలే సంశుద్ధిం యాతి నారాయణాలయే ॥"**

అనే ప్రమాణాన్ని అనుసరించి ఆయుస్సు ఉండునంతవరకు ఇంద్రియ పరాధీనులై పాపాలనే చేయువారికికూడా దివ్యదేశవాసం కలిగితే ప్రాణవియోగ సమయంలో పరమదయాళువగు పరమపురుషుని సంకల్పం చేత చిత్తశుద్ధి ఏర్పడి అంతిమస్మృతి అనే భగవద్విషయికస్మృతి కలుగుతున్నదను శాస్త్రార్థమిచట వివక్షితం. ఈ అంతిమస్మృతి యోగులకు కూడా దుర్లభం.

ఇందువలన దివ్యదేశవాసం చేయువారికి అంతిమ స్మృతి అనే ఉత్తమ హితాన్ని దయాదేవి కలుగజేస్తున్నదని నిరూపితమైంది.

శ్లో॥ దిశి దిశి గతివిద్భిర్దేశికైర్నీయమానా
స్థిరతరమనుకంపే స్త్యానలగ్నా గుణైస్త్వమ్ ।
పరిగతవృషశైలం పారమారోపయన్తీ
భవజలధిగతానాం పోతపాత్రీ భవిత్రీ ॥ **38**

**ప్రతి :** హే అనుకంపే= ఓ దయాదేవీ!, గతివిద్భిః= దయాగతులను ఎరిగిన (సముద్రంలో మార్గాలను ఎరిగిన), దేశికైః= ఆచార్యులచే (నావికులచే), దిశి దిశి= ఆ యా ప్రదేశాలలో (ఆయా దిక్కులలో), నీయమానా= కొనిపోబడుచున్నదానివిగాను (నడుపుకొని పోబడుచున్నదిగాను), గుణైః= జ్ఞానాది కల్యాణగుణాలచే (దారాలచే), స్థిరతరం= దృఢంగా ఉండునట్లు, స్త్యానలగ్నా= సంబంధం కలిగినదానివిగాను (బాగుగా బంధింపబడినదిగాను), పరిగతవృషశైలం= వేంకటాద్రిని చేరియున్న, పారం= గట్టువలెనున్న శ్రీనివాసుని (గట్టును), ఆరోపయన్తీ= పొందింపజేయుదానివిగా ఉన్న (పొందింపజేయునదిగానున్న), త్వం= నీవు, భవజలధిగతానాం= సంసారసముద్రంలో మునిగి ఉన్నవారికి, పోతపాత్రీ= నావగా, భవిత్రీ= అవుతున్నావు.

**అవ :** కింది శ్లోకంలో భగవద్దివ్యదేశవాసం పొందినవారి విషయంలో దయాదేవి ఒనరించే ఉపకారం ప్రస్తావించబడింది. ఈ శోక్లంలో సంసారసాగరంలో పడి ఉన్న అందరి విషయాలలోను ఆమె చేస్తున్న హితం నిరూపింపబడుతున్నది.

**తా :** పెద్దలు చెప్పినట్లు శ్రీనివాసుడు ఒక నావగా కవి చిత్రిస్తున్నారు. వివిధ తరంగాలచేత, భీకర జలచరాలచేత నిండి ఉన్న మహాసముద్రాన్ని ఓడచే దాటదలచిన యెడల, ఆ ఓడ సముద్రమార్గజ్ఞులైన, ఓడయొక్క శక్తిని ఎరిగినవారు అగు నావికులచే నడుపబడాలి. ఆ నావికులు తీసికొనిపోయిన స్థలంలోనే ఓడ, ఓడలోని ప్రయాణీకులు చేరతారు. దృఢమైన దారాలతో



ఆ నావ గట్టిగా కట్టబడి ఉండాలి. లేనిచో అభీష్టస్థలప్రాప్తి కలుగదు. అట్టి ఓడను అధిరోహించినవారే గట్టుకు చేరగలుగుతారు. అలాగే దయ ఇక్కడ ఒక నావ అవుతున్నది. ఆచార్యుల వారు తీసికొనిపోయిన చోటికే ఈ నావ వెళుతుంది. ఎప్పుడు ఎక్కడికి ఎలా తీసికొనిపోవాలనే సమస్త విషయాలు తెలిసినవారు వారే. భగీరథమార్గాన్ని గంగ అనుసరించినట్లు ఆచార్యులమార్గాన్ని దయ అనుసరిస్తున్నది. నావికుని అనుమతిలేనిచో నావ ఎలా స్థలం ఇవ్వదో అలాగే ఆచార్యుని అనుగ్రహంలేకుంటే దయ ఎట్టి ప్రాణిని కూడా విషయీకరింపనేరదు. అనగా దయాదేవి ఆచార్యులద్వారా మాత్రమే మనలను కాపాడుతున్నది. మరియు భగవానునియొక్క జ్ఞానబలైశ్వర్యాది కల్యాణగుణాలు అనే దారాలచే దయ చక్కగా కట్టబడి ఉన్నది. అనగా ఆ సమస్తగుణాలను తనకు ఉపకరణాలుగా చేసుకొని, వాటితో పూర్ణసంబంధం పొంది, తాను చేయుపనులలో వాటిని సహాయభూతాలుగా చేసుకొని ఉన్నదని భావం.

ఈ దయానావ కొంక వైలక్షణ్యం ఉంది. అన్ని ఓడలు నిమ్న ప్రదేశాలకేగి తీరం చేరతాయి. అలాకాకుండా ఈ ఓడ ఉన్నతప్రదేశంలో ఉన్న (కొండపైన ఉన్న) గట్టును (శ్రీనివాసుని) పొంది తనలో ఉన్న ప్రపన్నులు అనే ప్రయాణీకులను పొందజేస్తున్నది. కావున దయను నావగా చిత్రించడం ఎంతో సమంజసంగా ఉంది.

యదృచ్ఛాసుకృతాదులచే సదాచార్య సంబంధం ఏర్పడి, ఆ ఆచార్యులచే భగవద్దయకు విషయీభావాన్ని భజింపజేయబడిన సంసారి జీవులు ఆ దయాదేవి అనుగ్రహంవల్ల సంసారసాగరాన్ని దాటి గట్టుగా రూపింపబడిన పరమపురుషుని (శ్రీనివాసుని) పొందుతున్నారు. “అనుచరశక్త్యాది గుణాం” అని పదుకొండవ శ్లోకంలో చెప్పినట్లు “ఈ దయకు మిగిలిన భగవద్గుణాలు సహాయంచేసి ఈమె చేసే పనిలో అనుకూలంగా వ్యవహరిస్తూ ఉన్నాయి” అనే శాస్త్రార్థం ఇక్కడ వివక్షితం.

"స్థిరతర" మనే స్థలంలో "స్థిరచర" మనే పాఠం కనిపిస్తున్నది. ఓడ దృఢంగాను, చలించేదిగాను ఉండాలి. ఈ రెండింట ఏది లేకపోయినా ఓడవలన ప్రయోజనం ఉండదనే రసవంతమగు అర్థం "స్థిరచర" మనే పాఠంచేత గ్రహింపదగి ఉంది.

**శ్లో॥ పరిమితఫల సంగాత్ప్రాణినః కింపచానాః**
**నిగమవిపణిమధ్యే నిత్యముక్తానుషక్తమ్ ।**
**ప్రసదనమనుకంపే! ప్రాప్తవత్యా భవత్యా**
**వృషగిరిహరినీలం వ్యంజితం నిర్విశన్తి ॥ 39**

**ప్రతి :** హే అనుకంపే= ఓ దయాదేవీ!, పరిమితఫలసంగాత్= మిక్కిలి పరిమితములగు ఫలములయందలి ఆశచే, కింపచానాః= క్షుద్రులైన, ప్రాణినః= ప్రాణులు, ప్రసదనమ్= అనుగ్రహాన్ని, ప్రాప్తవత్యా= పొందియున్న, భవత్యా= నీచే, వ్యంజితం= చూపింపబడింది, నిత్యముక్తానుషక్తమ్= నిత్యులతోను ముక్తులతోను కూడినదిగా ఉన్న (ఎల్లప్పుడూ ముత్యాలతో కూడినదిగానున్న), వృషగిరిహరినీలమ్= వేంకటాద్రిలో ఉదయమందిన ఇంద్రనీలమణివంటి శ్రీనివాసుని (శ్రీనివాసునివలె ఉన్న ఇంద్రనీలమణిని), నిగమవిపణిమధ్యే= వేదమను అంగడివీధి మధ్యలో (పట్టణంలోని అంగడివీధిలో), నిర్విశన్తి= అనుభవిస్తున్నారు.

**అవ :** కింది శ్లోకంలో ముముక్షువులగు సంసారుల విషయంలో దయాదేవి ఆచార్యులచే ప్రదర్శింపబడిన త్రోవలో ప్రవేశించి ఆ సంసారులను సంసార సాగరంనుండి గట్టుకు చేర్చే విధం ప్రకారం వర్ణింపబడింది. ఈ శ్లోకంలో బుభుక్షువులగు అనగా మోక్షేతరాలైన క్షుద్ర పురుషార్థాలను అభిలషించే సంసారుల విషయంలో దయాదేవియొక్క అనుగ్రహప్రకారం వివరింప బడుతున్నది.



**తా :** ఆచార్యులీ శ్లోకంలో అత్యద్భుతమైన చిత్రమును చూపారు. విశిష్టాద్వైతసిద్ధాంతాన్ని, "ఉదారాః సర్వ ఏవైతే" అనే గీతావాక్యాన్ని అనుసరించి ఈ చిత్రాన్ని భావించాలి.

సర్వవిద్యా పారంగతుడు, సర్వాంగసుందరుడు, సర్వకల్యాణ గుణోపేతుడు, పరమదయాళువు, సర్వదేశాధిపతి అయిన సార్వభౌముడు, వివాహార్హ తరుణవయస్కుడు అగు ఒకమహారాజు తనదేశంలోని ప్రజలయొక్క చిత్తవృత్తులను పరిశీలింపగోరి స్వసమవయస్కులైన సుహృన్మంత్రులతో కలిసి ఒక సంవిధానం ఏర్పరచాడు. అతడు రాజధానిలో ఒక మహావిపణివీధి (అంగడివీధి)ని నిర్మించాడు. అక్కడ అతిక్షుద్రములైన శిలామయ పరికరాలు (తిఱుగలి, రుబ్బుడురాయి) మొదలుకొని మహార్ఘములైన వజ్రవైడూర్యాది నవరత్నపర్యంతం సమస్త వస్తుజాతాన్ని ఉత్తరోత్తరం ఉత్కృష్టాలుగా ఉండే విధంగా సమాయత్తపరచాడు. అందు ప్రథమాపణంలో శిలామయ పరికరాలు, ద్వితీయాపణంలో అయఃపరికరాలు (ఇనుము), తృతీయా పణంలో ఇత్తడిపాత్రాదులు, తదనంతరం కంచు, పిమ్మట రాగి, తరువాత వెండి, తదుపరి స్వర్ణం, పీతాంబరాదులు, అటుపై వజ్రవైడూర్యాది నవరత్నాలు ఉండునట్లు అంగడులను ఏర్పరచాడు. ఈ విధమైన సంవిధానమంతా పూర్తిచేసి స్వదేశజనులకు తన అభిప్రాయాన్ని ఇలా ప్రకటించాడు. "జాతిమత స్త్రీ పురుష వ్యత్యాసాలు లేకుండా సర్వజనులు ఈ అంగడివీధిలో క్రమక్రమంగా ప్రవేశించి వాళ్లకు ఇష్టమైన ఏదైన ఒక వస్తువును మూల్యం లేకనే తీసుకోవచ్చు. విపణివీధి తూర్పు పడమరలుగా ఏర్పడి ఉంది. కావున తూర్పు ద్వారంలో ప్రవేశించి తమ కభీష్టమైన వస్తువును స్వీకరించి పడమర ద్వారంగుండా వెడలిపోవాలి. ప్రవేశించినవాడు ఏమీ తీసుకోకుండా రిక్తహస్తుడుగా వెళ్లకూడదు". ఇట్లు చాటింపించి ఉద్దిష్టమైన రోజున అంగడివీధి తెరచి తాను కూడా ఆ అంగడివీధిలోనే సర్వాలంకారోపేతమగు కడపటిమండపంలో స్వసుహృన్మంత్రులతో కలసి ప్రజల ప్రవృత్తిని, వారి కోలాహలాన్ని చూస్తూ కూర్చున్నాడు.

పిమ్మట ప్రప్రథమంగా ఒక గ్రామీణుడు విపణివీధిలో ప్రవేశించాడు. ప్రథమాపణంలో పాషాణమయ పదార్థాలను చూచి తత్సౌష్ఠవంచేత ఆకర్షింపబడిన మనస్సుగలవాడై తన ఇంటిలో ఆ వస్తువు లేనందున అతిక్షుద్రం, స్వల్పమూల్యం కలిగి మిక్కిలి బరువుగా ఉండిన ఒక తిరుగలిరాయిని తీసి భుజముపై పెట్టుకొని బయలుదేరాడు. వాడు ఇనుము సామానుగల ద్వితీయాపణంనుండి నవరత్నపూరితమైన కడపటి అంగడివరకు వెళ్ళి ఆ పశ్చిమ ద్వారంనుండియే వెళ్లవలసినవాడు కావున కడపటి అంగడివరకు వెళ్లి ఒక్కొక్క అంగడిలోనూ ఉండే ఉత్తరోత్తరం ఉత్కృష్టాలైన పదార్థజాతం వానికి దృగ్గోచరమవుతుండగా ఒక్కొక్క అంగడిని దాటిపోవునప్పుడు ''అయ్యో! ఇది తీసికోకుండాపోయానే! అది తీసికోకుండాపోయానే! అతిస్వల్పం, మిక్కిలి బరువు అయిన మహాపాషాణం తీసుకొంటినే. నవరత్నాలు తీసుకోవడానికి కూడా ఏమీ ఆటంకం లేదుగదా! నా దౌర్భాగ్యంవలన రెండవ అంగడినికూడా చూడగలిగే ఓర్పులేకుండా అన్యాయంగా చెడిపోయానే?" అని బాధపడుతూ తనను చూస్తున్న మధ్యస్థులకు కూడా హస్యాన్నో, నిర్వేదాన్నో కలిగిస్తూ పశ్చిమద్వారం దాటి వెడలిపోయాడు. తరువాత అతనికంటె కొంచం ఓర్పుగల మరొక వ్యక్తి అంగడివీధిలో ప్రవేశించాడు. వాడుకూడా ప్రథమాపణస్థమైన పాషాణపదార్థాలచే సమాకృష్ట హృదయుడయ్యాడుకాని ద్వితీయాపణంలో "ఏమున్నదో చూద్దా"మని ఓర్పుతో ప్రథమాపణం దాటి ద్వితీయాపణానికి వచ్చాడు. అక్కడ ఉన్న వస్తువులు పాషాణంవంటి ప్రథమాపణస్థిత వస్తువుకంటె అధికమూల్యం గలిగినవి గావున, ఆ వస్తువులు తనకవసరమై ఉండడంచేత, దానినిదాటి పై అంగడులలో ఏమి ఉందో చూడడానికి కావలసిన ఓర్పులేనందున ఒక పెద్ద గడ్డపారను తీసికొని బయలుదేరాడు. ఇతడుకూడా పైపై విపణులలో ఉంచబడిన ఉత్తమోత్తమ పదార్థాలను చూచినపుడు మొదటివాడనుభవించిన మనోవేదనను అనుభవించి



వెడలిపోయాడు. ఇలాగే పలువురు తాము తాము ప్రవేశించినపుడు కించిత్కించిత్క్షమాధిక్యంవలన, ఒకడు ఇత్తడి, మరొకడు కంచు, వేరొకడు రాగి, తదితరులు వెండి మొదలగు పాత్రసామానులను కొనిపోయారు. వారందరూ స్వస్వీకృతపదార్థంకంటె ఉత్తమపదార్థాన్ని చూచినపుడు మితిలేని మనోవ్యథను అనుభవిస్తూనే వెళ్లారు. ఇలా నవరత్నాపణం వరకు రాగలిగిన వ్యక్తి దొరకనేలేదు.

ఇట్లుండగా సర్వాంగసుందరి, సకలకళానిష్ణాత, స్పృహణీయతమ, సర్వాత్మగుణోపేత, అతిమేధావిని, సర్వశాస్త్రార్థపారంగత, మహాపతివ్రతా లక్షణోపేత, సర్వలోక సార్వభౌమునికి పట్టమహిషి కావడానికి తగిన చిహ్నాలు, అర్హత కలిగిన అనవద్య యౌవనోపేత అయిన ఒక రాచకన్యక తద్విపణివీధిలో ప్రవేశించింది. ఆమె కూడా రాజుగారేర్పరచిన నియమాలన్నిటిని తెలుసుకొన్నది. పరమ క్షమారూపిణి అయిన ఆ కన్య ప్రథమాపణం వీడి ఒక్కొక్క ఆపణంలో ఉందు వస్తువులను చూస్తూ అలక్ష్యభావంతో దాటిపోతున్నది. నవరత్నాపణాన్ని కూడా ఆమె నిర్లక్ష్యంతో దాటిపోతూ ఉంటే ఆమెను చూచినవారు "ప్రవేశించిన ప్రతివ్యక్తి ఒక్కొక్క వస్తువును తీసికొని పోవాలనే నియమమీమెకు తెలియదో? లేక ఉన్మత్తయో? కడపటి అంగడినిగూడ దాటిపోతున్నదే? అని విస్మయ పడ్డారు. ఆమె నేరుగా సుహృన్మిత్రులతో మహారాజు కూర్చున్న కడపటి మండపానికేగి మిగుల ధైర్యంతో సోపానాలెక్కి సింహాసనోపవిష్టుండగు సార్వభౌముని భుజముమీద చేయివైచి విపణివీధిలో నేను అభిలషించు వస్తువు మీరే! ఈ విపణివీధిలో ఉంచబడిన యే వస్తువునైనను, ఎవరైనను గ్రహించ వచ్చును అని కదా మీ ప్రకటన. మీరును ఈ విపణీవీధిలోగల వస్తువులలో అంతర్భూతులేగదా! కనుక పరిశుద్ధకన్యనై సమస్త విషయాలలో తమకు పట్టమహిషి అగుటకు యోగ్యత కలిగిన నేను మిమ్ములనే నాయకునిగా వరించుటలో మీ రేర్పరచిన నియమానికి ఎలాంటి విరోధం లేదుగదా! కావున నేను పరిపూర్ణ భావశుద్ధితో

మిమ్మలను వరించుటచే కృపజేసి నన్ను మీరు పరిగ్రహింపవలసినది" అని ఆ కన్య ప్రార్థించింది. అప్పుడు ఆ రాజు, తత్సుహృన్మిత్రాదులు ఆమెయొక్క సౌందర్యం, గుణం, శాస్త్రజ్ఞత, వాక్చాతుర్యం మొదలైనవాటిని గమనించి పరమాశ్చర్యం పొంది సమీచీనమైన ఆమె మాటకు ఆటంకం చెప్పడానికి వీలులేనివారైనారు. తదుపరి ఆ సార్వభౌముడు ఆమెను పట్టమహిషిగా స్వీకరించాడు.

ఇపుడు ఆ అంగడివీధిలోగల పాషాణమయ పరికరాలు మొదలుకొని నవరత్నపర్యన్తమైన సమస్తవస్తుజాతాన్ని రాజమహిషియగు ఆమెకు యథేచ్ఛానుభవ వినియోగాదులకు అర్హములేగదా! గ్రామీణులవలె ఈమెయు ఏదైనా ఒక వస్తువును గ్రహించిఉండినయెడల అది ఒక్కటే ఆమెకు స్వకీయమైన వస్తువయి ఉండేది గదా!

ఇట్లాకన్యక సర్వాపణాలను దాటి సార్వభౌముని వరించుటకు హేతువేమనగా, ఆమెకు సార్వభౌమిగా ఉండుటకు తగిన లక్షణాలు ఉండడం తిలకించిన పరమ దయావంతులు, సార్వభౌమునికి అంతరంగులు, ఆ అంగడివీధియొక్క స్వరూపం తెలిసిన కొందరు మహాపురుషులయొక్క ఉపదేశమే. ఈ విధంగా ఆ మహనీయుల ఉపదేశంవలన ఆ కన్య ఆ సార్వభౌముని తనకు ప్రియభర్తగా పొంది స్వవిభ్రమవిలాసాదులచే స్వాధీనపతికయై చిరకాలం సంపూర్ణానందం అనుభవించింది.

సర్వవిశిష్టాద్వైత సిద్ధాంతసార ప్రదర్శకమగు ఈ చిత్రాన్ని ఆచార్యులీ శ్లోకంలో చిత్రించారు.

వేదమనేది ఒక విశాలమైన విపణివీధి. అక్కడ లభించని వస్తువు లేనేలేదు. సమస్త పురుషార్థోపలబ్ధికి కావలసిన ఉపాయాలు అక్కడ నిరూపింపబడి ఉన్నాయి. ఆవేదవీధిలోనే కడపట వేదాన్త (ఉపనిషత్తులు) మనే మంటపంలో నిత్యముక్తులతో, సుహృత్తులతోకూడి పరమపురుషుడగు



సార్వభౌముడు కూర్చొని ఉన్నాడు. అతనిని పతిగా పొంది వాని పాదారవిందకైంకర్యం ఆచరించి మోక్షానందం పొందడానికి సర్వజీవరాసులకు యోగ్యత ఉంది. ఐనా కొందరు క్షుద్రులు స్వకర్మప్రాబల్యంతో ఆ వేదవీధిలో ప్రవేశించునపుడు పరిమిత ఫలాలను (స్వరూప స్వభావాలచే పరిమితాలు) చూచి వాటినే పొంది పునః పునః సంసారగర్తంలో పడిపోతున్నారు. ఈ పరిమిత ఫలసంగులైన కొన్ని ప్రాణులపై యదృచ్ఛాది సుకృతాలవలన శ్రీనివాసుని దయయొక్క అనుగ్రహం ప్రసరించి (దయావతారులగు సదాచార్యుల ఉపదేశానుగ్రహాదులు సంభవించినప్పుడు) నప్పుడు ఆ ప్రాణులు క్షుద్రఫలాలపై విరక్తి కలిగి వేదాన్తంలో విరాజమానుడగు హరినీలరూపుడైన శ్రీనివాసపరబ్రహ్మాన్ని నిత్యముక్తులతో సహా తాము అనుభవించి సంసారబంధంనుండి విముక్తులవుతున్నారు. ఇలా వీరు మోక్షం పొందడానికి ఈ దయాదేవి అనుగ్రహమే కారణం. విశిష్టాద్వైత సంప్రదాయంలో పరమపురుషునికి, జీవునికి నాయికానాయక భావంతో అనుభవం కలుగుట ప్రసిద్ధమే. కావున పైన చూపిన చిత్రంలో ఉన్న సర్వాంశాలూ ప్రకృతార్థంలో సమన్వయ పరచుకోవడం సహృదయులకు సులభమే కనుక దీనికంటె విస్తరం చేయలేదు.

ఈ శ్లోకంలో ఈ దశకార్థమైన దివ్యదేశ ప్రభావం సూచింపబడింది. ఈ పర్వతాన్ని పొందినవారికే ఈ పురుషార్థం సిద్ధించునని చెప్పబడింది.

**శ్లో॥ త్వయి బహుమతిహీనః శ్రీనివాసానుకంపే!**
**జగతి గతిమిహాన్యాం దేవి సమ్మన్యతే యః ।**
**స ఖలు విబుధసింధౌ సన్నికర్షే వహన్త్యాం**
**శమయితి మృగతృష్ణావీచికాభిః పిపాసామ్ ॥ 40**

**ప్రతి :** హే దేవీ! శ్రీనివాసానుకంపే!= ఓ శ్రీనివాసుని దయాదేవీ!, ఇహ జగతి= ఈ లోకంలో, యః= ఎవడు, త్వయి= నీయందు, బహుమతిహీనః (సన్)= గౌరవబుద్ధిలేనివాడై, అన్యాం గతిమ్= వేరుగతిని, సమ్మన్యతే=

బహుమానిస్తున్నాడో, సః= వాడు, విబుధసింధౌ= గంగానది, సన్నికర్షే= సమీపమందు, వహన్త్యాం (సత్యాం)= ప్రవహిస్తుండగా, మృగతృష్ణావీచికాభిః = ఎండమావుల అలలచేత, పిపాసాం= దప్పికను, శమయతి ఖలు= శమింపజేసుకొనుచున్నాడుగదా!

**అవ :** కింది శ్లోకంలో బుభుక్షుముముక్షువులనబడు సమస్త చేతనుల విషయాలలో దయాదేవిచేయు అనుగ్రహప్రకారం వర్ణింపబడింది. ఈ శ్లోకంలో ఇలా పరహిత ప్రావీణ్యమే స్వరూపంగాకల దయాదేవియందు ఎవడు గౌరవభావం ప్రదర్శించడో, వాని దుర్గతిని 'నిరూపించి' ఈ దశకాన్ని పూర్తిచేసి అలవాటు ప్రకారం పై దశకాన్నికూడా అవతరింపజేస్తున్నారు.

**తా :** ఎవడు ఏ ఫలం అభిలషించి ఏ ఉపాయంతో ఎవనిదగ్గర అనుష్ఠించినా వాడా ఫలాన్ని భగవానుని కృపచేతనే పొందాలి. "యస్య ప్రసాదే సతతం ప్రసీదేయురిమాః ప్రజాః" అని అభియుక్తోక్తి. "లభతే హి తతః కామన్ మయైవ విహితాన్హితాన్" అని భగవానుడు గీతలో ప్రవచించాడు. ఇలా సామాన్యమైన ఐహికాముష్మిక ఫలాలను ఆ యా దేవతలు ప్రసాదించడం భగవంతుని దయచేతనే అని తెల్లమవుతుండగా ఇతరదేవతలకు కించిన్మాత్రం కూడా సంబంధమేలేని మోక్షమనే ఫలమునందు భగవద్దయకు ఎంత అవసరముందో ప్రతిపాదింపనవసరం లేదు. భక్తిమార్గాన్నో, ప్రపత్తిమార్గాన్నో అవలంబించిన అందరూ "ప్రపన్నా దన్యేషాం న దిశతి ముకుందో నిజపదమ్" అను రీతిగా భగవత్ప్రసన్నుడై తద్దయను అవలంబించియే తీరాలి. తత్త్వస్థితి ఇలా ఉండగా ఎవడు శ్రీనివాసుడను పరమపురుషుని దయయందు బహుమానం లేనివాడై ("ఈ భగవంతుని దయయే నన్ను సర్వవిధాపత్తుల నుండి కాపాడగలిగియున్నది" అను జ్ఞానంలేక) దేవతాంతరాలను ఆశ్రయించి తద్దయను అవలంబిస్తున్నాడో, వాడు తనకు చాల సమీపంలో ప్రవహించునది, బాహ్యాభ్యంతర తాపశమనం కల్గించునది, పరమ భోగ్యమైనది అగు గంగానదిని అనాదరించి తీవ్రమగు ఆతపంలో జలతరంగ



ప్రతీతిని కలిగిస్తున్న ఎండమావులచే అత్యధికమైన తన దప్పికను పోగొట్టుకోవడానికి అభిలషించు మూఢునితో సమానుడని భగవద్దయా వలంబినిని చూసి పరిహసించు విధంగా వాస్తవికంగా ఆచార్యులు అనుతాపం పొందుతున్నారు.

భగవద్దయాదేవికి, గంగాదేవికి బహువిధాలలో సామ్యం ఉంది. వారిరువురు భగవత్పాదారవిందంలో ఉద్భవించినవారు. సర్వపాపాలను అపహరించుటయందు శక్తిగలవారు. ఆశ్రయించే సమయంలోనే పరమభోగ్యంగా ఉండువారు. కావున ఆచార్యులకు అనేక సందర్భాలలో భగవద్దయను గంగాదేవిగా చిత్రించడం అలవాటు.

"సన్నికర్షే వహన్త్యాం" అనుటచే ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా ఆశ్రితులను కాపాడు విషయంలో భగవద్దయ ఎంతో జాగరూకంగా ఉన్నదను శాస్త్రార్థం స్ఫుటమవుతున్నది.

పిపాసాపీడితుడు గంగ నుపేక్షించి మరీచికలుండే ప్రదేశానికి వెళితే వాని దప్పిక తీరక పోవుటయేగాక ఎండలో ఎంతో దూరం పరుగిడుటచే పూర్వముండిన తాపం శతగుణితమై వాడు అధిక్రశమకు గురి అవుతాడు. అటులనే దేవతాంతరం పొందువాని విషయంలో కూడా సంసారతాప మధికమగునేగాక శమము నొందదను తత్త్వస్థితి ఇక్కడ స్పష్టమవుతున్నది.

పై దశకంలో చతుర్ముఖ బ్రహ్మపదపర్యంతమైన సర్వవిధైశ్వర్యాలు నిష్ప్రయోజనాలని ఎరిగిన సమర్థులు శ్రీనివాసునిదయనే శరణంగా అవలంబిస్తున్నారని విశదీకరింపనున్న అర్థం ఈ దశకాంత్యశ్లోకంలో వ్యతిరేకముఖంగా అవతరింపజేశారు.

***చతుర్థదశకం సమాప్తం***

***శ్రీమతే నిగమాన్త మహాదేశికాయ నమః***

# పంచమ దశకం

**శ్లో॥ ఆజ్ఞాం ఖ్యాతిం ధనమనుచరానాధిరాజ్యాదికం వా**
**కాలే దృష్ట్వా కమలవసతేరప్యకించిత్కరాణి ।**
**పద్మాకాన్తం ప్రణిహితవతీం పాలనేఽనన్యసాధ్యే**
**సారాభిజ్ఞా జగతి కృతినః సంశ్రయన్తే దయే త్వామ్ ॥ 41**

**ప్రతి :** హే దయే! = ఓ దయాదేవీ!, జగతి= లోకంలో, సారాభిజ్ఞాః= సారము నెరిగిన, కృతినః= సమర్థులు (ఆళ్వార్లు), కమలవసతేరపి= చతుర్ముఖునియొక్క, ఆజ్ఞాం= ఆజ్ఞను, ఖ్యాతిం= ప్రఖ్యాతిని, ధనం= ఐశ్వర్యాన్ని, అనుచరాన్= కింకరులను, ఆధిరాజ్యాదికం వా= సార్వభౌమత్వాదులనుకూడా, కాలే= సమయ విశేషమందు, అకించిత్కరాణి= కార్యకరములు కానివిగా, దృష్ట్వా= తెలుసుకొని, అనన్యసాధ్యే= ఇతరులకు సాధ్యంకాని, పాలనే= రక్షణ వ్యాపారమందు, పద్మాకాన్తం= శ్రియఃపతియగు శ్రీనివాసుని, ప్రణిహితవతీమ్= నియమించుచున్న, త్వాం= నిన్ను, సంశ్రయన్తే= ఆశ్రయిస్తున్నారు.

**అవ :** గత దశకాంతంలో శ్రీనివాసదయోత్కర్షం, ఇతర దయానికర్షం ప్రస్తావింపబడినాయి. ఈ దశకంలో కులశేఖరాళ్వారు మొదలగు మహనీయుల శ్రీసూక్తిని అనుభవపరీవాహరూపంగా వారు చెప్పిన పద్ధతిని అవలంబించి ఆ దయోత్కర్షం ప్రతిపాదింపబడుతున్నది. పూర్వదశకంలో తిరుమలలో నివాస మభిలషింపబడింది. ఈ దశకంలో తిరుమలయందలి పుట్టుక ప్రార్థింపబడుతున్నది. కింది శ్లోకంలో ఇతరదయావలంబుల దుర్గతి వర్ణింపబడింది. ఈ శ్లోకంలో శ్రీనివాసదయావలంబులు సారజ్ఞులని, సమర్థులని, భాగ్యవంతులని పొగడబడుతున్నారు.

**తా :** లోకంలో సారం తెలిసినవారు కావడంచేత భాగ్యవంతులుగా వ్యవహరింపబడే ఆళ్వార్లబోటివారలు శ్రీనివాసదయనే శరణంగా



పొందుతున్నారు. వీరికి పరమ ప్రాప్యం ఆ దయాదేవియే. పురుషకారభూతయగు మహాలక్ష్మితో కూడిన పరమపురుషుని చేతన సంరక్షణమందు సర్వదా ప్రేరేపిస్తున్న ఆ దయాదేవిని వదలి మరియొక వ్యక్తిని ఆశ్రయించినవారికి ఆపేక్షితపాలనం లభించదు.

**"న హి పాలనసామర్థ్యం ఋతే సర్వేశ్వరం హరిమ్"** అని,

**"న సంపదాం సమాహారే విపదాం వినివర్తనే ।**
**సమర్థో దృశ్యతే కశ్చిత్తం వినా పురుషోత్తమమ్ ॥"**

అని ప్రమాణాలు చెపుతున్న ప్రకారం సామాన్యంగా లౌకికపాలనమే సర్వేశ్వరుడగు శ్రీనివాసుని అధీనమని నిర్ణయింపబడినప్పుడు పాలనశబ్దానికి ముఖ్యార్థమగు మోక్ష ప్రదానమనే ప్రధానపాలనం పరమపురుషునికి తప్ప మరొకవ్యక్తికి మనస్సులోకూడా తలచుటకు వీలులేదు. కావున ఆ ఆళ్వార్ల వంటివారు, పెద్ద పెద్ద పదవులయందధికారం వహించు బ్రహ్మ రుద్రేంద్రాదులకు కూడా ఒక కాలవిశేషమందు (వారి పుణ్యం పూర్తియగు సమయం మొదలగు కాలాలయందు) పూర్వంలో ఉన్న ఆజ్ఞ, యశస్సు, ధనం, అనుచరులు, అధిరాజ్యసంపద మొదలైనవి కొద్దిగా కూడా కార్యకరాలు కాకుండుటయేగాక విపరీతోపద్రవాలనుగూడ కలుగచేయురీతిని అనేకవ్యక్తులయందు జూచి, ఆ పదవులలోగల దోషాలను పరిశీలించి, అట్టి దోషాలకు కించిత్తు గూడ అవకాశం లేకుండునట్లు పరమపురుషుని దయను ఉపాయంగాను, ఉపేయంగాను పొందుతున్నారు. ముముక్షువులగు పరమైకాంతులకు ప్రధాన ప్రాప్యం భగవన్ముఖోల్లాసమే (భగవద్దయయే). దాని కుపాయభూతం ఆ దయయే అవుతున్నది. ఈ శాస్త్రార్థం తెలిసినవారే సారజ్ఞులు. వారే కృతులనబడు భాగ్యవంతులు. మోక్షైకవ్యగ్రులగు ఆళ్వార్లు ఈ గోష్ఠిలో చేరినవారే. ఇట్లు భగవద్దయావలంబులను ఇక్కడ పొగడుటచే భగవద్దయకుగల ఉత్కర్ష ప్రతిపాదింపబడినట్లవుతున్నది.

**శ్లో॥ ప్రాజాపత్యప్రభృతివిభవం ప్రేక్ష్య పర్యాయదుఃఖం**
**జన్మాకాంక్షన్ వృషగిరివనే జగ్ముషాం తస్థుషాం వా ।**
**ఆశాసానాః కతిచన విభోః త్వత్పరిష్వంగధన్యైః**
**అంగీకారం క్షణమపి దయే హార్దతుంగైరపాంగైః ॥ 42**

**ప్రతి :** హే దయే!= ఓ దయాదేవీ!, కతిచన= కొందరు మహనీయులు (కులశేఖరాళ్వార్ల వంటివారు), ప్రాజాపత్యప్రభృతివిభవం= చతుర్ముఖైశ్వర్యాది సర్వైశ్వర్యములను, పర్యాయదుఃఖమ్= దుఃఖసమానాలుగా (నామమాత్ర సుఖాలుగా), ప్రేక్ష్య= చక్కగా ఎరిగి, త్వత్పరిష్వంగధన్యైః= నీ ఆలింగనంచే ధన్యములైనట్టి, హార్దతుంగైః= ప్రీతిచే చాల ఉత్కృష్టములైన, విభోః= ప్రభువగు శ్రీనివాసునియొక్క అపాంగైః= కటాక్షములచే, క్షణమపి= ఒక క్షణకాలమైన, అంగీకారం= స్వీకారమును, ఆశాసానాః= అభిలషిస్తున్నవారై, వృషగిరివనే= వృషాద్రి వనంలో, జగ్ముషాం= జంగమ వస్తువులయొక్కగాని, తస్థుషాం వా= స్థావర వస్తువులయొక్కగాని, జన్మ= పుట్టుకను, ఆకాంక్షన్= కోరినారు.

**అవ :** కింది శ్లోకంలో చతుర్ముఖపదవి పర్యంతమైన సర్వైశ్వర్యాలు నశ్వరాలు కాబట్టి వాటిని ఉపేక్షించి శ్రీనివాసుని దయనే అవలంబించు మోక్షాపేక్షులయొక్క ప్రభావం వర్ణింపబడింది. ఈ శ్లోకంలో ఆ మోక్షాన్ని కూడా అపేక్షింపక ఈ తిరుమలయందు శ్రీనివాసునియొక్క ఏకక్షణకాలికమైన కటాక్షానికి ఆశపడి జంగమంగాను, స్థావరంగాను జన్మనుకోరిన పరమ మహనీయులగు కులశేఖరాళ్వార్లవంటి వారియొక్క ప్రభావం కీర్తింపబడుతున్నది.

**తా :** కులశేఖరాళ్వార్లు "ఊనేరు శెల్వమ్" అను దశకంలో వృషాద్రివనంలో జంగమజన్మాన్ని మొదట ప్రార్థించి, తదనంతరం ఆ జన్మలో ఒకవేళ భగవానుని వదలిపోవుట సంభవించునేమో అనే సందేహంతో తుదకు చలనరహితమైన స్థావర జన్మాన్ని ప్రార్థించారు. ఇట్లు ప్రార్థించడానికి



కారణం ఆ పరమపురుషుని పరిపూర్ణ కృపాభరితమైన కటాక్షం తనమీద ప్రసరించాలన్న ఆశయే. అట్టి పరమపురుషుని కటాక్షానికి విషయ మగుటకంటె వేరొక ఉత్తమపురుషార్థం లేదని వారి ఆశయం. ఆ కులశేఖరాళ్వార్లయొక్క ఆశయాన్ని అలాగే వర్ణించి తద్ద్వారా దయ నిచ్చుట నుతిస్తున్నారు. గతశ్లోక ప్రతిపాదిత రీతిగా చతుర్ముఖైశ్వర్య పర్యంతాలైన సర్వైశ్వర్యాలు చూచుటకు ఆపాతతః సుఖాలవలె తోచినా, తుదకు అవి దుఃఖాలనడం నిస్సంశయం. ఇది శాస్త్రజ్ఞులకు చక్కగా తెలుసు. కనుక వాటిని ఉపేక్షించి అర్చావతారమందలి ఆభిరూప్యానుభవంతో విశేషాభిలాషచే మోక్షాన్ని కూడా ప్రార్థింపక ఈ తిరుమలలో "ఎంబెరుమాన్ పొన్మలైమేల్, ఏదేను మావేనే" (శ్రీనివాసునియొక్క పర్వతశ్రేష్ఠంమీద ఏదైనా ఒక వస్తువుగా జనించెదనా!) అని "పడియాయ్క్కిడందు ఉన్ పవళవాయ్ క్కాణ్బేనో" (మెట్టుగానైనా ఉండి త్వత్పల్లవాధరాన్ని సేవించెదనా!) అని ఒక జన్మను ప్రార్థించారు. ఈ జన్మానికి ప్రయోజనమేమంటే ఆ పర్వతంమీద సర్వత్ర సంచరించే విభువగు శ్రీనివాసుని కటాక్షం ఒక క్షణమైనా తన మీద ప్రసరించుననుదే. ఆ కటాక్షం ప్రతి పరమాణువులోనూ దయాసంబంధం పొంది ఉంది. దయ గాఢోపగూఢమైంది. పరమపురుషుని హృదయంలో ఉండే పరమప్రీతిప్రవాహం పొంగి తత్సంశ్లిష్టమై ఉంది. ఒక వ్యక్తియొక్క హృదయంలో ఉండే దయాప్రీత్యాద్యుత్తమగుణాలను కటాక్షంలో కనిపిస్తాయి. అట్టి సర్వేశ్వరునికటాక్షం ఒక క్షణకాలం తన మీద ప్రసరించినా చాలు. దీనికై ఎన్నివేల సంవత్సరాలైనా స్థావరజంగమాది జన్మలనెత్తి పడియుండవచ్చునని ఆళ్వార్లయొక్క అభిప్రాయం. అట్టి భక్తులకే తత్కటాక్షప్రభావం గోచరమవుతుంది. తదితరులకు "లవణ వణిజః కర్పూరార్ఘం" అనే న్యాయాన్ననుసరించి దానిమహిమ దెలియదను అభిప్రాయంతో ఆళ్వార్లను "కతిచన" అనుపదముచే (మనోవాక్కుల కందని ప్రభావంకలవారుగా) నిర్దేశిస్తున్నారు. ఇట్టి జన్మాలనే ఋషులుకూడ "పత్యుః

ప్రజానామైశ్వర్యం పశూనాం వా న కామయే, అహం కదంబో భూయాసం కుందో వా యమునాతటే" అని వేడినారు. అట్లనగా ప్రజాపతి అనే చతుర్ముఖపట్టాన్నో, పశుపతి అనే రుద్రపట్టాన్నో నేను కోరుట లేదు. సాక్షాద్విశ్వపతియగు కృష్ణపరమాత్మ విహరించు యమునానదీతటంలో కదంబవృక్షంగానో, కుందవృక్షంగానో జన్మిస్తాను. అపుడు కృష్ణుని దివ్యకటాక్షం, తత్పాదస్పర్శ లభించునుగదా అని అభిప్రాయం.

కులశేఖరాళ్వార్లు నీటిలో నివసించు పక్షిమత్స్యాదులయొక్క జన్మనుకూడా కోరి ఉండడంచేత తదనుగుణంగా "వృషగిరివనే" అను శబ్దమునందు వనపదంచేత జలస్థలోభయాలు గ్రాహ్యాలు.

**శ్లో॥ నాభీపద్మస్ఫురణసుభగా నవ్యనీలోత్పలాభా**
**క్రీడాశైలం కమపి కరుణే! వృణ్వతీ వేంకటాఖ్యమ్ ।**
**శీతా నిత్యం ప్రసదనవతీ శ్రద్ధధానావగాహ్యా**
**దివ్యా కాచిజ్జయతి మహతీ దీర్ఘికా తావకీనా ॥ 43**

**ప్రతి :** హే కరుణే= ఓ దయాదేవీ!, నాభీపద్మస్ఫురణసుభగా= నాభి యందలి కమలంచే రమణీయమైనది, నవ్యనీలోత్పలాభా= నూతనమైన నల్లకలువలయొక్క కాంతిగలిగినది (సద్యో వికసితమైన నీలోత్పలంవంటి కాంతి కలిగినదియు), నిత్యం శీతా= ఎప్పుడును తేటగానున్నట్టి (అనవరతం అనుగ్రహం కల్గినట్టియు), శ్రద్ధధానావగాహ్యా= విశ్వాసవంతులకు మునుగదగినది, దివ్యా= అత్యుత్కృష్టమైనది (పరమాకాశంలో ఉండునదియు), మహతీ= మిగుల పెద్దది అగు, (అత్యుత్కృష్టమైనదియు అగు), తావకీనా= నీదైన, కాచిత్= అతివిలక్షణమైన ఒక, దీర్ఘికా= నడబావి, కమపి= విలక్షణప్రభావోపేతమైన, వేంకటాఖ్యం= వేంకటమని ప్రసిద్ధిగాంచిన, క్రీడాశైలం= క్రీడాపర్వతాన్ని, వృణ్వతీ సతీ= వరించినదై (ఆశ్రయించినదై), జయతి= సర్వోత్కృష్టంగా ప్రకాశిస్తున్నది.



**అవ :** కింది శ్లోకంలో యోగులైన మహనీయులు భగవద్దివ్యకటాక్షాభిలాషతో తిరుమలలో ఏదైనా ఒక జన్మను కోరిరని వర్ణింపబడింది. ఈ శ్లోకంనుండి అలా తిరుమలలో జన్మలాభం కలిగినవారికి పూర్వోక్తప్రకారంగా ఆ భగవానుని కటాక్షమేర్పడునట్లు, మరికొన్ని మహాలాభాలు కలుగునట్లు నిరూపింపబడుతున్నది. "యశ్చ రామం న పశ్యేత్తు యం చ రామో న పశ్యతి" అని చెప్పబడిన విధంగా భగవత్కటాక్షప్రసారం గతశ్లోకంలో ప్రస్తావింపబడింది. ఇక్కడ ఆ కటాక్షపాతంచేత ఈ పుణ్యాత్ములకు (ఈ తిరుమలలో జన్మించినవారికి) సత్వగుణం అభివృద్ధమై ఆ భగవానుని సేవించే భాగ్యం కలుగుతున్నదని నిరూపింపబడుతున్నది. ఇది ఒక మహాలాభం గదా? దివ్యమంగళ విగ్రహసేవ, దివ్యాత్మస్వరూపానుభవం, దివ్యకల్యాణగుణానుభవం అనే త్రివిధానుభవాలు ఇక్కడ క్రమంగా మూడు శ్లోకాలలో ప్రస్తావింపబడుతున్నాయి.

**తా :** శ్రీనివాసుని దివ్యమంగళవిగ్రహాన్ని ఒక పెద్దదీర్ఘికగా చిత్రిస్తున్నారు. వికసితకమలాలంకృతమైనది, సద్యోవికసిత నీలోత్పలాలచే విశిష్ట శోభగలిగినది, చాల అగాధమైనదగుటచే ఎల్లవేళల శీతలమైనట్టిది, ప్రసన్నజలపూరితమైనది, సాధువులు నిర్భయంగా దిగి స్నానపానాదుల నాచరించి సర్వవిధతాపాలను శమింపజేసికొనుటకు అనుకూలంగా ఉన్నట్టిది, మిగుల పెద్దది అగు ఒక విలక్షణమైన నడబావి ఒక విశాలపర్వతంయొక్క మధ్యలో ఉన్నట్లయితే ఎలా సర్వోత్కృష్టంగా ప్రకాశిస్తుందో, అలాగే శ్రీనివాసుని దివ్యమంగళవిగ్రహం ఉన్నదని భావం. భగవంతుని దివ్యమంగళవిగ్రహం నీలమేఘశ్యామలాకారం కాబట్టి దానిలోని నిగనిగమనే కాంతిస్రవంతి ఒక పెద్దదీర్ఘికగా గోచరిస్తున్నది. నల్ల కలువలవంటి శోభ అక్కడ కనిపిస్తుంది. చతుర్ముఖబ్రహ్మకు ఉత్పత్తిస్థానమగు వికసిత కమలం ఈ దీర్ఘిక కొక అన్యాదృశ్యమైన శోభను కలుగజేస్తున్నది. అది సదా శీతలమై ఉంది. అట్లనగా చెంగటకేగుటకు వీలుగాని

ఉష్ణగుణసంబంధం రవంతకూడా లేక సదా సౌమ్యమై ఉన్నదని అభిప్రాయం. అట్లే ఎప్పుడును ప్రసన్నమై ఉంది. అనుగ్రహైకశీలం కలిగి ఉంది. మహావిశ్వాసంగల వారు వచ్చి శరణుపొంది తమయొక్క సర్వవిధతాపాలను పోగొట్టుకోవచ్చు. మరియు పరమాకాశంలో ప్రకాశిస్తున్నది (నాభియందు చతుర్ముఖబ్రహ్మను సంభవింపజేసిన పరమపురుషుని దివ్యమంగళ విగ్రహానికి, అర్చావిగ్రహానికి అభేదంచేత ఈ విధంగా వ్యవహరింప బడుతున్నది). ఆ నడబావి సర్వోత్కృష్టమై ఉంది. అటువంటి దివ్యమంగళ విగ్రహమనే ఈ దీర్ఘిక దయాదేవికి క్రీడోపకరణమట. అనగా ఆశ్రితపాపహరణమనే దయాదేవియొక్క క్రీడకు ఇది అంతరంగసాధనమని అభిప్రాయం. ఈ విగ్రహాన్ని సందర్శించినవారికి సర్వపాపాలు తొలగిపోతాయి గదా! అట్టి ఈ దీర్ఘిక దయాదేవికి క్రీడాపర్వతంగా ఉన్న వేంకటగిరిని పొంది ఉంది. పూర్వోక్తప్రకారంగా ఈ తిరుమల దయాదేవియొక్క క్రీడోపకరణమే. తత్పర్వత నామధేయాన్నిబట్టి ఈ విషయం తెలుస్తున్నది. వేంకటమనే పదానికి "సర్వపాపాని వేం ప్రాహుః కటస్తద్దాహ ఉచ్యతే" అను పురాణవ్యుత్పత్తిని బట్టి సర్వపాపదాహకత్వమే అర్థం కావున, దయాదేవియొక్క క్రీడ సర్వపాపహారకమే అగుట చేత, ఆ క్రీడయందీపర్వతం ఉపకరణమగుటకు ఆక్షేపం లేదు గదా! శ్రీనివాసుని దివ్యమంగళవిగ్రహం, ఈ తిరుమల ఏకస్వభావోపేతాలని స్ఫురిస్తున్నది.

ఇక్కడ "వృణ్వతీ" అనే పదానికి "వివృణ్వతీ" (ప్రకాశపరస్తున్న) అనే అర్థం స్వీకరించి భగవద్దివ్యమంగళ విగ్రహకాంతి అనెడి ఒక మహాహ్రదం తన మధ్య దయాదేవికి క్రీడాపర్వతమైన తిరుమలను తేలించుకొని, దానిని ప్రకాశపరస్తున్నదను ఒక విచిత్రానుభవం ఆచార్య హృద్గతమయిందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

మరియు "దీర్ఘికా" "క్రీడాశైలం" "వృణ్వతీ" అనే పదాలయొక్క సమభివ్యాహారమహిమచేత, విశేషణాలగతిచేత ఒక ఉత్తమనాయికా నాయకులయొక్క ప్రేమపూర్వకమైన పరస్పరసంశ్లేషవృత్తాన్తమగు ఒక రహస్యార్థం ఇక్కడ ధ్వనిస్తున్నది.



**శ్లో॥ యస్మిన్ దృష్టే తదితరసుఖైర్గమ్యతే గోష్పదత్వం**
**సత్యం జ్ఞానం త్రిభిరవధిభిర్ముక్తమానందసింధుమ్ ।**
**త్వత్స్వీకారాత్తమిహ కృతినః సూరిబృందానుభావ్యం**
**నిత్యాపూర్వం నిధిమివ దయే! నిర్విశంత్యంజనాద్రౌ ॥ 44**

**ప్రతి :** హే దయే!= ఓ దయాదేవీ, యస్మిన్= ఏ పరమాత్మస్వరూపం, దృష్టే సతి= సాక్షాత్కరింపబడినది కాగా, తదితరసుఖైః= తదన్యసుఖాలచే, గోష్పదత్వం= గోష్పదత్వం (గోవుయొక్క పాదవిన్యాస ప్రదేశత్వం), ప్రాప్యతే= పొందబడుతున్నదో, సత్యం= స్వరూపస్వభావాలలో వికృతిలేనట్టి, జ్ఞానం= స్వయంప్రకాశమైనట్టి, త్రిభిః అవధిభిః ముక్తం= త్రివిధపరిచ్ఛేదరహితమైనట్టి, ఆనందసింధుమ్= ఆనందసముద్రమైనట్టి, సూరిబృందానుభావ్యమ్= నిత్యసూరిబృందాలచే అనుభవింపదగినట్టి, నిత్యాపూర్వం= సర్వకాలాలలో అపూర్వంగా ఉన్నట్టి, తం= ఆ పరమాత్మను (దివ్యాత్మస్వరూపాన్ని), త్వత్స్వీకారాత్= నీ అంగీకారంవలన, ఇహ= ఈ ప్రకృతిమండలమందే, కృతినః= భాగ్యవంతులు (సమర్థులు), నిధిమివ= నిధినివలె, అంజనాద్రౌ= అంజనపర్వత మనబడు తిరుమలయందు, నిర్విశంతి= అనుభవిస్తున్నారు.

**అవ :** గత శ్లోకంలో దివ్యమంగళవిగ్రహసేవ అనే మహాలాభం ప్రస్తావింపబడింది. ఇక్కడ తద్ద్వారా లభించే దివ్యాత్మస్వరూప సాక్షాత్కారలాభం ప్రస్తావింపబడుతున్నది.

**తా :** ఉపనిషత్ప్రతిపాదితప్రక్రియ ననుసరించి దివ్యాత్మస్వరూపానికిగల ప్రభావాన్ని తత్రత్య పదాలచేతనే ఈ శ్లోకంలో ఆచార్యులు వర్ణిస్తున్నారు. "తస్మిన్ దృష్టే పరావరే" అను రీతిగా అపరిచ్ఛిన్నానందసముద్రమైన పరమాత్మస్వరూపాన్ని దర్శించినప్పుడు అంతవరకు సుఖరూపంగా తోచిన సాంసారిక సర్వసుఖాలు (చతుర్ముఖైశ్వర్య పర్యంతమైన సర్వసుఖాలు)

సముద్రంలో గోష్పదత్వదశను పొందుతున్నాయి. ఒక గొప్ప సముద్రంలో ఉన్న నీటికి, గోవుయొక్క పదవిన్యాస స్థలంలో నిలుచు నీటికి ఎంత తారతమ్యం ఉందో, అంత తారతమ్యం పరమాత్మానందానికి తదితర సుఖాలకు ఉందని ఆ పరమాత్మ సాక్షాత్కర్తలెరుగుదురు. అట్లానంద సముద్రంగా ఆ పరమాత్మస్వరూపం ప్రకాశిస్తున్నది. మరియు అచేతన వస్తువులవలె స్వరూపంలోను, చేతనవస్తువులవలె స్వభావంలోను కొంచెం కూడా వికారం లేనిది, నిరుపాధిక స్వయంప్రకాశమైనది. అనగా తన ప్రకాశమునందు మరొక వస్తువుయొక్క సహాయం కోరనిది. దేశపరిచ్ఛేదం, కాలపరిచ్ఛేదం, వస్తుపరిచ్ఛేదం అనబడు త్రివిధ పరిచ్ఛేదాలు దానికి లేవు. ఇక్కడనే ఉండును, ఇపుడే ఉండును, ఈ వస్తువుగనే ఉండును అనేవే త్రివిధ పరిచ్ఛేదాలు. ఆ పరమాత్మస్వరూపానికి అవిలేవు. ఎక్కడనైనా ఉంటాయి. ఏకాలమందైనా ఉంటాయి. ఏ వస్తువుగానైనా ఉండవచ్చు. సర్వవస్తు స్వరూపత్వమనగా సర్వవస్తువులలోను అంతర్యామిగా ఉండడంవల్ల సర్వశబ్దాలు పరమాత్మనే చెప్పునని భావం. ఈ విషయాన్నే "సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ" అనే ఉపనిషద్వాక్యం ఉద్ఘోషిస్తున్నది. తత్రత్యానంతపద వివరణమే 'త్రిభిరవధిభిర్ముక్త' మనునది. మరియు ఆ పరమాత్మస్వరూపం నిత్యముక్త బృందాలచే అనుభవింపదగింది. ఎంతకాలం అనుభవించినా విసుగుబుట్టక అపుడే కొత్తగా చూడబడు వస్తువువలె ఒక అన్యాదృశమైన భోగ్యతను కలిగి ఉంది. ఇటువంటి ప్రభావంతో కూడిన ఆ భగవద్దివ్యాత్మ స్వరూపాన్ని అంజనాద్రియందు జన్మించిన భాగ్యవంతులు ఓ దయాదేవీ! నీ యొక్క అంగీకారంతో ఈ ప్రకృతి మండలంలోనే "అమృత ఇహ భవతి" అనే ప్రక్రియ ననుసరించి ఈ కొండయందే ఒక పెద్ద నిధినివలె అనుభవిస్తున్నారు.

త్వత్స్వీకారాత్ (నీ యొక్క అంగీకారంచే అనుభవిస్తున్నారు) అను పదానికి రెండు విధాలుగా భావం చెప్పవచ్చు. "నన్నుచేరినవారు" అను నీ



యొక్క (దయాదేవియొక్క) అనుగ్రహమనే అంగీకారాన్ని పొందినవారు భాగ్యవంతులు. కావున వారిచ్చటనే ఆ పరమాత్మ స్వరూపాన్ని అనుభవిస్తున్నారనేది ఒక పద్ధతి. ఇపుడంగీకార కర్మత్వం జీవులకుంది. రెండవ పద్ధతిలో, నీ యొక్క అంగీకారం పరమాత్మ కేర్పడుటవలన దాని నిచ్చటికి రప్పించి ఇహలోకస్థులుకూడా అనుభవించునట్లు చేస్తున్నావని అభిప్రాయం. ఈ పద్ధతిలో అంగీకార కర్మత్వం పరమాత్మ కేర్పడుతుంది. ఉపనిషత్తులు పరబ్రహ్మస్వరూపాన్ని నిధిగానే (నిధియను పదంచేతనే) వర్ణిస్తున్నాయి. ఇలాగే ఈ శ్లోకంలో సమ్యగ్దృష్టితో ఆలోచించి చూస్తే వివిధోపనిషద్వాక్యరహస్యార్థాలు నిండి ఉండడం విద్వాంసులకు గోచరమవుతుంది.

**శ్లో॥ సారం లబ్ధ్వా కమపి మహతః శ్రీనివాసాంబురాశేః**
**కాలే కాలే ఘనరసవతీ కాలికేవానుకంపే ।**
**వ్యక్తోన్మేషా మృగపతిగిరౌ విశ్వమాప్యాయయన్తీ**
**శీలోపజ్ఞం క్షరతి భవతీ శీతలం సద్గుణౌఘమ్ ॥ 45**

**ప్రతి :** హే అనుకంపే!= ఓ దయాదేవీ!, మహతః= పెద్దదియగు, శ్రీనివాసాంబురాశేః= సముద్రాలవంటి శ్రీనివాసునినుండి (శ్రీనివాసుడను సముద్రంనుండి), కమపి= విలక్షణమైన, సారం= సారాంశాన్ని (శుద్ధజలాన్ని), లబ్ధ్వా= పొంది, (అత ఏవ= కనుకనే), ఘనరసవతీ= సాంద్రసారాంశాలైన గుణాలను కలిగినదానివై (నిండిన తీర్థం కలిగినదై, మృగపతిగిరౌ= సింహాచలాఖ్యమైన వేంకటాద్రియందు, (సింహ నివాస్యయోగ్య పర్వతమందు), వ్యక్తోన్మేషా= స్పష్టమగు ఆవిర్భావం కలిగిన, భవతీ= నీవు, కాలికేవ= మేఘపంక్తివలె, విశ్వం= ఉచ్చ నీచ విభాగాలులేక సర్వప్రపంచాన్ని, ఆప్యాయయన్తీ సతీ= సంతోషింపజేయు దానివై, కాలే కాలే= జీవులయొక్క సుకృతాలు పరిపాకదశనందే కాలంలో (అవశ్యమగు ఆ యా సమయాలలో), శీలోపజ్ఞం= సౌశీల్యం ఆదిగా కలిగిన (స్వభావమే

కారణంగా), శీతలం= శైత్యోపేతమగు, సద్గుణౌఘం= ప్రవాహంవంటి కల్యాణగుణబృందాన్ని (కల్యాణగుణములవంటి ప్రవాహాన్ని), క్షరతి= వర్షిస్తున్నావు (వర్షిస్తున్నది).

**అవ :** కింది శ్లోకంలో దివ్యాత్మస్వరూపానుభవం వర్ణింపబడింది. ఈ శ్లోకంలో దహరవిద్యాన్యాయాన్ని దివ్యాత్మస్వరూపానుభవానంతర భావియైన దివ్యగుణానుభవం వర్ణింపబడుతున్నది.

**తా :** ఇక్కడ దయాదేవిని మహావర్షం వర్షించే ఒక మేఘమాలగా చిత్రిస్తున్నారు. మేఘం లవణసముద్రంనుండి సారమైన శుద్ధజలాన్ని గ్రహించి నింపుకొని సింహాది భయంకరమృగాలు నివసించే పర్వతశిఖరానికి వచ్చి సర్వజనాలకు మహానందం కలుగజేసి ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా స్వభావమే కారణంగా ఆయా సమయవిశేషాలలో విశేషంగా వర్షించి సర్వలోకాన్ని స్నానపానాది సౌకర్యాలచేత, సర్వౌషధుల అభివర్ధనంచేత పరమక్షేమాన్ని ఎలా కలిగిస్తుందో, అట్లే ఈ దయాదేవికూడా శ్రీనివాసుడను సాగరంనుండి సారభూతాలైన గుణాలను గ్రహించి (తనకుపకరణాలుగా చేసికొని) సింహాచలమనే తిరుమలకు వచ్చి సర్వానందకరంగా ప్రతిష్ఠితమై ఉత్కర్షనికర్షవిభాగం లేకుండా సర్వజనులు పరమక్షేమం పొందునట్లు భగవంతునియొక్క సౌశీల్యాదికల్యాణగుణాలను ఆ యా సమయాలలో వర్షిస్తున్నది.

గుణాలను దయాదేవి వర్షించుట అనగా–భగవంతునిలో గల కల్యాణగుణాలను మహాపరాధులగు చేతనులయొక్క ఉజ్జీవనవిషయంలో ఉపయోగపడునట్లు చేయుట దయాదేవియొక్క కార్యమే. ఈ దయాదేవి లేనిచో ఆ గుణాలు దోషాలుగా కూడా పరిణమిస్తాయని పూర్వం చెప్పబడింది. ఈ కల్యాణగుణాలలో శీలమనే సౌశీల్యం చాల ఉత్కృష్టమైనదని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. "సౌశీల్యం నామ మహతో మన్దైస్సహ నీరంధ్రసంశ్లేషః" అనగా చాల ఉత్కృష్టమైన పురుషుడు చాల నికృష్టుడైన వానితో కలసిమెలసి



ఉండుటయే సౌశీల్యమని చెప్పబడింది. ఈ గుణం మనబోటివారి విషయంలో ఉపయోగపడి మనం క్షేమం పొందాలంటే దయాదేవియొక్క ప్రయత్నం చాల అవసరం. అనగా, భగవంతుడు పరమ దయచేతనే పరమ నికృష్టులగు నిషాదగోపికాదులతో కలసి నిలుస్తున్నాడు. దయాదేవి గుణాలను వర్షించడమంటే ఇదే. సముద్రంలో విశేషంగా నీళ్లు ఉండినా మన ఉపయోగానికి తగినవిధంగా శుద్ధపరచి మనకు లభించేటట్లు చేసేది మేఘమేగదా! ఆ మేఘం లేకుండా ఆ జలాన్ని మనం ఉపయోగించు కోవడానికి వీలు లేదుగదా! అలాగే దయాదేవి లేనిచో భగవంతుని కల్యాణగుణాలు మనకు అందవు అనే తత్త్వార్థం ఇక్కడ వివక్షితం.

**శ్లో॥ భీమే నిత్యం భవజలనిధౌ మజ్జతాం మానవానాం**
**ఆలంబార్థం వృషగిరిపతిస్త్వన్నియోగాత్ప్రయుంక్తే ।**
**ప్రజ్ఞాసారం ప్రకృతిమహతా మూలభాగేన జుష్టం**
**శాఖాభేదైస్సుభగమనఘం శాశ్వతం శాస్త్రపాణిమ్ ॥ 46**

**ప్రతి :** (హే దయే!= ఓ దయాదేవీ), వృషగిరిపతిః= వేంకటాద్రీశుడైన శ్రీనివాసుడు, త్వన్నియోగాత్= నీ ఆజ్ఞవలన, భీమే= కామక్రోధాది జలచరాలతోకూడి భయంకరమైన, భవజలనిధౌ= సంసారమనే సముద్రంలో, నిత్యం= ఎప్పుడూ, మజ్జతాం= మునుగుతున్న, మానవానాం= జనులయొక్క, ఆలంబార్థం= అవలంబంకొరకు, ప్రజ్ఞాసారం= వివేకమనే సారాంశం కల్గినట్టి (బలం కలిగినట్టి), ప్రకృతిమహతా= స్వభావంచేతనే చాల ఉత్కృష్టమైనదియు, (పెద్దదైనదియు) మూలభాగేన= ప్రణవంతో (భుజమనెడి మూలభాగంచే), జుష్టమ్= కూడినది, శాఖాభేదైః= అనేక శాఖలచే (వ్రేళ్ళచే), సుభగమ్= మనోహరమైనది, అనఘమ్= అపౌరుషేయమగుటచే ఎట్టి దోషం లేనట్టిది (ఎట్టి ఊనము లేనిదియు), శాశ్వతమ్= నిత్యమైనది (దృఢమైనది)అగు, శాస్త్రపాణిమ్= చేయివలె ఉన్న వేదశాస్త్రాన్ని (చేతిని), ప్రయుంక్తే= ఇస్తున్నాడు.

**అవ :** కింది శ్లోకంలో సౌశీల్యం మొదలగు గుణాలు ప్రస్తావింపబడినాయి. ఈ శ్లోకంలో ఆ సౌశీల్యంవలె ఉన్న దయాకార్యమగు శాస్త్రప్రదానమనే మరొక గుణం అనుభవింపబడుతున్నది. ''మగ్నానుద్ధరతే లోకాన్ కారుణ్యాచ్ఛాస్త్రపాణినా,'' ''శాస్త్రం ప్రదీప మివ కారుణికో దదాతి'' ఇత్యాది ప్రమాణాలు శాస్త్రాలను ఇక్కడ పరమదయాకార్యంగా వర్ణిస్తున్నాయి. సంసారమనే మహాసముద్రంలో పడి దిద్దిర దిరుగుతూ అవస్థపడే వారికి శాస్త్రమనే చేతిపట్టు లేనియెడల లేచి రావడానికి వేరుమార్గం లేదు. శాస్త్రమనే కరదీపికచే మంచి చెడ్డల నెరిగినపుడే సరియగు త్రోవలో నడువగలుగుతాము. కావున ఇట్టి ఉత్కృష్టమగు ఉపకరణమునొసంగి ఆ సముద్రంనుండి బయల్వెడలి సరియైన త్రోవలో నడుచునట్లు చేయడం దయాకార్యమనుట నిస్సంశయం. శాస్త్రాలలో ''వేదాచ్ఛాస్త్రం పరం నాస్తి'' అని వ్యాసభగవానుడు చెప్పినట్లు ప్రధానమైంది వేదశాస్త్రం ఒక్కటే. అట్టి శాస్త్రాన్ని ''కారుణ్యాచ్ఛాస్త్రపాణినా'' అనే ప్రమాణాన్ని అనుసరించి మునిగిపోవు వారిని వెలుపలకు తీయుటకు అవలంబంగా ఒసంగుబడు హస్తంగా వర్ణిస్తున్నారు. బహువిధ జలజంతువులతో నిండిన భయంకర సముద్రంలో మునిగిపోవువానిని వెలుపలకు తీయగోరిన ఆప్తుడు మంచిబలం కల్గినది, స్వభావంచేతనే పెద్దదై పుష్టమైన భుజం కల్గినది, ఊనంలేనిది, వ్రేళ్లను కల్గినది, ఎట్టి ఒగుతనం లేనిది, దృఢమైనది అగు హస్తమునిచ్చి రక్షిస్తాడో, అట్లే దయాప్రేరితుడగు సర్వేశ్వరుడు (శ్రీనివాసుడు) జగత్తును సృష్టించిన వెంటనే దానిని ఈ కామక్రోధాదులచే నిండిన సంసారసముద్రంనుండి ఉద్ధరింపగోరి పూర్వోక్తహస్తాన్ని పోలిన వేదశాస్త్రాన్ని ఇస్తున్నాడు. ఆ శాస్త్రం తనచే కలుగజేయబడు కృత్యాకృత్యవివేకమనే ప్రజ్ఞను సారంగా (బలంగా) కలిగి ఉంది. సర్వవేదార్థాలు ప్రణవంలో అంతర్భూతమైనవి కావున మహాప్రభావంతో కూడిన ప్రణవంతో కూడి ఉంది. సహస్ర సంఖ్యాకాలైన శాఖలను కలిగి ఉంది. ఒక పురుషునిచేత నిర్మితం కానందున భ్రమప్రమాదాది దోషాలు లేకుండా ఉంది. ఇలా దోషరహితంగా ఉండుటకు



అది నిత్యమగుటయే పరమకారణం. అందుచేత ఇట్టి మహత్త్వంకల శాస్త్రాన్ని పరమదయతో సర్వేశ్వరుడు మనకిస్తున్నాడను తత్త్వమిచట వివక్షితం.

మరియు ఇక్కడ సర్వోపబృంహణాలతో కూడిన వేదాన్ని శాస్త్రపదంచేత వివక్షించుట యుక్తం. కావున పరదేవతా పారమార్థ్యనిశ్చయానికి పరమసాధనమైన సాత్త్వికపురాణాది శాస్త్రాలుకూడా భగవద్దయచేతనే ఆవిర్భవిస్తున్నవి అని చెప్పడం యుక్తతమమే.

**శ్లో॥ విద్వత్సేవా కతకనికషైర్వీతపంకాశయానాం**
**పద్మాకాంతః ప్రణయతి దయే! దర్పణం తే స్వశాస్త్రమ్ ।**
**లీలాదక్షాం త్వదనవసరే లాలయన్ విప్రలిప్సాం**
**మాయాశాస్త్రాణ్యపి ద(శ) మయితుం త్వత్ప్రపన్నప్రతీపాన్ ॥ 47**

**ప్రతి :** హే దయే!= ఓ దయాదేవీ!, పద్మాకాన్తః= లక్ష్మీపతియగు శ్రీనివాసుడు, విద్వత్సేవాకతకనికషైః= విద్వత్సేవ అనే చిల్లగింజయొక్క రాపిడులచేత, వీతపంకాశయానామ్= నశించినట్టి అజ్ఞానపాపాది పంకములు కలిగినవారికి, తే= నీకు, దర్పణం= దర్పణమగు, స్వశాస్త్రం= తన శాస్త్రమును (భగవచ్ఛాస్త్రమనబడు పాంచరాత్రశాస్త్రమును), ప్రణయతి= ఇప్పిస్తున్నాడు, త్వదనవసరే= నీ కవసరంలేని సమయంలో, లీలాదక్షామ్= లీలలయందు సమర్థయైన, విప్రలిప్సాం= వంచనేచ్ఛను, లాలయన్= కొనియాడుతూ, త్వత్ప్రపన్నప్రతీపాన్= నిన్నాశ్రయించినవారియొక్క విరోధులను, దమయితుమ్= శిక్షించుటకు, మాయాశాస్త్రాణ్యపి= మోహన శాస్త్రాలనుకూడా, ప్రణయతి= చేస్తున్నాడు.

**అవ :** గత శ్లోకంలో ఉత్తమ శాస్త్రమైన వేదాన్ని ఇవ్వడం అనే భగవద్దయాకార్యమైన ఒక గుణం అనుభవింపబడింది. ఇక్కడ ఆ వేదంవలె మిగుల కొనియాడదగినదని సాక్షాద్భగవానునిచేతనే చేయబడినదగు భగవచ్ఛాస్త్రమనే పాంచరాత్రాగమాన్ని భగవంతుడివ్వడం, అలాగే కొన్ని

సమయాలలో మోహనశాస్త్రమనే వేదవిరుద్ధాలైన బౌద్ధాదిశాస్త్రాలను తానుగా మరికొందరిమూలంగా కలుగజేయడం దయాకృత్యాలే అని వివరిస్తున్నారు.

**తా :** పాంచరాత్రశాస్త్రాన్ని దయాదేవియొక్క అద్దంగా చిత్రిస్తున్నారు. ప్రపన్నులను రక్షించడమే దయాస్వభావం. పాంచరాత్రాగమంలో ప్రపత్తియొక్క ప్రభావం, దాని స్వరూపాదులు అనేక ఉపపత్తులతో చక్కగా ఉపపాదింపబడి ఉన్నాయి. కావున భగవద్దయయొక్క మహత్వాన్ని చక్కగా నిరూపించి చూపించుటచే ఆ శాస్త్రం దయాదేవికి అద్దమవుతుందని చెప్పవచ్చు.

ఇట్టి పాంచరాత్రశాస్త్రంలో విద్వాంసులైన సదాచార్యుల సంబంధం పొంది, సత్సంప్రదాయనిష్ఠుల దగ్గర పరిచర్యచేసి, తన్మూలంగా ఆత్మలో ఉండే అజ్ఞాన పాపాది దోషాలు తొలగి నిర్మలాన్తఃకరణులైన వారికే విశ్వాసం కలుగుతుంది. అట్టి సాత్వికులకే ఇట్టి ఉత్తమమైన (భగవద్దయా ప్రభావ ప్రతిపాదకమైన) పాంచరాత్ర శాస్త్రాన్ని పరమదయచే భగవంతుడిప్పిస్తున్నాడు. ఈ అర్థాన్ని ''విద్వత్సేవా'' అని ఉపక్రమింపబడిన పూర్వార్ధంలో నిరూపించారు. ఎల్లరూ సద్గతి చెందునట్లు చాల ఉత్తమమైన ప్రపత్తిమార్గాన్ని నిరూపించు వ్యాజంతో భగవద్దయాప్రభావాన్ని బోధించే భగవచ్ఛాస్త్రాన్ని ఆ దయాదేవి ఆదేశంచేతనే భగవానుడు చేస్తున్నాడు కనుక ఆ శాస్త్రం దయాకార్యమవుతున్నది. కాని ఆ భగవంతుడే బుద్ధాద్యవతారాలలో స్వయంగాను, మరికొన్ని సమయాలలో "త్వం వా రుద్ర మహాబాహూ! మోహశాస్త్రాణి కారయ!" అనురీతిగా మరికొందరి మూలంగాను జనాలను తత్త్వహిత పురుషార్థాలలో మోహపడునట్లుచేసే మోహన శాస్త్రాలను ప్రవర్తింపజేయడం దయారూపియగు వాని స్వభావానికి తగునా? అనే సంశయానికి ఉత్తరార్ధంలో తగు సమాధానం ఇస్తున్నారు.

ఇక్కడ సర్వ శాస్త్రాలచేత, తదనుసారులగు పూర్వాచార్యులచేత అంగీకరింపబడిన ఒక ముఖ్యమైన తత్త్వార్థాన్ని ఆచార్యులు నిరూపిస్తున్నారు.



భగవత్ప్రపన్నులనే బ్రహ్మవిత్తుల విషయంలో అపచారం చేస్తే ఆ పాపం ఎన్ని కల్పకాలాలు అనుభవించినా తొలగని నరకానుభవం కలుగజేస్తుంది. ఇట్టి భాగవతాపచారమనే క్రూరకర్మచేయు కార్యాన్నే ఇక్కడ ప్రతిపాదిస్తున్నారు. జీవునిదైన ఈ క్రూరకర్మ భగవంతునినుండి దయను కించిత్కాలం విడదీసి విప్రలిప్స అనే వంచనేచ్ఛను స్వీకరింపజేసి తన్మూలంగా తత్త్వహితాదులలో విపరీతమైన విషయాలను బోధించే మోహనశాస్త్రాలను కలుగజేసి వానిలో ఈ జీవులను ఆసక్తులనుజేసి, దానిచే వారిని విపరీతానుష్ఠానపరులుగా చేసి తత్ఫలమైన నరకానుభవ పర్యంతమైన శిక్షను వారికిస్తున్నది. ("కంజాభవన్తి...అవిధేయపుత్రా భవన్తి" (పంగువులవుతున్నారు... అవిధేయపుత్రులవుతున్నారు) ఇట్టి శిక్షలు సాక్షాద్దయాదేవిచే కలుగునవి.) మోహనశాస్త్రంలో దిగి తన్మూలంగా కలిగే నరకానుభవం భగవంతుని విప్రలిప్సచే ఏర్పడుతున్నది. ఇది తుషాగ్నివలె అతిదుస్సహం. ఇట్టి కఠినశిక్షను ఆశ్రిత విరోధుల విషయంలో భగవంతుడిస్తున్నాడు. ఇంతటికిని ఈ జీవకర్మయే కారణం. దీనినే "దమయితుం త్వత్ప్రపన్న ప్రతీపాన్" అని బోధిస్తున్నారు. భగవద్దయాశ్రితుల విరోధులను శిక్షించుటకు పుట్టిన మోహనశాస్త్రం పరంపరగా దయాదేవియొక్క ప్రభావాన్నే స్థిరపరస్తున్నది. ఇట్టి కఠినశిక్ష దయాశ్రితుల విరోధులకు కలదనే విషయం, విప్రలిప్సామూలకమైన మోహనశాస్త్రం ఆవిర్భవించుటచేతనేగదా తెలుస్తున్నది. కావున దయాదేవి కించిత్కాలం విడిచిపోయినను అప్పుడు కలుగు విప్రలిప్సను, తన్మూలకమైన మోహన శాస్త్రాలను ''భగవద్దయాప్రభావంతో ప్రాపంచికులు తెలుసుకోవాలి. తదాశ్రిత విరోధులకు ఇట్టి కఠినశిక్ష ఉంది. కావున అట్టి అపచారంనుండి జనులు నివర్తితులు కావాలి" అను దయచేతనే ఏర్పడినవి కనుక మోహనశాస్త్రంకూడా దయాకార్యమగుట కాక్షేపం లేదు.

ఈ అర్థానికి అనుకూలమైన అర్థాన్ని "ప్రణత ప్రతికూల మూలఘాతీ ప్రతిఘః కోఽపి వృషాచలేశ్వరస్య" అనే 24-వ శ్లోకంలో ఒకరీతిగా వివరించారు.

**శ్లో॥ దైవాత్ప్రాప్తే వృషగిరితటం దేహిని త్వన్నిదానాత్**
**స్వామిన్! పాహీత్యవశవచనే విన్దతి స్వాపమన్త్యమ్ ।**
**దేవః శ్రీమాన్ దిశతి కరుణే దృష్టిమిచ్ఛంస్త్వదీయాం**
**ఉద్ఘాతేన శ్రుతిపరిషదాముత్తరేణాభిముఖ్యమ్ ॥ 48**

**ప్రతి :** హే కరుణే= ఓ దయాదేవీ!, త్వన్నిదానాత్= నిన్ను కారణంగా గలిగిన, దైవాత్= సుకృతవిశేషంచేత, వృషగిరితటమ్= తిరుమల ప్రదేశాన్ని, ప్రాప్తే= పొందిన, దేహిని= ఒక ప్రాణి, స్వామిన్= ఓ స్వామీ!, పాహి= కాపాడు, ఇతి= అని, అవశవచనే= తనకు స్వాధీనంలేని వాక్కు కలిగినవాడై, అన్త్యం స్వాపం= అంతిమ నిద్రను (మరణాన్ని), విన్దతి సతి= పొందినవాడుకాగా, శ్రీమాన్ దేవః= శ్రీనివాసుడు, త్వదీయాం దృష్టిమ్= నీ కటాక్షాన్ని, ఇచ్ఛన్= కోరుతూ, శ్రుతిపరిషదాం ఉద్ఘాతేన= సర్వవేద బృందాలకు ఆరంభరూపమగు ప్రణవమనబడు, ఉత్తరేణ= ఉత్తరంచేత, ఆభిముఖ్యం= తన ఆభిముఖ్యాన్ని, దిశతి= ఇస్తున్నాడు.

**అవ :** తిరుమలలో లబ్ధజన్ములగు ప్రాణులకు అక్కడ ఏర్పడే లాభాలు ఇంతవరకు వర్ణింపబడినాయి. ఈ శ్లోకంలో అలా తిరుమలలో జన్మ లభించక పోయినా ఏదైనా ఒక సుకృతవిశేషంచేత ఆ తిరుమలను తాత్కాలికంగా పొంది అక్కడ దేహన్యాసం చేయువానికికూడా తత్క్షేత్రప్రభావంతో కలిగే లాభం వర్ణింపబడుతున్నది.

**తా :** యాదృచ్ఛికాది సుకృతం కలగడం కూడా దయాదేవి అనుగ్రహం చేతనే. అట్టి యాదృచ్ఛికాది సుకృత విశేషంచేత ఒక ప్రాణి తిరుమలను పొంది అక్కడ ఆ దయాదేవి అనుగ్రహం చేతనే తాను బుద్ధిపూర్వకంగా



చెప్పతలచక పోయినా, అర్థజ్ఞానాదులు శూన్యములే అయినా "స్వామీ కాపాడాలి" అనే మాటలు చెపుతూ మరణించినయెడల; లక్ష్మీసహితుడు, పరమపురుషుడు అగు శ్రీనివాసుడు ఆ దయాదేవియొక్క లీలాకటాక్షాలకు ఆశపడి "అటులనే నిన్ను కాపాడుదును" అను భావాన్ని వెల్లడించే "ఓమ్" అనెడు సర్వవేదారంభమగు మాటను చెపుతూ ఆ ప్రాణి కభిముఖుడవుతున్నాడు. వానియందు శాంతకోపుడై ప్రసన్నుడవుతున్నాడని భావం. "ఓమ్" అనే మాటకు అంగీకరించితినని అర్థం. "ఓమ్" అనే ప్రణవం ఉచ్చరించిన పిదపనే సర్వ వేదాలను ఆరంభించాలి కనుక "సర్వవేదాలకు ఆరంభరూపమగు" అను విశేషణం ఇవ్వబడింది. సర్వవేదార్థసారాన్నే ప్రణవం చెపుతున్నది. కనుక ఆ వేదాలన్నీ ఇట్టి సర్వప్రాణి సంరక్షణ దీక్షితుడు, దయామూర్తి అగు పరమపురుషునియొక్క గుణాలనే చెపుతున్నాయి అనే శాస్త్రార్థాన్ని ప్రకటించడమే ఈ విశేషణకృత్యం.

**శ్లో॥ శ్రేయస్సూతిం సకృదపి దయే! సమ్మతాం యస్సఖీం తే**
**శీతోదారామలభత జనః శ్రీనివాసస్య దృష్టిమ్ ।**
**దేవాదీనామయమనృణతాం దేహవత్త్వేఽపి విందన్**
**బంధాన్ముక్తో బలిభిరనఘైః పూర్యతే తత్ప్రయుక్తైః ॥ 49**

**ప్రతి :** హే దయే= ఓ దయాదేవీ!, యః జనః= ఏ జనం, శ్రేయస్సూతిమ్= సర్వశ్రేయస్సులను కలుగజేయు నట్టిదియు, శీతోదారామ్= శైత్యం, ఔదార్యాలతో కూడినదియు, తే= నీకు, సమ్మతాం సఖీమ్= ఇష్టమైన సఖియునగు, శ్రీనివాసస్య దృష్టిమ్= శ్రీనివాసునియొక్క కటాక్షాన్ని, సకృదపి= ఒకసారైనా, అలభత= పొందెనో, అయం= అట్టి యా జనం, దేహవత్త్వేఽపి= శరీరంతో కూడియుండు దశలోనూ, దేవాదీనామ్= దేవతాదుల విషయంలో, అనృణతామ్= అప్పులేని తనమును, విందన్= పొందుతూ, బంధాన్ముక్తః= దేహబంధంనుండి విడవబడినవాడై, తత్ప్రయుక్తైః= ఆ దేవతలచే సమర్పింపబడిన, అనఘైః= పరిశుద్ధములైన, బలిభిః= ఉపహారాలచేత, పూర్యతే= పూరింపబడుతున్నాడు.

**అవ :** ఈ దశకారంభంలో "ఆశాసానాః కతిచన విభోః" అనేచోట దయాలింగితమైన శ్రీనివాసకటాక్షం కోరి కొందరు మహనీయులు ఈ పర్వతంమీద జన్మకోసం ప్రార్థించారని చెప్పినారు. తదుపరి గత శ్లోకపర్యంతం ప్రసక్తానుప్రసక్తంగా అక్కడ జన్మించిన వారికి, దైవవశంగా అక్కడ వచ్చిచేరిన వారికి కలిగేలాభాలు వివరింపబడినాయి. ఈ శ్లోకంలో, పై శోక్లంలో యథాక్రమంగా ఆ శ్రీనివాసునియొక్క, దయాదేవి యొక్క కటాక్షాలతో ఏర్పడే సత్ఫలాలను వర్ణించి తద్ద్వారా ఆ కటాక్షాలకు, దయాదేవికిగల ప్రభావాన్ని వివరించి ఈ దశకం పూర్తిచేస్తున్నారు.

**తా :** దయాదేవికి ఎంతో ఇష్టతమయగు సఖి శ్రీనివాసుని దృష్టి (కటాక్షం). ఆ శ్రీనివాసుని కటాక్షంతోనే ఎప్పుడూ దయాదేవి కలిసిమెలసి ఉంటుంది. ఆ కటాక్షాలు చాల ప్రసన్నాలుగాను, పరమోదారాలుగాను ఉన్నాయి. తాపత్రయదగ్ధునికి ఆ శీతకటాక్షం చాల ఇంపుగా ఉంటుంది. అట్టి కటాక్షాలను ఒకమారైనా ఒకడు పొందితే వాడు ఈ దేహసంబంధం ఉండేవరకు దేవతలు, ఋషులు, పితరులు అనే వీరి విషయంలో కలిగే ఋణాలను తొలగించుకొని ఈ దేహసంబంధం వదలినతోడనే అర్చిరాదిగతి అనే ఉత్తమమార్గంగుండా పరమపదానికి వెళ్లునపుడు ఆ దేవతలచేత చాల ప్రీతిగా, గౌరవంగా సమర్పింపబడిన ఉపహారాలతో సంతోషిస్తున్నాడు.

ఒక్కొక్క ద్విజుడు జన్మించినపుడే దేవతలు, ఋషులు, పితరులు అనే ఈ ముప్పురి విషయంలోనూ ఋషిగానే జన్మిస్తున్నాడు. బ్రహ్మచర్యంచేత (వేదాధ్యయనంచే) ఋషులయొక్క, యజ్ఞములచేత దేవతలయొక్క, ప్రజలచేత (సంతానంచే) పితరులయొక్క అప్పులను తొలగించుకొంటున్నాడని వేదాలు చెపుతున్నాయి. అటువంటి ఈ మూడు ఋణాలుకూడా భగవానుని శరణుపొంది ఆయన కటాక్షం అందినవాని విషయంలో ఏ మాత్రం లేవని,



**"దేవర్షిభూతాత్మనృణాం పితౄణాం**
**న కింకరో నాయమృణీ చ రాజన్ ।**
**సర్వాత్మనా యశ్శరణం శరణ్యం**
**నారాయణం లోకగురుం ప్రపన్నః ॥**

అనే ప్రమాణానుసారంగా పెద్దలు నిశ్చయించి ఉన్నారు. కావున దేహం ఉన్నప్పుడు కూడా వాడు అప్పుపడిన వాడుకాడు. ఈ దేహత్యాగానంతరమే మోక్షం పొందుతున్నాడు. అలా పరమపదానికి వెళ్లునపుడు మార్గంలో "సర్వేఽస్మై దేవా బలిమావహంతి" అని ఉపనిషత్తు ప్రతిపాదించినట్లు భావదోషం లేక పరిశుద్ధమైన ఉపహారాలతో దేవతలు వీనిని పూజిస్తున్నారు. శ్రీనివాసకటాక్షానికి ఇంతటి ఉత్కర్ష తత్సఖియగు దయాదేవిచేతనే ఏర్పడుతున్నది అని పరంపరగా దయామాహాత్మ్యమే ఇక్కడకూడా ప్రకటీకృతమవుతున్నది.

**శ్లో॥ దివ్యాపాంగం దిశసి కరుణే! యేషు సద్దేశికాత్మా**
**క్షిప్రం ప్రాప్తా వృషగిరిపతిం క్షత్రబన్ధ్వాదయస్తే ।**
**విశ్వాచార్యాః విధిశివముఖాః స్వాధికారోపరుద్ధాః**
**మన్యే మాతా జడ ఇవ సుతే వత్సలా మాదృశే త్వమ్ ॥ 50**

**ప్రతి :** హే కరుణే= ఓ దయాదేవీ!, త్వం= నీవు, యేషు= ఏ చేతనులయందు, సద్దేశికాత్మా సతీ= సదాచార్యరూపిణివవుతూ, దివ్యాపాంగం= ఉత్తమకటాక్షాన్ని, దిశసి= ప్రయోగిస్తున్నావో, తే= అటువంటి, క్షత్రబంధ్వాదయః= క్షత్రబంధువు మొదలగువారు, వృషగిరిపతిమ్= వృషాద్రినాథుడగు శ్రీనివాసుని, క్షిప్రం= శీఘ్రంగా, ప్రాప్తాః (భవన్తి)= పొందిన వారవుతున్నారు, విశ్వాచార్యాః= లోకాచార్యులగు, విధిశివముఖాః= బ్రహ్మరుద్రాదులు, స్వాధికారోపరుద్ధాః= తమతమ అధికారాలచే అడ్డగింపబడినవారై ఉన్నారు, (అతః= కావున), మాతా= తల్లి, జడే= మందుడగు, సుతే ఇవ= పుత్రునియందు వలె, త్వం= నీవు, మాదృశే=

మాబోటివారియందు, వత్సలా= ఎక్కువ ప్రీతిగలదానవు, (ఇతి= అని), మన్యే= భావిస్తున్నాను.

**అవ :** భగవత్కటాక్షప్రభావం గత శ్లోకంలో వర్ణింపబడింది. ఆచార్య కటాక్ష ప్రభావం ఇక్కడ వర్ణింపబడుతున్నది. ప్రథమంకంటె ద్వితీయం ఎక్కువ ప్రభావం కలదని ఇక్కడ విశదీకరింపబడుతున్నది. దయాస్తోత్రంలో ఆచార్య కటాక్షానికి సంబంధమేమంటే దయాదేవియే ఆచార్యరూపం పొందుతున్నది. కావున దయ వేరు, ఆచార్యుడు వేరనుట లేదు. అందుచే ఆచార్యవేషం పొందిన దయాదేవీకటాక్షప్రభావం ఇక్కడ వర్ణింపబడినట్లవుతున్నది. అనంతరదశకంలో మోక్షోపాయమైన ప్రపత్తిని స్వానుష్ఠానముఖంగా ప్రస్తావింపబోతున్నారు. దానికి ప్రథమంగా ఆచార్య కటాక్షం అత్యావశ్యకం కనుక దానినిక్కడ కీర్తించి ఉత్తరదశకం ప్రారంభిస్తున్నారు.

**తా :** మిగుల పాపులగు క్షత్రబంధువు మొదలగువారు సదాచార్య కటాక్ష విశేషంతో అతిశీఘ్రంగా మోక్షం పొందారని ప్రమాణాలు చెపుతున్నాయి. అట్టి పాపులు అంత త్వరగా మోక్షం పొందడానికి ఆచార్యవేషం పొందిన దయాదేవి కటాక్షవిశేషమే కారణం. సర్వలోకానికి ఆచార్యపదం వహించడానికి తగిన యోగ్యతలు కలిగిన బ్రహ్మరుద్రవ్యాసాదులు ఆ యా పదవులలో అధికారం నిర్వహిస్తున్నవారగుటచే మోక్షోపాయపూర్తి కలిగి ఉండినా, ఆ అధికారస్థానానికి కారణమైన సుకృతం పూర్తి అయ్యేవరకు మోక్షం పొందుటకు వీలులేక నిరుద్ధులుగానే ఉన్నారు. లోకంలో ఒక తల్లి కనేక పుత్రులుండినా సమర్థుడైన పుత్రునికంటె మందుడగు పుత్రునియందే ఆమెకధిక ప్రేమ ఉండడం అనుభవసిద్ధం. సమర్థుడెటులైనా 'బ్రతికిపోవును, మందుడు, చేతగానివాడు అగు ఈ మూఢుడెట్లు బ్రతుకునో' అని ఆ తల్లి చింతించి వీనికి తనచేతనగు సహాయం ఎక్కువగా చేస్తుంది. ఇది మాతృస్వభావం. అట్లే సర్వలోకమాతవగు ఓ దయామాతా! నీవు క్షత్రబంధువువలె అతిపాపిష్ఠులైన మాబోటివారియందే ఎక్కువ ప్రేమ కలిగి



ఉన్నావు. లేనిచో మాకుకూడా త్వరలో లభించే మోక్షం అతిసమర్థులైన బ్రహ్మాదులకుకూడా లభించలేదుగదా! అని ఈ విధంగా దయను పొగడి తద్వారా సదాచార్య కటాక్షానికి గల శాస్త్రోక్తమైన ఉత్కర్షను ఇక్కడ ఆచార్యులు ప్రకటించారు.

క్షత్రబంధువనువాని వృత్తాంతం విష్ణుధర్మపురాణం 97వ అధ్యాయంలో చెప్పబడి ఉంది. క్షత్రబంధువు సూర్యవంశంలో జన్మించినవాడు. చాల పాపిష్ఠి. అడవిలోని బాటసారులను, సర్వజంతువులను హింసించేవాడు. ఒక రోజు దారిదప్పి వాడు ఉన్నచోటికి వచ్చిన మహర్షిని చూచి యాదృచ్ఛికంగా అతనికి సద్భావమేర్పడింది. ఆ మహర్షి ఇతనిని ఆ క్రూరకృత్యాలను వదలిపెట్టమని ఉపదేశించాడు. దానిని వదలుటకు వీలుగాదని వాడు చెప్పగా; మహర్షి ఎలాగైనా అతనిని సద్గతికి మరలించాలనుకొని తుమ్మినపుడు, దగ్గినపుడు, "గోవిందా" అని చెప్పునట్లు ఉపదేశమిచ్చి వెళ్లాడు. అతడు అలాగే ఆచరిస్తూ వచ్చాడు. ఆ భగవన్నామోచ్చారణ ప్రభావంతో అనంతరజన్మలో ఉత్తమ జన్మం పొంది పూర్వజన్మ స్మరణ కలిగి గోవిందనామ ప్రభావం తెలుసుకొని ఆ గోవిందుని శరణుపొంది మోక్షం పొందాడు.

ఇంతటి శ్రేయస్సు అతనికి ఆ మునిరూపంలో వచ్చిన ఆచార్యుని అనుగ్రహంవల్ల కలిగింది. ఈ వివరాలను విష్ణుధర్మంలో తిలకించండి.

***పంచమదశకం సమాప్తం***

***శ్రీమతే నిగమాంతమహాదేశికాయ నమః***

## షష్ఠ దశకం

**శ్లో॥ అతికృపణోఽపి జన్తురధిగమ్య దయే! భవతీం**
**అశిథిలధర్మ సేతుపదవీం రుచిరామచిరాత్ ।**
**అమితమహోర్మిజాలమతిలంఘ్య భవాంబునిధిం**
**భవతి వృషాచలేశపదపత్తననిత్యధనీ ॥ 51**

**ప్రతి :** హే దయే!= ఓ దయాదేవీ!, అతికృపణోఽపి జన్తుః= చాల అకించనుడైన జంతువుగా ఉండువాడును, రుచిరామ్= అందమైన, అశిథిలధర్మసేతుపదవీమ్= దృఢమైన దానవు, ధర్మమనే పరమపురుషుని పొదింపజేయు సేతుమార్గరూపయైన దానవు అగు, భవతీం= నిన్ను, అధిగమ్య= పొంది, అచిరాత్= శీఘ్రంగా, అమితమహోర్మిజాలమ్= అధికమైన పెద్ద అలలు గలిగిన, భవాంబునిధిమ్= సంసార సముద్రాన్ని, అతిలంఘ్య= దాటి, వృషాచలేశపదపత్తననిత్యధనీ= వేంకటాధీశుడగు శ్రీనివాసునియొక్క పదములనే పట్టణంలో నిత్యమైన సంపత్తును కలవాడుగా, భవతి= అవుతున్నాడు.

**అవ :** గత దశకంలో శ్రీనివాసుని దివ్యకటాక్షానికి ఆశపడి ఈ పర్వతమందు జన్మను కోరిన కొందరు మహనీయుల ప్రభావాన్ని వర్ణించి అట్టి భగవద్దివ్య కటాక్షంకూడా సర్వశ్రేయస్సులకు కారణమగు దయారూపులగు ఆచార్యులయొక్క కటాక్షానికి, ఏదో ఒక మోక్షోపాయానికి సంబంధం కలుగజేసి మోక్షపర్యంతమగు ఐశ్వర్యాన్ని ఇచ్చు శక్తిగలదని ప్రతిపాదించారు.

ఈ దశకంలో అలాంటి మోక్షోపాయాలలో ఉత్కృష్టమైన ప్రపత్తియొక్క స్వరూపాదులను, దాని కనుకూలమగు కొన్ని గుణాలను దయాదేవి కనుగుణమైన రీతిలో ప్రతిపాదించి, దశకాంతంలో ఆచార్యుల ప్రభావాన్ని అనుసంధించి, స్వయంగా దయాదేవియందు ప్రపత్తి ననుష్ఠించి దశకాన్ని పూర్తిచేస్తున్నారు.



కింది శ్లోకంలో మోక్షోపాయానికి అంతరంగమైన ఆచార్యకటాక్ష ప్రభావం వర్ణింపబడింది. ఈ శ్లోకంలో ఆ కటాక్షంచేత కలిగే ప్రపత్త్యధికారం నిరూపింపబడుతున్నది.

**తా :** పరమదరిద్రుడుకూడా దయాదేవి అవలంబంతోనే శాశ్వత సంపత్తునుపొంది మహానందం పొందుతున్నాడు. కొద్దిపాటి పెట్టుబడికూడా లేని దరిద్రుడు అమిత సంపదకాశపడి అనేక భయంకర జంతువులచేత, బ్రహ్మాండమైన అలలచేత వ్యాపించిన సముద్రాన్ని ఓడ మొదలగు సాధనాలతో నిరపాయంగా దాటుటకు వీలులేదు కనుక మహారాజుచే చాల అందంగాను, దృఢంగాను, పన్ను మొదలైనవి లేకుండా ధర్మంగా అందరూ ప్రయాణించే విధంగా కట్టి విడువబడిన సేతుమార్గంగుండా శీఘ్రంగా దాటి పెద్ద పెద్ద కొండలు మొదలగు ప్రకృతి సౌందర్యంతో కూడిన పర్వతప్రాంతానగల ఒక పెద్ద నగరాన్ని పొంది అక్కడ విశేషక్రయ విక్రయాది వ్యాపారంతో ఎలా శాశ్వత సంపదను పొంది సుఖిస్తాడో, అట్లే అకించనుడనబడువాడు మోక్షం పొందుటకు శాస్త్రాలలో ముఖ్యోపాయంగా చెప్పబడిన భక్త్యాద్యుపాయాలను అనుష్ఠించుటకు శక్తిలేనివాడు, తనకు ఎట్టి మూలధనం లేక పోయినా శ్రీనివాసుని దయను శరణంగా పొందినయెడల, అనగా "ఆ భక్త్యాద్యుపాయ స్థానంలో నీవే నిలిచి పరమ అకించనుడనగు నాకు ఆ మోక్షం ఇవ్వాలని" ప్రార్థించినయెడల ఆ దయాదేవి అనుగ్రహంచేత మిక్కిలి దృఢమైనదని, ధర్మమని, సంసారసేతువని శాస్త్రాలలో చెప్పబడిన పరమపురుషుని పొందజేసే సేతువువంటి మార్గంగా ఆ దయాదేవినే అవలంబించి క్షుత్పిపాసాశోకమోహాది మహాతరంగాలతో వ్యాప్తమై ఉండే ఈ సంసారమహాసముద్రాన్ని అతిశీఘ్రంగా దాటి వేంకటాద్రీశుని చరణారవిందాలనే పెద్ద పట్టణాన్ని పొంది ఆ పాదారవిందాలయందు కైంకర్యమనే నాశంలేని శాశ్వతసంపదను పొంది పరమానందం పొందుతున్నాడు. ఆహా! ఎంతటిదోగదా దయాదేవియొక్క ప్రభావమని

ఆశ్చర్యపడుతున్నారు. ప్రపత్తి అనబడే శీఘ్రంగా ఫలమిచ్చు మోక్షోపాయానికి అకించనుడుగా, అనన్యగతికుడుగా ఉండువాడే పూర్ణాధికారి. అనగా ఇతర ఉపాయాలను అనుష్ఠించుటకు శక్తి చాలనివాడు, భగవద్దయతప్ప వేరేశరణం లేనివాడు ముఖ్యాధికారి అని భావం.

"జంతుః" అనుటచే ఈ ప్రపత్తియందు ఏ ప్రాణికైనా అధికారం కలదని స్పష్టమవుతున్నది. ఇట్లు ఇక్కడ ప్రతిపదంచేతా వేదాంతోక్తాలైన ప్రపత్తి విషయాలైన పలుశాస్త్రార్థాలు నిరూపింపబడుతున్నాయి. జాగ్రత్తగా తిలకించువారికవి స్పష్టమవుతాయి.

వేంకటేశ్వరునియొక్క చరణారవిందాలను పట్టణంగా రూపించుటచే మహానగరంలో అపేక్షితాలైన సమస్తపదార్థాలు లభించునట్లు తచ్చరణారవిందాలను ఆశ్రయించువారికి కోరిన సమస్తపురుషార్థాలను ఇచ్చునది ఆ భగవచ్చరణారవిందయుగమే అనే తత్త్వార్థమిచట వివక్షితం.

**శ్లో॥ అభిముఖభావసంపదభిసంభవినాం భవినాం**
**క్వచిదుపలక్షితా క్వచిదభంగురగూఢగతిః ।**
**విమలరసావహా వృషగిరీశదయే! భవతీ**
**సపది సరస్వతీవ శమయత్యఘమప్రతిఘమ్ ॥ 52**

**ప్రతి :** హే వృషగిరీశదయే= వేంకటాధీశుని దయాదేవీ!, విమలరసావహా= నిర్దుష్టమగు స్నేహం కలిగినదానవు, (కాలుష్యంలేని తీర్థాన్ని ప్రవహింపజేయుదానవు), క్వచిదుపలక్షితా= కొన్ని ప్రదేశాలలో కొన్ని కాలాలలో జనులచే చూడబడియు, క్వచిదభంగురగూఢగతిః= కొన్ని దేశకాలాలలో ఎవ్వరిచేత చూడబడజాలని (అంతః ప్రవాహమును) ప్రవాహాన్ని కలిగిన దానవు అగు, భవతీ= నీవు, సరస్వతీవ= (అంతర్వాహినియగు) సరస్వతీనదివలె, అభిముఖభావసంపదభిసంభవినాం= నీ యందు ఆభిముఖ్యమనే సంపదకు అనుకూలమైన జన్మను



కలిగినటువంటి, భవినాం= సంసారులయొక్క, అప్రతిఘమ్= తీర్చుటకు శక్యంకాని, అఘం= పాపాన్ని, సపది= తత్క్షణమే, శమయతి= పోగొడుతున్నావు.

**అవ :** కిందటి శ్లోకంలో దయాదేవిని శరణుపొందిన అకించనాధికారుల విషయంలో ఆమె చేసే ఉపకారం వర్ణింపబడింది. ఈ శ్లోకంలో 'ఆ దయాదేవిని ఆశ్రయించినవారిలో కొందరికి కొన్ని సమయాలలో క్లేశ దుఃఖాదులు కలుగుచున్నవే! ఇది యుక్తమా' అనే సందేహానికి దృష్టాంత పూర్వకంగా సమాధానం ఇవ్వబడుతున్నది.

**తా :** ఇక్కడ దయాదేవిని సరస్వతీనదిగా చిత్రిస్తున్నారు. సరస్వతీనది అంతర్వాహిని. ఆ నది కొన్ని ప్రదేశాలలో కొన్ని సమయాలలో అందరికీ కనబడుతూ బహిరంగంగా ప్రవహిస్తుంది. మరికొన్ని ప్రదేశాలలో మరికొన్ని సమయాలలో ఎవ్వరికీ కనిపించకుండా భూమిలోపలనే నిర్మల తీర్థంతో ప్రవహిస్తుంది. అక్కడ కనబడక పోవుటచేత ఆ నది లేదని అనుకోకూడదు. అట్టి ఆ నది పుణ్యతీర్థమగుటచే దానియందు యావచ్ఛక్తి ఆభిముఖ్యం వహించువారిని పాపాలనుండి విడదీసి వారికి క్షేమమిస్తుంది. అట్లే దయాదేవికూడా ప్రపంచంలోని సర్వజంతువులమీద సర్వదా పరిపూర్ణమైన స్నేహరసాన్ని అనగా అనుగ్రహబుద్ధిని కలిగి ఉంది. కొన్ని సమయాలలో కొందరియందు స్పష్టంగా ఆ దయాదేవియొక్క అనుగ్రహం (ప్రవాహం) కనబడుతుంది. మరి కొందరియందు కొన్ని సమయాలలో ఆ అనుగ్రహప్రవాహం కనబడదు. అయినా ఆమెయొక్కప్రవాహం లోపల ఉన్నదని అనుకోవాలి. సుఖం కలిగినపుడు ఈశ్వరుని దయవలన కలిగినదిగా భావిస్తున్నాం. దుఃఖక్లేశాదులు సంభవించినపుడు ఈశ్వరుని దయలేదని అనుకొంటున్నాం. అది పొరపాటు. కష్టం సంభవించినపుడుకూడా దయ ఉన్నదనియే అనుకోవాలి. దయాదేవి హితాన్ని కలిగిస్తుంది. కఠిన ప్రకృతులకు వారి హితంకోసమే ఆమె కష్టముల నిస్తుంది. సుఖం ఇచ్చునపుడు

ఆమె స్పష్టంగా కనుబడుతున్నది. కష్టము నిచ్చునపుడు లోపలనే మరుగున పడియుండి మన హితానికి పాటుపడుతున్నది. అక్కడ కూడా ఆమె ఉన్నది. కాగా దయాదేవియే మన హితానికిగాను కష్టాలను ఇస్తున్నది అనియే శాస్త్రాల తాత్పర్యం అనే విషయాన్ని ఇక్కడ సరస్వతీ దృష్టాన్తంతో ఆచార్యులు స్పష్టం చేశారు. ఇట్లు సర్వజంతువులయందును హితబుద్ధికలిగిన దయాదేవి తనయందాభిముఖ్యం మాత్రం కలిగినవారిని కూడ ఉన్నతస్థితికితెచ్చి అతితర్వలో క్రూరమైన వాళ్ల పాపాలను సరస్వతీ నదివలెనే పోగొడుతున్నది.

ఈ ప్రపత్తి దశకంలో 'సర్వహితప్రావణ్యము' అనే దయాదేవియొక్క గుణం అవశ్య మపేక్షితమగుటచే నిరూపింపబడింది.

**శ్లో॥ అపి కరుణే! జనస్య తరుణేన్దువిభూషణతా-**
**మపి కమలాసనత్వమపి ధామ వృషాద్రిపతేః ।**
**తరతమతావశేన తనుతే నను తే వితతిః**
**పరహితవర్త్మనా పరిపచేలిమకేలిమతీ ॥ 53**

**ప్రతి :** హే కరుణే= ఓ దయాదేవీ, పరహితవర్త్మనా= పరహితమనేరూపం చేత, పరిపచేలిమకేలిమతీ= పరిపక్వం చెందిన లీలలుగల, తే= నీ యొక్క, వితతిః= విస్తారం (ప్రవాహం), జనస్య= జనులకు, తరుణేన్దు విభూషణతామపి= బాలచంద్రుని శిరమునగల శివునియొక్క స్థానాన్ని, కమలాసనత్వమపి= పురుషోత్తముని నాభికమలాన్ని ఆసనంగా కలిగిన చతుర్ముఖుని పదవిని, వృషాద్రిపతేః= వేంకటాద్రిపతియగు శ్రీనివాసునియొక్క (పరమపురుషునియొక్క), ధామపి= స్థానమును (మోక్షమును)కూడ, తరతమతావశేన= తారతమ్య వశంచే, తనుతే నను= ఇచ్చుటలేదా! (ఇచ్చుట నిశ్చయం).

**అవ :** గత శ్లోకద్వయంలో అకించనులగు మోక్షాధికారుల విషయంలో దయాదేవి అవలంబించే ప్రక్రియ వర్ణింపబడింది. ఇక్కడ మోక్షార్థులే



దయాదేవిని శరణు పొందాలా? ఐశ్వర్యం మొదలైన పురుషార్థాలను అపేక్షించువారి విషయంలో ఆమె చేయగలిగినది ఏమీలేదా? అని కొందరికి కలిగే సందేహాన్ని పోగొట్టి సర్వపురుషార్థాలు భగవద్దయవలననే కలుగుతున్నాయి అనే శాస్త్రార్థాన్ని ప్రసంగవశంగా నిరూపిస్తున్నారు.

**తా :** కిందటి శ్లోకంలో వ్యంగ్యంగా చెప్పబడిన 'పరహిత ప్రాపణ్యం' అనే దయాస్వరూపం ఇక్కడ వ్యక్తంగా చెప్పబడుతున్నది. దయాదేవియొక్క ప్రవాహం పరహితాన్ని చేయడమనే రూపాననే ఉంటుంది. ఇదే దయాదేవియొక్క పరిపక్వమైన లీల. పరమఫలమగు మోక్షాన్ని ప్రతి జంతువుకు ఇవ్వడానికి ఆమె సిద్ధంగా ఉంది. ఐతే వారువారు తమతమ పూర్వకర్మానుగుణంగా వేర్వేరు ఫలాలను కోరుతున్నారు. అందువల్ల వారివారి ప్రార్థనయొక్క తారతమ్యాన్ననుసరించి శివపదమో చతుర్ముఖపదమో లేక సాక్షాత్పరమపురుషపదమగు మోక్షమో దేనిని కోరుకొంటారో దానిని ప్రసాదిస్తున్నది. సర్వపురుషార్థాలను ఆమె వద్దనుండియే పొందాలి. ఉత్తమపురుషార్థంకోసం ప్రార్థించకుండా ఉండడం మన పొరపాటేగాని ఆమె దోషం కాదు.

**శ్లో॥ ధృతభువనా దయే త్రివిధగత్యనుకూలతరా**
**వృషగిరినాథపాదపరిరంభవతీ భవతీ ।**
**అవిదితవైభవాఽపి సురసిన్ధురివాతనుతే**
**సకృదవగాహమానమపతాపమపాపమపి ॥ 54**

**ప్రతి :** హే దయే= ఓ దయాదేవీ!, ధృతభువనా= పోషింపబడే సకల లోకాలు కలదానవు (జలాన్ని ధరించినదియు), త్రివిధ గత్యనుకూలతరా= త్రివిధ పురుషార్థాలకు అనుకూలురాలవగునట్టి (ఆకాశం భూమి పాతాళం అనే మూడు చోట్లా ప్రవహించి అందరికీ ఆనుకూల్యం ఒసంగునదియు), వృషగిరినాథ పాదపరిరంభవతీ= వేంకటాచలపతియగు పరమపురుషునియొక్క తిరువడి సంశ్లేషం కలిగినదానవు అగు, భవతీ=

నీవు, సురసింధురివ= దేవనదియగు గంగవలె, అవిదిత వైభవాఽపి= తెలియని వైభవం కలదానవైనను, సకృదపి= ఒకసారైనా, అవగాహమానం= స్నానంచేయువానిని (ఆశ్రయించిన వానిని), అపతాపం= తాపం పోయిన వానినిగా, అపాపమపి= పాపంలేని వానినిగా, ఆతనుతే= చేస్తున్నావు.

**అవ :** 'అభిముఖభావ' శ్లోకంలో శ్రీనివాసుని దయను సరస్వతీనదిగా చిత్రించారు. తదనంతర శ్లోకంలో మధ్య సంభవించిన సందేహానికి సమాధానమిచ్చారు. ఈ శ్లోకంలోను, పై శ్లోకంలోను దయాదేవిని గంగానదిగా చిత్రిస్తున్నారు.

**తా :** ప్రపత్తికి ఉద్దేశ్యమైన దయాదేవికిగల ఉత్కర్షం, అవశ్యమైన గుణాంతరాలు ఇక్కడ వర్ణింపబడుతున్నాయి. ప్రపత్తిచేయువాడు ప్రపత్తి విద్యను భక్తియోగంవలె చాలకాలం ఆవృత్తిచేయ నక్కరలేదు. ఒకేసారి భగవద్దయను శరణుపొందితే సరిపోతుంది. అలాగే ఆ దయాదేవియొక్క పూర్ణప్రభావాన్ని తెలుసుకోవాలన్న నిర్బంధం లేదు. ఆమె ప్రభావం ఎరుగనివాడు కూడ 'యదృచ్ఛయాఽపి సంస్పృష్టః దహత్యేవ హి పావకః' (నిప్పు అని తెలియక స్పృశించినా అది తన స్వభావాన్ననుసరించి దహించియే తీరును) అనునట్లు తన స్వభావానికి తగినవిధంగా శరణు పొందితే అట్టివారిని రక్షించియే తీరును అనునవియే ఆ ఉత్కృష్టగుణాలు. ఈ విషయాన్నే గంగానదిని దృష్టాంతీకరించి ఆచార్యులువారు వర్ణిస్తున్నారు. గంగానదికి దయకు గల సామ్యాన్ని పలువిశేషణాలతో విశదీకరిస్తున్నారు. గంగానది భువనమనే తీర్థాన్ని ధరిస్తున్నది. ఇంతేగాక సర్వలోకాలను తన పారిశుద్ధ్యంతో ధరిస్తున్నది. ఆ విధంగానే దయాదేవికూడా సర్వలోకాలను తన పాలనాధికారంతో ధరిస్తున్నది. గంగకు స్వర్గం భూలోకం పాతాళం అను మూడు లోకాలలోనూ గతి ఉంది. కనుకనే దానికి త్రిపథగా త్రిమార్గగా అనే పేర్లున్నాయి. దయాదేవికూడా త్రివిధగతి కలిగి ఉంది. అనగా ఐశ్వర్యం కైవల్యం మోక్షం అనే మూడు పురుషార్థాలకు అనుకూలమైంది. గంగ



భగవంతుని పాదారవిందాలనుండి పుడుతున్నది. దయకూడా భగవంతుని పాదాలనుండే మొదట పుడుతున్నది. ఈ విషయం 'రూఢా వృషాచలపతేః పాదే' అను శ్లోకంలో నిరూపింపబడింది. గంగయొక్క ప్రభావం తెలియనివాడు కూడా ఒకసారి దానిలో స్నానం చేస్తే ఆ నది తన స్వభావానికి తగినట్లు వాని శరీరంలోని బాహ్యతాపాలను పోగొట్టి ఆత్మగతమైన పాపాలను కూడా పోగొడుతుంది. అటులనే దయాదేవి తన ప్రభావం ఎరుగని వాడైనా ఒకసారి శరణమందితే తావన్మాత్రంతోనే స్వస్వభావానుగుణంగా వానికిగల ఆధిభౌతికాధిదైవికాధితాపాలను, వానికి మూలకారణమైన పాపాలను కూడా పోగొట్టి ఉత్తమపురుషార్థం ప్రసాదిస్తున్నది.

ప్రపత్తి దశకంలో దయాదేవియొక్క ఈ ఉత్తమగుణం అవశ్య నిరూపణీయమని తలచిన ఆచార్యులు దీనిని ఎంతో మనోహరమైన ప్రక్రియలో ప్రకటించారు.

కిందటి 52-వ శ్లోకంలో సరస్వతీనదీసామ్యాన్ని పై శ్లోకంలో గంగానదీసామ్యాన్ని వర్ణిస్తున్న ఆచార్యులు ఈ శ్లోకంలో యమునానదీ సామ్యాన్ని (దయాదేవికి) వర్ణిస్తున్నారు. రెండు శ్లోకాలలో గంగాసామ్యం చెప్పడంకంటె ఈ శ్లోకంలో యమునాసామ్యము నంగీకరించి ప్రసిద్ధమైన మూడు పుణ్యనదులసామ్యాన్ని ఈ ప్రకరణంలో వర్ణించడం చాల యుక్తం' అని కొందరు పెద్దల అభిప్రాయం. దాని కనుగుణంగా ఈ శ్లోకంలో ఉన్న 'త్రివిధ గత్యనుకూలతరా' 'వృషగిరినాథ పాదపరిరంభవతీ' మొదలగు విశేషణాలు అమరి ఉన్నాయని వారి హృదయం. ఇక్కడ ప్రాచీన వ్యాఖ్యానాలలోని పెద్దల అభిప్రాయాలను అనుసరించి మా వ్యాఖ్యానం ప్రవృత్తమైనదనే విషయం సహృదయులు గమనింపగలరు.

**శ్లో॥ నిగమసమాశ్రితా నిఖిలలోకసమృద్ధికరీ**
**భజదఘకూలముద్రుజగతిః పరితప్తహితా ।**

**ప్రకటిత హంసమత్స్యకమఠాద్యవతారశతా**
**విబుధసరిచ్ఛ్రియం వృషగిరీశదయే! వహసి ॥ 55**

**ప్రతి :** హే వృషగిరీశదయే= ఓ వేంకటాధీశుని దయాదేవీ!, నిగమ సమాశ్రితా= వేదాన్ని పొందినదానవు (వేదప్రతిపాద్యమయినట్టియు), నిఖిలలోక సమృద్ధికరీ= సర్వలోకానికి సమృద్ధి నొసంగుదానవు, భజదఘకూలముద్రుజగతిః= ఆశ్రితులయొక్క పాపమనే గట్టును పెకలించివేయు గమనవతివియు, పరితప్తహితా= మిక్కిలి తాపమునొందిన వారికి హితకరివి, ప్రకటిత హంసమత్స్యకమఠాద్యవతారశతా= ప్రకాశింపజేయబడిన హంస–మత్స్య–కూర్మాద్యనేక భగవదవతారాలు కలదానవు అయిన (ప్రకాశపరచు పలు రేవులను గలిగినట్టి) త్వం= నీవు, విబుధ సరిచ్ఛ్రియం= దేవనదియగు గంగయొక్క శోభను, వహసి= వహిస్తున్నావు.

**అవ :** ఈ శ్లోకంలో గంగాసామ్యం వర్ణింపబడుతున్నది.

**తా :** గంగానదియొక్క ప్రభావం వేదాలలో విశేషంగా ప్రతిపాదింపబడి ఉంది. స్వర్గం, భూలోకం, పాతాళం అను త్రిలోకాలలోను తన ప్రవాహం చేత గంగానది విశేష సమృద్ధిని కలుగజేస్తున్నది. ఆ నది స్నానాదులను ఆచరించువారియొక్క పాపాలను పూర్తిగా నశింపజేయు స్వభావంకలది. మిక్కిలి తాపం పొందినవారికి తన శైత్యమాధుర్యాది స్వభావాలచే పరమహితకారి అవుతున్నది. హంస, మత్స్యం, కూర్మం మొదలగు వివిధ జలజంతువులను ప్రదర్శించే పలురేవులు కలిగినది. ఈ అర్థాలను ప్రతిపాదించే విశేషణాలు దయాదేవికి కూడా అమరియుండుటచే ఇక్కడ దయను గంగగా చిత్రించారు.

భగవద్దయాదేవి వేదాలలో విశేషంగా ప్రతిపాదింపబడి ఉంది. భగవద్దయ ఏ వేదంలో ఎలా ప్రతిపాదింపబడి ఉన్నదనగా ఏతద్విశదీకరణమే



ఈ దయాశతకంయొక్క పరమోద్దేశమని చెప్పవలసి ఉంది. వేదాలలో భగవానుడు నిర్వహించే జగత్సృష్టి–రక్షణ–సంహారం మొదలగు వ్యాపారాలు, పాంచరాత్రాగమాదులలో కనిపించే వివిధావతారాలు ప్రతిపాదింపబడి ఉన్నాయి. ఈ సృష్ట్యాది సర్వవ్యాపారాలు, పరవ్యూహాది సర్వావతారాలు, భగవంతుని దివ్యమంగళవిగ్రహం, కిం బహునా? సర్వమూ దయాదేవియొక్క కార్యాలే అని ఈ స్తోత్రంలో మిగుల సుందరంగా అక్కడక్కడ నిరూపింపబడినాయి. అందువల్ల దయయొక్క విచిత్రమైన కార్యాలను ప్రతిపాదించే వేదం ఆదిగాగల శాస్త్రాలన్నీ దయనే (కార్యముఖేన) ప్రతిపాదిస్తున్నట్లు తెలియజేయబడుతున్నదిగదా! ఇలాగే భగవంతునియొక్క సకల కల్యాణగుణాలు దయాదేవియొక్క కింకరవర్గాలే అనికూడా ప్రతిపాదింపబడింది. అందువల్ల భగవద్గుణాలను వర్ణించే వేదభాగాలు కూడా మరుగున దయనే పొగడినవిగా చెప్పబడుతున్నాయి. దయాదేవి సమస్త లోకాలకు సర్వసమృద్ధిని కలుగజేస్తున్నది. తనను శరణు పొందేవారియొక్క పుణ్యపాపాలనే ద్వివిధకర్మలను నిశ్శేషంగా అంతరింపజేస్తున్నది. సంసారతాపదగ్ధునకు పరమహితకారిణి అవుతున్నది. భగవంతునియొక్క హంస మత్స్యాది జ్ఞానప్రదాలైన వివిధావతారాలను కలుగజేస్తున్నది. భగవదవతారాలన్నీ దయాకార్యాలే గదా! కాగా, గంగకుగల స్వభావాలన్నీ దయాదేవికి ఉన్నాయి కాబట్టి ఈమెను గంగాదేవికి సమంగా చెప్పవచ్చునని ఆచార్యుల అభిప్రాయం.

ఇక్కడ నిరూపింపబడిన దయాగుణాలన్నీ ప్రపత్తిచేసే అధికారికి తెలియవలసినవి కనుక ఈ దశకంలో అని వర్ణింపబడినాయి.

**శ్లో॥ జగతి మితంపచా త్వదితరా తు దయే! తరళా**
**ఫలనియమోజ్ఝితా భవతి సంతపనాయ పునః ।**
**త్వమిహ నిరంకుశప్రశకనాదివిభూతిమతీ**
**వితరసి దేహినాం నిరవధిం వృషశైలనిధిమ్ ॥ 56**

**ప్రతి :** హే దయే!= ఓ దయాదేవీ!, జగతి= ప్రపంచంలో, త్వదితరా= నీకంటె వేరైన, దయా తు= దయ అయినచో, మితంపచా= చాల అల్పమైన ఫలాల నిచ్చునదిగాను, తరళా= చంచలమైనదిగాను, ఫలనియమోజ్ఝితా= నిశ్చయంగా ఫలముల నొసగే నియమం లేనిదిగాను, సంతపనాయ పునః = ఆధ్యాత్మికాదితాపాలను కూడా మరల ఇచ్చునదిగాను, భవతి= అవుతున్నది, నిరంకుశప్రశకనాది విభూతిమతీ= ఎవరిచేనైనా అడ్డగించుటకు వీలుగాని నిరంకుశ శక్తి, స్వాతంత్ర్యం మొదలగు గుణాలను విభూతిగా కలిగిన, త్వం= నీవు, ఇహ= ఈ లోకంలో, దేహినాం= ప్రాణులకు, నిరవధిం= అపరిమితమైన, వృషశైలనిధిం= వేంకటగిరియందుండు నిధిని (శ్రీనివాసుని), వితరసి= ఇస్తున్నావు.

**అవ :** కింది శ్లోకంలో గంగాసామ్యంచేత శ్రీనివాసుని దయకుగల సర్వలోక సమృద్ధికరత్వాది గుణాలు అనుభవింపబడినాయి. తద్ద్వారా ఇతరదయల స్వభావాలు కూడా స్మృతిపథం అధిరోహించగా వానియొక్క కొరతలను, వాని కెదురుగా శ్రీనివాసుని దయకుండు సంపూర్తిని ఈ శ్లోకంలో వర్ణిస్తున్నారు. మోక్షార్థంగా ప్రపత్తిచేయువాడు ఇతర దయలకు, భగవద్దయకుగల తారతమ్యాన్ని అవశ్యం తెలుసుకోవాలి. అపుడే పై శ్లోకంలో చెప్పబోవు మహావిశ్వాసం మొదలగు ప్రపత్త్యంగాలు పూర్ణంగా సిద్ధిస్తాయి. కాగా, అవశ్యనిరూపణీయమైన ఈ విషయాన్ని ఈ శ్లోకంలో (పూర్వార్థంచే ఇతరదయలకుగల కొరతను - ఉత్తరార్ధంచే శ్రీనివాసుని దయకుగల సంపూర్తిని) నిరూపిస్తున్నారు.

**తా :** శ్రీనివాసదయేతరాలైన కొన్ని బ్రహ్మరుద్రాదిదయలు, లౌకిక ప్రభువుల దయలు ఫలము నిచ్చుటకు శక్తిలేనివి. ఇవ్వబడు ఫలాలుకూడా చాల పరిమితాలుగానే ఉంటాయి. మరియు ఆ దయలు నశ్వరాలు. అనగా మనం ఆ బ్రహ్మరుద్రాదుల నుపాసించి వారికి దయ గలిగినప్పటికి ఆ దయచే మనకు ఫలం లభించుటకుముందే వారు నశించినయెడల తద్దయలుకూడా నశిస్తాయి. కావున నిశ్చయంగా ఫలాలు కలుగుతాయని నమ్ముటకు వీలులేదు. ఈ దినం మనకు అనుకూలురుగా ఉండినచో దయ ఉద్భవిస్తుంది. రేపు ప్రతికూలురైతే ఆ దయ నశించి విపరీత ఫలప్రదమగు కోపంగా మారుతుంది. ఒకవేళ వారి దయతో ఒక ఫలం పొందినా ఆ ఫలం నిత్యంగాను, అపరిచ్ఛిన్నంగాను ఉండదు. ఆ స్వల్పఫలం ముగిసిన తరువాత మరల సంసారతాపత్రయం మనలను పీడిస్తుంది. శ్రీనివాసదయ అన్ని విషయాలలోను దీనికెదురైనది. భగవంతుని యొక్క నిరంకుశ స్వాతంత్ర్యం, నిరంకుశశక్తి మొదలగు గుణాలను దయ తనకు అనుకూలంగా చేసుకొని వాటిని సర్వ ప్రాణిహితానికే ఉపయోగపరుస్తున్నది. ఈ శ్రీనివాసదయ ప్రసాదించే ఫలాలు అపరిమితంగా ఉంటాయి. నిత్యమగు మోక్షాన్నికూడా ఆమె ఇవ్వటానికి శక్తి కలిగి ఉంది. ఆమె ఒక ప్రాణిని విషయీకరించినయెడల వానికి కర్మాధీనంగా ఏర్పడే పలు ప్రతిబంధకాలను తగురీతిలో పోగొట్టి ఏదైన ఒక దినాన పూర్ణ ఫలమును నిశ్చయంగా ఇస్తుంది. ఆమెచే మోక్షమనే పూర్ణఫలం పొందినవానికి మరల సంసారతాపం ఉండదు. ఇంత మాత్రమేగాక భగవద్దయను పొందినవానికి ఇహలోకంలోనే మోక్షానుభవమని చెప్పదగిన వేంకటగిరిలో ఉన్న శ్రీనివాసుడనే ఒక పెద్ద నిధియొక్క అనుభవాన్నిచ్చి సంతోషింపజేస్తున్నది. ఉపనిషత్తులుకూడా పరమపురుషుని నిధిగా చెపుతున్నాయి.



**శ్లో॥ సకరుణలౌకికప్రభుపరిగ్రహనిగ్రహయోః**
**నియతిముపాధిచక్రపరివృత్తిపరంపరయా ।**
**వృషభమహీధరేశకరుణే! వితరంగయతాం**
**శ్రుతిమితసంపది త్వయి కథం భవితా విశయః ॥ 57**

**ప్రతి :** హే వృషభమహీధరేశకరుణే= ఓ వేంకటాధీశుని దయాదేవీ!, సకరుణలౌకికప్రభుపరిగ్రహనిగ్రహయోః= దయతోగూడిన లౌకికప్రభువుల అనుగ్రహనిగ్రహాలయొక్క, నియతిం= వ్యవస్థను, ఉపాధిచక్రపరివృత్తి

పరంపరయా= ఆనుకూల్య–ప్రాతికూల్య కారణాలయొక్క పరంపరచే కలిగినదిగా, వితరంగయతాం= నిశ్చయించువారికి, శ్రుతిమితసంపది= వేదాలచే ప్రకటింపబడిన వైభవంకలిగిన, త్వయి= నీ యందు, విశయః= సంశయం, కథం భవితా= ఎలా కలుగుతుంది? (కలుగదు).

**అవ :** కింది శ్లోకంలో ఇతర దయలకంటె శ్రీనివాసునిదయకు గల ఉత్కర్ష నిరూపింపబడింది. అట్టి దయాదేవియందు ప్రపత్తిచేయువానికి సంశయం లేకుండడం, దృఢమైన విశ్వాసం అవశ్యాపేక్షితాలు. భగవద్దయాస్వరూపాన్ని చక్కగా పరిశీలించేవారికి సంశయ ప్రసక్తియే లేదని ఈ శ్లోకంలో చెపుతున్నారు.

**తా :** లోకంలో ఉన్న ఒక దయగల ప్రభువు ఆ యా దేశకాలాలలో ఒకని అనుగ్రహించడానికి, నిగ్రహించడానికి కారణమేమంటే ఆ పేదవాడు ఆ ప్రభువునందు అనుకూలుడుగాను, ప్రతికూలుడుగాను ఉండడం. వీడు ఎప్పుడనుకూలుడవుతున్నాడో అప్పుడు ప్రభువనుగ్రహిస్తున్నాడు. ఎప్పుడు ప్రతికూలుడవుతున్నాడో అప్పుడు నిగ్రహిస్తున్నాడు. అందువలన ప్రభువు అనుగ్రహం కోరినట్లయితే అవశ్యం ఆయనయెడల అనుకూలతను ప్రదర్శించాలి. అలా ఆనుకూలుడైతే నిశ్చయంగా అనుగ్రహ మేర్పడుతుంది. లౌకికప్రభువు విషయంలోనే ఇట్టి నియమముండగా వేదాలలో విశేష వైభవోపేతంగా వర్ణింపబడిన శ్రీనివాసుని దయాదేవి విషయంలో అనుకూలుడుగా ఉంటే తదనుగ్రహం ఉద్భవించుననే విషయంలో సందేహం ఉండదు. అనుకూలుడుగా ఉండినయెడల దయాదేవి అనుగ్రహం నిశ్చయంగా పొందవచ్చు. తన మహాపాపాలను గురించి సంశయింప నవసరంలేదు. ఇంతవరకు మహాపరాధి అయినా ఇదివొుదలు అనుకూలుడుగా ఉంటానని నిశ్చయించుకొని దృఢమగు విశ్వాసంతో ఇక్కడ శరణు పొందవచ్చు. ఇందుచేత ప్రపత్తికి ముఖ్యాంగమైన మహావిశ్వాసం ఎలా ప్రతిపాదింపబడుతున్నదో అట్లే ఆనుకూల్యసంకల్పం,



ప్రాతికూల్యవర్జనం అనే అంగాలుకూడా ఈ శ్లోకంలో ప్రతిపాదింప బడుతున్నవని గ్రహించాలి. ప్రపత్తిచేయువానికి ముఖ్యమైన ఈ అంగాలయొక్క స్వరూపం, దీనిని ప్రపత్తిలో ఉపయోగించే ప్రక్రియ అవశ్యం తెలియదగినవి కనుక ఈ దశకంలో వీటిని నిరూపించారు.

ఇక్కడ లౌకికప్రభువు దృష్టాంతంలో ఒక సంశయం ఉద్భవించవచ్చు. అదేమంటే లౌకికప్రభువు ప్రతికూలుని విషయంలో నిగ్రహించే విధంగా దయాదేవికూడా ప్రతికూలునియందు నిగ్రహించునా? అని. దీనికి సమాధానం "శ్రుతిమితసంపది" అను పదంతో చెప్పబడుతున్నది. వేదాలు భగవన్మహిమలను "అజ్ఞాతనిగ్రహాలు" (నిగ్రహమనే విషయం ఎరుగనివారు) అని నిరూపించుటచేత భగవన్మహిష్యగ్రగణ్య, లక్ష్మీస్వరూపిణి అయిన దయాదేవి నిగ్రహించడం లేదని కొందరు సమాధానం చెపుతున్నారు. మరికొందరు నిగ్రహానుగ్రహాలను ఉభయవిషయాలలో లౌకికప్రభు దృష్టాంతాన్ని వివక్షించినా బాధకం లేదు. దయాదేవి కిక్కడ ప్రతికూలురయందు నిగ్రహం ఉంది. కాని దయాదేవి చేయు నిగ్రహాలన్నీ అనుగ్రహంలోనే పర్యవసిస్తాయి. తత్కాలంగా మన కప్రియం కావడంవల్ల నిగ్రహంవలె ఉండినా లఘువైన అలాంటి శిక్షణలతో మనకుగల ప్రతికూలాచరణకు కారణభూతమైన పాపాలను పోగొట్టి సన్మార్గానికి తిప్పి చివరకు అనుగ్రహాన్నే కలుగజేస్తుంది. ఈ విషయమే "శ్రుతిమితసంపద" అను పదంవలన వివక్షితం అని చెపుతున్నారు.

**శ్లో॥ వృషగిరికృష్ణమేఘజనితాం జనితాపహరాం**
**త్వదభిమతిం సువృష్టిముపజీవ్య నివృత్తతృషః ।**
**బహుషు జలాశయేషు బహుమానమపోహ్య దయే!**
**న జహతి సత్పథం జగతి చాతకవత్కృతినః ॥ 58**

**ప్రతి :** హే దయే!= ఓ దయాదేవీ!, జగతి= లోకంలో, కృతినః= భాగ్యవంతులు (అళ్వార్లు ప్రభృతులు), చాతకవత్= చాతకపక్షివలె,

వృషగిరికృష్ణ మేఘజనితాం= వేంకటగిరియందుండు కృష్ణుడను కృష్ణమేఘంనుండి ఉద్భవించినది, జనితాపహరాం= జనన పరపంపరచే గలుగు తాపాన్ని పోగొట్టునది, త్వదభిమతిమ్= నీ అభిమానమనే, సువృష్టిమ్= మంచివర్షాన్ని, ఉపజీవ్య= పొంది, నివృత్తతృషః= దప్పిలేనివారుగాను, బహుషు జలాశయేషు= పలు మడుగులలో (జడులయందును), బహుమానం= ఆదరాన్ని, అపోహ్య= వదలి, సత్పథం= సన్మార్గాన్ని (ఆకాశాన్ని), న జహతి= వదలుట లేదు.

**అవ :** కింది శ్లోకంలో ఆనుకూల్యసంకల్పాదులగు కొన్ని ప్రపత్త్యంగాలు వర్ణింపబడినాయి. ఇక్కడ భగవద్దయనే తనకు రక్షణ కల్పించేదిగా వర్ణించుట, వేరొక శరణం లేకుండుట అను ఆదిగాగల గోప్తృత్వవరణ కార్పణ్యాదులగు మరికొన్ని అంగాలు ప్రస్తావింపబడుతున్నాయి. ఈ అంగాలను ప్రస్తావించు వ్యాజంతో ఆళ్వార్లుబోటి మహనీయుల అనుష్ఠానాన్ని తెలియపరచి తద్ద్వారా భగవద్దయను కీర్తిస్తున్నారు. పూర్వోక్తాంగాలవలె ఈ అంగాలుకూడా ప్రపన్నునికి తప్పక తెలియదగినవి కావున ఈ దశకంలో చెప్పబడుతున్నాయి.

**తా :** చాతకపక్షులు లోకంలో చెరువు, సరస్సులు మొదలగు అనేక తీర్థాశయాలుండినా ఆకాశంనుండి కురిసే వాననీటి మీదనే ఆధారపడి ఆ నీటిని తాగి తమ దప్పిని పోగొట్టుకొంటున్నాయి. అటులనే ఆళ్వారులను పోలిన భాగ్యవంతులు లోకంలో ఎందరో దేవతలుండినా వారిని జలాశయాలుగా తలచి వారియందాదరం లేక వేంకటాచలమందు నివసించే కృష్ణరూపుడగు శ్రీనివాసమేఘంనుండి ఉద్భవించిన దయాదేవియొక్క అభిమానమనే వర్షాన్ని తమ కవలంబంగా తలచి ఆమెనే ఆశ్రయించి సంసారతాపాన్ని ఉపశమింపజేసుకొంటున్నారు. ఇదియే వేదాన్ననుసరించి నడచు పెద్దలయొక్క త్రోవ. ఈ రీతిగా భగవద్దయను శరణంగా పొందే పరమైకాంతులను చాతకపక్షులుగా ఆచార్యులు చిత్రించారు.



**శ్లో॥ త్వదుదయతూలికాభిరమునా వృషశైలజుషా**
**స్థిరచరశిల్పినైవ పరికల్పితచిత్రధియః ।**
**యతిపతియామునప్రభృతయః ప్రథయన్తి దయే**
**జగతి హితం న నస్త్వయి భరన్యసనాదధికమ్ ॥ 59**

**ప్రతి :** హే దయే!= ఓ దయాదేవీ!, వృషశైలజుషా= వేంకటాద్రిపై వేంచేసి యుండు, అమునా= ఈ, స్థిరచరశిల్పినైవ= సర్వచరాచరాలను సృష్టించు శ్రీనివాసుడను శిల్పిచేతనే, త్వదుదయతూలికాభిః= నీ ఆవిర్భావమును కలుగచేయు భగవత్సంకల్పాలనే వర్ణం పూసే కుంచెలచేత, పరికల్పితచిత్రధియః= కల్పించబడిన విచిత్రాలుగల, యతిపతియామున ప్రభృతయః= ఉడయవర్లు ఆళవందార్లు మొదలగు పరమాచార్యులు, నః= మాకు, త్వయి= నీయందు, భరన్యసనాత్= భరన్యాసం (శరణాగతి) కంటె, అధికం= గొప్పదగు, హితం= మేలు, న= లేదు, (ఇతి= అని) ప్రథయన్తి= ప్రకాశపరస్తున్నారు.

**అవ :** కింది శ్లోకం వరకు భగవద్దయయందు ప్రపత్తి ననుష్ఠించువానికి అవశ్యజ్ఞాతవ్యమైన అంశాలు నిరూపింపబడినాయి. పై శ్లోకంలో సాక్షాత్తు ప్రపత్తిని స్వానుష్ఠానముఖంగా తెలియజేస్తున్నారు. ఈ శ్లోకంలో అట్టి ప్రపత్తిమార్గాన్ని, భగవంతునియందు విశేషంగా భక్తిచేసి తద్ద్వారా ఆ ఔపనిషదపరమపురుషుని విశేషానుగ్రహం పొంది దానిచే ఉత్తమజ్ఞానానికి చెందిన శ్రీభాష్యకార్లు ఆళవందార్లు నాథమునులు నమ్మాళ్వార్లు వంటి మహనీయులు దీనికంటె ఉత్తమమైన మార్గాంతరం మనబోటి అశక్తులకు లేదనుకొన్నారు. ఆ మార్గమే చాలశ్రేష్ఠమని పొగడి తమయొక్క వివిధోపదేశాలచేత, గ్రంథాలచేత, అనుష్ఠానంచేత నిరూపించి ఉన్నారు అని చెప్పి ఈ ప్రపత్తిమార్గానికి భగవత్స్మృతి, తదనుయాయులగు భాగవతుల పరిగ్రహం ఉంది కాబట్టి ఇది పరమవైదికమగు ప్రాచీనమార్గమని చూపించి,

జ్ఞానశక్తులులేని మనబోటివారికి ఇదే ఉత్తమమార్గమని నిరూపిస్తున్నారు. కింది శ్లోకంలో ప్రపత్తి మార్గాన్ని విశేషంగా ఆదరించే ఆళ్వార్లు స్మరింపబడినారు. ఈ శ్లోకంలో అట్టి ఆచార్యులు స్మరింపబడుతున్నారు.

**తా :** ఇక్కడ శ్రీ భాష్యకారులు ఆళవందారులను పోలిన పరమాచార్యులు జ్ఞానాన్ని చిత్రంగా చిత్రిస్తున్నారు. ఈ విజ్ఞానచిత్రాన్ని రచించింది సర్వచరాచరప్రపంచనిర్మాత, ఉత్తమశిల్పి అగు శ్రీనివాసుడే. అతనికి సాధనంగా ఉండే కుంచికలు ఆయన సంకల్పాలే. లేఖనమందలి వర్ణం దయయే. దయ అనే వర్ణంలో ముంచిన సంకల్పములనే కుంచికలతో రాయబడిన చిత్రాలే పూర్వాచార్యుల విజ్ఞానాలు. కుంచికలు కనబడకపోయినా వర్ణం ఎలా చిత్రంలో కనబడుతూ ఉంటుందో, అట్లే భగవంతుని దయ ఈ ఆచార్యులయొక్క జ్ఞానంలో నిండి నిలిచి ఉంది. ఆ జ్ఞానమే శబ్ద రూపంగా వెలుపల ప్రవహిస్తున్నది. కావున ఆ ఆచార్యుల శ్రీసూక్తులలో కూడా ఆ దయాప్రవాహం ప్రవహించుటకు ఆటంకం లేదు. భగవద్దయా ప్రవాహం వారి శ్రీసూక్తులలో ప్రవహించుట అనగా ఆ దయాదేవి యొక్క పూర్ణప్రభావం శ్రీసూక్తులతో ప్రకాశించుటయే. దీనిని ఇంకా వివరిస్తే అనాది కాలంగా అతిఘోరంగా అనంతాపరాధాలుచేసి అతిదుస్సహమగు ఈ సంసారచక్రంలో భ్రమిస్తున్న మనబోటి వారలకు 'నాకు గత్యంతరం లేదు. నీవే రక్షించి ఈ కష్టాన్ని పోగొట్టి నాకు ప్రాప్తమైన సుఖం కలిగించు' అని ప్రార్థించి దయాదేవిచరణారవిందాలను పట్టుకొని శరణాగతి చేస్తే ఇంతకాలం చేసిన అపరాధాలను క్షమించి ఆ పాపాలను పోగొట్టి మోక్షపర్యన్తమైన సుఖము నిచ్చు పరమోదారస్వభావం కలది ఆ దయాదేవి అని నిరూపించడమే అవుతుంది.

ఇట్లు సులభమైన క్షేమోపాయం వారు చూపించి ఉన్నారు కాబట్టి మన పూర్వులవలంబించిన ఆ ప్రపత్తి మార్గాన్నే మనం కూడా అవలంబిద్దాం. అని ఈ ప్రబంధ నిర్మాతయగు శ్రీదేశికులవారి తిరువుళ్లం.



ఈ శ్లోకంలో 'త్వదుదయతూలికాభిః' అనే పదానికి 'నీ ఆవిర్భావం అనే కుంచికలచే' అని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. అలాగైతే దయయే కుంచిక అవుతున్నది. శ్రీదేశికులవారు యాదవాభ్యుదయ కావ్యంలో,

**క్రీడాతూలికయా స్వస్మిన్ కృపారూషితయా స్వయమ్ ।**
**ఏకో విశ్వమిదం చిత్రం విభుః శ్రీమానజీజనత్ ॥**

అనే శ్లోకంలో విశ్వమనే చిత్రానికి దయను వర్ణంగా పెట్టుకొనినట్లు చెప్పారు. దాని ననుసరించి ఈ విజ్ఞానచిత్రానికి కూడా దయయే వర్ణంగా ఉండవచ్చును అనుకొని పైన చెప్పిన ప్రకారం వ్యాఖ్యానింపబడింది. ఈ వ్యాఖ్యానానికి తగినట్లు పదవ్యుత్పత్తిని సరిజేసుకోవాలి.

**శ్లో॥ మృదుహృదయే దయే మృదితకామహితే మహితే**
**ధృతవిబుధే బుధేషు వితతాత్మధురే మధురే ।**
**వృషగిరిసార్వభౌమదయితే మయి తే మహతీం**
**భవుకనిధే హి భవమూలహరాం లహరీమ్ ॥ 60**

**ప్రతి :** మృదుహృదయే= మృదువగు హృదయం కలిగినట్టియు, మృదితకామహితే= విరక్తులయందు హితచింత కలిగినట్టియు, మహితే= గొప్పదానవుగా పొగడబడునట్టియు, ధృతవిబుధే= ధరింపబడిన జ్ఞానులు కలిగినట్టియు, బుధేషు= జ్ఞానులయందు, వితతాత్మధురే= ఉంచబడిన తనభారమును (జీవసంరక్షణ కార్యాలను) కలిగినట్టియు, మధురే= ఇంపైనట్టియు, వృషగిరిసార్వభౌమదయితే= వేంకటాద్రీశుని ప్రియమహిషి అయినట్టియు, భవుకనిధే= సర్వమంగళములకు నిధిగా ఉన్న, హేదయే= ఓ దయాదేవీ, (త్వం= నీవు) భవమూలహరాం= సంసారవృక్షానికి వేరునుపెల్లగించగల, తే= నీయొక్క, మహతీం= గొప్పదైన, లహరీం= ప్రవాహాన్ని, మయి= నా యందు, విదేహి= ఉంచు, (ప్రవహింపజేయుము).

**అవ :** కింది శ్లోకంలో ఎట్టి భేదంలేక, సర్వచేతనులు ఉజ్జీవించుటకు పాయమైన ప్రపత్తిమార్గాన్ని ప్రపంచానికి చూపిన పరమ దయగల

పూర్వాచార్యులయొక్క ప్రభావం వర్ణింపబడింది. ఈ శ్లోకంలో అట్టి ఆచార్యులు ప్రదర్శించిన మార్గాన్ననుసరించి భగవంతునియందు చేయవలసిన ప్రపత్తిని, భగవద్దయాదేవిని చేతనసమాధిలో నిలిపి ఆమెయందనుష్ఠించి తన అభీష్టంకోసం ప్రార్థిస్తున్నారు. భగవంతునికిగల ప్రభావమంతా ఈ దయాదేవిసంబంధం చేతనే కనుక ఈమెయే ముఖ్యంగా ఉపాసింపదగినది అని బహుధా నిరూపించి ఉన్నారు. దాని ననుసరించి ఇక్కడ ఆమెనే ప్రార్థించుట.

**తా :** 'వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః' అన్నట్లు ఎవరికి ఏవిధమైన కష్టమేర్పడినా దానిని సహించక హృదయం ద్రవించి కష్టపడు నట్టి స్వభావం కలది దయాదేవి. మరియు వైషయికమైన ఆశలను ఉపసంహరించుకొని విరక్తులై భగవత్ప్రీత్యర్థంగానే సర్వకర్మలననుష్ఠించు పరమైకాంతుల విషయంలో మిక్కిలి హితాన్ని కోరి ఉండునది దయాదేవి. తాత్కాలికంగా అప్రియంవలె కొన్ని సంఘటన లేర్పడినా అవి పరమహితంగానే చేయబడినవని తరువాత స్పష్టపడుతుంది. పరమైకాంతులమీద పరమప్రీతిచేతనే ఆ ఘటనలు చేయబడుతూ ఉంటాయని శాస్త్రజ్ఞులకు తెలుసు. ఇలా పరమైకాంతులయందు మిక్కిలి అభిమానం కలిగి ఉండడంచేతనే శాస్త్రాలలో ఆమెను ఆధారంచేసుకొని నవలంబించి సులభంగా మోక్షం పొందదగు మార్గం విశేషంగా ప్రశంసింపబడి ఉంది. ప్రపత్తిని పొగడితే దయాదేవిని ప్రశంసించినట్లే అవుతుంది. ప్రపత్తి కేవలం దయనే అవలంబించినదిగదా! మరియు జ్ఞానులను ధరించునది దయ. అనగా వారికి 'ఉణ్ణుం శోరు' అను రీతిలో ధారక పోషక భోగ్యాలుగా ఉండునది దయ. ఇక్కడ 'మృదితకామ' అను చోటున పరమైకాంతులు 'ధృతవిబుధే' అనుటచే ఆళ్వారులు, 'బుధేషు వితతాత్మధురే' అనుటచే ఆచార్యులు వివక్షింపబడుతున్నారనుట ఉచితమని తోస్తుంది. కావున ఆళ్వారులను పోలిన జ్ఞానులను ధరించేది దయాదేవి. నాథమునులు, ఆళవందారు, భాష్యకార్లు మొదలగు పరమాచార్యులయందు తనభారాన్ని



అప్పగించునది దయాదేవి. అనగా కింది దశకాన అంత్య శ్లోకంలో 'సద్దేశికాత్మా' అని చెప్పినట్లు ఆచార్యులు దయాదేవియొక్క రూపాంతరం కాబట్టి చేతనసంరక్షణమనే తన కార్యాన్ని ప్రాయశః వారలకు అప్పగించి ఉన్నదని భావం. లోకంలో హితవరులు కొందరు పలుమార్లు హితాలను ఆచరించినా ఆశ్రయించునప్పుడు సుముఖంగా లేకపోవడం ఉంటుంది. అలాకాకుండా దయాదేవి క్షీరసేవనంవలె ఎప్పుడూ మధురంగానే ఉంటుంది. ఇన్ని విశేషాలు ఈమెలో ఉండడానికి కారణమేమంటే సర్వప్రపంచ సార్వభౌముడగు శ్రీనివాసుడు చెప్పుచేతలలో మెలగుతూ ఈమెకు పరమవిధేయుడుగా ఉండడమే. ఆతడిలా విధేయుడుగా ఉండటానికి కారణం కూడా ఈమె సర్వమంగళనిధిగా ఉండుటచే ఈమె యొద్దనుండి మంగళాన్ని సేకరించి ప్రపంచానికి ఇవ్వవలసి ఉండుటయే. ఇట్టి మహాప్రభావంగల దయాదేవిని సంబోధించి 'ఓ దయామాతా! ఈ సంసారమనే మహావృక్షాన్ని వేరుతో పెకలించి తోసి తిరిగి మొలవడానికి అవకాశం లేకుండా చేయునట్లు నీయొక్క గొప్ప ప్రవాహాన్ని మిక్కిలి పాపియగు నాయందు ప్రవహింపజేయి' అని ప్రార్థిస్తున్నారు. తనదగ్గరగల సంసారమూలకారణమైన పాపవృక్షం అనాదికాలంగా వృద్ధిచెంది ఉండడం వల్ల అట్టి మహావృక్షాన్ని పెకలించడానికి కొలది అయిన ప్రవాహం చాలదని, చాల గొప్పదగు ఒక అపూర్వ ప్రవాహం ఏర్పడకపోతే సాధ్యం కాదని అట్టి ప్రవాహంతో అపాపవృక్షం సమూలంగా నశించినయెడల తనకు క్రమ ప్రాప్తమైన మోక్షము లభిస్తుందని ఆచార్యుల తిరువుళ్లం.

***షష్ఠదశకం సమాప్తం***

***శ్రీమతే నిగమాన్త మహాదేశికాయ నమః***

## సప్తమ దశకం

**శ్లో॥ అకూపారై రేకోదకసమయ వైతండికజనై**
**రనిర్వాప్యాం క్షిప్రం క్షపయితుమవిద్యాఖ్య బడబామ్ ।**
**కృపే త్వం తత్తాదృక్ప్రథిమ వృషపృథ్వీధరపతి**
**స్వరూపద్వైగుణ్యద్విగుణనిజబిందుః ప్ర (భవ) వహసి ॥ 61**

**ప్రతి :** హే కృపే= ఓ దయాదేవీ!, తత్తాదృక్ప్రథిమ వృషపృథ్వీధరపతి స్వరూపద్వైగుణ్యద్విగుణనిజబిందుః= ఇంతింతని వివరింపవీలులేక అంతంతదనియే చెప్పవలసినంతటి వైశాల్యం కల్గిన వేంకటాద్రీశుని దివ్యాత్మ స్వరూపానికి రెండింతలు పెద్దదైన వస్తువుకంటె రెండురెట్లు పెద్దదగు తనదైన ఒక బిందువుగల, త్వం= నీవు, ఏకోదకసమయవైతండికజనైః= ఒకే జలమయమైన ప్రళయకాలమందలి వితండవాదుల వాదాలకంటె ఎక్కువ వేగంగల, అకూపారైః= సముద్రాలచే, అనిర్వాప్యామ్= ఆర్పజాలని, అవిద్యాఖ్యబడబామ్= అవిద్యయను బడబాగ్నిని, క్షపయితుమ్= ఆర్పుటకు, ప్రభవసి= సమర్థమవుతున్నావు, (ప్రవహసి= ప్రవహిస్తున్నావు).

**అవ :** కింది దశకంలో సాంగమైన ప్రపత్తి ప్రస్తావింపబడింది. ఈ దశకంలో ప్రపత్త్యుత్తర కాలంలో దయాదేవిచే కలుగు ఆనుకూల్యాలు వర్ణింపబడుతున్నాయి. గత దశకాంతంలో దయాదేవియొక్క బృహత్తర ప్రవాహం స్మరింపబడింది. ఆ ప్రవాహకార్యాలే ఈ దశకంలో అక్కడక్కడ నిరూపింపబడుతున్నాయి.

కింది శ్లోకంలో "నాయొక్క అనాది పాపవృక్షాలను పెళ్లగించి త్రోచివైన సమర్థమగు ప్రవాహాన్ని నాపై ప్రవహింపజేయు"మని ప్రార్థించారు. "నీ పాపాలనే కర్మలు మహా ప్రళయకాలంలో కూడా నశించక చాల దార్ఢ్యం కలిగి ఉన్నాయి గదా! వానిని అంతరింపజేయుశక్తి నాకు కలదా?" అను దయాదేవియొక్క సంశయాన్ని ఆ దయాదేవియొక్క ఎంతో బ్రహ్మాండాకారమైంది, ఎక్కువ దార్ఢ్యం కలిగింది అగు మహాప్రవాహంయొక్క ప్రభావాన్ని స్మరింపజేసి ఈ శ్లోకంలో నివర్తింపజేస్తున్నారు. దయా ప్రవాహాన్ని ప్రార్థించినంతట అది ప్రవహించిన పిదప ప్రపన్నునికి కలిగే ఆనుకూల్యం కూడా ఇక్కడ అర్థాత్తుగా నిరూపింపబడుతున్నది.

**తా :** ఈ శ్లోకంలో చిత్రించిన విధం చాల రమణీయం. ప్రళయకాలంలో సమస్త సముద్రాలు ఏకమై ప్రకోపించి అమిత వేగంతో పొంగి ప్రవహిస్తాయి. ఆ సమయంలోకూడా సముద్రంయొక్క వేగం పొంగి ప్రవహిస్తుంది. ఆ సమయంలో ఆ సముద్రంయొక్క వేగం వితండవాదం చేసేవాని వాగ్జాలంవలె ఉంటుందని ఆచార్యులు చిత్రిస్తున్నారు. వితండవాదులకు తనదని స్థాపింపదగిన పక్షమేదీ ఉండదు. ఎవ్వరేది చెప్పినా ఆడంబరపూర్ణమైన శబ్దజాలాన్ని వెదజల్లి, పెద్దగా శబ్దంచేసి ఆక్షేపించి ఆర్భాటం చేయడమే వారి లక్ష్యం. అట్లే ప్రళయకాల సముద్రాలుకూడా రక్ష్య నాశ్య విభాగం లేక సమస్త వస్తువులను మహాజవంతో మింగివేస్తాయి. అట్టి ప్రళయ సముద్రాలతోకూడా ఆర్పబడజాలని బడబాగ్నితో సమమైనవి అవిద్య అనే జీవులయొక్క పాపాలు. అగ్నికి 'ఆశ్రయాశం' అని ఒకపేరుంది. తాను ఏ పదార్థాన్ని ఆశ్రయిస్తున్నదో ఆ పదార్థాన్ని గ్రహిస్తుంది. బడబాగ్నికూడా ఇలాంటిదే. అట్లే ఈ కర్మలుకూడా తమ కాశ్రయాలైన జీవులను నాశనం చేస్తున్నాయి. ఆ ప్రళయకాల సముద్రాలు ప్రసిద్ధబడబాగ్ని నొకవేళ ఆర్పినా ఆర్పవచ్చు. ఈ కర్మబడబాగ్ని నార్పుటకు అవి శక్తిలేనివి. ఆ కర్మలంతటి దార్ఢ్యం కలవి. అనగా జీవకర్మలు ప్రళయకాలంలో కూడా నశింపనివి అని తాత్పర్యం. అట్టి ఈ కర్మబడబాగ్నిని ఒక క్షణంలో నశింపజేయుటకు నీయొక్క ప్రవాహమే సమర్థమైంది. పరబ్రహ్మంయొక్క స్వరూపం (దివ్యాత్మస్వరూపం) విభువు. అనగా సర్వప్రదేశాలలోను వ్యాపించి తనకంటె పెద్దదైన వేరొక పదార్థంలేకుండా అన్నిటికంటె పెద్దదిగా ఉండుటయే. అట్టి బృహత్తరమైన బ్రహ్మస్వరూపంకంటె రెండింతలు పెద్దదైన ఒక వస్తువును మనసా భావించి, ఆ వస్తువుకంటెకూడా రెండురెట్లు పెద్దదగు ఒక వస్తువును భావించిన యెడల అనగా సర్వవ్యాపియగు పరమాత్మస్వరూపాన్ని

నాల్గురెట్లుగా పెంచిచూచినపుడు ఏర్పడు వస్తు వేదికలదో, అది "ఓ దయాదేవీ! నీయొక్క ఒక బిందువే" అని ఆచార్యులు నిరూపిస్తున్నారు. ఒక పెద్దగంగానదివంటి దయాప్రవాహంలో ఒక బిందువు పరబ్రహ్మంకంటె నాల్గింతలు పెద్దదనగా ఆ పూర్ణప్రవాహం ఇంతదని నిరూపించుటెట్లు? మనసా ఎలా భావించడం అని ఆచార్యులు విస్మయపడుతున్నారు. నీ ప్రవాహం అంత పెద్దదిగాను, బలిష్ఠంగాను ఉన్నందున ఎంత దృఢమైనదయినా, ప్రళయంలో నశించకుండా ఉన్నదయినా జీవకర్మ సముదాయాన్ని ఒక క్షణంలో నశింపజేయుట కద్దులేదని భావం.

పరమాత్మ స్వరూపంకంటె దయ ఎంతో పెద్దదని వర్ణించుటచే పరమాత్మస్వరూపమంతా దయాకబళీకృతమని అర్థమవుతుంది. దానిచే దయాసంబంధ రహితమైన పరమాత్మస్వరూపం లభించదని తెలుస్తున్నది. ప్రపత్తిచేసిన వానియందు భగవద్దయాప్రవాహమేర్పడి సంచితం, ప్రారబ్ధం అనే పలువిధాల పాపాలను పోగొడుతున్నది. ఇదియే ప్రపత్త్యుత్తర కాలాన దయచే ప్రపన్నునకు కలిగే ప్రథమానుకూల్యమనే శాస్త్రార్థం ఇక్కడ వివక్షితం.

లోకంలో ఒకటికంటె మరొకటి పెద్దదని వర్ణించునప్పుడు దానికంటె రెండింతలు పెద్దదని చెప్పడం సహజవిషయం. పరమాత్మ స్వరూపంకంటె పెద్దవస్తువు లేదనడం నిజం. మనసా పరికల్పించి పెద్ద వస్తువును భావించాలి. అట్లుండగా ఇక్కడ పరమాత్మ స్వరూపంకంటె దయాదేవీ బిందువు రెండింతలు పెద్దదని చెప్పిన చాలదా? నాల్గింతలు పెద్దదని చెప్పవలెనా? దానినిగూడ ఒకేసారి నాల్గురెట్లు పెద్దదని చెప్పక విడివిడిగా రెండు రెండింతలని చెప్పి నాల్గింతలుగా చూపించుటలో ఏ దేని విశేషతాత్పర్యముందా? అని విమర్శకులాలోచించాలి. పరబ్రహ్మస్వరూపం నాలుగుపాదాలుకలదిగా ఉపనిషత్తులు చెపుతున్నాయి. అట్లు నాలుగు పాదాలుగల పరబ్రహ్మం దయాబిందువులో నాల్గింటిలో ఒక భాగంగా నిలిచి ఉండడమే తాత్పర్యమని కొందరు వ్యాఖ్యానిస్తారు. మరికొందరు రెండింతలు పెద్దదని చెపుతారు. కాని ఈశ్వరస్వరూపమైన శ్రీదేవి స్మృతిపథానికి రాగా



దానిని చేర్చి ఈశ్వరస్వరూపద్వంద్వంయొక్క రెండింతలుగా వర్ణించారని చెపుతారు. ఈ పక్షంలో రెండు రెండ్లుగా చెప్పినది కూడా ఒక విధంగా సమంజసమవుతుంది.

**శ్లో॥ వివిత్సావేతాళీవిగమపరిశుద్ధేఽపి హృదయే**
**పటుప్రత్యాహారప్రభృతి పుటపాకప్రచకితాః ।**
**నమస్త్వాం నారాయణశిఖరికూటస్థకరుణే**
**నిరుద్ధత్వద్ద్రోహాః నృపతిసుతనీతిం న జహతి ॥ 62**

**ప్రతి :** నారాయణశిఖరికూటస్థకరుణే= నారాయణాచల మను వేంకటాద్రిపై స్థిరవాసంచేయు శ్రీనివాసుని దయాదేవీ!, హృదయే= మనస్సు, వివిత్సావేతాళీవిగమపరిశుద్ధేఽపి= (స్త్రీ-భూమి-స్వర్ణాదులను) పొందాలన్న ఆశ అనే స్త్రీ పిశాచం వదలుటచే పరిశుద్ధమైనప్పటికిని, పటుప్రత్యాహార ప్రభృతి పుటపాకప్రచకితాః= (అష్టాంగ భక్తియోగంలోచేరిన) ఉగ్రమైన ప్రత్యాహారం (ఇంద్రియ నిగ్రహం)మొదలగు సంగములనే పుటపాకంనుండి చాల భయపడిన కొందరు మహనీయులు, త్వాం= నిన్ను, నమస్తః= శరణుకోరినవారై, నిరుద్ధత్వద్ద్రోహాః= నీయందు ద్రోహచింత లేనివారై, నృపతిసుతనీతిమ్= రాజపుత్ర న్యాయాన్ని, న జహతి= విడుచుట లేదు.

**అవ :** కింది శ్లోకంలో దయాప్రవాహంయొక్క వేగాన్ని వర్ణించి తద్ద్వారా ప్రపన్నుని పాపాలను ఆ ప్రవాహం పోగొట్ట శక్తిగల్గినదని సామాన్యంగా నిరూపించారు. ఈ శ్లోకంలో ఆ ప్రపన్నునికి ప్రపత్త్యుత్తర కాలంలో బుద్ధిపూర్వకమైన పాపాలను (ఉత్తరాఘములను) ఆ దయాదేవి నశింపజేయు ప్రక్రియను విశదీకరిస్తున్నారు. ఇట్లే ఈ దశకంలో ప్రపన్నుని విషయంలో దయాదేవి చేయు ఆనుకూల్యాలను అక్కడక్కడ ఆ దయాదేవీప్రవాహ ప్రభావవర్ణనావ్యాజంతో ప్రకటిస్తున్నారు. భక్తియోగం అనుష్ఠించువారికంటె ప్రపత్తిచేయువారు దయాదేవి కెక్కువ అనుగ్రాహ్యులు కావున ఒకవిధంగా వీరిని శ్రేష్ఠులని చెప్పవచ్చుననే తాత్పర్యం ఈ దశకంలో వ్యక్తమవుతున్నది.

**తా :** ధనం, ధాన్యం, స్త్రీ అని ఈ విధంగా ఉన్న భోగసాధనాలను పొందాలనే ఆశ బేతాళస్త్రీ (స్త్రీపిశాచాని)కి సమానం. స్త్రీ పిశాచానికి అడిగిన వస్తువులన్నింటిని ఇస్తూ ఉండాలి. కోరిన వస్తువులలో ఒక వస్తువు ఇవ్వకపోయినా అది ఆ మనిషిని మింగేస్తుంది. ఇది పిశాచియొక్క స్వభావం. కింద చెప్పబడిన ఆశకూడా ఇలాంటిది. ఆశను పూర్తిచేయకుంటే అది మనిషిని ఛిన్నాభిన్నం చేస్తుంది. ఇట్టి ఆశ మోక్షం పొందడానికి ప్రధాన విరోధి. దీనిని మొదట తొలగించినప్పుడే ముముక్షువు కావచ్చు. అనగా మోక్షేచ్ఛ కలుగుతుందని అభిప్రాయం. అట్టి ఆశను తొలగించి మనస్సును శుద్ధిపరచుకొని ముముక్షువులుగా తేరినవారిలో కొందరు పెద్దలు ఆ మోక్షానికి శాస్త్రోక్తాలైన భక్తి, ప్రపత్తులనే ద్వివిధోపాయాలలో భక్తియోగాన్ని చూచి భయపడుతున్నారు. ఎందుకంటే ఆ భక్తియోగానికి అంగాలుగా చెప్పబడిన ప్రత్యాహారం మొదలగువానిని స్మరించినంతనే అవి పుటపాకాలుగా అనిపిస్తున్నాయి. పుటపాకంలోని అగ్నిజ్వాలలు బయటికి కనిపించవు. అధికంగా అంతర్దాహమును కలుగజేస్తాయి. అట్లే ఈ ప్రత్యాహార ప్రభృతులు కూడా ఆచరిస్తూ ఉన్నాయి. కావున వాని ననుష్ఠించి నిలవడం మనబోటి అశక్తులకు సర్వాత్మనా సాధ్యంకాదని భయపడుతున్నారు. అశక్తివలన భయపడుతున్నారే గాని ఆ భక్తియోగం తమ స్వరూపానికి విరుద్ధమనియో లేక అది నికృష్టోపాయమనియో అనుకోవడం లేదు. ఇలా భీతులైనవారు శ్రీనివాసదయను శరణుపొందుతున్నారు. శరణాగతి అనే మోక్షోపాయాన్ని అనుష్ఠించిన వీరు రాజపుత్రులవలె అవుతున్నారు. రాజపుత్రులకు కూడా అపరాధం చేసినపుడు దండన ఉంది. ఇతరులకు వలె దండన తీవ్రంగా ఉండదు. దండన తీవ్రంగా లేకపోయినా రాజపుత్రులు చక్రవర్తి కోపానికి పాత్రులు గాక వాని ఆజ్ఞలను చక్కగా అనుష్ఠించి స్వల్ప దండనకు కూడా ఆస్పదులు గాక తమను రక్షించుకొని రాబోవు యువరాజ్యపట్టాభిషేకానికి తగు స్థితిలో ఉంటారు. అట్లే ఈ ప్రపన్నులు కూడా భగవంతునికి అత్యంతాంతరంగులు కనుక వాని ఆజ్ఞోల్లంఘనను మనస్సులో కూడా స్మరించరు. భగవదాజ్ఞ ననుసరించడమంటే "శ్రుతిః



స్మృతిర్మమైవాజ్ఞా యస్తాముల్లంఘ్య వర్తతే" అని భగవంతుడు వాక్రుచ్చిన రీతిగా శ్రుతిస్మృతి విహిత కర్మలను చేయుటయే. ప్రపన్నులు కూడా "మమ ద్రోహీ" అని చెప్పబడిన స్థితి తమకు సంభవించని విధంగా శాస్త్రోక్తకర్మలను చక్కగా అనుష్ఠించి తీరాలి. కొందరు ప్రపన్నులకు ప్రబలమైన జన్మాంతరకర్మవల్ల శాస్త్రోల్లంఘనం చేసి పాపకర్మలను బుద్ధిపూర్వకంగా చేయవలసిన సందర్భమేర్పడినప్పుడు ఈ దయాదేవి రాజపుత్రన్యాయాన్ని అనుసరించి వారి విషయంలో స్వల్పమైన దండనను వారు మోక్షం పొందుటకు ఉద్దేశించిన కాలం లోపలనే అనుకరింపజేసి, పరిశుద్ధులను కావించి మోక్షం ఇస్తున్నది. అలాగే ప్రపన్నుని విషయంలో బుద్ధిపూర్వోత్తరాఘమనే పాపాలకు దయాదేవి స్వల్పమైన దండనను విధిస్తున్నదని తేలుతున్నది. ఇటువంటి సూక్ష్మ శాస్త్రార్థాలు ఇక్కడ నిరూపింపబడి ఉన్నాయి.

**శ్లో॥ అనన్యాధీనస్సన్ భవతి పరతంత్రః ప్రణమతాం**
**కృపే! సర్వద్రష్టా న గణయతి తేషామపకృతిమ్ ।**
**పతిస్త్వత్పారార్థ్యం ప్రథయతి వృషక్ష్మాధరపతిః**
**వ్యవస్థాం వైయాత్యాదితి విఘటయన్తీ విహరసి ॥ 63**

**ప్రతి :** హే కృపే= ఓ దయాదేవీ!, వృషక్ష్మాధరపతిః= వేంకటాద్రీశుడగు శ్రీనివాసుడు, అనన్యాధీస్సన్= మరొకరికి అధీనుడు కాకపోయినను, ప్రణమతాం= తన్నాశ్రయించినవారికి (శరణాగతులకు), పరతంత్రః= పరతంత్రుడుగా, భవతి= అవుతున్నాడు, సర్వద్రష్టా= సర్వవిషయాలను ఎల్లప్పుడు సాక్షాత్తుగా చూడగల సర్వజ్ఞత కలిగి ఉండినను, తేషాం= ఆ శరణాగతులయొక్క, అపకృతిం= అపరాధాలను, న గణయతి= లెక్కపెట్టుటలేదు, పతిస్సన్ (నీకు) భర్తగా ఉండినను, త్వత్పారార్థ్యం= నీయందు పరతంత్రతను, ప్రథయతి= ప్రకాశపరుస్తున్నాడు. వైయాత్యాత్= (నీ యొక్క) ధార్ష్ట్యమువలన, వ్యవస్థాం= శాస్త్రంలో ఏర్పడియున్న వ్యవస్థను, ఇతి= ఇట్లు, విఘటయన్తీ= మీరజేస్తూ, విహరసి= విహరిస్తున్నావు.

**అవ :** కింది శ్లోకంలో ప్రపన్నుల విషయంలో ప్రాచీనకర్మవశాత్తు ఏర్పడుతున్న కొన్ని బుద్ధిపూర్వకాపరాధాలకు చాల అల్పమైన దండనను దయాదేవి ఇప్పిస్తున్నదని నిరూపించారు. ఈ శ్లోకంలో ఆ ప్రపన్నుల విషయంలో సర్వస్వామియగు భగవంతుని పరతంత్రుని గావించి వారుచేయు అపరాధాలను అతడు ఉపేక్షించునట్లుచేసి నీవాల్లభ్యంవలన శాస్త్రమర్యాదను ఉల్లంఘిస్తున్నావని దయాదేవిని కీర్తిస్తున్నారు.

**తా :** ఉపనిషత్తులు "న తస్యేశే కశ్చన" అనగా భగవంతునిపై నియామకుడొకడు లేడు అని చెపుతున్నాయి. అట్టి భగవంతుడాశ్రితుల విషయంలో మిగుల పరతంత్రుడై దౌత్యసారథ్యాదులను కూడా ఆచరించడానికి ముందంజ వేస్తున్నాడు. ఇట్లే వివిధ సేవలు చేస్తున్నాడు. అలాగే "యస్సర్వజ్ఞః సర్వవిత్" అనగా అన్నిటిని సర్వదా సాక్షాత్కరించు స్వభావం కలవాడు అని ప్రశంసింపబడినాడు. ఆశ్రితులు చేసే కొన్ని అపరాధాలను తెలియనివానివలె ఉండి ఉపేక్షిస్తున్నాడు. అట్లే "పతిం విశ్వస్య" అనగా సర్వపతిగా ఉండినప్పటికి హే దయాదేవీ! (నీకు పతిగా ఉండినా) నీయందు పరతంత్రుడై ఉన్నాడు. అనగా నీ చెప్పుచేతలలో మెలగుతూ నీయిచ్ఛ ననుసరిస్తున్నాడు. ఇవన్నీ నీవాల్లభ్యంవలననే ఏర్పడుతున్నాయి. ఆహా! నీధార్ష్ట్యం ఎంతటిదో గదా! అని విస్మయపడుతున్నారు. ఇట్లు నిందవలె అనిపించే ఈ వాక్యాలు ఉన్నత స్తోత్రంలో పర్యవసిస్తున్నాయని పాఠకులకు వేరుగా వివరింప నవసరం లేదు. ఉత్తమ ప్రభువులకు కింద చెప్పబడిన ఆశ్రితపారతంత్ర్యాద్యుత్తమగుణాలు అత్యావశ్యకాలే గదా? అట్టివి లేనివాడు ఉత్తమ ప్రభువు కాలేడు.

అయినా శాస్త్రపద్ధతి నుల్లంఘించడం అయుక్తమేగదా అని ఇక్కడ సందేహం ఉంది. కాదు. ఏ శాస్త్రాలు వానిని సర్వస్వామిగా పొగడుతూ ఉన్నాయో, అవియే వాని చరణారవిందమునందు శరణాగతి చేసినయెడల వాని హృదయం ద్రవించి, దయోద్రేకంకలిగి శరణాగతుని విషయాన దాసానుదాసుడుగా మెలగుతున్నాడని చెప్పడంవల్ల ఇది కూడా శాస్త్రసమ్మత పద్ధతే.



కింది శ్లోకంలో ప్రపన్నుని బుద్ధిపూర్వకమైన ఉత్తరాఘములకు స్వల్పదండన అన్నారు. ఇక్కడ ఆ ప్రపన్నులయొక్క అబుద్ధిపూర్వకాపరాధాలకు దండనయే లేదంటున్నారు. ఇదే ఇక్కడ సూచితమైన ప్రధాన శాస్త్రార్థం. ఇలాగే ప్రపన్నునికి బుద్ధిపూర్వకంగా ఉద్భవించే ఉత్తరాఘవిషయంలో పూర్వోక్తదండన ఆ అపరాధాలకు ప్రాయశ్చిత్తం ఆచరించనివాని విషయంలో మాత్రమే. ఆ అపరాధానికి శాస్త్రోక్తనిష్కృతి ననుష్ఠించిన యెడల ఆ స్వల్పదండన లేదు. అట్లాప్రాయశ్చిత్తాలను అనుష్ఠించుటకు వీలు లేనివాడు "ప్రాయశ్చిత్తిరియం ప్రోక్తా యత్పునః శరణాగతిః" అనునట్లు "పాపాలు చేశాను. దానికి శాస్త్రోక్తమైన ప్రాయశ్చిత్తాలు అనుష్ఠించుటకు శక్తిసామర్థ్యాలు నాకు లేవు. కావున హే ప్రభో! నీవే ఆ ప్రాయశ్చిత్త స్థానంలో నిలిచి ఆ పాపాలకు దండన నొసంగక నన్ను రక్షించాలి" అని మరల ఒక ప్రపత్తిచేసిన యెడల వాని విషయంలో ఆ పాపాలను లెక్కింపక ఉపేక్షిస్తున్నాడను శాస్త్రార్థం ఇక్కడ వివక్షితం.

**శ్లో॥ అపాంపత్యుః శత్రూనసహనమునేర్ధర్మనిగలం**
**కృపే! కాకస్యైకం హితమితి హినస్తి స్మ నయనమ్ ।**
**విలీనస్వాతంత్ర్యో వృషగిరిపతి స్త్వద్విహృతిభిః**
**దిశత్యేవం దేవో జనితసుగతిం దండనవిధిమ్ ॥ 64**

**ప్రతి :** హే కృపే= ఓ దయాదేవీ!, త్వద్విహృతిభిః= నీ లీలలచే, విలీనస్వాతంత్ర్యః= ధారబోసుకొన్న స్వాతంత్ర్యం కలిగిన, వృషగిరిపతిః= వేంకటాద్రీశుడగు శ్రీనివాసుడు, అపాంపత్యుః= జలములకధిపతియైన సముద్రరాజుయొక్క, శత్రూన్= శత్రువులను, అసహనమునేః= ఇతరుల మహత్త్వాలను సహించలేని పరశురాముని యొక్క, ధర్మనిగలం= పుణ్యమను సంకెలను, కాకస్య= కాకాసురునియొక్క, ఏకం నయనం= ఒక కంటిని,

హితమితి= హితమని తలంచి, హినస్తిస్మ= పోగొట్టెను, ఏవం= ఇట్లు, దేవః= ప్రభువగు శ్రీనివాసుడు, జనితసుగతిం= సద్గతిని కలుగజేయు, దండన విధిం (గతిం)= దండనను, దిశతి= ఇస్తున్నాడు.

**అవ :** గత శ్లోకద్వయంతో దయాపరతంత్రుడగు శ్రీనివాసుడు ఆశ్రితుల విషయంలో కొన్ని అపరాధాలకు స్వల్పదండన ఇస్తున్నాడని, మరికొన్నింటిని గమనించుటయే లేదని నిరూపించారు. ఈ శ్లోకంలో పరమ పురుషుడొసగు దండనను దయాదేవి తగ్గించి స్వల్పంగా చేయుటమాత్రమేగాక ఆ దండనను పర్యవసానంలో ఆ అపరాధాలకు హితాలనే కలుగజేయునట్లు చేస్తున్నదని ఈ ప్రకారంగా దయాదేవిని పొగడుతున్నారు.

**తా :** ఈ విషయాన్ని రామావతారంలో జరిగిన మూడు వృత్తాంతాలను దృష్టాంతీకరించి ఆచార్యులు విశదీకరిస్తున్నారు. శ్రీరాములు సముద్రం దాటుటకు తగిన ఉపాయం కల్గింపుమని సముద్రరాజును ప్రార్థించాడు. అప్పుడతడు శీఘ్రంగా రాకపోవుటచే ప్రభువు కోపంతో బాణాన్ని ధనువున సంధించగా సముద్రరాజు స్వపత్నీసమేతుడై వచ్చి పరమాత్మునికి నమస్కరించి తగు సమాధానం చెప్పిన పిమ్మట వానికేర్పడదగిన దండనను వాని శత్రువులయెడల ప్రయోగించాడు. దీనికి దయాదేవి యొక్క ప్రేరణమే కారణం. ఇట్లే వివాహపూర్వ్యనంతరం అయోధ్యకు వస్తూ ఉండగా అతని ప్రసిద్ధిని సహించలేక ఎదురుగావచ్చి యుద్ధాని కీడ్చిన పరశురామునికి సంభవించిన కోపంగూడ కడపట (పరశురాముడు ప్రణతుడైన పిదప) అతని పుణ్యమనే సంకెళ్ళను విరుగజేసి అతనిని బంధంనుండి విప్పివేయుటలో పర్యవసించింది. ఇది కూడా దయాదేవి విహారమే. మోక్షం పొందాలని నిశ్చయించువానికి పాపాలు ఎలా బంధకాలో, అట్లే ఐహికం, ఆముష్మికం అని చెప్పబడే ఈ లోకసుఖాలను, స్వర్గాది సుఖాలను కలిగించు పుణ్యాలు కూడా బంధకాలే. ఇలా పుణ్యపాపాలు రెండూ ముముక్షువుకు సంకెలలే. కావలసినయెడల పుణ్యాలు బంగారు సంకెలని అనుకోవాలి. బంగారుమయములైనా సంకెలలే గదా!



అటులనే సీతాదేవి యందు అసహ్యాపచారం ఆచరించిన కాకాసురుడు బ్రహ్మాస్త్రానికి భయపడి త్రిలోకాలను చుట్టి శ్రమతో వచ్చి కింద పడిపోయినంతనే – వానిని సంహరించవలసిరావడం ఆ సందర్భంలో అవసరమైనా ప్రభువు దయాపరవశుడై ఒక కంటినిమాత్రం గుడ్డిగావించి మరల ఇట్టి దుష్కార్యాలలో వానికి ప్రవృత్తి లేకుండా మేలు చేశాడు.

ఇట్లు పూర్వోక్త సదృశులయందు మొదట ప్రభువుకు వారి అపరాధంవలన కోపం సంభవించినా పిదప దయాదేవీవిలాసవశుడై ఫలాన్నిచ్చే సమయాన వారికి హితమునే కలుగజేయు (ఆపాతతః చూచుటకు దండనవలె కనిపించినను) దండన నిస్తున్నాడు. ఆహా! ఎంతటిది దయాదేవీ ప్రభావం. "నా హితం కారయేత్ హరిః" పరమపురుషుడు ఎప్పుడును అహితానికి కారణం కాడు. వాడు మనకిచ్చు దండనలు ఒక విధంగా హితకరాలే. ప్రపంచంలో ఈశ్వరసంకల్పంతో జరుగుతున్నవన్నీ దయాకార్యాలే అనే తత్త్వం ఇక్కడ తెలియదగిన విషయం.

**శ్లో॥ నిషాదానాం నేతా కపికులపతిః కాఽపి శబరీ**
**కుచేలః కుబ్జా సా వ్రజయువతయో మాల్యకృదితి ।**
**అమీషాం నిమ్నత్వం వృషగిరిపతేరున్నతిమపి**
**ప్రభూతైః స్రోతోభిః ప్రసభమనుకంపే! సమయసి ॥ 65**

**ప్రతి :** హే అనుకంపే= ఓ దయాదేవీ!, నిషాదానాం నేతా= బోయవారి కధిపతియగు గుహుడు, కపికులపతిః= వానరేశుడగు సుగ్రీవుడు, కాఽపి శబరీ= శబరియను నొక బోయస్త్రీ, కుచేలః= జీర్ణవస్త్రుడగు కుచేలుడు, సా కుబ్జా= కంసునికి చేటియైన త్రివక్ర, గూనిది, వ్రజయువతయః= గోపయువతులు, మాల్యకృత్= మాలాకారుడు, ఇతి= అని యిటువంటి, అమీషాం= వీరియొక్క, నిమ్నత్వం= తక్కువతనమును, వృషగిరిపతేః= వేంకటాద్రీశుని యొక్క, ఉన్నతిమపి= ఎక్కువతనమును, ప్రభూతైః= చాల పెద్దదైన, స్రోతోభిః= నీ ప్రవాహములచే, సమయసి= సమీకరిస్తున్నావు.

**అవ :** ఆశ్రితులకు అపరాధుల విషయంలో దయాదేవి చేసే ఆనుకూల్యాలు ఇంతవరకు వర్ణింపబడినాయి. ఇటుపై రెండు శ్లోకాలలో నిరపరాధులైన భగవదాశ్రితుల విషయంలో దయాదేవీకృత్యం వర్ణింపబడుతున్నది. రామావతారంలోను, కృష్ణావతారంలోను కొన్ని ఉదాహరణలను చూపి ఈ విషయాన్ని ఈ శ్లోకంలో విశదీకరిస్తున్నారు.

జాత్యాదులచే విహీనులయందును దయాదేవి తనకు పరివారమైన సౌశీల్యమనే భగవద్గుణాన్ని ప్రేరేపించి ఆమె నడచుకొను విధం ఇక్కడ చాల అందంగా చిత్రింపబడుతున్నది. ఆశ్రితుల విషయంలో దయాదేవియొక్క అనుగ్రహాన్ని ఇంతవరకు నిరూపించి తరువాత ఆమెకు పరికరాలైన ఇతర భగవద్గుణాలు ఆశ్రితుల విషయంలో చేయు ఉపకారం నిరూపింపబడుతున్నది.

**తా :** గుహుడు, సుగ్రీవుడు, శబరి, కుచేలుడు, త్రివక్ర (గూనిది), గోపయువతులు, మాలాకారుడు మొదలగు పరమభాగవతుల విషయంలో భగవానుడు సర్వస్వదాన మనబడు తనయొక్క గాఢాలింగనం ఒసగి నీరంధ్ర సంశ్లేషం చేసిన ప్రకారం శ్రీమద్రామాయణ భాగవతాది గ్రంథాలలో ఆ యా ప్రకరణాలు చదివిన వారికి సువిదితమవుతుంది. గుహాదులు జాత్యాదులచే చాల తగ్గినవారైనా భగవంతునియందు వీరికున్న ప్రేమ చెప్పజాలనంత గొప్పది. దీనిననుసరించియే భగవంతుడును "తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్" అను రీతిలో "సంశ్లిష్యసి త్వమిహ తేన సమానధర్మా" అని పెద్దలు చెప్పినట్లు నీ రంధ్రసంశ్లేషం కావించాడు. ఈ గుణాన్నే, "మహతో మందైస్సహ నీరంధ్రసంశ్లేషః సౌశీల్యమ్"చాల గొప్పవాడు చాల విహీనులతో భేదంలేక కలసి మెలసి ఉండుటయే సౌశీల్యం అని పెద్దలు నిర్వచిస్తున్నారు. ఈ సౌశీల్యగుణం దయాదేవికి ప్రాణసఖి. దయచేతనేగదా వీరి యందిట్లు భగవంతుడు ప్రవర్తించుట.

ఒక పెద్ద ప్రవాహం మిట్టప్రదేశాన్ని పడద్రోసి, తగ్గించి పల్లపు ప్రదేశాన్ని పూరించి ఉన్నతీకరించడం చూస్తున్నాం. అటులనే ఆశ్రితుల విషయంలో పలుప్రకారాలుగా మాటలూరి వృద్ధిచెందిన దయాప్రవాహం పరమపురుషుని ఉన్నతిని పడద్రోసి, అతి నీచులగు కింద చెప్పినవారి నిమ్నతను ఉన్నతీకరించి సమీకరిస్తున్నది. చాల పెద్ద ప్రవాహాలకే ఇలా విపరీతమైన మిట్టపల్లాలను సమీకరించే శక్తి ఉంటుంది. కనుక ఆశ్రితుల విషయంలో దయ అనేక విధాలైన (సౌశీల్యాది గుణాలనెడు) పెద్ద ప్రవాహాలను ప్రవహింపజేస్తున్నదనుట ఇక్కడ రహస్యం.



ఇక్కడ ఏడుకొండలవాని దయ గుహాదులగు ఏడుగురిమీద ప్రవహించు ప్రకారం వర్ణింపబడియుండుట ఒక వైచిత్ర్యమని కొందరు చెపుతారు.

**శ్లో॥ త్వయా దృష్టస్తుష్టిం భజతి పరమేష్ఠీ నిజపదే**
**వహన్మూర్తీరష్టౌ స జయతి మృడానీపరిబృఢః ।**
**బిభర్తి స్వారాజ్యం వృషశిఖరిశృంగారికరుణే**
**శునాసీరో దేవాసురసమరనాసీరసుభటః ॥ 66**

**ప్రతి :** హే వృషశిఖరిశృంగారికరుణే= ఓ వేంకటాద్రీశుడగు శ్రీనివాసవిలాసుని (ప్రియమహిషియగు) దయాదేవీ!, పరమేష్ఠీ= చతుర్ముఖ బ్రహ్మదేవుడు, త్వయా= నీచే, దృష్టః= కటాక్షింపబడినవాడై, నిజపదే= తనస్థానమందు, తుష్టిం= సంతోషాన్ని, భజతి= పొందుతున్నాడు, మృడానీపరిబృఢః= పార్వతీవల్లభుడగు పరమేశ్వరుడు, త్వయా దృష్టః= నీచే కటాక్షింపబడినవాడై, అష్టౌమూర్తీః= ఎనిమిది రూపాలను, వహన్= వహిస్తూ, విహరతి= విహరిస్తున్నాడు, శునాసీరః= దేవేంద్రుడును, త్వయా దృష్టః= నీచే కటాక్షింపబడినవాడై, దేవాసురసమరనాసీరసుభటః= దేవాసుర యుద్ధాలలో యోధాగ్రగణ్యుడై విలసిల్లుతూ, స్వారాజ్యం= తన స్వర్గసామ్రాజ్యాన్ని, బిభర్తి= వహిస్తున్నాడు.

**అవ :** కింది శ్లోకంలో నికృష్టులైన భగవదాశ్రితుల విషయంలో దయా ప్రవాహంయొక్క ఉత్కృష్టత వర్ణింపబడింది. ఈ శ్లోకంలో చాల ఉత్కృష్టులుగా శాస్త్రాలలో వ్యవహరింపబడుతున్న బ్రహ్మరుద్రేందుల విషయాలలో

దయాదేవీకృత్యం వర్ణింపబడుతున్నది. గత శ్లోకంలో దయాగుణంయొక్క రూపాంతరమైన సౌశీల్యగుణం ప్రస్తావింపబడింది. ఇక్కడ అలాగే దయకు అత్యంతాంతరంగమైన ఔదార్యమనే గుణం నిరూపింపబడుతున్నది.

**తా :** చతుర్ముఖుడు, రుద్రుడు, దేవేంద్రుడు అను ఈ త్రిమూర్తులు భగవదంతరంగులనుటలో సందియం లేదు. వారు తమ తమ పదవులలో సుఖంగా పరిపాలించుట దయాదేవియొక్క కటాక్షంచేతనే. ఈమె కటాక్షం లేనియెడల వారా పదవులలో ఒకక్షణంకూడా ఉండుటకు వీలుకాదు. వారికి ఆయాసమయాలలో సంభవించే పరమాపదలను భగవానుడు పరమదయతో నిరసించి, వారిని రక్షించిన ప్రకారాలు పురాణాలలో సుప్రసిద్ధాలు. ఇక్కడ దయాదేవి ఔదార్యమనే గుణంమూలంగా ఇట్టి పెద్ద పెద్ద పదవులలో వారిని స్థాపిస్తూ ఉన్నదని, శ్రీనివాసుడను శ్రీమన్నారాయణుడే సర్వదేవతా సార్వభౌముడని వాని దయచేతనే తదితర సర్వదేవతలు స్వస్వపదాలలో నిలిచి జీవించుట అని ఆదిగాగల శాస్త్రార్థాలు వివక్షితాలు.

**శ్లో॥ దయే! దుగ్ధోదన్వద్ద్యుతియుతసుధాసింధునయతః**
**త్వదాశ్లేషాన్నిత్యం జనితమృతసంజీవనదశాః ।**
**స్వదన్తే దాన్తేభ్యః శ్రుతివదన కర్పూరగుళికాః**
**విషణ్ణస్తశ్చిత్తం వృషశిఖరివిశ్వమ్భరగుణాః ॥ 67**

**ప్రతి :** హే దయే= ఓ దయాదేవీ!, దుగ్ధోదన్వద్ద్యుతియుతసుధాసింధు నయతః= క్షీరసముద్రంలో బాగుగా కలిపియుండు అమృతసముద్రంవలె, త్వదాశ్లేషాత్= నీయొక్క దృఢ సంబంధంవలన, జనితమృతసంజీవనదశాః= మృతినొందిన వారినిగూడ ఉజ్జీవింపజేయు దశను కలిగినట్టి, శ్రుతివదనకర్పూరగుళికాః= శ్రుతిదేవియొక్క నోటికి కర్పూరమాత్రలుగా నున్నట్టి, చిత్తం= మనస్సును, విషణ్ణన్తః= పిండునవిగానున్న (ద్రవింపజేయునవిగానున్న), వృషశిఖరివిశ్వమ్భరగుణాః= వేంకటాద్రిలోనుండు జగద్రక్షకుడగు శ్రీనివాసునియొక్క కల్యాణగుణాలు, దాన్తేభ్యః= జితేంద్రియులకొరకు, నిత్యం= ఎప్పుడును, స్వదన్తే= రుచిస్తున్నాయి.



**అవ :** గత శ్లోకద్వయంలో సౌశీల్యం, ఔదార్యం అనే రెండు భగవద్గుణాలు, దయాదేవీ సంబంధంచే భగవదాశ్రితుల విషయంలో చేసే ఉపకారం వర్ణింపబడినాయి. ఈ శ్లోకంలో మిగిలిన సమస్తగుణాలు దయాదేవీ సంబంధంచే విరక్తులగు పరమైకాంతులకు ఎంతో తీపుగా ఉన్నాయని వర్ణిస్తున్నారు.

**తా :** భగవంతుని కల్యాణగుణాలు క్షీరసముద్రంవంటివి. అందరికి చాల భోగ్యాలు. వానిలో దయ అనే గుణం అమృతసాగరం వంటిది. మృతినొందినవారిని ఉజ్జీవింపజేయడం అమృతంయొక్క స్వభావం. భగవంతునిలోగల ఇతరగుణాలు దయతో కలిసియుండుటచే ఆ సమస్తగుణాలు స్వయం పరమభోగ్యాలుగా ఉండుటయేగాక సంసార తాపంచే మృతతుల్యులగు జీవులను సయితం ఉజ్జీవింపజేస్తూ ఉన్నాయి. సంసారులను ఉజ్జీవింపజేయుట అనగా భగవద్గుణాలను ధ్యానించువారికి సద్గతిని కల్పించుటయే. మరియు ఈ గుణాలు శ్రుతి అనే నాయికయొక్క నాలుకకు ఎట్లు విలక్షణరుచిని కలుగజేయునో అట్లే వేదాంతాలు భగవద్గుణాలను వర్ణించునపుడు కర్పూరమాత్రను ఆస్వాదించునట్లు ఒక విలక్షణరసాస్వాదనను పొందుతున్నాయి. అట్టి ఈ గుణాలు "పరమాత్మని యో రక్తః విరక్తోఽ పరమాత్మని" అనురీతిలో విషయవైరాగ్య పూర్వకంగా భగవత్ప్రేమ కలిగిన వారికి చాల రుచించునని భావం.

**శ్లో॥ జగజ్జన్మస్థేమప్రళయరచనాకేళిరసికః**
**విముక్త్యేకద్వారం విఘటితకవాటం ప్రణయినామ్ ।**
**ఇతి త్వయ్యాయత్తం ద్వితయముపధీకృత్య కరుణే!**
**విశుద్ధానాం వాచాం వృషశిఖరినాథః స్తుతిపదమ్ ॥ 68**

**ప్రతి :** హే కరుణే= ఓ దయాదేవీ!, వృషశిఖరినాథః= వేంకటాద్రీశుడగు శ్రీనివాసుడు, జగజ్జన్మస్థేమప్రళయరచనాకేళిరసికః= జగత్తుయొక్క సృష్టిస్థితి సంహారాలను రచించుట అనే లీలయందు రసికుడుగాను, ప్రణయినాం= తమయందు విశేషప్రేమ కల్గినవారికి (భక్తులకు), విఘటితకవాటం=

తెరువబడిన తలుపుకల, విముక్త్యేకద్వారం= మోక్షమునకు ప్రధాన ద్వారంగాను, (భవతి= అవుతున్నాడు), ఇతి= ఇట్టి, త్వయ్యాయత్తం= నీచే ఏర్పడిన, ద్వితయం= ఉత్కర్షద్వయమును (జగత్కారణత్వం, మోక్షప్రదత్వం), ఉపధీకృత్య= నిమిత్తంగా చేసుకొని, విశుద్ధానాం వాచాం= అపౌరుషేయములగుటచే ఎట్టి దోషాలకు ప్రసక్తి లేక చాల పరిశుద్ధమైన వేదవాక్కులకు, స్తుతి పదం= స్తోత్ర పాత్రుడుగా, (భవతి= అవుతున్నాడు).

**అవ :** కింది శ్లోకంలో శ్రీనివాసుని సర్వగుణాలు దయాసంబంధం చేతనే వేదవతియొక్క నాలుకకు కర్పూరగుళికలవుతున్నాయని వర్ణించారు. అనగా దయా సంబంధంచేతనే ఆ గుణాలు ఉత్కర్షం చెంది, వేదాలు పొగడు స్థితిని పొందుతున్నాయని భావం. ఈ శ్లోకంలో అట్టి గుణాలకు ఆధారభూతుడగు శ్రీనివాసుని ఆ వేదాలు కీర్తించడం ఆ దయాదేవి అధీనంగా భగవంతుని యందమరియుండు జగత్కారణత్వం, మోక్షప్రదత్వం అనే రెండాకారాలనుబట్టియే అని వర్ణించి దయకుగల మహోన్నతస్థితిని విశదీకరిస్తున్నారు.

**తా :** శ్రీనివాసుడను పరమపురుషుడు సర్వజగత్తుయొక్క సృష్టిస్థితి సంహారాలను స్వలీలార్థమాచరిస్తూ, ఇతర దేవతలకు లేని జగత్కారణుడను ఉత్కర్షను పొందియున్నాడు. అట్లే మోక్షలోకానికి తలుపు తెరువబడిన ఒకే మార్గంగా, (ప్రధానోపాయంగా) ఉన్నాడు. అనగా భగవంతునియందు భక్తి ప్రపత్తులను అనుష్ఠించిన వారికి మోక్షమివ్వడం అనేది ఇతర దేవతలకు సాధ్యంకాని ఒక ప్రధాన కార్యమని భావం. జగత్కారణత్వం, మోక్షప్రదత్వం అనే ఈ రెండూ శ్రీనివాసునికసాధారణాలని, మరొకరికి లేనివని తెలుస్తుంది. ఇవి దయాధీనాలు కావడంవల్లనే భగవంతునియందు ఉత్కర్షను పొందుతున్నాయి అనగా ద్వితీయదశకంలో నిరూపించినట్లు జగత్సృష్టిస్థితి సంహారకర్తృత్వం, మోక్షమివ్వడం మొదలగునవన్నీ దయచేతనే ఏర్పడుతున్నాయని భావం. చాల ఉత్కృష్టాలుగా కొనియాడబడుతూ ఉండే ఈ రెండు గుణాలు దయాసంబంధంచేతనే ఉత్కృష్టాలవుతున్నాయనే



కారణంగా అపౌరుషేయాలైన వేదాలు సయితం ఆ గుణద్వయాశ్రయుడగు శ్రీనివాసుని పొగడుతూ ఉన్నాయి. తద్గుణద్వయరహితుడుగా శ్రీనివాసుడుండినప్పటికి, ఆ గుణద్వయం దయాధీనంగా లేకపోయినా ఆ వేదాలు వానిని కీర్తించవు. కావున ఆ వేదాలు తద్గుణద్వయిద్వారా భగవంతుని స్తుతించుటకు ముఖ్యమైన కారణం ఈ సంబంధమేనని దయాదేవియొక్క ఉత్కృష్టప్రభావాన్ని ఆచార్యులిక్కడ స్పష్టం చేశారు.

జగత్సృష్ట్యాది కార్యాలు, మోక్షప్రదత్వం దయచే ఏర్పడుననే శాస్త్రార్థమిక్కడ వివక్షితం.

పురుషునిచే నిర్మింపబడినయెడల భ్రమ, ప్రమాదం, విప్రలంభం మొదలగు నా నా దోషాల కవకాశం ఉంది. అట్లుకాక అపౌరుషేయంగాను, నిత్యంగాను ఉండుటచే వేదాలలో ఇలాంటి దోషాలకు అవకాశం లేదనే భావం “విశుద్ధానాం వాచాం”అను పదంచే వివక్షితం.

**శ్లో॥ కలిక్షోభోన్మీలత్క్షితికలుషకూలంకషజవైః**
**అనుచ్ఛేదైరేతైరవటతటవైషమ్యరహితైః ।**
**ప్రవాహైస్తే పద్మాసహచరపరిష్కారిణి! కృపే!**
**వికల్పం (ల్ప్యా) తేఽనల్పా వృషశిఖరిణో నిర్ఝరగణాః(గుణాః)॥ 69**

**ప్రతి :** పద్మాసహచరపరిష్కారిణి= మహాలక్ష్మితోకూడిన శ్రీనివాసునికి అలంకారం చేస్తున్న, హే కృపే= ఓ దయాదేవీ!, కలిక్షోభోన్మీలత్క్షితి కలుష కూలంకషజవైః= కలియొక్క ఉగ్రతవలన వృద్ధిచెందు ప్రాపంచికుల పాపాలను వేరుతో పెళ్లగించి తోసివేయునట్టి వేగం కలిగిన, అనుచ్ఛేదైః= విరామంలేక సతతం ప్రవహించునవి, అవటతటవైషమ్యరహితైః= మిట్టపల్లమను (ఉత్కృష్ట, నికృష్టులను) భేదంలేక సమస్త ప్రదేశాలలో ప్రవహించునట్టివియు అగు, ఏతైః= ఈ, తే= నీ యొక్క, ప్రవాహైః= ప్రవాహాలతో, అనల్పాః= చాల పెద్దవైన, వృషశిఖరిణః= వేంకటాద్రియందలి,

నిర్ఝరగణాః= జలప్రపాతబృందాలు, వికల్ప్యంతే= సమానాలని భావింప బడుతున్నాయి.

**అవ :** గత శ్లోకంవరకు భగవద్గుణాలకు, భగవానునకు ఏర్పడు సమస్తోత్కర్షలు దయాసంబంధంచేతనే అని నిరూపించారు. ఈ దశకారంభంలోగల "అకూపారైః" అను శ్లోకంలో భగవంతునియందు ప్రపత్తి చేసినవారి విషయంలో దయాదేవి పెద్ద ప్రవాహంతో ప్రవహించు ప్రక్రియను దయాదేవి ఒక బిందువు పరబ్రహ్మ స్వరూపంకంటె నాలుగింతలు పెద్దదని, ఆ దయాప్రవాహంచే అవిద్య అనే కర్మలన్నీ నశిస్తున్నాయని ప్రతిపాదించి విశదీకరించి ఉన్నారు. తదుపరి గత శ్లోకం వరకు ప్రసంగా లవతరించాయి. ఈ దశకానికి ఉపాంత్యమైన ఈ శ్లోకంలో పూర్వోక్త ప్రవాహప్రభావాన్ని సమీచీన దృష్టాంతంతో విశదీకరిస్తున్నారు. దీనిచే "దయాదేవియొక్క ప్రవాహం ప్రపన్నుల విషయంలో సంభవించు ప్రక్రియ" అను ఈ దశకార్థంకూడా అర్థాత్తుగా నిరూపింపబడినదవుతున్నది.

**తా :** "తెళింద పెరుంతీర్తంగళ్ శెరిందవెర్పు" (నిర్మలమైన మహాతీర్థాలు ప్రవహించే పర్వతం) అని ఆచార్యులు తామే చెప్పినట్లుగా ఈ తిరుమలయందు ప్రవహించు పెద్ద జలాపాతాలను దయాప్రవాహంతో పెద్దలుపమిస్తూ ఉన్నారని వర్ణిస్తున్నారు. దయయే రూపం తాల్చి వచ్చినట్లున్న మహాలక్ష్మితో అనవరతం సంశ్లేషించి ఉన్న శ్రీనివాసునియొక్క దయ వాని కొక ముఖ్యాలంకారంగా అమరి ఉంది. అతివేగం కల ఆ ప్రవాహం కలిప్రభావంతో కలుగు ప్రాపంచికుల పాపాలను సమూలోన్మూలనం కావిస్తున్నది. అనగా భగవంతుని దయకు విషయమైన వారి పాపం నిశ్శేషంగా తొలగుతున్నదని భావం. అట్టి దయాప్రవాహం మనలను విషయీకరించుటకు మన మామెను శరణుపొందాలి. ఆ దయాప్రవాహం ఇక్కడ ఈ సమయంలోనే ప్రవహించుననే నియతి లేనిది. అవిచ్ఛిన్నంగా ఎప్పుడూ ప్రవహిస్తుంది. ఈ విషయాన్ని వేంకటాద్రికి అనవరతం భక్తులు వచ్చి శ్రీనివాసుని సేవించి తమ అభీష్టాలను పొంది పోతూ ఉండడం



ప్రత్యక్షంగా చూస్తున్న మనకు విశదీకరింప నవసరంలేదు. ఈ ప్రవాహం మిట్టపల్లమనే భేదం లేక అన్నిచోట్ల చాలా వేగంగా ప్రవహిస్తుంది. అనగా జాత్యాదులచే ఉత్కృష్టుల నికృష్టుల విషయంలో ఎలాంటి పక్షపాతం లేకుండా ప్రవహించి స్వకార్యం నిర్వహిస్తుంది. ఈ విషయాన్ని వివిధోదాహరణాలతో ఈ దశకంలోనే నిరూపించి ఉన్నారు. ఇది దయాప్రవాహంయొక్క స్వభావం. ఈ విధంగానే తిరుమలలో ప్రవహించు జలపాతాలకు కింద చెప్పిన స్వభావం ఉన్నది కాబట్టి ఆ జలపాతాలను దయాప్రవాహంతో సమంగా భావించవచ్చు. సమానమైన ప్రయోజనం ఉన్న చోటులలో వికల్పమని శాస్త్రజ్ఞులు చెపుతారు. ఈ జలప్రపాతాలు తమ వేగంతో భువిలోని సమస్త అశుద్ధాలను పోగొడుతాయి. అవి మహాపుణ్యతీర్థాలు కనుక ప్రాపంచికుల పాపాలను కూడా పోగొడుతాయి. కాలనియమం లేకుండా ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటాయి. పెద్ద ప్రవాహాలు కావడంతో మిట్టపల్లాలనే భేదంలేక ఎక్కడనైనా నిరర్గళంగా ప్రవహిస్తాయి. అందువల్ల దయాప్రవాహానికి గల గుణాలన్నీ ఈ జలప్రపాతాలకు కూడా ఉన్నాయి గనుక వీనిని దయాప్రవాహంతో ఉపమించవచ్చు.

ఇక్కడ దయాప్రవాహాన్ని ఉపమేయంగాను, జలప్రపాతాలను ఉపమానంగాను చెప్పవలసి ఉండగా ఇలా విపర్యస్తంగా చెప్పడానికి కారణం "దయాప్రవాహానికి ఉపమానమగుటకు కావలసినంత ఉన్నతి ఆ ప్రపాతాలకు లేకపోవడం. దయాప్రవాహం నానా రీతుల ఉత్కృష్టమైంది. కొన్ని అంశాలలో మాత్రం ఆ దయాప్రవాహాన్ని ఈ జలప్రపాతాలు అనుకరిస్తున్నవి" అను కారణం చేతనే.

ఇక్కడ "వికల్పం తే నిర్ఝరగణాః" అను పాఠంకంటె "వికల్ప్యం తే నిర్ఝరగణాః" అను పాఠం బాగున్నదనే అభిప్రాయంతో పూర్వులు వ్యాఖ్యానించారు. దాని ననుసరించియే మేమును వ్యాఖ్యానించాం.

**శ్లో॥ ఖిలం చేతోవృత్తేః కిమిదమితి విస్మేరభువనం**
**కృపే! సింహక్ష్మాభృత్ప్రుతముఖ చమత్కారకరణమ్ ।**

**భరన్యాసచ్ఛన్నప్రబలవృజిన ప్రాభృతభృతాం**
**ప్రతిప్రస్థానం తే శ్రుతినగరశృంగాటకజుషః ॥ 70**

**ప్రతి :** హే కృపే= ఓ దయాదేవీ!, శ్రుతినగరశృంగాటకజుషః= వేదమనే పట్టణానికి చతుష్పథంవంటి ఉపనిషత్తులను పొందియున్న, తే= నీ యొక్క, భరన్యాసచ్ఛన్న ప్రబలవృజినప్రాభృతభృతాం= భరసమర్పణం (శరణాగతి) అనే వస్త్రంతో మూయబడిన ప్రబల పాపాలనే ఉపహారాలను తీసుకొని వచ్చువారి నుద్దేశించి, ప్రతిప్రస్థానం= ఎదురేగిస్వీకరించుట అనునది, చేతోవృత్తేః= మనోవ్యాపారంయొక్క, కిమిదం ఖిలం= ఇదేమి లోపం (విస్మరణం), ఇతి= అని, (చేతోవృత్తేః ఖిలం= మనోవృత్తి నుండి జారినదిగాను, అనగా మనసుచేతగూడ భావించుటకు వీలులేనిదిగాను), కిమిదమితివిస్మేరభువనం= ఇదేమిటి అను ఆశ్చర్యంతోకూడిన ప్రపంచము కలిగినదిగాను, సింహక్ష్మాభృత్కృత ముఖచమత్కారకరణమ్= సింహాచలమనే వేంకటాద్రియందుండు విద్వాంసుడగు శ్రీనివాసునికి ఆశ్చర్యం కలుగజేయునదిగాను, (అస్తి= ఉన్నది).

**అవ :** ఇంతవరకు ఈ దశకంలో ప్రపన్నుని విషయంలో దయాదేవి చేయు వివిధోపకారాలను చెప్పి తద్వారా ప్రపన్నుడు నిర్భయుడుగా ఉండనగునని ఉపపాదించారు. దశకాంత్యమగు ఈ శ్లోకంలో ప్రపన్నుని విషయంలో దయాదేవిచేయు అతి ప్రధానమైన ఒక మహోపకారాన్ని విశదీకరించి ఈ దశకాన్ని ఉపసంహరిస్తున్నారు.

**తా :** వేదమనునది ఒక పెద్ద పట్టణం. పట్టణంలో సమస్త వస్తువులు లభించునట్లు వేదంలో ఐశ్వర్యం, కైవల్యం, మోక్షం అనబడే సమస్త పురుషార్థాలు లభిస్తాయి. అనగా వానిని పొందుట కుపాయాలు వేదంలో ఉన్నాయి. పట్టణానికి నాల్గు మహాపథాలు కలిసే చతుష్పథం ఎలా ప్రధానస్థలమో, అట్లే వేదానికి ఉపనిషద్భాగం అన్ని మార్గాలను భగవానునియందు సమన్వయింపజేసి ఇచ్చు భాగంకదా అది. అట్టి స్థలంలో



భగవద్దయాప్రభావం చక్కగా నిరూపింపబడుటచే అట్టి చతుష్పథాన్ని దయాదేవి పొందియుండునట్లు ఇక్కడ చిత్రింపబడుతున్నది. చతుష్పథంలో ఉండు వారికి ఏ మార్గంలో ఎవరు వచ్చినా చక్కగా దృష్టిగోచరులగునట్లు దయాదేవికి "చతుర్విధా భజన్తే మాం" అను రీతిలో ఏ ఫలాన్ని ఉద్దేశించి ఎవరు వచ్చినా వారు చక్కగా దృష్టిగోచరులవుతారు. వెంటనే వారువారు కోరిన ఫలాలను ప్రసాదించి అనుగ్రహిస్తున్నది. ఇట్లుండగా, మోక్షం కోరి ప్రపత్తి చేయువాని విషయంలో ఈ దయాదేవి చూపించే అత్యాదరం చాల ఆశ్చర్యకరంగా ఉన్నదని ఆచార్యులు విస్మయపడుతున్నారు. శరణాగతి చేయువాడు తన మహాపాపాలను దయాదేవికి ఉపాయనంగా తీసుకొని పోతున్నాడు. అతనికి పండే ధనం ఇదే గదా! వారి వారికి ఫలించిన వస్తువులనే వారువారు తమ తమ దైవతాలకు ఉపహారంగా అర్పించడం అలవాటై ఉన్నదిగదా! అందువల్ల ఈ పాపోపహారాన్ని "భరన్యాసం" (శరణాగతి) అనే ఒక చిన్న ధర్మమనే వస్త్రంతో చక్కగా మూసుకొని పోతున్నాడు. పైన మూయబడిన వస్త్రస్వరూపాన్ని చూచి ఆ ఉపహారాన్ని అలాగే దయాదేవి స్వీకరిస్తున్నది. అలా స్వీకరించునప్పుడు సంభవించే ఒక ప్రక్రియను ఆచార్యులు చాల రమణీయంగా వర్ణిస్తున్నారు. అదేమనగా ఈ జీవుడు ఈ ఉపహారాన్ని ఇలా మూసి ఎత్తుకొని పోవుటకు బయలుదేరినప్పుడే దయాదేవి చాల ఆదరంతోను, సంభ్రమంతోను ఎదురేగి దానిని స్వీకరిస్తున్నది. అప్పుడు వేదాలు, నిత్యముక్తులు ఆశ్చర్యపడుతున్నారు. "ఆహా! సర్వలోక సార్వభౌమియగు దయాదేవి ఎక్కడ? పాపపుంజమగు వీడెక్కడ? ఆమె వీని నెదుర్కొనుటేమి? ఇదేమి ఆశ్చర్యం? ఈశ్వరుడు సర్వజ్ఞుడు కనుక వాడు పాపం చేసే ప్రతి సమయంలో ఆ పాపాలను చక్కగా ఎరిగి ఉన్నాడే! అట్లుండగా ఇప్పుడు దయాదేవి వానికెదురేగి వాని నాదరించుట యుక్తమా? ఈశ్వరుడును, దయాదేవియు ఇతని పాపాలను మరచిపోయిరా? ఈ దయాదేవియొక్క ఔదార్యం మనస్సుచేత భావింప వీలుగానంతటి ఉన్నత రీతిలో ఉన్నదిగదా" అని అందరు ఆశ్చర్యచకితులగునట్లు సర్వజ్ఞుడగు

సాక్షాచ్ఛ్రీనివాసునికే విలక్షణాశ్చర్యాన్ని కలుగజేస్తున్నది దయాదేవి చేయు ప్రపన్నజీవాదరణం.

జీవుడెన్ని పాపాలు చేసినవాడైనా భగవానుని సమీపించి “నేనేమీ తెలియక ఇంత చేశాను. దీనిని పోగొట్టుటకు వేదాంతోక్త భక్తి యోగాదులు ఆచరించడానికి నాకు శక్తిలేదు. క్షమ కూడా లేదు. కావున ఆ భక్తియోగాన్ని ఆచరిస్తే ఏ ఫలం వస్తుందో, నా భక్తి యోగస్థానంలో నీవే నిలిచి నన్ను రక్షించి నాకాఫలం ఇవ్వవలె”నని చెప్పి శరణాగతి పొందినయెడల ఆ పరమపురుషుడు పరమదయాళువగుటచే ఆ దయచే ఇతని సర్వపాపాలను ఇతడు శరణాగతి చేసినవాడను హేతువుచే క్షమించి ఇతనిని సంసారబంధంనుండి వదలించి మోక్షపర్యంతమగు ఐశ్వర్యం ప్రసాదిస్తున్నాడు. ఇవన్నీ దయాకార్యాలే అను శాస్త్రార్థ మిచట వివక్షితం.

పై దశకంలో కృపణుడైన ప్రపన్నుని భరమును దయాదేవి మోస్తున్నదని నిరూపింపబోయే విషయాన్ని ఈ దశకాంతంలో ఇక్కడ యథాపూర్వంగా అవతరింపజేశారు.

*సప్తమదశకం సమాప్తం*

*శ్రీమతే నిగమాన్త మహాదేశికాయ నమః*

## అష్టమ దశకం

**శ్లో॥ త్రివిధచిదచిత్సత్తాస్థేమప్రవృత్తినియామికా**
**వృషగిరివిభోరిచ్ఛా సా త్వం పరైరపరాహతా ।**
**కృపణభరభృత్కింకుర్వాణప్రభూత గుణాంతరా**
**వహసి కరుణే! వైచక్షణ్యం మదీక్షణసాహసే ॥ 71**

**ప్రతి :** హే కరుణే= ఓ దయాదేవీ!, త్రివిధచిదచిత్సత్తాస్థేమప్రవృత్తిని యామికా= మూడువిధాలైన చేతనాచేతనములయొక్క స్వరూపస్థితి ప్రవృత్తులను నియమించు దానవుగాను, పరైః అపరాహతా= ఇతరులచే ప్రతిరోధించుట కసాధ్యవుగాను, కృపణభరభృత్= గత్యంతరవిహీనుడైన ప్రపన్నునియొక్క భారాన్ని వహించు దానవుగాను, కింకుర్వాణ ప్రభూత గుణాంతరా= (నీకు) సేవజేయు సమస్త భగవద్గుణాలు కలిగినదానవు గాను, వృషగిరివిభోః= వేంకటాద్రీశుడగు శ్రీనివాసునియొక్క, ఇచ్ఛా= ఇచ్ఛా రూపమైన, సాత్వం= అట్టి నీవు, మదీక్షణసాహసే= నన్ను కటాక్షించుట అను సాహస కృత్యమునందు, వైచక్షణ్యం= సామర్థ్యమును, వహసి= వహిస్తున్నావు.

**అవ :** గత దశకంలో ప్రపన్న విషయంలో దయాప్రవాహంచే ఏర్పడు ఆనుకూల్యములు వర్ణింపబడినాయి. ఈ దశకంలో ఈ ప్రపన్నుని విషయంలో, ప్రపత్తికి పూర్వకాలంలో, తదుత్తర మిహలోకంలో ఉండు కాలంలో, మోక్షేతర ఫలాపేక్షులవిషయంలో, మోక్షార్థమై భక్తియోగం అనుష్ఠించువారి విషయంలో ఈ దయాదేవివలన కలుగు ఉపకార పరంపర వర్ణింపబడుతున్నది. ఏతదనుగుణంగా దయాస్వరూపం ఈ దశకారంభంలో నిరూపింపబడుతున్నది. ఇట్లు సర్వలోకం భగవద్దయను అవలంబించి నిలుస్తున్నది అని తేలినయెడల ప్రపన్నుడు తనకు రక్షణ సిద్ధమని నిర్భయుడుగా ఉండవచ్చుననుకోవడం ఇక్కడ అర్థాత్తుగా సిద్ధిస్తున్నది.

కింది శ్లోకంలో ప్రపన్నుని విషయంలో దయ చేయు ప్రత్యుత్థానాన్ని చూచి ప్రపంచం ఆశ్చర్యపడుతున్నదని వర్ణించారు. ఈ శ్లోకంలో దానికంటె మిక్కిలి సాహసవంతమైన ఒక పనిని దయాదేవి చేస్తూ ఉన్నది. ఇది చాల ఆశ్చర్యం పొందదగిన విషయమని చెపుతున్నారు.

**తా :** ఇతరుల దుఃఖాన్ని పోగొట్టాలనుకొనే సమర్థుని ఇచ్ఛయే దయ. ఇది పరహితప్రావణ్యమనుటలో పర్యవసించునని మన సిద్ధాంతం. ఇట్టి భగవదిచ్ఛయే బద్ధులు (సంసారులు), ముక్తులు, నిత్యులు అనబడే త్రివిధ చేతనులయొక్క; ప్రకృతి, కాలం, శుద్ధసత్వం అనబడే త్రివిధ అచేతనుల యొక్క స్వరూపస్థితిప్రవృత్తులకు నియామికగా ఉంటుంది. ప్రపంచంలోని సర్వచేతనాచేతనులయొక్క సమస్తవ్యవహారాలు భగవద్దయవలననే జరుగుతున్నవని పరమతాత్పర్యం. ఈ భగవదిచ్ఛకు ఎవరిచేతా ఆటంకం కల్పించుటకు సాధ్యం కాదు. భగవంతుడొకరిని రక్షింపదలచిన వానినడ్డగించువారెవరూ లేరు. ఇట్టి దయాదేవిని ఒకడు శరణు పొందిన యెడల వానియొక్క సర్వభారాన్ని మోయుటకు సిద్ధంగా ఉంది. ఈ దయాదేవికి సేవ చేయుటకు జ్ఞానబలైశ్వర్యాదులు, అమిత మహిమ కలిగిన నానా భగవద్గుణాలు ఉన్నాయి. ఇట్టి వైభవాన్ని కాంచిన ఈ దయాదేవి అపరాధచక్రవర్తి అని వ్యవహరింపదగిన మహాపరాధిని, పాపంచేత సర్వలోకపుణ్యాలను భస్మీకరించు సామర్థ్యం గలవాడను అగు నన్ను కటాక్షించుట పెద్ద సాహసకృత్యమని, చాల సామర్థ్యంతో చేస్తున్నదని, ఇది మిగుల ఆశ్చర్యకరమని ఆచార్యులు అనుసంధిస్తున్నారు. ఎట్టి దోషగంధం లేని దయాదేవి నన్ను కటాక్షించుట అనే వ్యాపారంద్వారా నా సంబంధమేర్పడితే నా దోషాలు ఆమెను కూడా తొలగిస్తాయో, ఏమో అని భయపడవలసినది నా పరిస్థితి. అట్టి నన్ను కటాక్షించి ఉజ్జీవింపజేయడం పూర్వోక్తరీతిగా అంతటి ప్రభావమున్న నీకేగాని, మరొకరికి సాధ్యం కాదని తాత్పర్యం.



ఇట్లు ఆచార్యులు స్వవిషయంలో చేసిన నైచ్యానుసంధానం తదుత్తరకాలస్థులగు మనబోటివారి అనుసంధానానికి మార్గదర్శకంగా ఉంది. ఇక్కడ దయాదేవియొక్క స్వరూపం (ఇచ్ఛారూపత్వం) నిరూపితమవుతున్నది.

**శ్లో॥ వృషగిరిపతేర్హృద్యా విశ్వావతార సహాయినీ**
**క్షపితనిఖిలావద్యా దేవి (వీ) క్షమాదినిషేవితా ।**
**భువనజననీ పుంసాం భోగాపవర్గ విధాయినీ**
**వితమసి పదే వ్యక్తిం నిత్యాం బిభర్షి దయే! స్వయమ్ ॥ 72**

**ప్రతి :** హే దయే దేవీ!= ఓ దయాదేవీ, వృషగిరిపతేః హృద్యా= వేంకటాద్రీశునికి మనోహారణివి మనస్సులో ఉదయించుదానవుగాను, శ్రీనివాసుని హృదయంలో వసించు దానవుగాను, విశ్వావతార సహాయినీ= సర్వావతారాలలో సహాయభూతవుగాను, సమస్తావతారాలలోను పత్నిగా వెంట వస్తున్నదానవుగాను, క్షపితనిఖిలావద్యా= పోగొట్టబడిన అందరియొక్క దోషాలు కలదానవుగాను, (నిరస్తసమస్తదోషగాను), క్షమాదినిషేవితా= క్షమాదిగుణాలచే సేవింపబడుదానవుగాను, (భూదేవి మొదలగువారిచే సేవింపబడుదానవుగాను), భువనజననీ= ప్రపంచసృష్టికి కారణభూతవుగాను, (ప్రపంచ మాతవుగాను), పుంసామ్= ఆయా చేతనులకు, భోగాపవర్గ విధాయినీ= భోగం మోక్షం అనబడు సర్వపురుషార్థాలనిచ్చుదానవుగా నున్న, (త్వం= నీవు), స్వయం= స్వయంగానే, వితమసిపదే= తమోగుణ సంబంధం లేని పరమపదమునందు, నిత్యాం వ్యక్తిం= శాశ్వతమైన ప్రకాశాన్ని నిత్యమైన విగ్రహాన్ని, బిభర్షి= భరిస్తున్నావు.

**అవ :** కింది శ్లోకంలో తనను కటాక్షించుట అను సాహసకృత్యాన్ని దయాదేవి చేస్తున్నదని వర్ణించారు. ఇట్లు ఆమె చేయుటకు కారణం మాత్ర ప్రేమయే. లోకమాతయగు మహాలక్ష్మి ఈ దయాస్వరూపిణి కావున ఆమె వేరు, ఈమె వేరు కాదు. ఈ విషయం "కరుణామివరూపిణీం" అని ప్రథమదశకంలోనే నిరూపింపబడింది. కనుక లక్ష్మివలె దయకూడా తల్లియే. ఈ విషయంలో

ఇరువురికి గల సమానమైన వివిధవిశేషణాలను ఆచార్యులు ఈ శ్లోకంలో విశదీకరిస్తున్నారు. దీనిచే అచేతనమైన గుణాన్ని సంబోధించి స్తోత్రంచేయడం యుక్తమా? అనే ఆక్షేపణ కూడా పరిహరింపబడిన దవుతున్నది. లక్ష్మి దయాస్వరూపిణి కావడంవల్ల లక్ష్మీస్తోత్రంలోనే పర్యవసిస్తున్నదిగదా! కింది శ్లోకంలో భగవంతుని ఇచ్ఛావిశేషమే దయ అన్నారు. ఆ ఇచ్ఛకొక రూపమిచ్చినయెడల అది సాక్షాన్మహాలక్ష్మియొక్క రూపంగానే ఉండుననే తత్త్వం ఇచట తెలియదగింది.

**తా :** ఈ శ్లోకంలో చెప్పిన విశేషణాలన్నీ దయకు, లక్ష్మికి (శ్లేషలో) సమానమైనవి. దయ పరమపురుషుడగు శ్రీనివాసునియొక్క హృదయంలో ఉద్భవించునది. మిగిలిన గుణాలకంటె దయాగుణమంటేనే పరమపురుషునకు ఎక్కువ ప్రేమ. మహాలక్ష్మియు హృదయే. అనగా "అహల్య హిల్లేన్ ఇఱైయు మెన్టు" అనునట్లు ఒక క్షణకాలంకూడా శ్రీనివాసుని వదలి ఉండలేక ఆయన వక్షఃస్థలంలోనే వసించునదని భావం. సర్వావతారాలలోను దయయే సహాయంగా ఉంటుంది. దయచేతనేగదా అవతరించుట! "రాఘవత్వేఽ భవత్సీతా రుక్మిణీ కృష్ణజన్మని" అన్నట్లు సమస్తావతారాలలోను మహాలక్ష్మి సహధర్మచారిణిగా కలిసి అవతరిస్తున్నది. దయ సర్వదోషాలను పోగొట్టునది. లక్ష్మి ఎట్టిదోషాలకు ఆస్పదంకానిది. అజ్ఞాతవిగ్రహా. దయకు క్షమాదిగుణాలు సేవ చేస్తున్నాయి. అనగా సహాయభూతాలని భావం. లక్ష్మికి క్షమ అనబడు భూదేవ్యాది మహిషులు సేవ చేస్తున్నారు. ప్రథమదశకంలో వివరించిన విధంగా ఈ ప్రపంచసృష్టికి దయయే కారణం. అట్లే లక్ష్మియు భువనజనని, ప్రపంచమాత. దయ సర్వజనులకు వారు వారు కోరిన భోగ మోక్షాలను, పురుషార్థాలను ఇస్తున్నది లక్ష్మియు,

**"శ్రేయో నహ్యరవిందలోచన మనఃకాన్తా ప్రసాదాదృతే**
**సంసృత్యక్షరవైష్ణవాధ్వను నృణాం సంభావ్యతే కర్హిచిత్" ॥**



అనే సంప్రదాయం ప్రకారం సమస్తపురుషార్థాలనిచ్చునది. అనేక విధాల లక్ష్మీగుణాలను కలిగిన దయాదేవి తమోగుణసంబంధంలేని పరమపదంలో స్వేచ్ఛచేతనే నిత్యమైన మూర్తిని ధరిస్తున్నది. అనగా దయయే ఒకమూర్తిని స్వీకరించినట్లు మహాలక్ష్మి పరమపదంలో ప్రకాశిస్తున్నదని తాత్పర్యం.

ఈ శ్లోకంలో విధేయమగు చతుర్థపాదం తమోగుణం తల ఎత్తని సాత్వికాధికారివిషయంలో ఈ దయాదేవి పైపై తనకార్యాలుచేసి పూర్ణంగా అభివ్యక్తమవుతున్నదని, మరియు పరమపదంలో దయయొక్క అభివ్యక్తి నిత్యంగా ఉన్నదని స్ఫురింపజేస్తున్నది. అనగా ప్రకృతిమండలంలో జీవుల కర్మలు ప్రతిబంధకాలుగా ఉన్నందున దయ తన పూర్ణస్వరూపాన్ని ప్రకాశపరచుటకు వీలుగాకున్నది. పరమపదంలో అట్టి ప్రతిబంధకం లేనందున నిత్యంగా నిరాటంకంగా ప్రకాశిస్తూ ఉన్నదని ప్రాచీనులు వ్యాఖ్యానించారు.

**శ్లో॥ స్వయముదయినస్సిద్ధాద్యావిష్కృతాశ్చ శుభాలయాః**
**వివిధవిభవవ్యూహావాసాః పరం చ పదం విభోః ।**
**వృషగిరిముఖేష్వేతేష్విచ్ఛావధి ప్రతిలబ్ధయే**
**దృఢవినిహితా నిశ్శ్రేణిస్త్వం దయే! నిజపర్వభిః ॥ 73**

**ప్రతి :** హే దయే= ఓ దయాదేవీ!, స్వయముదయినః= స్వయంవ్యక్తమైన దివ్యమంగళవిగ్రహాలు కలిగిననియు, సిద్ధాద్యావిష్కృతాశ్చ= సిద్ధులు, దేవతలు మొదలగువారిచే ప్రకాశపరచబడిన విగ్రహాలను కలిగినవియు, వివిధవిభవవ్యూహావాసాః= అనేక విధాలైన విభవాలకు వ్యూహాలకు వానస్థానాలును, విభోః= ప్రభువైన పరమపురుషునియొక్క, పరం పదం చ= పరమపదమనబడు స్థానాలును, శుభాలయాః= ఏ శుభాలయాలు కలవో, వృషగిరిముఖేష్వేతేషు= వేంకటాద్రి మొదలగు ఇలాంటి స్థానాలలో, ఇచ్ఛావధి ప్రతిలబ్ధయే= తమ ఇష్టపూర్తిని పొందుట కొరకు, త్వం= నీవు,

నిజపర్వభిః= నీ సొంత పర్వభేదములచే (గెణుపులచే), దృఢవినిహితా= గట్టిగా నిర్మింపబడిన, నిశ్రేణిః= నిచ్చెనగా, భవసి= అవుతున్నావు.

**అవ :** గత శ్లోకద్వయంలో చెప్పబడిన సర్వలోకహితైషిత్వమనే దయాస్వరూపాన్ని విశదీకరిస్తూ కింది శ్లోకంలో చెప్పిన సర్వఫలప్రదత్వమనే గుణాన్ని ఇక్కడ సమీచీనదృష్టాంతంతో వివరిస్తున్నారు.

**తా :** ఇక్కడ దయనొక దృఢమైన నిచ్చెనగా చిత్రిస్తున్నారు. నిచ్చెన కిందనుండువారిని పైకెక్కిస్తుంది. పైనుండువారిని కిందికి దింపుతుంది. అందుకు ఈ నిచ్చెన దృఢమైన పలుపర్వాలచే నిర్మింపబడి ఉండాలి. దయాప్రక్రియకూడా ఇట్టిదే. పరమపురుషునికి అనేక వాసస్థలాలు ఉన్నాయి. స్వయంవ్యక్తాలైన కొన్ని దివ్యదేశాలు ఉన్నాయి. ఇక్కడ భగవంతుడు స్వయంగానే ఆశ్రితసంరక్షణ కొరకు ఆవిర్భవిస్తున్నాడు. ఇలాగే సిద్ధులు, ఋషులు, దేవతలు అనునట్టివారి ప్రార్థనల ననుసరించి ఆవిర్భవించు అనేక స్థలాలు ఉన్నాయి. క్షీరాబ్ధినాథుడు, కేశవాదులు మొదలగు వ్యూహావతారాలయొక్క స్థలాలుకూడా ఉన్నాయి. ఇటులనే రామకృష్ణాది విభవావతారాలు పలుచోట్ల ఉన్నాయి. వీటికన్నింటికి శ్రేష్ఠమైన పరమపదమనే పరవాసుదేవుని స్థానం ఉంది. వీనిలో స్వయంవ్యక్తభగవదావిర్భావం కలది వేంకటాద్రి. ఇటువంటి వేంకటాద్రి మొదలగు స్థలాలలో ఉండే ఆ యా మూర్తులను ఆ యా జనులు ఉపాసించి తమ తమ ఇష్టాలను పూర్తి చేసుకొంటున్నారు. ఇంద్రుడు మొదలగువారిని ఆరాధించి ఫలం పొందడం కూడా భగవంతుని దయచేతనే అని శాస్త్రాలలో స్పష్టం. ఇట్లు ఈ ప్రకృతిలోకం మొదలు పరమపదంవరకు అక్కడక్కడ భగవంతుని ప్రతిష్ఠించివారు వారు కోరిన ఫలాలను పొందునట్లు చేసేది భగవద్దయాదేవియే. అందువలన పరమపదంలో ఉండే భగవానుని సర్వులు సేవించి ఉజ్జీవించునట్లు అర్చారూపపర్యంతం కిందికి దింపుకొని రావడం, ఇక్కడున్నవారికి వారు వారు కోరిన ఫలాలనిచ్చి క్రమేణ పైకెక్కించుకొని



పోవడం దయాకృత్యాలే. కావున ఈ దయాదేవిని ఒక నిచ్చెనగా భావించవచ్చు. ఈ దయానిశ్రేణియొక్క పర్వాలు భగవంతునియొక్క పరవ్యూహాది రూపాలుగాను, పై శ్లోకాలలో చెప్పబోవురీతిగా యాదృచ్ఛికాది సుకృతమూలంగా ఏర్పడే దయాదేవి కటాక్షపాతం మొదలగు అనుకూలపరంపరగాను ఉంటుంది.

ఇక్కడ ''ఇచ్ఛావధి ప్రతిలబ్ధయే'' అనే పదంలో జీవేచ్ఛవలె పరమపురుషేచ్ఛ వివక్షితం. వానికి కూడా దిగివచ్చి అనుగ్రహించినపుడే ఇచ్ఛాపూర్తి కలుగుతున్నది. కనుక పరమపురుషునకు, జీవులకు; దిగడానికి, ఎక్కడానికి అనుకూలంగా ఈ దయానిచ్చెన అమరి ఉంది. ఇక్కడ హార్దావతారాన్ని "పరం చ పదం" అనుచోట కల చకారంచే వివక్షిస్తున్నారని ప్రాచీనుల వ్యాఖ్యానం.

భగవంతునియొక్క సర్వవిధావతారాలు దయచేత ఏర్పడుతున్నాయి. జీవులు ఆ యా అవతారాలను ఉపాసించి ఫలం పొందడం ఆ దయాదేవి చేతనే అనడం ముఖ్యతాత్పర్యం.

**శ్లో॥ హితమితి జగద్దృష్ట్యా క్లృప్తైరక్లప్తఫలాంతరైః**
**అమతివిహితైరన్యైర్ధర్మాయితైశ్చ యదృచ్ఛయా ।**
**పరిణతబహుచ్ఛద్మా పద్మాసహాయదయే! స్వయం**
**ప్రదిశసి నిజాభిప్రేతం నః ప్రశామ్యదపత్రపా ॥ 74**

**ప్రతి :** హే పద్మాసహాయదయే!= లక్ష్మీసహాయుడగు ఓ శ్రీనివాసుని దయాదేవీ!, జగద్దృష్ట్యా= లోకదృష్టిచే, హితమితి= హితమని, క్లృప్తైః= కల్పించుకొనబడిన ప్రాసంగిక సుకృతాలచేత, అక్లప్తఫలాంతరైః= తానుచేయు సుకృతకర్మచే కోరిన ఫలంకంటె వేరుఫలాల ఉద్దేశంలేని అనుషంగిక సుకృతాలచేతను, అమతి విహితైః= బుద్ధిపూర్వములుకాని అజ్ఞాత సుకృతాలచేతను, యదృచ్ఛయా ధర్మాయితైః= స్వయంగా ధర్మమవుతున్న

యాదృచ్ఛిక సుకృతాలచేత, అన్యైశ్చ= వీనికంటె వేరైన సామాన్యబుద్ధిపూర్వక సుకృతాలచేత, పరిణత బహుచ్ఛద్మా= పరిపక్వమైన అనేక వ్యాజాలుగల, (త్వం= నీవు), ప్రశామ్యదపత్రపా సతీ= శమించిన లజ్జకలదానివగుతూ, స్వయం= స్వయంగానే, నిజాభిప్రేతమ్= తనకు (నీకు) అభిమతమైన పురుషార్థాన్ని, నః= మాకు, ప్రదిశసి= ఇస్తున్నావు.

**అవ :** కింది శ్లోకంలో దయనొక నిచ్చెనగా రూపించి సర్వఫలం శ్రీనివాసునిదయచేతనే లభిస్తున్నదని ప్రతిపాదించారు. ఈ శ్లోకంనుండి దశకాంతం వరకు నిచ్చెన ఎలా క్రమేణ మెట్లుమెట్లుగా జనాలను ఎక్కిస్తుందో అట్లే ఈ దయాదేవి చేతనులను మెట్లుమెట్లుగా ఎక్కించే ప్రక్రియ వర్ణింపబడుతున్నది. దానిలో మొదట ప్రపత్త్యాద్యుపాయాన్వయానికి పూర్వం దయాదేవి చేసే ఉపకారప్రకారాన్ని విశదీకరించి పిదప ఆమెచే ఏర్పడు ఉపాయసంబంధాన్ని (ప్రపత్త్యన్వయాన్ని), తదనంతరం ప్రపత్త్యుత్తరకాలంలో ఏర్పడే ఫలాలను, మోక్షప్రాప్తిని చెప్పి కడపట భక్తియోగం చేయువారి విషయంలో ఈ దయాదేవి ప్రదర్శించే అనుగ్రహప్రకారాన్ని వర్ణించి ఈ దశకాన్ని ముగిస్తున్నారు. ఈ శ్లోకంలో ఆచార్యాశ్రయణానికి కూడా ప్రప్రథమంగా దయాదేవి చేసే ఉపకారం వర్ణింపబడుతున్నది.

**తా :** చేతనులయందు కొన్ని సమయాలలో ఏర్పడే ప్రాసంగికం, ఆనుషంగికం, అబుద్ధిపూర్వకం, యాదృచ్ఛికం, సామాన్యబుద్ధిపూర్వకం అనే సుకృతాలను, తాను రక్షించుటకొక వ్యాజంగా చేసుకొని దయాదేవి ఈ చేతనులను రక్షిస్తున్నది. రక్షించునపుడు తన కభిమతమైన పురుషార్థమునిచ్చి రక్షిస్తుంది. అనగా దయాదేవికభిమతమైన పురుషార్థం నిత్యానందరూపమైన మోక్షమే. దాని నిచ్చినపుడే పూర్ణరక్షణ చేసినట్లువుతుంది. ఆ మోక్షపురుషార్థాన్ని ఆమె ఒనగురీతిని పై శ్లోకంలో చక్కగా నిరూపించనున్నారు. ఇలా రక్షించునపుడు ఆమెకు ఇంతవరకూ ఉండిన సిగ్గు తొలగిపోయినదట. "ఈ చేతనుని ఇంతవరకు రక్షించలేదే. దానికొక



వ్యాజం దొరకలేదే! మనముండి ఏమి ప్రయోజనం?" అని సిగ్గుపడిన దయాదేవి ముందు చెప్పిన ప్రకారం ఏదో ఒక సుకృతాన్ని వ్యాజంగా చేసుకొని విగతలజ్జయై రక్షిస్తున్నది. ఇదియే గాక బహుకాలంగా దేహాత్మభ్రమచేత స్వతంత్రాత్మభ్రమచేత నిండి ఉన్న ఈ జీవుడు దయ తన్ను రక్షింప వచ్చునపుడు "నిన్నెవరు పిలిచినది? పిలువనిచోటికి రావడానికి నీకు సిగ్గులేదా?" అని అడిగిన యెడల, "సుకృతం చేయువారిని రక్షించుట నా కర్తవ్యం. సుకృతం చేయుట అనునదే నన్ను పిలుచుట. కావున నీవు (కింద చెప్పినరీతిలో) కొన్ని సుకృతాలు చేసియుండుట వలన నిన్ను రక్షించుట నాకర్తవ్యమగుటచే కర్తవ్యముననుష్ఠించుటలో సిగ్గుపడదగినదేమున్నది?" అని సమాధానం చెప్పి విగతలజ్జయై వీనిని రక్షిస్తున్నదని ఇక్కడ వివరించవచ్చు.

ప్రాసంగిక సుకృతమనగా – భగవన్నామాలను ఉచ్చరించిన యెడల పుణ్యం కలుగుతుందని నిశ్చయింపబడింది. తమ పుత్రాదులయొక్క "నారాయణుడు, గోవిందుడు" మొదలగు పేర్ల నుచ్చరించునపుడు, "ఇది భగవన్నామం, దీని నుచ్చరించి నేను పుణ్యం సంపాదించుకోగలను" అనే ఆలోచన లేకపోయినా ఆ నామప్రభావం వలన ఏర్పడే సుకృతం మొదలైనవి.

అనుషంగికమనగా – ముందు పోతున్న ఒక భాగవతుని దొంగలు చుట్టుకొని హింసించే సమయాన స్వకార్యంకోసం వెనుక వస్తున్న ఒక మనిషిని చూచిన ఆ దొంగలు ఈ భాగవతుని కాపాడటానికి వస్తున్న భటుడే వీడని భ్రమించి ఆ భాగవతుని వీడి పరుగెత్తుతున్నారు. ముందు వెళ్ళిన భాగవతుని దొంగలు పట్టుకొన్నది, వదలినది వెనుక వెళ్లినవానికి తెలియదు. ఐనను వీడే (వెనుకవచ్చువాడు) ఆ భాగవతునికి హింస లేకుండుటకు కారణమైనవాడు కనుక ఆ విధంగా సుకృతం వీనికి చేకూరుతున్నది. ఇట్టివి ఆనుషంగికాలు.

అబుద్ధిపూర్వమనగా – స్వప్రయత్నం లేకుండానే దైవవశాత్తు గంగా మరణం సంభవించుట మొదలగునవి.

యాదృచ్ఛిక సుకృతమనగా – మత్స్యగ్రాహి ఒకడు అర్ధోదయం మొదలగు పుణ్యకాలాలలో, సముద్రం మొదలగు పుణ్యతీర్థాలలో మత్స్యగ్రహణానికి మునుగునపుడు అతనికి పుణ్యం సంపాదించాలనే ఆశ లేకపోయినా ఆ కాలంయొక్క, పుణ్యతీర్థంయొక్క ప్రభావంచేత ఏర్పడు సుకృతం మొదలగునవి.

సామాన్య బుద్ధిమూలక సుకృతమనగా – "వీడొక బ్రాహ్మణుడు" అనే సామాన్యబుద్ధితో ఒక బ్రాహ్మణుని ఆరాధించినపుడు ఆ బ్రాహ్మణుడు చాల ఉత్కృష్టశ్రోత్రియుడు, సర్వశాస్త్రవేత్త, ఆత్మగుణపూర్తి గలిగినవాడు, మంచి అనుష్ఠాత, సత్కులప్రసూతుడుగా ఉండిన యెడల ఆరాధకునికి ఈ విషయాలు తెలియకపోయినా సామాన్య బ్రాహ్మణబుద్ధ్యా వాడుచేసిన ఆరాధనను ఈ పాత్రవైలక్షణ్యంచే ఉత్కృష్టారాధనమై వీనికి విశేష సుకృతాన్ని కలుగజేస్తుంది. ఇటువంటివి సామాన్యబుద్ధిమూలక సుకృతాలు.

ఈ సుకృతాలకు వేరుగా కొన్ని ఉదాహరణలను వ్యాఖ్యాతలు చెపుతారు. వీనిలో మూడింటికి పరస్పరభేదాన్ని, మరొక విశేషాన్ని 'శ్రీవచన భూషణ వ్యాఖ్యానం' ఆరవపదంలో చూడవచ్చు. ఈ సుకృతాలను మన వేదాంతదేశికులు పరమపదసోపానమనే గ్రంథంలో చెప్పి ఉన్నారు.

ఇక్కడ ప్రతిపదార్థం, తాత్పర్యం, ప్రాచీనులవ్యాఖ్యానాన్ని అనుసరించి ఇంతవరకు రాయబడినాయి.

వాస్తవంగా, "హితమితి జగద్దృష్ట్యాక్లప్తై" అనుటచే సామ్యాబుద్ధి మూలక సుకృతం, "అక్లప్తఫలాంతరైః" అనుటచే ప్రాసంగికానుషంగికం, "అమతి విహితైః" అనుటచే అబుద్ధిపూర్వం, "అన్యైశ్చ ధర్మాహితైః యదృచ్ఛయా" అనుటచే యాదృచ్ఛికం అని ఆచార్యులు నిర్దేశిస్తున్నారనడం యుక్తమని తోస్తున్నది.

ఇక్కడ సామాన్యబుద్ధిమూలకంగా బుద్ధిపూర్వకమైన ప్రవృత్తి ఉంది. ప్రాసంగికంలో ఒక ప్రయత్నంచేతనే తనకుద్దేశ్యమగు ఒక ఫలంకంటె మేలైన



కొన్ని ఫలాలు సిద్ధించడం, ఆనుషంగికంలో వీనికుద్దేశం లేనప్పుడే ఫలము సిద్ధించడం, అబుద్ధిపూర్వంలో వేరొకరి ప్రయత్నంచేతనే వీనికి ఫలం సిద్ధించడం, యాదృచ్ఛికంలో ఎదురుచూడనపుడు అకస్మాత్తుగా సుకృతం సంభవించడం విశేషాంశాలు. ఈ విషయాలనుబట్టి వీటికి పరస్పరభేదం నిరూపింపబడాలి.

వీటికి క్రమేణా ఉదాహరణలు : సామాన్య బుద్ధిమూలకానికి పూర్వోక్తమే ఉదాహరణం కావచ్చు. ప్రాసంగికానికి : తన కుద్దేశ్యుడైన ఒక భాగవతునికి వీజనం ఒనరించునపుడు మరొక భాగవతుడచటికి వచ్చినయెడల ప్రథమభాగవతవీజన కైంకర్యంచేతనే ద్వితీయభాగవతునికి కూడా వీజనఫలం సిద్ధించుటచే ఇద్దరు భాగవతులకు కైంకర్యం చేసినయెడల ఏర్పడే సుకృతం వీనికి కల్గుతున్నదనుట ఉదాహరణం కావచ్చు. ఆనుషంగికానికి: పశువులను తరుముకొని పోవునపుడు ఆ పశువు గుడికి ప్రదక్షిణంగా వెళ్లినపుడు దానిననుసరించిపోవు వీనికిని ప్రదక్షిణఫలం సిద్ధించడం ఉదాహరణం. అబుద్ధిపూర్వమునకు : ఒకడు తనకు తెలియకనే తోవలో ధారపోసుకొనిన డబ్బును వేరొకడు తీసుకొనిపోయి భగవంతునికి మాలాసమర్పణాది కైంకర్యం చేసినయెడల డబ్బు ధారబోసుకొనిన వాని కేర్పడు సుకృతం ఉదాహరణం. యాదృచ్ఛికానికి: ఏతపుగెడ కొనడానికి వచ్చిన వానికి అచింతితంగా భగవద్దర్శనం సంభవించి తద్ద్వారా కలుగు సుకృతం ఉదాహరణం. ఈ యాదృచ్ఛికంలో సుకృతం సంభవించినా విషయం పూర్వనిశ్చితం కాదు. ఆనుషంగికంలో పశువు ప్రదక్షిణంగా పోవునపుడు దానిని తరుముతూ వీడు దానివెనుక వెళ్లినయెడల ప్రదక్షిణపుణ్యం నిశ్చయంగా కలుగుననుట. ఇక్కడ భేదకాకారం కనిపిస్తుంది.

**శ్లో॥ అతివిధిశివైరైశ్వర్యాత్మానుభూతరసైర్జనాన్**
**అహృదయమిహోపచ్ఛంద్యైషామసంగదశార్థినీ ।**
**తృషితజనతాతీర్థస్నానక్రమక్షపితైనసాం**
**వితరసి దయే! వీతాతంకా వృషాద్రిపతేః పదమ్ ॥ 75**

**ప్రతి :** హే దయే!= ఓ దయాదేవీ!, అతివిధిశివైః= బ్రహ్మరుద్రాదుల నతిక్రమించియున్న (అనగా వారి ఆనందంకంటె ఉత్కృష్టమైన), ఐశ్వర్యాత్మానుభూతిరసైః= ఐశ్వర్యం, కైవల్యం వీనియొక్క అనుభవానందాలచే, జనాన్= జనులను, ఏషాం= ఈ జనులకు, ఇహ= ఈ ఐశ్వర్య కైవల్యాలలో, అసంగదశార్థినీ= ఆశలేక పోవుదశను కలుగజేయ గోరినదానిపై, అహృదయం యథా తథా= తనకభిప్రాయం లేకయే, ఉపచ్ఛంద్య= ఆ ఐశ్వర్యాధి పలాలనిచ్చి వారిని సమాధానపరచి, తృషిత జనతాతీర్థస్నానక్రమక్షపితైనసాం= దప్పిగొనిన వానియొక్క పుణ్యతీర్థస్నాన న్యాయంచే పోగొట్టబడిన పాపంగల, (ఏషాం= ఈ జనులకు) వీతతంకాసతీ= విగతభయలజ్జాదులు గల దానివై, వృషాద్రిపతేః= వేంకటాద్రీశుడగు శ్రీనివాసునియొక్క, పదం= స్థానమును (మోక్షమును), వితరసి= ఇస్తున్నావు.

**అవ :** కింది శ్లోకంలో చెప్పిన "ప్రకటితబహుచ్ఛద్మా, నిజాభిప్రేతం ప్రదిశసి" – అనేక వ్యాజాలను ఆధారం చేసుకొని తనకభిమతమైన పురుషార్థం ఒసగుచున్నావనే విషయాన్ని, నిచ్చెన క్రమేణ మెట్టు మెట్టుగా ఎక్కిస్తున్నదని తత్పూర్వ శ్లోకంలో చెప్పిన విషయాన్ని ఈ శ్లోకంలో వివరిస్తున్నారు.

**తా :** ఆతపాదులచే తాపంచెందినవాడు తాపాపనోదనార్థమై పుణ్యతీర్థంలో స్నానం చేయునపుడు ఆ తీర్థప్రభావంవలన వాని పాపాలు వదలిపోతున్నాయి. అటులనే శ్రీనివాసుని దయనవలంబించి ఐశ్వర్యం, కైవల్యం మొదలగు పురుషార్థాలను పొందునపుడు ఆ భగవత్సేవ వీనికి క్రమంగా ఆ ఐశ్వర్యాది నశ్వరపురుషార్థాలలో రుచిని పోగొట్టి, మోక్షపురుషార్థంలో ఆశను కలుగజేసి తదనుగుణంగా తదుపాయాన్వయం కావించి మోక్షాన్నికూడా ప్రసాదిస్తున్నదనే విషయం వివక్షితం.

దయాదేవికి చేతనుని పూర్ణసంరక్షణలోనే అనగా మోక్షప్రదానంలోనే ముఖ్యమైన పని. ఐనా బహుకాలంగా సంసారంలో సంచరిస్తున్నవారికి



వారు కోరిన ఫలాలనే (ఐశ్వర్య కైవల్యాదులను) ఇచ్చి వారిని ఉపచ్ఛందనం చేసి, అనగా వారి ఇష్టాన్ని (తనకిష్టంలేకపోయినా) అనుసరించి పిదప వారికే ఈ నశ్వరపురుషార్థాలలోగల దోషాలను తెలియజేసి క్రమశః మోక్షేచ్ఛ, ఉపాయాన్వయం అనే ఫలాన్ని ఇస్తున్నది. ఇట్లు ఉపాయాన్వయ పూర్వంగా ఫలాలను ఇస్తే ఆమెకు పక్షపాతాది దోషాలకవకాశ మేర్పడదు. దీనినే "వీతాతంకా" అనే పదంతో సూచిస్తున్నారు. సాక్షాద్భగవద్దయచే ప్రదీయమానఫలాలు కనుక ఐశ్వర్యాదులు కూడా బ్రహ్మాండసృష్టికర్తయొక్క, తత్సంహారకర్తయగు రుద్రునియొక్క ఐశ్వర్యాదులను మించి ఉంటాయని "అతివిధిశివైః" అనే పదంతో తెలియజేస్తున్నారు.

ఇక్కడ కైవల్యమనే ఆత్మానుభవరసం బ్రహ్మరుద్రాదుల ఆనందంకంటె ఉత్కృష్టంగా ఉంటుందనడంలో సందియం లేదు. ఐశ్వర్యం కూడా తదానందంకంటె ఉత్కృష్టమని చెప్పడం ప్రమాణసమ్మతమా? అనే సందేహం కలుగుతుంది. దీనికి సమాధానం బ్రహ్మరుద్రాదుల ఆనందంలో కూడా దుఃఖసంబంధం ఉంది. అప్పుడప్పుడు వారు పడిన అవస్థలు పురాణాలలో ప్రసిద్ధాలు. అట్లుకాక ఉత్కటపాపాంశ సంబంధం లేకుండా సుకృతాంశపూరితుడైన ఒక భగవదనుగ్రహ విషయభూతుడగు అధికారికి బ్రహ్మరుద్రాదులవలె దుఃఖసంబంధంలేక నిరంతరసుఖరూపమగు ఐశ్వర్యమే కలుగవచ్చు. కావున వీని అనుభవానికి బ్రహ్మరుద్రాద్యనుభవంకంటె ఉత్కృష్టానుభవమని చెప్పడంలో ఎలాంటి ప్రమాణవిరోధం లేదు.

**శ్లో॥ వృషగిరిసుధాసింధౌ జన్తుర్దయే! నిహితస్త్వయా**
**భవభయపరీతాపచ్ఛిత్త్యై భజన్నఘమర్షణమ్ ।**
**ముషితకలుషో ముక్తేరగ్రేసరైరభిపూర్యతే**
**స్వయముపనతైః స్వాత్మానందప్రభృత్యనుబంధిభిః ॥ 76**

**ప్రతి :** హే దయే= ఓ దయాదేవీ!, త్వయా= నీచేత, భవభయపరీతా పచ్ఛిత్త్యై= సంసారంలో కలుగు భయం, తాపత్రయం వీనియొక్క నివృత్తి కొరకు,

వృషగిరిసుధాసింధౌ= వేంకటాద్రియందండు అమృతసముద్రంలో (శ్రీనివాసునియందు), నిహితః= చేర్చబడిన, జన్తుః= ప్రాణి, భవభయపరీతాపచ్ఛిత్త్యై= సంసారతాపత్రయ నివృత్తికొరకు, అఘమర్షణం= సర్వపాపప్రాయశ్చిత్తరూపమగు ప్రపత్తిని (ధర్మశాస్త్రోక్తాఘమర్షణస్నానమును), భజన్= పొందినవాడై (అనుష్ఠించినవాడై), ముషితకలుషః= పోగొట్టబడిన పాపం కలిగినవాడై, స్వయముపనతైః= తానుగానే సంభవింపదగిన, ముక్తేః= మోక్షమునకు, అగ్రేసరైః= అగ్రయాయులగు, స్వాత్మానందప్రభృత్యనుబంధిభిః= స్వాత్మానందం మొదలగు భోగాలతో, అభిపూర్యతే= పూరింపబడుతున్నాడు.

**అవ :** కింది శ్లోకంలో దయాదేవి ఐశ్వర్యకైవల్యాదిపురుషార్థాలనిచ్చి తద్ద్వారా శ్రీనివాస సంబంధాన్ని కలుగజేసి క్రమంగా మోక్షమునిస్తూ ఉన్నదని వర్ణించారు. ఇట్లు నశ్వరపురుషార్థాలకొరకు భగవంతుని ఆశ్రయించినవారికి ప్రపత్తిరూపమైన మోక్షోపాయాన్వయమేర్పడడాన్ని, ఉపాయానుష్ఠానానంతరం వచ్చు ఫలాలను ఈ శ్లోకంలోను, అనంతర శ్లోకంలోను వివరిస్తున్నారు.

**తా :** ప్రపత్తి అనే ఉపాయం అఘమర్షణమని చెప్పబడుతున్నది. ఇది సర్వపాపాలను తొలగించే ప్రాయశ్చిత్తం. దీనిని ప్రాణులకు కలుగజేయగోరిన దయాదేవి మొదట వేంకటాద్రియందుండు అమృతసముద్రం వంటి శ్రీనివాసుని పొందజేస్తున్నది. ఫలాంతరోద్దేశంతో శ్రీనివాసుని పొందినవానికి కూడా ఆ వస్తుప్రభావంవలన మోక్షతదుపాయాలలో ఉత్కటేచ్ఛ జనిస్తున్నది. అలా ఉపాయాన్వయమేర్పడినపిదప పరమపదమనే మోక్షానికి పోవుటకుముందు ఈ ప్రపంచంలో ఉన్నంత కాలంవరకు పరమపదంలో ఎట్టి భోగాలననుభవింపదగునో, అట్టి పరమాత్మానుభవాన్ని (తానుగానే వస్తున్న) పూర్ణంగా అనుభవించవచ్చు. అనగా, సర్వేశ్వరునియందు ప్రపత్తి చేసిన పిదప ఈ ప్రపన్నుడు తాను చేయు నిత్య నైమిత్తికాది సర్వకర్మములను భగవత్ప్రీతినుద్దేశించియే చేస్తున్నాడు. కావున భగవానుడు, తత్కల్యాణగుణాలు



సర్వదా ఇతని బుద్ధియందు ప్రకాశిస్తూనే ఉంటాయి. కాబట్టి పరమాత్మానుభవమితనికి పరిపూర్ణంగా సంభవిస్తున్నది. ఇదంతా దయాకార్యమే.

ఇక్కడ భగవంతుని అమృతసముద్రంగా రూపించుటచే నిదాఘ కాలంలో ఆతపతప్తుడు అతిశీతలామృతోదధియందు అవగాహన మాచరిస్తే ఎలాంటి మహానందం కలుగుతుందో, అట్లే ఈ బ్రహ్మహ్రదావగాహనం చేసిన వానికి బాహ్యాభ్యంతరాది సర్వతాపాలు తొలగిపోతాయనడం సూచితమవుతున్నది.

ధర్మశాస్త్రోక్తమైన అఘమర్షణస్నానం వంటిది బ్రహ్మహ్రదావగాహనం. అనగా ప్రపత్తి అనేది సర్వపాపప్రాయశ్చిత్తరూపం. ఇది ఈ స్తోత్రంలోనే పలుమార్లు చెప్పబడింది.

ఇక్కడ "స్వాత్మానందప్రభృత్యనుబంధిభిః" అనే పదంలో "స్వాత్మానంద" అనే భాగానికి తనకాత్మయైన పరమపురుషునియొక్క ఆనందానుభవమని వాఖ్యానించాం. పరమాత్మననుసంధించునపుడు తనకు "ఆత్మ" అను ఆకారంలో అనుసంధించాలనే విషయం తెలియజేయడానికి "స్వాత్మా నంద" అనే నిర్దేశం చేయబడింది. ఇట్లుగాక "స్వాత్మ" శబ్దంతో జీవాత్మను వివక్షించి ''తదానంద'' శబ్దంతో జీవస్వరూపానందం, ''ప్రభృతి'' శబ్దంతో పూర్వోక్తభగవదనుభవం చెప్పబడుతున్నాయని కొందరు వాఖ్యానిస్తారు. అప్పుడు జీవాత్మానుభవమంటే భగవచ్ఛేషంగాను, భగవద్దాసుడుగాను జీవాత్మననుభవించుటయే. ప్రతి కర్మానుష్ఠానంలోనూ తనను భగవచ్ఛేషుడుగా తలచి అనుష్ఠించుట వలన అప్పుడు సంభవించే ఆనందం చాల ఉత్కృష్టమని భావం.

ప్రపత్తి మోక్షార్థంగా చేయబడినా, మోక్షానికి వెళ్లడానికి ముందు ఇహలోకంలో ఇట్టి స్వాత్మానుభవం, భగవదనుభవం ఆనుషంగికంగా

స్వయంగానే దయాదేవి అనుగ్రహంచేత సంభవిస్తున్నదనడం "స్వయముపనతైః" అనే పదానికి భావం.

**శ్లో॥ అనితరజుషామంతర్మూలేఽప్యపాయపరిప్లవే**
**కృతవిదనఘా విచ్ఛిద్యైషాం కృపే! యమవశ్యతామ్**
**ప్రపదనఫలప్రత్యాదేశప్రసంగవివర్జితం**
**ప్రతివిధిముపాధత్సే సార్ధం వృషాద్రిహితైషిణా ॥ 77**

**ప్రతి :** హే కృపే=ఓ దయాదేవీ! అనితరజుషాం=దేవతాంతరాలను, ఫలాంతరాలను అవలబించని ప్రపన్నులకు, అంతర్మూలే=బుద్ధిపూర్వకమైన, అపాయపరిప్లవే=అపరాధమనే కీడు, సంభవత్యపి=సంభవించినను, కృతవిత్=చేసిన ప్రపత్తిని తలచి కృతజ్ఞవుగాను, అనఘా=నిగ్రహేచ్ఛ యను దోషములేనిదానవుగాను ఉన్న, (త్వం=నీవు) ఏషాం=ఈ ప్రపన్నులకు, యమవశ్యతాం=యముని వాతబడుట అను మహావిపత్తును, విచ్ఛిద్య= తొలగించి, వృషాద్రిహితైషిణా సార్ధం=వేంకటాద్రియందుండు హితమునే కోరు శ్రీనివాసునితో కూడుకొని, ప్రపదనఫలప్రత్యాదేశప్రసంగవివర్జితం= ప్రపత్తికి ఫలంగా సంకల్పింపబడిన మోక్షానికి ఎట్టి ప్రతిరోధానికి అవకాశంలేనట్టుగా, ప్రతినిధిం=పరిహారాన్ని (పునః ప్రపదనం లఘుదండనం మొదలగువానిని), ఉపాధత్సే= ఏర్పాటుచేస్తున్నావు.

**అవ :** క్రింది శ్లోకంలో ప్రపత్తి అనే ఉపాయంలోని సంబంధం, తదనంతరం నిర్మాణకాలపర్యంతమైన ఉత్తరకాలంలో ఈ ప్రపన్నునికేర్పడే పరమాత్మానుభవానందం అనే ఇష్టప్రాప్తిరూపమైన ఫలం వర్ణింపబడినాయి. ఈ శ్లోకంలో ఆ ఉత్తరకాలంలోను, నిర్యాణకాలంలోను సంభవింపదగిన అనిష్టంయొక్క పరిహారరూపమైన ఫలం వర్ణింపబడుతున్నది.

**తా :** ప్రపన్నుడు ప్రపత్తిచేయునపుడు "ఈశ్వరునకనుకూలుడుగనే ఉండగలను. ప్రాతికూల్యం చేయుటలేదు" అని సంకల్పపూర్వకంగా



ప్రపత్తిననుష్ఠించుటవలన ఉత్తరకాలంలో (ప్రపత్తి చేసిన పిదవ) అతనికి బుద్ధి పూర్వకాలైన అపరాధాలు ప్రాయశః సంభవించవు.(ఇక్కడ అపరాధాలు అంటే భగవదాజ్ఞారూపాలైన శాస్త్రాలనుల్లంఘించుటయే). ఒకవేళ ప్రారబ్ధకర్మ ప్రాబల్యంవలన బుద్ధిపూర్వకమైన ఆపరాధాలు సంభవించినా ఈ ప్రపన్నుని మోక్షప్రాప్తికెట్టి విరోధం సంభవింపదనే అంశాన్ని ఆచార్య లిక్కడ ప్రకటిస్తున్నారు. అబుద్ధిపూర్వకాలైన (తనకు తెలియకనే) అపరాధాలేర్పడినయెడల ఆ దోషం ప్రపన్నునికి ప్రపత్తియను బ్రహ్మవిద్య యొక్క మాహాత్మ్యంచేత అంటుట లేదు. అంటే ఆ పాపాలకు ఫలమివ్వడానికి ఈశ్వరుడు సంకల్పించుట లేదని భావం. ఇదే అబుద్ధిపూర్వకమైన పాపాన్ని ప్రపన్నేతరుడు అనుష్ఠించినయెడల (బ్రహ్మవిద్యాన్వయం లేనివాడు) ఆ దోషానికి కూడా అతనికి దండన ఉంది.

కొన్ని సమయాలలో ప్రపన్నుడే బుద్ధిపూర్వకంగా పాపంచేసినప్పటికి ప్రపత్తిచేసే సమయంలో వీడు కోరిన ప్రకారంగా వీనికిష్టమైన కాలంలో మోక్షమిచ్చునట్లీశ్వరుడు సంకల్పించినయెడల ఇప్పుడు చేసిన అపరాధానికి వీడు కోరిన కాలానికి మునుపే పునశ్శరణాగతి అను పరిహారాన్నో, లేక వాడు కఠిన ప్రకృతిగా ఉండి పునశ్శరణాగతిని ఆనుష్ఠించనియెడల పూర్వోక్తప్రకారంగా రాజపుత్రన్యాయంతో లఘుదండనదానం అనే పరిహారాన్నో ఈ దయాదేవి సర్వభూతహితైషియైన శ్రీనివాసునితోకలసి ఆలోచించి సంవిధానం కావించి, ఇతని నిర్యాణకాలంలో యముడో, తద్భటులో వీనిని స్వాధీనపరచుకొని నరకానుభవం ఇవ్వకుండునట్లు కాపాడి, ముందు సంకల్పించిన మేరకు తాను ప్రపత్తిఫలమైన మోక్షానికి ఏవిధంగానూ విఘాత మేర్పడనట్లు వీనికి మోక్షమునిచ్చియే తీరును.

"న ఖలు భాగవతాః యమవిషయం గచ్ఛంతి" అనిగదా ప్రమాణాలు చెపుతున్నాయి! దీనిచే ప్రపత్త్యుత్తరకాలంలో సంభవించే అనిష్టనివృత్తి నిరూపితమవుతున్నది. ఈ శాస్త్రార్థాన్నే "ధీపూర్వోత్తర పాప్మనామజన

నాజ్ఞాతేఽపి తన్నిష్కృతే, కౌటిల్యే సతి శిక్షయాఽప్యనఘయన్ క్రోడీకరోతి ప్రభుః" అని "శ్రీమద్రహస్యత్రయసారం"లో ఆచార్యులు స్పష్టంగా చెప్పారు.

**శ్లో॥ క్షణవిలయినాం శాస్త్రార్థానాం ఫలాయ నివేశితే**
**సురపితృగణే నిర్వేక్ష్యత్రాగపి ప్రలయం గతే ।**
**అధిగతవృషక్ష్మాభృన్నాథామకాలవశంవదాం**
**ప్రతిభువమిహ వ్యాచఖ్యుస్త్వాం కృపే! నిరుపప్లవామ్ ॥ 78**

**ప్రతి :** హే కృపే= ఓ దయాదేవీ!, క్షణవిలయినాం= స్వల్పకాలంలో నశిస్తున్న, శాస్త్రార్థానాం= శాస్త్రాలలో విధింపబడు యూగం, దానం, హోమం మొదలగు పుణ్యకర్మలయొక్క, ఫలాయ= ఫలాలనిచ్చుట కొరకు, నివేశితే= నియమింపబడిన, సురపితృగణే= దేవపితృబృందం, నిర్వేక్ష్యత్రాక్= పుణ్యకర్మ చేసినవాడు తత్ఫలం అనుభవించుటకుముందే, ప్రలయం గతేఽపి= నశించిపోయినను, అకాలవశంవదాం= కాలానికి లోబడనిదియు, (కాలంచే నాశంలేక నిత్యంగా ఉండునదియు), నిరుపప్లవామ్= ఎవరిచే ఎట్టి ఉపద్రవం పొందనిదియు, అధిగతవృషక్ష్మాభృన్నాథం= ఆశ్రయింపబడిన వేంకటాద్రీశుడగు శ్రీనివాసుడు కలిగిన దానవగు, త్వాం= నిన్ను, ఇహ= ఈ విషయంలో (దేవపితృలకు బదులుగా చేసిన పుణ్యాలకు ఫలమిచ్చు విషయంలో), ప్రతిభువం= బదులుదానవుగా (జామీనుగా) వ్యాచఖ్యుః= (పెద్దలు) చెప్పినారు.

**అవ :** ఈ శ్లోకం ప్రాసంగికమైంది. అనగా కింది శ్లోకంలో మోక్షార్థమై ప్రపత్తి చేసినవాని విషయంలో వానికి ఫలప్రాప్తికి మునుపు సంభవించే కొన్ని ప్రతిబంధకాలను దయాదేవి పోగొట్టి క్లుప్తకాలంలో ఫలమేర్పడునట్లు చేస్తున్నదని వర్ణించారు. ఈ శ్లోకంలో అట్లే స్వర్గాది పురుషార్థాలనుద్దేశించి యాగదానాది పుణ్యకర్మలను అనుష్ఠించువారి విషయంలో కొన్ని ప్రతిబంధకాలు సంభవించినయెడల వాటిని కూడా దయాదేవియే పోగొట్టి వారికాఫలాల నందజేస్తున్నదని నిరూపిస్తున్నారు.



**తా :** యాగం మొదలగు పుణ్యకర్మలు చేయువారికి ఫలం ఇవ్వడంకోసం సర్వేశ్వరుడు, ఇంద్రుడు మొదలగు దేవతలు పితరులు మొదలగు వారిని ఏర్పాటుచేసియున్నారు. యాగం మొదలగు కర్మలే ఫలాలను ఇస్తాయన్నది అంగీకారం కాదు. కర్మలు క్షణంలో నశించిపోతాయి కాబట్టి కాలాంతరభవాలైన స్వర్గాదిఫలాలకు అవి కారణం కావడానికి వీలు కాదుగదా! ఏతదర్థంగా మధ్య''అపూర్వ'' మనునొక పదార్థాన్ని ఒప్పుకోవడంలో పలుదోషాలున్నాయి. కాన ఆ యా కర్మలలో ఉద్దేశ్యులగు ఇంద్రాది దేవతల అనుగ్రహంచేతనే ఫలమేర్పడుతున్నది. ఇది ఇట్లుండగా ఆ దేవతలుకూడా పరమపురుషానుగ్రహంచేత ఆ యా పదవులలో గుర్తించిన కాలంవరకు నియమితులు కాబట్టి వారికికూడా నాశం ఉంది. స్వర్గాన్ని ఉద్దేశించి యాగం చేసినవాడు తన కాలసమాప్త్యనంతరం ఆ ఫలాన్ని పొందవలసిన సమయంలో పూర్వోక్తేంద్రాది దేవతలకేర్పడిన కాలావధి తీరిపోయి వారు నశించినయెడల ఆ ఫలం ఎవ్వరివ్వగలరనే సందేహమేర్పడినప్పుడు శాస్త్రజ్ఞులైన పెద్దలిలా చెపుతారు. కాలావధిలేకుండా, వేరొక అధికారిలేనందున స్వేష్టవిరోధాద్యుపద్రవరహిత అయిన శ్రీనివాసుని దయయే నశించిపోయినా ఇంద్రాద్యధికారులకు ప్రతినిధిగా ఉండి ఆ యా ఫలాలనిస్తున్నది. అనగా శ్రీనివాసుడను పరమపురుషుడు పరమదయచే ఇంద్రాదులు నశించిపోయినప్పటికి వారికియ్యదగిన ఫలాల నిప్పిస్తున్నాడు. వాడు నిత్యుడు. అకాలకాల్యుడు. ఆయనకుపైన ఎవరూ లేరు. కావున ప్రతిరోధానికి అవకాశం లేదని భావం.

ఇంద్రాదులు స్వయంగా ఫలమివ్వడానికి కూడా పరమపురుషుడు వారి కంతర్యామిగా ఉండి ఒసగిన శక్తియే కారణం. యాగాద్యనుష్ఠాతలైన ఆరాధకులు (తామెరుగకపోయినా) ఇంద్రాదులనుద్దేశించి ఆరాధించినా, తదంతర్యామియగు పరమపురుషునే ఆరాధిస్తూ ఉన్నారని గీతాది శాస్త్రాలలో స్పష్టం. ఇట్లుండగా ఆ ఇంద్రాదులు నశించినయెడల ఈ పరమపురుషుడే

ఆ నష్టేంద్రాదులకు ప్రభువుగా ఉండి, తత్స్థానస్థాపితేంద్రాంతరం ద్వారా పూర్వోక్తఫలం ప్రసాదిస్తున్నాడు. ఇంద్రాంతరమూలంగా ఫలం ఇచ్చినా జవాబుదారితనం పరమపురుషునే చేరినందువలన అతడే ఇచ్చునట్లుగా భావించాలనే విషయమిక్కడ వివక్షితం. విస్తరభీతివల్ల ఇంతమాత్రమే ఉపపాదించాం.

**శ్లో॥ త్వదుపసదనాదద్య శ్వో వా మహాప్రలయేఽపి వా**
**వితరతి నిజం పాదాంభోజం వృషాచలశేఖరః ।**
**తదిహ కరుణే! తత్తత్క్రీడాతరంగపరంపరా**
**తరతమతయా జుష్టాయాస్తే దురత్యయతాం విదుః ॥ 79**

**ప్రతి :** హే కరుణే= ఓ దయాదేవీ!, త్వదుపసదనాత్= నిన్ను శరణు పొందుటచే, అద్యవా= నేడో, శ్వోవా= రేపో, మహాప్రలయేఽపివా= మహాప్రళయం లోనో, వృషాచలశేఖరః= వేంకటాద్రికి శిరోభూషణుడగు శ్రీనివాసుడు, నిజం= తనదైన, పాదాంభోజం= చరణారవిందాన్ని, వితరతి= ఒసగుతున్నాడు. తత్= కనుక, ఇహ= ఈ రక్షణవిషయంలో, తత్తత్క్రీడా తరంగ పరంపరా తరతమతయా= ఆ యా నానావిధ తరంగాలను పోలిన క్రీడల యొక్క, దురత్యయతామ్= దాటుటకు అలవిగానితనాన్ని, విదుః= (శాస్త్రజ్ఞులు) తెలుసుకొన్నారు.

**అవ :** కింది శ్లోకంలో ప్రాసంగిక విషయం చెప్పబడింది. ఈ శ్లోకంలో దయాదేవియందు ప్రపత్తి చేసినవానికి ఏదో ఒక దినాన మోక్షమనే ఉత్తమఫలం లభించుట నిశ్చయమను ప్రతినజేసి ప్రపన్న ప్రకరణం ఉపసంహరిస్తున్నారు.

**తా:** దయాదేవి ఒక పెద్దనది. దానిలో చేతనుని విషయీకరించడం అనే లీలలే తరంగాలు. అవి చిన్నవిగాను, పెద్దవిగాను ఉంటాయి. అనగా చేతనునియొక్క కర్మతారతమ్యాన్ని అనుసరించి దయాదేవియొక్క అలలలోనూ తారతమ్యం ఉంది. కొందరు శీఘ్రంగా ఫలం లభించాలనే కోరికతో



తదనుగుణమైన రీతిలో ఉపాయాలను అనుష్ఠిస్తే అక్కడ దయాదేవియొక్క తరంగాలు తదనుగుణరీతిలో అమరుతాయి. పెద్దపెద్ద తరంగాలుద్భవించి శీఘ్రంగా ఫలం లభిస్తుంది. ఇట్లుగాక మోక్షం మొదలగు ఫలంలో ఉత్కటేచ్ఛలేక "నిదానంగా వచ్చినా మునిగి పోయింది లేదులే" అనుకొని ఉపాయం అనుష్ఠిస్తే తదనుగుణంగా దయాదేవీతరంగ మేర్పడుతుంది. అంటే చిన్నతరంగం పుడుతుందని భావం. ఇలా అనేక ఉదాహరణలు చెప్పవచ్చు.

ఇట్లు తనకర్మానుగుణంగా దయాదేవియందు పూర్వోక్తరీతిలో ఏదో ఒక ప్రక్రియలో ఒక ఫలాన్నుద్దేశించి ప్రపత్తి చేసినా చేసినవాడు కోరిన ప్రకారం నేడో, రేపో, మహాప్రళయంలోనో, ఎప్పుడైనా శ్రీనివాసుడు తన చరణారవిందాలనిచ్చియే తీరును. అనగా తన చరణారవిందంద్వారా నిత్యకైంకర్యమనే మోక్షమిస్తాడని భావం. ఇందులో సందేహం లేదు. మోక్షేతర ఫలం కోరడం అధికపుణ్యులకే సంభవిస్తుంది. ఇట్లుగాక ఫలాంతరాలను అంతరీకరించిగాని, విలంబితంగాని ఫలం కోరినా శ్రీనివాసుని దయను ఆశ్రయించినయెడల వారికిని కాలక్రమంలో మోక్షపర్యంతమైన ఫలం లభించునని చెప్పడమే ఇక్కడ ఉద్దేశం.

"మహాప్రలయేఽపి వా" అనేది చతుర్ముఖబ్రహ్మపదవి నధిరోహించిన వారికి ప్రాయశః మరల ఈ సంసారప్రవేశం లేక మహాప్రళయకాలంలో మోక్షం లభించుననే విషయాన్ని ఉద్దేశించి చెప్పినదిగా వ్యాఖ్యానించ వచ్చు.

**శ్లో॥ ప్రణిహితధియాం త్వత్సంపృక్తే వృషాద్రిశిఖామణౌ**
**ప్రసృమరసుధాధారాకారా ప్రసీదతి భావనా ।**
**దృఢమితి దయే దత్తాస్వాదం విముక్తివలాహకం**
**నిభృతగరుతో నిధ్యాయన్తి స్థిరాశయచాతకాః ॥ 80**

**ప్రతి :** హే దయే= ఓ దయాదేవీ!, త్వత్సంపృక్తే= నీతో దృఢసంబంధం కల్గిన, వృషాద్రిశిఖామణౌ= వేంకటగిరి శిఖరమందు మణివలె ప్రకాశించు

శ్రీనివాసునియందు, ప్రణిహితధియాం= చక్కగా నివేశితబుద్ధులగు వారికి (నిరంతరధ్యాతలకు), ప్రసృమరసుధాధారాకారా= పారుతున్న అమృతధారకు సమానమైన, భావనా= ధ్యానం, ప్రసీదతి= తేటగా ఏర్పడుతుంది, ఇతి= ఇట్లు, దత్తాస్వాదం= ఇవ్వబడిన రసంకల, విముక్తివలాహకం= మోక్షమును వర్షించు మేఘమగు శ్రీనివాసుని, స్థిరాశయచాతకాః= ఒక భగవంతునియందే స్థిరంగా నివేశింపబడిన బుద్ధిగల చాతకపక్షులనే యోగులు, నిభృతగరుతః సంతః=ముడుచుకొన్న రెక్కలు కలిగినవారై, దృఢం= దృఢంగా, నిధ్యాయన్తి= ధ్యానిస్తున్నారు.

**అవ :** కింది శ్లోకంలో ప్రపన్నునికి ఏదో ఒకరోజు నిశ్చయంగా ఫలం లభిస్తుందని చెప్పినారు. ఈ శ్లోకంలో భక్తియోగం అనుష్ఠించువానికి దయాదేవి అనుగ్రహంచేతనే ఆ భక్తియోగం నిర్విఘ్నంగా పూర్తి అవుతున్నదని చెపుతున్నారు. మోక్షంకోసం చేసే భక్తియోగం అంటే పరమపురుషుని విషయంగాను, వస్త్వంతరస్మృతిచే అనంతరితంగాను, ఒకేధారగా ఏర్పడు స్మృతియే. దీనినే ధ్యానమని, ఉపాసనమని పలురీతుల చెపుతారు. ఈ ధ్యానం యోగులకు అమృతధారవలె చాల ఇంపుగా ఉండాలి. మరియు ఆ పరమపురుషునియొక్క రూపం, గుణం, స్థానం మొదలగు వానితోకూడి ఉండాలి. వానిలో గుణాలు చాల ప్రధానాలు (ఇది దహరవిద్యలో స్పష్టం). ఆ గుణాలలో "దయ" అనే గుణం చాల ముఖ్యమైంది. ఈ గుణంచేతనే గదా మిగతా గుణాలు దోషాలుగాక గుణాలుగా కనిపించడం. కావున ఈ దయాన్వితుడగు పరమపురుషుని ధ్యానించినయెడల ఆ ధ్యానం అమృతధారలవలె చాల ఇంపుగా అమరుతాయి. ఈ గుణం లేనియెడల అపరాధులగు మనబోటివారు ప్రభువును సమీపించుటకు అవకాశం లేదు. యోగులుకూడా ఈ గుణాన్ని పురస్కరించుకొని వేంకటాద్రీశుని ధ్యానిస్తున్నారు. అప్పుడే వారికాభక్తియోగం ప్రసన్నమవుతున్నది. ఈవిషయం తెలిసే మేఘాన్నే తమకు రక్షగా కలిగిన చాతకపక్షులవంటి యోగులు ఇట్టి



ఉత్కృష్ట రసాస్వాదం ఇచ్చువాడు, మోక్షమనే వర్షానికి మేఘమువంటివాడు అయిన భగవానునే తమకు సిద్ధోపాయంగా తలచి తమ జ్ఞానం కర్మ అనే రెండు రెక్కలనెగుర విడువక అనగా, దేవతాంతరంలో ప్రవేశింపనివ్వక పరమపురుషుని విషయంలోనే ప్రయోగించి ఆయననే ధ్యానిస్తున్నారు.

ఇలా ఈ శ్లోకాన్ని పూర్తిగా యోగుల విషయంగానే వ్యాఖ్యనించాం. "చాతక" పదాన్ని ప్రాయశః ప్రపన్నుని విషయంలోనే ప్రయోగించడం ఆచార్యులవారికి ఆలవాటు గనుక దానిననుసరించి పూర్వార్ధాన్ని యోగుల విషయంగాను, ఉత్తరార్ధాన్ని ప్రపన్నుల విషయంగాను కూడా వ్యాఖ్యానించవచ్చు.

అప్పుడు "ఇతి" అను దానికి 'ఇట్లైనందున" అని అర్థం. దయాన్వితుడైన పరమపురుషుని విషయం ఆలోచించడంవల్లనే యోగులధ్యానం అమృతధారవలె మిక్కిలి ఇంపుగా ఉంటుంది. ఆ ధ్యానం పూర్తి అవుతుందన్న విషయం తెలిసి చాతకంవంటి ప్రపన్నులు కూడా తమ కర్మజ్ఞానాలను ముడుచుకొని అనగా, దేవతాంతరమందో, ఫలాంతరమందో ప్రయోగింపక ఆ దయాన్వితుడైన పరమపురుషునే స్వయంపురుషార్థంగా (ఫలోపాయంగాగాక) ధ్యానిస్తున్నారని తాత్పర్యం. ఈపక్షంలో ప్రపన్నులు స్వయంప్రయోజనంగా పరమపురుషుని ధ్యానించవచ్చుననే విషయం వ్యక్తమవుతున్నది.

అలవాటుప్రకారం పై దశకంలో శ్రీనివాసుని కాలమేఘంగా వర్ణింపబోవుటను దశకాంత్యమగు ఈ శ్లోకంలో "విముక్తి వలాహకమని" చెప్పి ఈ దశకాన్ని పూర్తిగావిస్తున్నారు.

***అష్టమదశకం సమాప్తం***

## నవమ దశకం

శ్లో॥ కృపే! విగతవేలయా(విధృతలోకయా) కృతసమగ్రపోషైస్త్వయా
కలిజ్వలనదుర్గతే జగతి కాలమేఘాయితమ్ ।
వృషక్షితిధరాదిషు స్థితిపదేషు సాఽనుప్లవైః
వృషాద్రిపతి విగ్రహైర్వ్యపగతాఖిలావగ్రహైః ॥ 81

**అర్థం :** హే కృపే! = ఓ దయాదేవీ! విగతవేలయా= ఎల్లలు లేనటువంటి, (విధృతలోకయా= ధరింపబడిన సర్వలోకాలు కలిగినట్టి), త్వయా= నీచే, కృత సమగ్రపోషైః= చేయబడిన సమస్తవిధాలైన పోషణ కలిగినట్టియు (సమస్తప్రాణుల పోషణ కలిగినట్టియు), వ్యపగతాఖిలాఽవగ్రహైః= పోయిన సకలవిధాలైన నిగ్రహాలు కలిగినట్టి (పోగొట్టబడిన దుర్భిక్షాలు కలిగినట్టి), వృషక్షితిధరాదిషు స్థితిపదేషు=వేంకటాద్రి మొదలగు దివ్యస్థానాలలో, సానుప్లవైః= అనుచరులతో కూడినవగు వృషాద్రిపతివిగ్రహైః= వేంకటాద్రీశుడగు శ్రీనివాసునియొక్క దివ్య మంగళ విగ్రహాలచే, కలిజ్వలనదుర్గతే= కలి అనునగ్నిచే దుర్గతినొందిన, జగతి= జగద్విషయంలో, కాలమేఘాయితమ్= కాలమేఘంవలె ఆచరించుట(కలదు).

**అవ :** దయాస్తోత్రంలో ఎనిమిది దశకాలు సంపూర్తినందినాయి. ఇది తొమ్మిదవ దశకం. ఇంతవరకు ఈ దయాదేవిచే ప్రపంచానికేర్పడు బహువిధ ప్రయోజనాలు ఉపనిషత్ప్రభృత్యనేకశాస్త్రాలలో నిరూపిత ప్రక్రియననుసరించి బహుధా వర్ణింపబడినాయి. రాబోవు అన్తిమదశకంలో ప్రతి శ్లోకంలోను అస్మచ్ఛబ్దంతో తనను నిర్దేశించి దయాదేవియందు తనకు కావలసిన కొన్ని ఫలాలను ప్రార్థింపబోతున్నారు. కాగా ఈ తొమ్మిదవదశకంతోనే ఈ దయాస్తోత్రం ఒకవిధంగా పూర్తి అవుతున్నదని చెప్పవచ్చు. దయాదేవిచే ప్రపంచానికి సంభవించే ఉపకారాలలో ఉత్తమోత్తమమైన ఉపకారం పరమపురుషుని శ్రీనివాసుడు మొదలగు అర్చారూపాలలోను, మత్స్య కూర్మ



రామ కృష్ణాది విభవ రూపాలలోను అవతరింపజేయుటయే. దీనికంటె ఉత్తమమైన పరమోపకారం ఇంకొకటి లేదు. ఈ అవతారాల చేతనేకదా సకలప్రపంచాలు సద్గతి చెందుతున్నాయి

**"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।**
**అభ్యుత్థానమధర్మస్య తదాఽఽత్మానం సృజామ్యహమ్ ॥**
**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥"**

అనిగదా ఆ పరమపురుషుని సంకల్పం! ఇట్టి ఉత్తమోపకారాన్ని ఉపాంత్య దశకంలో నిరూపించి, అనగా అర్చావతారాలు, దశావతారాలు మొదలగు భగవదవతారాలలో దయాకృత్యాన్ని విశదీకరించి దశకాన్ని ముగిస్తున్నారు. విభవావతారాలకంటె అర్చావతారాలు పలువిధాల ఉత్కర్షకు చెందినవని ఆళ్లార్లు, ఆచార్యులు చక్కగా నిరూపించారు. అందువల్ల ప్రప్రథమంగా వేంకటాచలం మొదలగు దివ్యదేశాలలో వేంచేసియుండు శ్రీనివాసుడు మొదలగు అర్చామూర్తులయొక్క ప్రభావాన్ని (దయాదేవిచే ఏర్పడుదానిని) ప్రథమశ్లోకంలో వర్ణిస్తున్నారు. మిగిలిన తొమ్మిది శ్లోకాలలో మత్స్యకూర్మావతారద్వయానికి ఒక శ్లోకాన్ని తదితరాష్టావతారాలకు క్రమంగా ఎనిమిది శ్లోకాలను అమర్చి ఈ దశకం సమాప్తి చేయబడుతుంది.

కింది దశకంలో ప్రపన్నునికి ప్రపత్త్యుత్తరకాలంలో ఏర్పడే దయాదేవి చేయు ఉపకారాలు వర్ణింపబడినాయి. ఆ ఉత్తరకాలంలో ప్రపన్నులకు అర్చావతారసేవ చాల ముఖ్యం కాబట్టి తన్మహిమ, తదనుబంధియైన విభవావతారవైభవం ఈ దశకంలో వర్ణింపబడుతున్నాయి.

కింది శ్లోకంలో శ్రీనివాసుని మోక్షాన్ని వర్షించే మేఘంగా రూపించారు. ఈ శ్లోకంలో శ్రీనివాసునివంటి సమస్త దివ్యదేశాలలో ఉన్న సర్వమూర్తులను

సర్వవిధదురితాలను (దుర్భిక్షాలను) పోగొట్టి సర్వవిధఫలాలను (మంచి వర్షాలను) ఇచ్చే ఒక మహాకాలమేఘంగా చెపుతున్నారు.

**తా :** దయాదేవికి ప్రపంచరక్షణ విషయాలలో ఒక ఆటంకం కూడా లేదు. ఈ దేశంలో, ఈ కాలంలో, ఇతనినే రక్షించుట అనే నియమం లేదు. ఏ కాలంలోగాని, ఏ దేశంలోగాని ఏ ప్రాణినైనా రక్షిస్తుంది. అట్టి దయాదేవిచేతనే భగవదవతారాలు ఏర్పడుతున్నాయి. "అవతారం" అంటే "దిగుట" అని అర్థం. మేఘం జలభారాన్ని మోయలేక పర్వతాలపైకి దిగి భూమిపై వర్షిస్తుంది. అట్లే పరమపురుషుడు కూడా కారుణ్యభారాన్ని మోయలేక పరమపదంనుండి దిగుతున్నాడు. అనగా కరుణచే అవతారాల నెత్తుతున్నాడని భావం. సమస్తజనులు ఈ అర్చావతారాలను సేవించి సమస్తఫలాలను పొందుదురుగాక అను దయయే ఇక్కడ ముఖ్యకారణం. కావుననే భగవద్దివ్యమంగళవిగ్రహాలన్నీ దయచే పోషింపబడినవవుతున్నాయి. మేఘం ఎలా జలంతో నిండిందో అట్లే భగవానుని అర్చాది విగ్రహాలు దయచే నిండినాయి. ఆ మేఘం అవతరించునప్పుడెట్లు తనకు సహచరాలైన గాలి, మెఱపు మొదలగువానితో కూడి అవతరించునో, అట్లే భగవంతుడు కూడా తన కనుచరులగు పత్నులు, అనంతగరుడాదినిత్యసూరులు మొదలగు వారితోడనే అవతరిస్తాడు. ఆ మహాకాలమేఘం వర్షించిన యెడల సర్వదుర్భిక్షాలు శాంతమై ప్రపంచక్షేమమెట్లేర్పడునో, అట్లే ఈ శ్రీనివాసుడు మొదలగు అర్చావతారాలు ఆవిర్భవించిన వెంటనే కలి అనే అగ్నిచే మలమల మాడిపోయిన ప్రపంచానికి సర్వవిధ క్షోభలు తొలగి, అనగా వారు చేసిన పాపాలు భగవత్సేవచే తొలగి, భగవంతుని నిగ్రహ సంకల్పం శాంతమై అందరికి పరమక్షేమం కలుగుతున్నది. అందువల్ల వేంకటాచలం మొదలగు దివ్యదేశాలలో ఉన్న అర్చామూర్తులు కాలమేఘంవలె సర్వతాపాలను పోగొట్టునను ప్రధాన శాస్త్రార్థం ఇక్కడ నిరూపింపబడి తద్ద్వారా అర్చావతార ప్రభావం విశదీకృతమవుతున్నది.



ఇక్కడ "త్వయా" అను పదాన్ని కర్తృవాచకంగా వివక్షించి, దయాదేవినే కాలమేఘంగా వర్ణించి వ్యాఖానించడం కూడా ఉంది.

విచేయయు ఉపకారాలను వర్ణింపదలచి ఈ శ్లోకంలో ప్రథమ-ద్వితీయావతారాలైన మత్స్యకూర్మాలను వర్ణిస్తున్నారు.

**తా:** ప్రపంచంలో ఉన్న మత్స్యములు, కూర్మములు, హంసలు తమ అపత్యాలను కాపాడడంలో ఇతర జంతువులవలె కాక విలక్షణంగా ఉంటాయి. మత్స్యములు నేత్రాలతో తమ శిశువులను బాగా చూచుట చేతను, కూర్మములు వానిని మనసా స్మరించుటచేతను, హంసలు బాగుగా స్పృశించుటచేతను ఆ శిశువులకు పూర్ణపోషణలు ఏర్పడుతున్నాయి. ఈ విషయాన్ని "ఈ క్షణధ్యాన సంస్పర్శైమత్స్యకూర్మవిహంగమాః, రక్షంతి స్వాన్య పత్యాని" అని పెద్దలు చెప్పియున్నారు. ప్రకృత శ్లోకంలో"విచింతన ప్రభృతిభిః " అను పదంలో "ప్రభృతి" శబ్దంచేత "మత్స్యకూర్మాదికామ్" అనుచోట "ఆది" శబ్దంచేత, భగవంతుని హంసావతారం కూడా వివక్షితమే. ప్రసిద్ధ దశావతారాలలో ఆ అవతారం గణింపబడలేదు. దానిని స్పష్టంగా చెప్పక "ఆది" శబ్దంతో సంగ్రహించారు.

దయాదేవి పరమానుగ్రహంతో ప్రపంచంలో వివిధప్రజలను సృష్టించి తత్పోషణార్థమై భగవత్స్వీకృత మత్స్యకూర్మాదివిగ్రహాలలో ప్రవేశించి, ప్రపంచంలో ఉన్న మత్స్యకూర్మాలనుకూడా నిరీక్షణధ్యానాదికార్యాలు ఆచరించునట్లుచేసి తద్ద్వారా ప్రపంచ ప్రాణులను కాపాడుతున్నదని తాత్పర్యం.

మత్స్యావతార, కూర్మావతారాలు నిరీక్షణధ్యానాలను ఎపుడు, ఎక్కడ చేశాయి? వానిచే ప్రపంచక్షేమమెట్లేర్పడింది? అనిన-అసురుడు వేదాల నపహరించుకొని సముద్రంలో మునిగిపోయినపుడు భగవంతుడు మత్స్యరూపమెత్తి సముద్రంలో ప్రవేశించి నాలుగు వైపులా బాగుగా నిరీక్షించి

వేదాలను కనిపెట్టి వెలికి కొనివచ్చెననుట ప్రసిద్ధం. వెదకునప్పుడు భగవంతుని పుండరీకనయనాలు సముద్రంలో పలుచోట్ల కనబడి ఒక పద్మారణ్యమే అక్కడ సంభవించినట్లుండెనని ఆచార్యులు "దశావతారస్తోత్రం"లో వర్ణించారు. ఇట్లు సమ్యఙ్నిరీక్షణాలతో వేదాల నుద్ధరించుటచేత గదా జగత్తునకు వేదమూలమైన సర్వక్షేమాలు సంభవించినవి. కాగా, ఈ అవతారంలో దయాదేవి మత్స్యమూర్తియొక్క నయనంలో ప్రవేశించి తన్నిరీక్షణద్వారా వేదాలనుద్ధరించి జగత్తును సంరక్షించినదిగా చెప్పడానికి ఆటంకం లేదు.

ఇట్లే ప్రపంచమాతయగు మహాలక్ష్మిని క్షీరసాగరం నుండి ఉద్ధరించి తన్మూలంగా ప్రపంచానికి "చైతన్య స్తన్యదాయినీమ్" అను రీతిలో పరమ క్షేమం కలుగజేయగోరిన పరమపురుషుడు కూర్మావతారమెత్తి ఎంతో పెద్దదైన మందరపర్వతం వీపునందొరసికొనుచుండినా దేవాసురులు, సముద్రం వీని మహా ఘోష ఉండినా నిశ్చలంగా ధ్యానంలో ఉన్నదానివలె ఉండి మందరపర్వతాన్ని ధరించి, సముద్రాన్ని చిలికి మహాలక్ష్మినిపొంది తద్ద్వారా ప్రపంచానికి పరమక్షేమం ప్రసాదించాడు. ఈ అవతారంలో భగవంతుని మనస్సులో దయాదేవి ప్రవేశించి పూర్వోక్తకార్యాన్ని చేయించింది కావున "విచిన్తనమ"ను ధ్యానస్థితిని పొందదడంవల్లనే ఈ కార్యం జరిగిందని చెప్పనగును. ఇట్లే హంసావతారం విషయం ఊహించుకొనునది.

"తాదృశైః సమీక్షణచింతనైః" అను పదాలకు ప్రపంచంలో ఉండు సామాన్యమైన మత్స్యకూర్మాలు సమీక్షణవిచింతనాలకు సమానాలైన సమీక్షణవిచింతనాలచే అని వ్యాఖ్యానించాం. ఇదిగాక పరబ్రహ్మం ప్రపంచసృష్టికి ముందు సమీక్షణాదులు చేసి ప్రపంచాన్ని సృష్టించి దానిలో ప్రవేశిస్తున్నదని ఉపనిషత్తులు చెపుతున్నాయి. అట్టి వ్యాపారాన్ని ఇప్పుడు దయాదేవి భగవంతునియొక్క మత్స్య కూర్మాది దివ్యమంగళవిగ్రహాల



మూలంగా చేస్తున్నదనే విషయం "తాదృశైః" (ఉపనిషత్ప్రసిద్ధములైన) అను పదంచేత సూచింపవచ్చు. అందువల్ల వేదోద్ధరణ, మహాలక్ష్మిని అందజేయడం మత్స్య కూర్మావతారాలలో దయాదేవి చేసిన పరమోపకారాలని విశదీకృతమగును.

ఇట్లే భగవంతుయొక్క అవతారదశలో ఏర్పడు దివ్యమంగళ విగ్రహాలు (మత్స్య కూర్మాదులు) అప్రాకృతమైన విగ్రహాలు కనుక పరబ్రహ్మ స్వరూపానికివలె వీనికి సర్వకళ్యాణగుణాలు, సర్వదోషరహితత్వం పూర్ణంగా ఉన్నదను విషయాన్ని తెలియజేయుటకై "విచిత్రగుణ చిత్రితాం, వివిధదేశవైదేశికీం" అను విశేషణ పదద్వయం ఇవ్వబడింది.

**శ్లో॥ యుగాన్తసమయోచితం భజతి యోగనిద్రారసం**
**వృషక్షితిభృదీశ్వరే విహరణక్రమాజ్జాగ్రతి ।**
**ఉదీర్ణచతురర్ణవీకదనవేదినీం మేదినీం**
**సముద్ధృతవతీ దయే! త్వ(త) దభిజుష్టయా దంష్ట్రయా॥ 83**

**ప్రతి :** హే దయే!= ఓ దయాదేవీ!, త్వం= నీవు, యుగాన్తసమయోచితం= ప్రళయకాలానికి అనురూపమైన, యోగనిద్రారసమ్= యోగనిద్రారసమును, భజతి= పొందియున్న, వృషక్షితిభృదీశ్వరే= వేంకటాద్రీశుడగు శ్రీనివాసుడు, విహరణక్రమాత్= లీలాక్రమముచే, జాగ్రతిసతి= మేల్కొనుచుండగా, ఉదీర్ణచతురర్ణవీ కదనవేదినీం= పొంగిపొరలెడి నాల్గుసముద్రాలచే ఏర్పడిన హింసను తెలియపరస్తున్న, మేదినీమ్= భూమిని, త్వదభిజుష్టయా= నీతోకూడిన, దంష్ట్రయా= (వరాహమూర్తియొక్క) కోరచేత, సమద్ధృతవతీ=పై కెత్తినావు.

**అవ :** "మత్స్యఃకూర్మో వరాహశ్చ నారసింహశ్చ వామనః, రామో రామశ్చ కృష్ణశ్చ బుద్ధః కల్కీ తథైవ చ" అనే పురాణప్రసిద్ధి ననుసరించి మత్స్య

కూర్మావతారాలను కిందిశ్లోకంలో వర్ణించి తదనంతరమైన వరాహావతారంలో దయాదేవి చేసిన లోకోపకారాన్ని ఇందు వర్ణిస్తున్నారు.

**తా :** యుగసమాప్తికాలంలో, అనగా చతుర్ముఖబ్రహ్మకు రాత్రియగు ప్రళయకాలంలో సత్యలోకంవరకు సర్వలోకాలు నీటిలో మునిగిపోతున్నాయి. అట్లే సమస్తసముద్రాలు అప్పుడు పొంగిపొరలి పోతాయి. ఆ కాలంలో భగవంతుడు యోగనిద్ర ననుభవిస్తాడు. అనగా నిద్రవలె ఉండు యోగం అనుభవిస్తున్నాడని భావం. యోగమంటే పునఃప్రపంచాన్ని సృష్టించి జీవులకు సద్గతిని కలిగించి క్షేమం పొందించుటలోగల చింతయే (అలబ్ధస్య లాభః యోగః= పొందబడని వస్తువుయొక్క ప్రాప్తి యోగం). ఇట్లు ప్రళయావసానంవరకు యోగరసం అనుభవించి పిదప సృష్ట్యారంభకాలంలో తన లీలాక్రమంతో అనగా, ప్రళయంలో యోగనిద్ర, తదనంతరం సృష్టి అను స్వసంకల్పక్రమంతో భగవంతుడు మేల్కొంటున్నాడు. ప్రళయకాలంలో అన్ని సముద్రాలు పొంగి ఏకోదకంగా అయిపోయినందువలన భూమి ఎక్కడనో పాతాళంలో అణగిపోతున్నది. అప్పుడు భూమికి సంభవించిన పీడను దయాదేవి తెలుసుకొని భగవంతుని వరాహావతారాన్ని స్వీకరింపజేసి, ఆ యవతారానికి అసాధారణమైన కోరలో తాను ప్రవేశించి సముద్రంలో మునిగిపోయిన భూమిని పైకెత్తుతున్నది. పరమదయచే భగవానుడు వరాహావతారాన్ని ధరించి భూమిని ఉద్ధరిస్తున్నాడని భావం. మునిగిపోయిన భూమినుద్ధరించి పూర్వస్థితిలో నిలిపి ప్రాణులను సంరక్షించుటయే వరాహావతారంలో దయచే కలిగిన ప్రధానోపకారం.

ఇక్కడ "జాగృతీ" అని, "కదనవేదినీ" అని ప్రథమాంతమైన పాఠాలు కూడా ఉన్నాయి. అప్పుడవి రెండూ దయకు విశేషణాలు కావడంతో భగవంతుడు యోగనిద్ర ననుభవించినా దయాదేవి స్వయంగా మేల్కొని ఉండి తాను భూపరిశ్రమను ఎరిగి ఉద్ధరణ చేయిస్తున్నదని తాత్పర్యం.



"త్వదభిజుష్టయా" అనుచోట "తదభిజుష్టయా" అనే పాఠంకూడా ఉంది. అప్పుడు "శ్రీనివాసునిచే స్వీకరింపబడిన" అని అర్థం.

**శ్లో॥ సటాపటలభీషణే సరభసాట్టహాసోద్భటే**
**స్ఫురత్రుధి పరిస్ఫుటద్భ్రుకుటికేఽపి వక్త్రే కృతే ।**
**దయే! వృషగిరీశితుర్దనుజడింభదత్తస్తనా**
**సరోజసదృశా దృశా సముదితాకృతిర్దృశ్యసే ॥ 84**

**ప్రతి :** హే వృషగిరీశితుః దయే= ఓ వేంకటాద్రీశుని దయాదేవీ!, సటాపటలభీషణే= కేసరసమూహంచేత భయంకరమైనదియు, సరభసాట్టహాసోద్భటే= అతి సంభ్రమంతో కూడిన అట్టహాసంచేత ఉద్ధతమైనదియు, పరిస్ఫుటద్భ్రుకుటికే= అతి ప్రకాశమైన భ్రుకుటీవక్రతను కలిగిన, వక్త్రే= (నృసింహావతారంయొక్క) ముఖమండలం, స్ఫురత్రుధి= కోపం కలిగినదిగా, కృతేఽపి= చేయబడి ఉండినప్పటికి, సరోజసదృశా= తామరపుష్పంతో సమానమైన, దృశా= నేత్రముచే, దనుజడింభ దత్తస్తనా= అసుర బాలుడగు ప్రహ్లాదునకియ్యబడిన స్తన (న్య) ం కలిగిన, త్వం= నీవు, సముదితాకృతిః= సమ్యగావిర్భవించిన స్వరూపంకలదానవై, దృశ్యసే= కనబడుతున్నావు.

**అవ :** శ్రీ నృసింహావతారమూలంగా దయాదేవి చేసే ఉపకారం ఈ శ్లోకంలో వర్ణింపబడుతున్నది.

**తా :** అఘటితఘటనకు ప్రథమోదాహరణమైన నృసింహావతారంలో దయాదేవి ఒక అఘటితఘటనను కలిగించింది. "పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం" అనే ప్రమాణాన్ని అనుసరించి అవతారానికి ముఖ్యప్రయోజనం సాధుసంరక్షణే. దుష్కృద్వినాశం ఆనుషంగికంగా ఏర్పడునది. కాగా, ఈ అవతారానికి ముఖ్య ప్రయోజనం భాగవతోత్తముడైన ప్రహ్లాదుని వాక్కును పరిపాలించి అతనిని సంరక్షించుటయే. తదానుషంగికంగా హిరణ్యాసురసంహారం సంభవించింది. ఈ అవతారముండినది కొన్నినిముషాలే. అంతలో జరిగిన ఒక

విచిత్రవృత్తాంతాన్ని ఆచార్యులిక్కడ వర్ణిస్తున్నారు. సింహజాతికి స్వభావ సిద్ధమైన కేసరాలు గుంపులు గుంపులుగా ముఖంమీద వ్రేలాడుటచే మహాభయంకరమైనది, స్తంభంనుండి ఆవిర్భవించునపుడే మిక్కిలి కోపంతోను వేగంతోను, ప్రపంచమంతా గడబిడజెందునట్లు పెద్ద అట్టహాసంతో కూడినది, కోపమే మూర్తీభవించినట్లు వక్రభ్రుకుటిని కల్గినది, భయంకర నేత్రాలు కల్గినది అయిన ముఖమండలం ఏ క్షణంలో దృష్టిగోచరమైందో, ఆ క్షణంలోనే ఆ ముఖమండలంలో గల నేత్రాలద్వారా దయాదేవియొక్క ప్రవాహముద్భవించి అతిమధురం శీతలం అయిన కటాక్షమనబడే స్తన్యంతో అసురబాలుడగు ప్రహ్లాదుని ఓదార్చి తన్మూలంగా ప్రపంచంలో స్వపరత్వాన్ని భగవంతుడు స్థాపించాడు. ఏ క్షణంలో భగవన్నేత్రాలు అసురునికి మహాభయంకరంగా కనిపించాయో ఆ క్షణంలోనే ఆ నేత్రాలే తామర పుష్పాలవలె ప్రహ్లాదునికి పరమ భోగ్యాలుగా, హార్దానుగ్రహ ప్రస్రావకాలుగా, పరమశాంతమైనవిగా కనిపించాయి. ఇదే ఇక్కడ దయాదేవియొక్క అఘటితఘటన. దయాదేవిచేసే సాధుపరిత్రాణరూపమైన ఉపకారం ఇలా వేగంగా ఉంటుంది. ఒక సాధువును (ప్రహ్లాదుని) సంరక్షిస్తే తన్మూలంగా ప్రపంచానికేర్పడే ఉపకారాన్ని వేరుగా వివరింపనక్కరలేదుగదా! కోపమో, అనుగ్రహమో, వాత్సల్యమో అన్ని భావాలు నేత్రంద్వారానేగదా ఇతరులు తెలుసుకోవడం సాధ్యమవుతుంది. దయామాత తనకు బిడ్డడగు భాగవతరత్నమైన ప్రహ్లాదునికి అనుగ్రహమయమైన కటాక్షమనే స్తన్యం ఇచ్చి అతనికి ఆత్మధారణ కలుగజేసింది. అప్పుడు దయాదేవియొక్క స్వరూపం భగవన్నేత్రంలో స్ఫుటంగా ప్రకాశించింది. అనగా ఈ అవతారం దయాదేవి భగవన్నేత్రంలో ప్రవేశించి ప్రహ్లాదునిద్వారా ప్రపంచానికి ఉపకరించిందని పండితభావం.

"కృతేఽపి" అను పదంచేత, కోపమనేది భగవంతునకు "క్రోధ మాహారయత్తీవ్రం" అనే వాల్మీకి వాక్యప్రకారంగా ఆగంతుకంగాను,



తాత్కాలికంగాను వస్తుందని, ఉత్తరార్ధోక్త వాత్సల్యభరిత కటాక్షమే స్వాభావికమని తెలుసుకోవాలి.

**శ్లో॥ ప్రసక్తమధునా విధిప్రణిహితైస్సపర్యోదకైః**
**సమస్తదురితచ్ఛిదా నిగమగంధినా త్వం దయే! ।**
**అశేషమవిశేషతః త్రిజగదంజనాద్రీశితుః**
**చరాచరమచీకరశ్చరణపంకజేనాంకితమ్॥ 85**

**ప్రతి :** హే దయే!= ఓ దయాదేవీ! త్వం=నీవు, విధిప్రణిహితైః= చతుర్ముఖునిచే సమర్పింపబడిన, సపర్యోదకైః= పూజా (పాద్య) తీర్థములచే, ప్రసక్తమధునా= తేనెయొక్క ధారలు కలిగినదియు, సమస్తదురితచ్ఛిదా= సమస్తపాపాలను పోగొట్టునదియు, నిగమగంధినా= వేదవాసన కల్గినదియునగు (వేద ప్రతిపాదితమగు), అంజనాద్రీశితుః= వేంకటాద్రీశునియొక్క, చరణపంకజేన= పాదారవిందంచే, చరాచర= చరాచరరూపమైన, త్రిజగత్= త్రిలోకాలను, అశేషం= నిశ్శేషంగా, అవిశేషతః= తారతమ్యం లేక, అంకితం= ముద్రింపబడినవిగా, అచీకర= చేసితివి.

**అవ :** ఈ శ్లోకంలో త్రివిక్రమావతారం ద్వారా దయాదేవి చేసిన మహోపకారం వర్ణింపబడుతున్నది. వామనావతారఫలితం త్రివిక్రమావతారంలోనే పర్యవసిస్తున్నది కావున ఈ అవతారాన్నే ఇక్కడ వర్ణిస్తున్నారు.

**తా :** ఇంద్రాదిదేవతలను హింసించిన మహాబలియొక్క గర్వం అణచు వ్యాజంగా ఈ అవతారమేర్పడింది. 'ఎప్పుడెప్పుడవకాశం కల్గునో ఎట్లెట్లు ప్రపంచాని కుపకరింతునో' అని దయాదేవి చాల జాగరూకతతో ఉంది. ఈ అవతారమేర్పడు సమయాన భగవంతుని పాదమునందు దయాదేవి ప్రవేశించి త్రిజగత్తులలోగల సర్వప్రాణులకు ఒక పరమోపకారం చేయించింది.

మహాబలివద్ద యాచించి గైకొనిన మూడడుగుల భూమిని కొలుచు వ్యాజంతో భగవంతుడు చాల బృహత్తమరూపం స్వీకరించి ఒక అడుగుచే

అధఃస్థిత సర్వలోకాలను, రెండవ అడుగుచే ఉపరితమలోకాలను కొలచివైచాడు. అప్పుడా బృహత్పాదం సత్యలోకంలో ప్రవేశించగా చతుర్ముఖుడు పరమాదరంతో ధర్మతీర్థాలతో ఆ పాదాన్ని అభిషేకించాడు. ఆ సమయాన ఆ తీర్థంలో కలసి ఉండిన మధుధారలు తచ్ఛ్రీపాదానికి సంబంధించినవి. ఆ పాదం సర్వపాపాలను పోగొట్టు శక్తి కలిగినది. ఏ రీతాగానైనా తత్పాదసంబంధ విశిష్టులైన వారికి కొద్దిగా కూడా పాపసంబంధముండదు. ఆ భగవత్పాదం వేదంలో పలుచోట్ల వివిధ రకాలుగా స్తుతింపబడింది. పద్మంవలె మృదువుగా, ఎఱ్ఱగా, మనోహరంగా ఉన్న ఆ పాదంతో ప్రపంచాన్ని కొలుచునపుడు స్థావరజంగమాత్మకమైన సర్వజగత్తుకూ తత్సంబంధం ఏర్పడింది. అది భగవత్పాదంచేత తద్వస్తుజాతానికి ముద్రవైచినట్లయింది. భగవత్పాదసంబంధమేర్పడడం సామాన్యంగా లభ్యంకాదు. విశేష పుణ్యంచేత మాత్రమే అది లభ్యమవుతుంది. ఇలాంటి ఉత్తమ పురుషార్థాన్ని దయాదేవి సందర్భమేర్పడినపుడు సర్వవస్తువర్గాలకు తారతమ్యం ప్రదర్శించకుండా అనగా పుణ్యాధికులమీద అధికాదరం పాపులమీద న్యూనత అనే ఏవిధమైన వ్యత్యాసం లేకుండా సర్వులకూ ఒకేరీతిగా కలుగజేయించింది. ఆహా! దయాదేవి ప్రభావమెంతటిదని ఆచార్యులు ఆశ్చర్యపడుతున్నారు. ఈ అవతారానికి ఇలా సర్వప్రాణులకు భగవత్పాదసంబంధం కలిగించి వారిని కృతార్థులుగా చేయడం ప్రధాన ప్రయోజనం. బలిచక్రవర్తియొక్క గర్వాన్ని అపహరించడం ఆనుషంగికం. తదితరావతారాలలో కొందరికిమాత్రమే మేలుకలిగింది. ఈ అవతారంలో పుణ్యశాలి, పాపి అని; చేతనుడు, అచేతనుడు అని; ఈ విధమైన విభాగం లేకుండా సర్వవస్తువులకు గొప్ప మేలు కలిగింది. కావుననే వేదాలు ఈ అవతారవిషయంలో అత్యాదరం ప్రదర్శించాయి.

ఏ వస్తువు మీద ఎవరిముద్ర పడుతుందో, ఆ వస్తువు వానిదే అనడం లోకప్రసిద్ధం. పరమపురుషుని పాదముద్రను (వైష్ణవముద్రను) సర్వవస్తువులమీద ముద్రించి ఒక అణువునైనా వదలక సర్వవస్తువులు వైష్ణవములేనని అనగా, పరమపురుషునివేనని దయాదేవి స్థాపించింది. ముద్రణోపకరణం కఠినంగా ఉండినయెడల నొప్పి కలుగదు. అట్లుగాక తామర పుష్పంవలె మృదువైన పాదంతో ముద్రించుటవలన నొప్పికి అవకాశం లేదు. తామర పుష్పానికి తేనె సంబంధం, వాసన సంబంధం స్వభావసిద్ధాలు. ఇక్కడ (భగవత్పాదమునందు) వానికెట్టి కొరతలేదనే విషయాన్ని ఆచార్యులు "ప్రసక్తమధు", "నిగమగంధినా" అనే పదాలతో సూచిస్తున్నారు.



**శ్లో॥ పరశ్వథతపోధనప్రధనసత్రకృతూపాకృత**
**క్షితీశ్వరపశుక్షరత్క్షతజ కుంకుమస్థాసకైః ।**
**వృషాచలదయాళునా నను విహర్తుమాలిప్యథాః**
**నిధాయ హృదయే దయే! నిహతరక్షితానాం హితమ్ ॥ 86**

**ప్రతి :** హే దయే!= ఓ దయాదేవీ! వృషాచలదయాళునా= వేంకటాచలంపై ఉండు దయాళువైన శ్రీనివాసునిచే, నిహతరక్షితానాం= నిహతులై రక్షింపబడిన వారి యొక్క, హితం= హితమును, హృదయే విధాయ= మనస్సులో ఆలోచించి, విహర్తుమ్= విహరించుటకై, పరశ్వథతపోధన ప్రధనసత్రకృతూపాకృత క్షితీశ్వరపశుక్షరత్క్షతజ కుంకుమ స్థాసకైః= పరశువు ఆయుధంగా కల పరశురామునియొక్క యుద్ధమనే ఉత్తమ యాగంలో బలిగావింపబడిన రాజులనెడు యాగపశులనుండి స్రవించు రక్తమనెడు కుంకుమ ద్రవ్యంచేత, ఆలిప్యథా= పూయబడితివో అన్నట్లు ఒప్పుతున్నావు.

**అవ :** కింది శ్లోకంలో త్రివిక్రమావతారంలో దయాదేవి చేసిన లోకోపకారం వర్ణించారు. ఈ శ్లోకంలో దాని తరువాతిదైన పరశురామావతారంలో ఏర్పడిన కృత్యాలను దయాకార్యాలే అని నిరూపిస్తున్నారు. తదితరావతారాలవలెగాక ఇరువదియొక్క పర్యాయాలు క్షత్రియులను

సంహరించి నెత్తురుమడుగుల గట్టించిన పరశురాముడెట్లు దయాళువగును? అనే సంశయం కలుగుతుంది. బాగుగా అలోచిస్తే ఇది దయాకార్యమే అని స్ఫురిస్తుంది. లోకకల్యాణార్థమై చేయబడు యాగాలలో పశువులను సంహరిస్తున్నారు. అట్లు సంహరింపబడిన పశువులకు ఉత్తమ పుణ్యలోకప్రాప్తి కలుగుతుందని శాస్త్రాలు చెపుతున్నాయి. అటులనే అపరాధులుకూడా రాజులు విధించే దండనలచేత శద్ధులవుతున్నారని శాస్త్రసిద్ధం. ఈవిధంగా చరిత్రభ్రష్టులైన దుష్ట క్షత్రియులను మరణమనే దండనచే శుద్ధీకరించి వారికి సద్గతినొసంగగోరిన దయాదేవి పరశురామావతారంద్వారా దానిని నెరవేర్చింది. మరొకవిధంగా దిద్దడానికి వీలుగాని ఆ దుష్టక్షత్రియులకు సంహారమే పరమహితం. గీతలో చెప్పబడిన“వినాశాయ చ దుష్కృతాం” అనుమాటను బాగా ఆలోచిస్తే సాధుపరిత్రాణంవలె దుష్కృద్వినాశనం కూడా తత్పరిత్రాణమందే పర్యవశిస్తుందని తెలుస్తుంది.

భగవంతుడు చేసే సర్వజగత్సంహారరూపమైన ప్రళయమే దయాకార్యమైనపుడు ఆయన నిర్వహించే కొందరు రాజుల సంహారం దయాకృత్యమగుటలో సంశయమేల? కాగా, పరశురాముడు చేసిన క్షత్రియమర్దనం ఒక ఉత్తమయాగం. దీనిచే ప్రపంచానికి బహువిధక్షేమం కలుగుతున్నది. ఆ యాగంలో దుష్టక్షత్రియులే ఉపాకరణమనెడి ఒకవిధమైన సంస్కారంచేత సంస్కరింపబడిన పశువులు. అనగా వధించడానికి సిద్ధపరుపబడిన పశువులు. ఆ పశువులయొక్క సంహారసమయంలో ఏర్పడిన రక్తప్రవాహమనెడి కుంకుమద్రవంతో దయాదేవి నలంకరించి ఆమెతో వేంకటాద్రీశుడగు శ్రీనివాసుడు విహరిస్తున్నాడు. దుష్టులకును హితమునే కోరు స్వభావంకల దయాదేవికి ఆ దుష్టులకిట్టి హితమొనరించి వారిని రక్షించుటయే చాల ఇష్టమనే శాస్త్రార్థాన్ని, వారి రక్తమనే కుంకుమద్రవం పూసి ఆమెతో శ్రీనివాసుడు విహరించడాన్ని వర్ణిస్తున్నారు.



పరశ్వథమంటే గొడ్డలి. దానిని ధరించినముని పరశ్వథతపోధనుడు. రాజులనే పశువులను సంహరించుటకాగొడ్డలి ఉపయోగపడుతున్నది. యాగం చేయుటకర్షుడు తపోధనుడు.

**శ్లో॥ కృపే! కృతజగద్ధితే! కృపణజన్తుచిన్తామణే !**
**రమాసహచరం క్షితౌ(తదా) రఘుధురీణయంత్యా త్వయా!**
**వ్యభజ్యత సరిత్పతిః సకృదవేక్షణాత్తత్క్షణాత్**
**ప్రకృష్టబహుపాతకప్రశమ హేతునా సేతునా ॥ 87**

**ప్రతి :** కృతజగద్ధితే! = లోకహితం ఒనరించుదానా, కృపణజను చిన్తామణే! = గత్యన్తరంలేని కృపణప్రాణుల అభీష్టములనొసంగు చిన్తామణీ, హేకృపే! = ఓ దయాదేవీ! క్షితౌ = భూమియందు,(తదా = ఆ కాలమందు), రమాసహచరం = లక్ష్మీసహచరుడైన శ్రీనివాసుని, రఘుధురీణయంత్యా = రఘువంశానికి నిర్వాహకుడగు శ్రీరాముడుగా చేయించిన, త్వయా = నీచేత, సకృదవేక్షణాత్ = ఒకసారి చూచుటచేతనే, తత్క్షణాత్ = ఆ నిమిషంలోనే, ప్రకృష్టబహుపాతకప్రశమ హేతునా = ప్రబలమైన అనేకవిధాలైన పాపాలను ప్రశమింపజేయుటలో సమర్థమైన, సేతునా = సేతువుచే, సరిత్పతిః = సముద్రుడు, వ్యభజ్యత = రెండుగా విభజింపబడినాడు.

**అవ :** తరువాతిదైన రామావతారంలో దయచే ఏర్పడిన లోకోపకారం ఈ శ్లోకంలో వర్ణింపబడుతున్నది.

**తా :** కరుణయే మూర్తీభవించి వచ్చినదనుట కనుగుణంగా కరుణా కాకుత్థ్సుడని వ్యవహరింపబడునది ఈ అవతారం. కారుణ్యానికి పరాకాష్ఠ గత్యన్తరహీనులగు కృపణప్రాణులను కాపాడి వారి కోరికలు తీర్చడమే. ఇదే శరణాగతత్రాణం. ఇట్టి శరణాగతి ధర్మాన్ని ప్రపంచానికి వెల్లడించి, తానును బహువిధాల ఆనుష్ఠించి చూపుటకే శరణాగతరక్షణలో వ్యగ్రమైక రఘువంశంలో శ్రీరాముడవతరించాడు. అట్లవతరింపజేసింది దయాదేవియే.

ఈ శరణాగతి ధర్మానుష్ఠానానికి మహాలక్ష్మిసంబంధం అత్యావశ్యకం. "అగ్రతస్తే గమిష్యామి" అని గదా ఆమెమాట! కాగా, ఆమెననుసరించి నడచునట్లు దయాదేవి పరమపురుషుని అవతరింపజేసింది. రావణునివలన మహోపద్రవమేర్పడిన సమయంలో భూలోకంలో అవతరించిన శ్రీరామునిచే రావణసంహారం మొదలగు నా నా కార్యాలు నిర్వహింపబడినా, వాటిలో అత్యంత శ్రేష్ఠమైంది సేతుబంధనకార్యమేనని ఆచార్యులు చెపుతున్నారు. ఋషులతో కలసిమెలసి ఉండడం, రావణసంహారం మొదలైన కార్యాలచేత తత్కాలస్థితులకు లాభమేగాని, మనవంటి వెనుకటివారికి ఎలాంటి లాభం లేదు. సేతుబంధనమంటే కల్పావసానంవరకు సర్వులకు ఉత్తమఫలం ఇవ్వదగినది. "సేతుం దృష్ట్వా సముద్రస్య బ్రహ్మహత్యాం వ్యపోహతి" అని ప్రమాణాలు చెప్పినట్లు ఒకపర్యాయం సేతువును దర్శిస్తేచాలు బ్రహ్మహత్య మున్నగు క్రూరపాపాలు కూడా తొలగిపోతాయి. అట్టి సేతువు భగవంతునియొక్క ఒక దయాకటాక్ష విశేషంచేత తత్క్షణమే సంభవించింది. దానిచే సముద్రం రెండుగా విభక్తమయింది. ఆ సేతువునే గదా ఈనాటివరకు సర్వజనులు దర్శించి గతపాపులై సద్గతి పొందుతున్నారు. రామావతారకార్యంలో ఈ కార్యం చాల ఉత్కృష్టమైనదని, దయాదేవికి దీనియందు సంబంధం కలదని చెప్పుటకడ్డులేదుగదా! దీనిని గుర్తించి ఒక మహాకవి రామావతారంలో అనేకకార్యాలు సంభవించి ఉండినా సేతుబంధనానికిగల ఉత్కర్షను కీర్తించి ''సేతుబంధ'' మను ఒక మహాకావ్యాన్ని ప్రాకృతభాషలో చాలాకాలానికి మునుపే రచించాడు.

"సకృదవేక్షణాత్, తత్క్షణాత్" అనే పదాలను "భగవంతుడు సాగరాన్ని కటాక్షించుటచే ఆ క్షణంలోనే యేర్పడిన"వని అన్వయింప దగునని యోచించి రెండువిధాలుగా అర్థం వివరింపబడింది. ఏ సేతువు భగవంతునికి లవణ సముద్రతరణానికి కారణమయిందో, అదేసేతువు మనబోటివారికి సంసారసముద్రతరణానికి (భగవత్సంబంధంచే) కారణమవుతున్నదను



విషయాన్ని "తం వీక్ష్య సేతుమధునాఽపి శరీరవంతః సర్వే షడూర్మిబహుళం జలధిం తరన్తి" అని మరొకచోట ఆచార్యులు చెప్పారు.

**శ్లో॥ కృపే పరవతస్త్వయా వృషగిరీశితుః క్రీడితం**
**జగద్ధితమశేషత స్తదిదమిత్థమర్థాప్యతే ।**
**మదచ్ఛలపరిచ్యుతప్రణతదుష్కృతప్రేక్షితైః**
**హతప్రబలదానవైర్హలధరస్య హేలాశతైః ॥ 88**

**ప్రతి :** హే కృపే!= దయాదేవీ!, త్వయాపరవతః= నీ కధీనుడగు, వృషగిరీశితుః= వేంకటాద్రీశుడగు శ్రీనివాసునియొక్క, క్రీడితం= విహారం, అశేషతః= అంతయు, జగద్ధితం భవతి= లోకానికి హితమవుతున్నది. తదిదం= ఆ యీ క్రీడితం, మదచ్ఛలపరిచ్యుతప్రణతదుష్కృత ప్రేక్షితైః= (మద్యపానంచేత ఎర్పడిన) మదమనే వ్యాజంతో స్మృతినుండి విచ్యుతమైన ఆశ్రితపాపనిరీక్షణ కలిగినవియు, హతప్రబలదానవైః= సంహరింపబడిన అతిపరాక్రమశాలురైన అసురులను కలిగినవియునగు, హలధరస్య= బలరామునియొక్క, హేలాశతైః= అనేకలీలలచే, ఇత్థం= ఇట్లు (లోకహితమే అని), అర్థాప్యతే= నిరూపింపబడుతున్నది.

**అవ :** బలరామావతారంలో దయాదేవీకృతోపకారం వర్ణింపబడుతున్నది.

**తా :** వేంకటాద్రీశుడగు శ్రీనివాసునియొక్క సర్వలీలలు ప్రపంచానికి క్షేమకరాలే. ఈ నిజ నిరూపణ బలరామావతారంలో చక్కగా కనపడుతుంది. ఆ అవతారంలో ఆశ్రితపక్షపాతం చాల కాష్ఠాప్రాప్తంగా ఉండినది. కావుననే దుర్యోధనుని సమస్తాపరాధాలు అయన నేత్రాలకు గోచరం కాలేదు. మద్యపానం చేయడం ఆ అవతారంలో అలవాటుగా కనిపిస్తుంది. దానిచే ఏర్పడిన మదమనే వ్యాజంతో తననాశ్రయించిన వారి ప్రబలమైన దుష్కృతాలను అయన గమనించ లేదు. కావుననే ఆశ్రితులకెట్టికీడు సంభవించలేదు. తననాశ్రయించని దుష్టులగు అనేకాసురులను ఆయన

వధించాడు. ఆ వధకూడా పూర్వోక్త ప్రకారంగా వారికి కావలసిన హితంలోనే పర్యవసిస్తుంది. కాగా, ఆశ్రితానాశ్రితుల విషయంలో ఆయన ప్రవర్తించిన విధానం (లీలలు) జగత్తుకు కల్యాణాన్నే కలుగజేస్తున్నది కనుక శ్రీనివాసునియొక్క సర్వలీలలు లోకహితపరాలు అనడానికి ఎలాంటి సందేహం లేదు.

మద్యపానంవలన ఏర్పడిన మదమనడం వ్యాజమేగాని ఆశ్రితపక్షపాతమే ఇక్కడ ముఖ్యకారణం. అనగా దయయే వారి అపరాధాలను గమనింపకుండుటకు కారణమని భావం. ఈ శ్లోకానికి విశేషతాత్పర్యం త"తత్త్వబోధిని" అనే ద్రావిడ వ్యాఖ్యానంలో ఉంది.

**శ్లో॥ ప్రభూతవిబుధద్విషద్భరణభిన్నవిశ్వంభరా**
**భరాపనయనచ్ఛలాత్త్వ మవతార్య లక్ష్మీధరమ్ ।**
**నిరాకృతవతీ దయే! నిగమసౌధదీపశ్రియా**
**విపశ్చిదవిగీతయా జగతి గీతయాఽంధంతమః ॥ 89**

**ప్రతి :** హే దయే!= ఓ దయాదేవీ!, త్వం= నీవు, ప్రభూతవిబుధద్విషద్భరణభిన్నవిశ్వంభరాభరాఽపనయనచ్ఛలాత్= దేవశత్రువులగు అనేకాసురులను భరించుటచే మిక్కిలి శ్రమజెందిన భూదేవియొక్క భారాన్ని పోగొట్టుట అనే వ్యాజంతో, లక్ష్మీధరమ్= లక్ష్మీపతిని, అవతార్య= (శ్రీకృష్ణునిగా) అవతరింపజేసి, నిగమసౌధ దీపశ్రియా= వేదశిఖరమైన వేదాంతానికి దీపశోభవంటిదియు, విపశ్చిదవిగీతయా= ఏ విద్వాంసుల చేతా అప్రమాణమని చెప్పబడనిదియు అయిన (సర్వ సంప్రతిపన్నమగు), గీతయా= భగవద్గీతచే, జగతి= ప్రపంచంలో, అంధంతమః= గాఢ తమస్సును, నిరాకృతవతీ= పోగొట్టినావు.

**అవ :** కృష్ణావతారంలో ఏర్పడిన దయోపకారాన్ని ఈ శ్లోకంలో వర్ణిస్తున్నారు.



**తా :** శ్రీరామావతారంలో సేతుబంధనం ఎలా ఎంత ప్రధానమో, అట్లే కృష్ణావతారంలో ప్రధాన కృత్యం గీతోపదేశమే. ఈ అవతారానికి ప్రయోజనం అసురభారం మోయజాలని భూదేవియొక్క ప్రార్థననుసరించి ఆమె భారాన్ని తొలగించడం (అసురులను సంహరించుటయే) అని పురాణాలలో వర్ణించి ఉండడం ఒక వ్యాజం మాత్రమే. భూభారం పోగొట్టడం ప్రధానోద్దేశం కాదు. గీతోపదేశమే ప్రధానోద్దేశం. కంసాద్యసురసంహారాలచే తత్కాలస్థితులకు ఆనుకూల్యం కలిగి ఉండవచ్చు. కాలవ్యవహితులైన మనబోటి లక్షలు కోట్లకొలది జనులకు గీతవలన కలిగే అనుకూలతను వర్ణింపతరమా? కాగా, దయాదేవి యే కాలంలోనైనా, సమ్యక్జ్ఞానం పొంది సర్వజనులు పరమక్షేమం పొందాలని తలచి లక్ష్మీపతియగు పరమపురుషుని (శ్రీనివాసుని) కృష్ణుడుగా అవతరింపజేసి తన్మూలంగా ఉత్తమ ప్రమాణమైన గీతాశాస్త్రాన్ని ప్రపంచానికి ఇచ్చింది. ఈ గీతాశాస్త్రం వేదశిఖరమగు వేదాంతానికి దీపంవంటిది. వేదాంతంలో ఇమిడిన సర్వరహస్యాలు ఈ దీపంచేతనే తెలియబడాలి. సౌధానికి దీపం వినా శోభకలుగనట్లు, ఈ గీతా సంబంధం లేకుంటే వేదవేదాంతాలు శోభించవు. అనగా తత్తాత్పర్యమెరుగ వీలుగాదని భావం. గీతను ప్రమాణంగా ఒప్పుకొనని పండితుడు ప్రపంచంలో లేడని చెప్పవచ్చు. అట్టి ఉత్తమప్రమాణం గీత. గాఢ తమస్సువంటి అజ్ఞానాన్ని గీతాదీపమే పోగొట్టగలదు. ఆ తమస్సును వదలినపుడే ఈ ప్రపంచానికి పరమక్షేమం ఏర్పడుతుంది. గీతలోనే శరణాగతినుపదేశించే చరమశ్లోకం ఉంది. అజ్ఞానం తొలగి పరమపురుషార్థమగు మోక్ష పర్యంతమైన పురుషార్థాలను పొందడానికి సదుపాయాలను ఉపదేశించి సర్వకాలస్థులు క్షేమం పొందునట్లు చేస్తున్న ఈ గీతోపదేశంకంటె ఉత్తమ దయాకార్యం వేరొకటి ఉండదని తలచి ఈ అవతారానికి ఇదే పరమ ప్రయోజనమని, ఇది దయాదేవిచే ఏర్పడిన మహోపకారమని ఆచార్యులు చెప్పారు.

**శ్లో॥ వృషాద్రిహయసాదినః ప్రబలదోర్మరుత్ప్రేఙ్ఖిత**
**స్త్విషా స్ఫుటతటిద్గుణ స్త్వదవసేక సంస్కారవాన్ ।**
**కరిష్యతి దయే! కలిప్రబలఘర్మనిర్మూలనః**
**పునః కృతయుగాంకురం భువి కృపాణధారాధరః ॥ 90**

**ప్రతి :** హే దయే!= ఓ దయాదేవీ!, త్వదవసేక సంస్కారవాన్= నీచే (దయచే) తడుపుట (పూయుట) అను సంస్కారం కలిగినదియు, వృషాద్రి హయసాదినః = వేంకటాద్రియందుండు గుర్రపురౌతగు శ్రీనివాసునియొక్క, ప్రబలదోర్మరుత్ప్రేఙ్ఖితః= మిక్కిలి బలం కలిగిన చేయి వీచుటచే కలుగు గాలిచే ఆందోళితమైనదియు, త్విషా= స్వకాంతిచే, స్ఫుటతటిద్గుణః= ప్రకాశించు మెరపు తీగ కలిగినదియు, కలిప్రబలమర్మనిర్మూలనః= కలిచే కలిగే ప్రబల తాపాన్ని నిర్మూలించునదియు అయిన, కృపాణధారాధరః= కత్తి అనే మేఘం, భువి= భూలోకంలో, పునః= మరల, కృతయుగాంకురమ్= కృతయుగాంకురాన్ని, కరిష్యతి= కలుగజేయబోతున్నది.

**అవ :** కడపటిది, కలియుగావసానంలో ఏర్పడబోవునది అగు కల్క్యవతారంలో దయాదేవిచే సంభవింపనున్న ఉపకారం ఈ దశకాంత్యమగు శ్లోకంలో వర్ణిస్తున్నారు.

**తా :** కలియుగావసానంలో పరమపాపులగు జనులే ఎక్కువగా ఉంటారని, అప్పుడు భగవంతుడు వెల్ల గుర్రంమీద స్వారిచేస్తూ హస్తోద్ధృత ఖడ్గుడై అ పాపులను నిశ్శేషంగా సంహరించి ఈ దుష్కలిని ముగించి ధర్మోత్తరమైన కృతయుగాన్ని ఆరంభింపబోతున్నాడని, అదే ఆ అవతార ప్రధానకృత్యమని పురాణాలు వర్ణిస్తున్నాయి. ఆ విషయాన్ని ఆచార్యులు ఇక్కడ కవితాచిత్రంలో చూపిస్తున్నారు.

మేఘం సముద్రంనుండి అతిశీతలోదకాన్ని సంపూర్ణంగా గైకొని పెద్దదైన గాలి సాయంతో ఆకాశంలో ఏకీభవించి ఉత్తరక్షణంలో మహావర్షం



కురవబోవుతున్నదనుటకు సూచకంగా పెద్ద పెద్ద మెరుపుతీగలను కలిగినదై పిదప బాగుగా వర్షించి గ్రీష్మకాలంవలన కలిగిన మహాతాపంతో శుష్కమై నశించిపోయిన పైరులను, భూమిని చల్లార్చి మరల సస్యాంకురాలను ఉద్భవింపజేసి ప్రపంచానికెలా పరమక్షేమం కలుగజేస్తుందో, అట్లే శ్రీనివాసునియొక్క భవిష్యత్కల్క్యవతారంలో హస్తోద్ధృతమైన కృపాణమగు మేఘం కూడా లోకక్షేమం కలుగజేయబోతున్నది. ఈ కృపాణానికి భగవద్దయలో తడుపుటయే నూనెతో పూయబడు సంస్కారమవుతున్నది. అంతేగాక, మేఘం సముద్రంనుండి జలం తీసుకొన్నట్లుగా అవుతున్నది. నూనె పూసి సంస్కరింపనిచో కృపాణం చక్కగా పనిచేయదు. మేఘం జలస్వీకరణం కావింపనిదే వర్షించ లేదు. ఈ కృపాణమనే మేఘం భగవంతునియొక్క అతిప్రబలమైన భుజాటోపాలతో కలిగిన గాలిచే ఆందోళిత మవుతున్నది. తళతళమని తీగవలె ప్రకాశించుటచే మెరుపుతీగతో కూడినదవుతున్నది. దయలో తడిసి దానినే స్వీకరించుటవలన ఈ కృపాణమేఘం దయావర్షాన్నే వర్షిస్తుంది. అనగా, ఆ కత్తిచే సంహృతులగు వారందరు పరమపురుషుని దయచే సద్గతి పొందుతారు. వారిని పైపై దుష్కృత్యాలు చేయనీయక సంహరించి సద్గతినొందజేయడం పూర్ణదయా కార్యంకదా! కాగా, ఈ కృపాణం దయావర్షాన్ని వర్షిస్తున్నదనడంలో ఎట్టి ఆక్షేపం లేదు. ఇట్లు దయావర్షమేర్పడిన పిదప కలిక్రౌర్యంవలన ఏర్పడిన పాపాలు తొలగి మరల మిక్కిలి ధర్మయుగమైన కృతయుగపు మొలకలుద్భవింపనున్నవి. ఇదంతా దయాదేవివలన కలుగు ఉపకారమే. ఈ అవతారంలో దయాదేవి భగవంతుని కృపాణంలో ప్రవేశించి పైన చెప్పిన పనులు చేయబోతున్నది.

ఇట్లీ దశకంలో క్రమంగా జలమాత్రచరమైన మత్స్యమును; జలస్థలోభయచరమైన కూర్మమును; స్థలమాత్రచరమైన శుద్ధమానవ రూపుడగు వామనుడును; అతిదీర్ఘ రూపుడగు త్రివిక్రముడును; రజోగుణ

ప్రచరుడైన పరశురాముడును; పూర్ణసత్త్వగుణోపేతుడై ప్రకటిత మానుషమాత్ర భావుడైన దాశరథియును; మానుషభావం, పరత్వం అనే ఉభయాకారాలను ప్రపంచానికి వెల్లడించి పరిపూర్ణ బ్రహ్మస్వరూపిగా, సకలకల్యాణ గుణాకరుడుగా, క్షీరానికి శర్కరాసంపర్కంవలె తనతో సహకరించిన బలరామునితో కూడినవాడు అయిన వాసుదేవుడును; కేవల పరరూపంతోనే ప్రకాశింపబోవు కల్కియును, (ఈ దశావతారాలు) ఈ అవతారాలలో ఏర్పడిన సర్వకృత్యాలు భగవద్దయాకార్యాలేనని చెప్పి గతదశకంలోనే దయాదేవిచే ప్రపంచాని కేర్పడిన ఉపకారపరంపరలను ఆచార్యులు బహుధా విశదీకరించారు.

దయాప్రవాహం తనయందు చేయవలసిన కార్యాన్ని ఉత్తరదశకంలో ప్రార్థింపబోతున్నారు.

*నవమదశకం సమాప్తం.*

*శ్రీమతే నిగమాంతమహాదేశికాయ నమః*

## దశమదశకం

**శ్లో॥ విశ్వోపకారమితినామ సదా దుహానా**
**మద్యాపి దేవి! భవతీ మవధీరయంతమ్ ।**
**నాథే నివేశయ వృషాద్రిపతేర్దయే! త్వం**
**న్యస్తస్వరక్షణ భరం త్వయి మాం త్వయైవ ॥ 91**

**ప్రతి :** హే వృషాద్రిపతేః దేవిదయే!= ఓ వేంకటాద్రీశుని దయాదేవీ!, ఇతినామ= ఇట్లు (గత నవదశకాలలో నిరూపించినట్లు), విశ్వోపకారం= ప్రపంచానికి సకలవిధోపకారాలను, సదా= ఎల్లప్పుడు, దుహానాం= పిండుతున్న (ఇస్తున్న), భవతీమపి= నిన్నుగూడ, అద్యాఽపి= ఇప్పుడుకూడా, అవధీరయంతమ్= తిరస్కరించువాడును, త్వయైవ= నీచేతనే, త్వయి= నీయందే, న్యస్తస్వరక్షణభరం= అప్పగింపబడిన నిజరక్షణభారం కలిగినవాడును అగు, మాం= నన్ను, త్వమేవ= నీవే, నాథే= వేంకటనాథుడు, లోకనాథుడు అగు నీ నాథునియందు, నివేశయ= విడివడకుండా సంయుక్తుని చేయుము.

**అవ :** గత నవదశకాలలో దయాదేవిచే ప్రపంచానికి సర్వకాలాలలో ఏర్పడే సకలోపకారాలను నిరూపించి ప్రపంచస్థులకు, స్వశిష్యపరంపరకు దయాదేవీమాహాత్మ్యం ఉపదేశించుటకై ఆమెను స్తుతించారు. ఈ చివరి దశకంలో తన స్వరూపానికి తగిన కొన్ని కోరికలను పూర్తిచేయునట్లు ప్రార్థిస్తున్నారు. కింద ఉపదేశించిన విషయాలను స్వానుష్ఠానముఖంగా ప్రకటిస్తున్నారని భావం. గత దశకంలో విభవావతారవైభవాలను, ఉత్కృష్టాలైన అర్చావతారవైభవాలను విశదీకరించారు. అట్టి అర్చలలో ఉత్కృష్టతమమైన శ్రీనివాసార్చనద్వారా తాను కోరినఫలాలను ఇప్పించులాగున దయాదేవిని ఈ దశకంలో ప్రార్థిస్తున్నారు. కింది శ్లోకంలో సర్వపాపులను సంహరించు కల్క్యవతారం ప్రస్తావించబడింది. అట్లు సర్వపాపక్షపణసమర్థుడైన కల్కిరూపియగు శ్రీనివాసుడు నా పాపాలనుకూడా

తొరగజేయాలి, ఇది దయాదేవివైన నీచేతనే జరుగాలని ఈశ్లోకంలో వేడుకొంటున్నారు.

**తా :** శ్రీనివాసుని ఒక కామధేనువుగా చేసి దయాదేవి ప్రపంచానికి కావలసిన సర్వోపకారాలు అనే క్షీరాన్ని ఆయన దగ్గరనుండి పిండి తల్లి బిడ్డలకు ఇచ్చినట్లు మనకర్పిస్తున్నది. సృష్టి స్థితి ప్రళయకాలాలలోను, ప్రపన్నుల విషయంలోను, తదితర విషయాలలోను, యోగులవిషయంలోను పరవ్యూహవిభవార్చాద్యవతారాలు మరియు అనేకరీతులలోను బహువిధోపకారాలను దయాదేవి చేస్తున్నదని ఈ స్తోత్రంలో ఇప్పటివరకు తొమ్మిది దశకాలలో విశదంగా నిరూపింపబడింది.

ఇట్లు ప్రపంచవిషయంలోను, విశేషించి నాకు బహూపకారాలు చేస్తున్న తల్లివంటి నిన్ను దుష్టతనయునివలె నేను ఇప్పుడు తిరస్కరిస్తున్నాను. ఆహా! ఎంత క్రౌర్యం అని ఆచార్యులు తనను విమర్శించుకొంటున్నారు. దయాదేవిని తిరస్కరించడం అంటే; శాస్త్రోక్తమైన విధినిషేధాదులను తిరస్కరించి తద్వారా దయాదేవియొక్క అనుగ్రహం మనపై ప్రసరించుటవకాశం ఒసగకుండుటయే. నాయొక్క ఆత్మరక్షణభారాన్ని నీవే నీ యందే ఆరోపించుకొని నన్ను రక్షించుటకై ఉద్యుక్తవయి ఉన్నావు. అనగా, నేను నీయందు ప్రపత్తిచేసి ఉన్నాను. ఆ ప్రపత్తితో స్వతంత్ర కర్తృత్వంకూడా నీకే కలదని భావం. ఇట్టి స్థితిలో ఉన్నప్పటికి ఇంత ఉపకారంచేసే నిన్నుకూడా ఇప్పుడు నేను అవమితిస్తున్నానని ఆచార్యులంటున్నారు. ప్రపత్తి చేసినపిమ్మటకూడా ప్రకృతిసంబంధవశాన పాపాలు సంభవించవచ్చు. అది దయను తిరస్కరించుటయే అను రహస్యార్థమిట వివక్షితం. అట్టి అపరాధాలను చేసే నన్ను క్షమించి ముందు నీవు నా రక్షణభారాన్ని స్వీకరించిన దాని కనుగుణంగా శ్రీనివాసుని పాదారవిందాలతో విడివడని దృఢసంయుక్త స్థితిని తనకు కలుగజేయుమని ప్రార్థిస్తున్నారు.

"వృషావిప్రతౌ" అనే పాఠంకూడా ఉంది. అప్పుడు "నాదే" అనుట కది విశేషణమవుతుంది.



**శ్లో॥ నైసర్గికేణ తరసా కరుణే! నియుక్తా**
**నిమ్నేతరేఽపి మయి తే వితతిర్యది స్యాత్ ।**
**విస్మాపయేద్వృషగిరీశ్వరమప్యవార్యా**
**వేలాతిలంఘనదశేవ మహాంబురాశేః ॥ 92**

**ప్రతి :** హే కరుణే!= ఓ దయాదేవీ!, నైసర్గికేణ= (నీకు) స్వాభావికమైన, తరసా= వేగముచే, నియుక్తా= ప్రేరేపింపబడినదియు, (అతఏవ= కనుకనే), మహాంబురాశేః= సముద్రంయొక్క, వేలాతిలంఘనదశేవ= గట్టునతిక్రమించు స్థితివలె, అవార్యా= ఎవరిచేనైనను అడ్డగించుటకు వీలుకానిదియునగు, తే వితతిః= నీ ప్రవాహం, నిమ్నేతరే= మిట్ట మడవయైన (గర్వంచేత చాల ఉత్కర్షము నభిమానించు), మయ్యపి= నాయందు సయితం, యదిస్యాత్= ప్రసరించెనేని, తదా= అప్పుడు, వృషగిరీశ్వరమపి= వేంకటాద్రీశునిగూడ, విస్మాపయేత్= ఆశ్చర్యపరచును.

**అవ :** కింది శ్లోకంలో అత్యధికాపరాధాలను చేసే తననుకూడా ప్రార్థించడానికి వీలగునట్లు ఆమె స్వభావం అమరి ఉన్నదని దయాదేవియొక్క గొప్పతనాన్ని ఈ శ్లోకంలో స్తుతిస్తున్నారు.

**తా :** ప్రవాహం గట్టులు తెంచుకొని అతివేగంగా ప్రవహించునపుడు మిట్ట మడవనుకూడా లక్ష్యంచేయకుండా అక్కడ ప్రసరిస్తుంది. అట్లే నీ ప్రవాహం స్వభావంగానే చాల వడిగలది కనుక మిక్కిలి మిట్ట మడవయైన, అనగా– దయాదేవి అనుగ్రహమేర్పడుట కనుగుణంగా ఏవిధమైన సద్గుణం లేకుండుటమాత్రమేగాక దురభిమానాది దుర్గుణాలు నిండియున్న నాయందుకూడా నిరాటంకంగా ప్రవహిస్తుంది. నన్నుకూడా రక్షించెదవని భావం. ఇట్లు నీ ప్రవాహం నాపై ప్రసరించునపుడు సముద్రం మేరమీరి పొంగి ప్రవహిస్తే దానిని ఎవరుకూడా అడ్డగించుటకు సాధ్యంకాదో, అటులనే నిన్నుకూడా ఎవరును (శ్రీనివాసుడును) అడ్డగించుటకు సాధ్యం కాదు గనుక

ఆ శ్రీనివాసుడే నీ ప్రవాహాన్ని చూచి ''ఆహా! దయాదేవియొక్క దీనజనసంరక్షణ సంభ్రమమెట్టి" దని ఆశ్చర్యపడుతున్నాడు. ఇట్లు తనయందు నిశ్చయంగా దయాదేవి అనుగ్రహమేర్పడునని ఆచార్యులు తనను సమాశ్వాసపరచుకొంటున్నారు. ఇట్లాశ్వాసించుటకు దయాదేవి కమరియుండు సత్త్వభావమే కారణం.

**శ్లో॥ విజ్ఞాతశాసనగతిర్విపరీతవృత్త్యా**
**వృత్రాదిభిః పరిచితాం పదవీం భజామి ।**
**ఏవంవిధే వృషగిరీశదయే! మయి త్వం**
**దీనే విభోశ్శమయ దండధరత్వలీలామ్ ॥ 93**

**ప్రతి :** హే వృషగిరీశదయే= ఓ వేంకటాద్రీశుని దయాదేవీ!, విజ్ఞాతశాసనగతిః= ఎరుగబడిన శాస్త్రగతి (దండనగతులను) గల, (అహం= నేను) విపరీతవృత్త్యా= విరుద్ధాచారంచేత, వృత్రాదిభిః= వృత్రాసురుడు, రావణుడు మొదలగువారిచేత, పరిచితాం= స్వీకరింపబడిన, పదవీం= మార్గమును, భజామి= పొందియున్నాను, ఏవం విధే= ఇట్టి (చాల క్రూరుడైన), దీనే= అనాథుడను (నీ పాదములబడిన), మయి= నాయందు, విభోః= ప్రభువగు శ్రీనివాసునియొక్క, దండధరత్వలీలామ్= దండించుట అను లీలను, త్వం= నీవు, శమయ= శమింపజేయి.

**అవ :** కింది శ్లోకంలో దయాదేవియొక్క స్వాభావికమైన గుణాన్ని వర్ణించారు. ఈ శ్లోకం మొదలు తన స్వభావాన్ని గుర్తిస్తున్నారు.

**తా :** నేను సర్వశాస్త్రాలను ఎరుగుదును. ఏ యే అపరాధాలను చేస్తే ఎలాంటి దండనలు లభిస్తాయో చక్కగా ఎరుగుదును. అయినా శాస్త్ర ప్రదర్శితమార్గంలో నడచుటమాత్రం లేదు. భగవదాజ్ఞను ఉల్లంఘించడమే ముఖ్యోద్దేశంగాగల వృత్రాసురుడు, రావణుడు, శిశుపాలుడు మొదలగు లోక కంటకులైన భగవద్ద్రోహులు అవలంబించిన దారిని నేను అవలంబించి



ఉన్నాను. దానియందే నాకు స్వాభావికమైన రుచి కలిగి ఉంది. ఇది నా స్వభావం. ఇట్టి మహాపరాధియగు నేను దీనుడను. అనగా అనాథను; వేరెవరిచేతనైనా కాపాడబడుటకు సాధ్యంకానివాడను. నీ పాదారవిందాలలో పడినవాడను. తల్లీ! దయాదేవీ! నీ నాథుడు నాపై కోపంతో విధింపబోవు దండనలను నీవు నిరోధింతువని ఇలా తనను నికర్షించి చెప్పుటద్వారా, ఎట్టి ఆర్ద్రాపరాధులకైనా దయాదేవిచే సద్గతి కలుగుననే నమ్మకాన్ని ఆచార్యులు ప్రకటిస్తున్నారు. ప్రపత్తి చేసిన పిదప బుద్ధిపూర్వకాలైన పాపాలు సంభవించినయెడల వానినికూడా పునశ్శరణాగతి అనే ప్రాయశ్చిత్తంతో పోగొట్టవచ్చుననే రహస్యం ఇక్కడ ఎరుగదగింది. తెలిసి పాపాలు చేసినవానికి తెలియక చేసిన వానికంటె దండన అధికమని శాస్త్రాలు చెపుతున్నాయి. కనుక ఎక్కువ దండనకు గురి కావలసియున్న నన్ను దీనుడనే కారణాన్ని బట్టి నీ స్వభావంచేతనే నాథుని కోపింపనీయకుమని ప్రార్థిస్తున్నారు.

**శ్లో॥ మాసాహసోక్తి ఘనకంచుకవంచితాన్యః**
**పశ్యత్సు తేషు విదధామ్యతిసాహసాని ।**
**పద్మాసహాయకరుణే! న రుణత్సి కిం త్వం**
**ఘోరం కులిఙ్గశకునేరివ చేష్టితం మే ॥ 94**

**ప్రతి :** హే పద్మసహాయకరుణే!= ఓ శ్రీనివాసుని దయాదేవీ! (అహం= నేను) మాసాహసోక్తిఘనకంచుకవంచితాన్యః= సాహసం చేయవద్దను ఉపదేశమనే గట్టిదైన కవచమును (ఆచార్యవేషమును) ధరించి దానిచే పరులను వంచించువాడనై, తేషు= ఆ వంచితజనులు, పశ్యత్సు= చూస్తుండగనే, అతిసాహసాని= మిక్కిలి సాహస కార్యాలను (అకృత్యాలను), విదధామి= చేస్తున్నాను, కులిఙ్గశకునేరివ= కులింగ పక్షివలె, ఘోరం= దారుణమైన, మే= నాయొక్క, చేష్టితం= కృత్యాన్ని, త్వం= నీవు, కిం న రుణత్సి= ఏల అడ్డగించకున్నావు.

**అవ :** ఈశ్లోకంలో కూడా తన స్వభావాన్ని చెపుతున్నారు. బుద్ధి పూర్వకంగా నేను అపరాధాలు చేయడం మాత్రమేగాదు. ఇతరులకు సన్మార్గం ఉపదేశిస్తూ తత్సమక్షంలోనే అతిక్రూరపాపాలు చేస్తున్నానంటున్నారు. గత శ్లోకంలో నేను చేసే బుద్ధిపూర్వాపరాధాలకు క్రూరదండనమేర్పడజేయక కాపాడుమని ప్రార్థించారు. ఈ శ్లోకంలో ఆ అపరాధాలకు కారణభూతమైన క్రూర పాపంలో నాకు ప్రవృత్తి కలిగింపక రక్షింపమని వేడుకొంటున్నారు.

**తా :** కులింగశకుని అను ఒక పక్షి ఉంది. అది ఎప్పుడూ "మా సాహసం కురు" – "సాహసం చేయకు" అని అరుస్తూనే ఉంటుంది. సింహం నిద్రించునపుడు అది ఆవలిస్తే వెంటనే హఠాత్తుగా దానినోట దూరి తద్దంతమధ్యగతమైన మాంసఖండాలను ముక్కుతోపొడిచి తీసికొనిరావడం తత్స్వభావమట. ఈ కృత్య మెంత సాహసం? ఒక నిమిషం విలంబించినా సింహం నోరుమూసుకొనినా ఏమవుతుంది? ఇట్టి మహాసాహసం చేసే ఈ పక్షి ఇతరులకు సాహసం చేయవద్దని ఎప్పుడూ ఉపదేశిస్తున్నదట. ఈ పక్షి నడతవలె నా నడతకూడాఉన్నదని ఆచార్యులు తన స్వభావాన్ని ఇక్కడ వర్ణిస్తున్నారు. శాస్త్రాలను ఉల్లంఘించరాదని పరులకు సర్వదా ఉపదేశిస్తూ ఉండే నేను భయం, లజ్జ లేక అతిసాహసమైన క్రూరకార్యాలు చేస్తున్నాను. ఆహా! నా సాహసమెట్టిది! ఓ దయాదేవీ! ఇట్టి నా సాహసకృత్యాలను, పూర్వోక్త ప్రకారం మాతృప్రేమ గల నీవు ఏల అడ్డగింపవు? అని ప్రశ్నిస్తున్నాడు. అనగా, భగవద్దయ చేతనే అకృత్యాలైన పాపకృత్యాలలో రుచి, ప్రవృత్తి కలుగకుండా ఉండాలనే విషయం ఇక్కడ స్పష్టమవుతున్నది. జ్ఞానం విశేషంగా కలుగవచ్చు. సమీచీనానుష్ఠానం ఏర్పడడం చాల అరుదు. అది భగవదనుగ్రహైకలభ్యం. రాజసూయయాగంలో భీష్మాచార్యులను నిందించిన శిశుపాలుడు ఈ కులింగశకునిని ఉపమానంగా చెప్పాడు. కులింగశకుని స్వభావాన్ని:



**"కులింగశకునిర్నామ హరేర్దారితదంతినః ।**
**ముఖాదామిషమాదత్తే వదన్ మా సాహసం కురు"॥**

అని పెద్దలు చెప్పారు.

**శ్లో॥ విక్షేపమర్హసి దయే విపలాయితేఽపి**
**వ్యాజం విభావ్య వృషశైలపతేర్విహారమ్ ।**
**స్వాధీన సత్త్వసరణిః స్వయమత్ర జన్తౌ**
**ద్రాఘీయసీ దృఢతరా గుణవాగురా త్వమ్ ॥ 95**

**ప్రతి :** హేదయే!= ఓ దయాదేవీ!, స్వాధీనసత్త్వసరణిః= తన కధీనమైన సత్త్వగుణమార్గం కలిగినదియు (తనకధీనమైన జింక మొదలగు జంతువులయొక్క త్రోవను కలిగినదియు), ద్రాఘీయసీ= మిగుల పొడవైనదియు (బహుదూరం వ్యాపింపదగినదియు) దృఢతరా= చాల గట్టిదియునగు, గుణవాగురా= భగవంతుని కల్యాణగుణరూపయై వలవలెఉన్న (దారాలతో చేయబడిన వలవలె ఉన్న), త్వం= నీవు, విపలాయితేఽపి= (నీవు వద్దని) చాలదూరం పరుగెత్తి పోయినను, అత్రజంతౌ= ఈ జంతువునందు (నాయందు), వృషశైలపతేః= వేంకటాద్రీశునియొక్క, విహారం= లీలను (వేటను), వ్యాజం= వ్యాజంగా, విభావ్య= కల్పించుకొని, స్వయం = స్వయంగానే, విక్షేపం= విక్షేపమునకు (వ్యాపించుటకు ఎగిరి పట్టుకొనుటకు), అర్హసి= తగినదానవవుతున్నావు.

**అవ :** కింది శ్లోకంలో కులింగపక్షివలెనున్న నన్ను సాహస కార్యాలనుండి నిరోధించమని ప్రార్థించారు. ఈ శ్లోకంలో అట్లు నిరోధించుటకు తగిన ఒక ఉపాయాన్ని విన్నవిస్తున్నారు.

**తా :** అడవిలో స్వేచ్ఛగా పరుగెత్తుతూ దాక్కొంటున్న జంతువులను పట్టుకొనివచ్చి తన రాజభవనంలో ఉంచి, వాటికి హితమైన సర్వకార్యాలు చేసి తన నాయకునితోకూడా ఆ ప్రాణులవలన కలుగు ఆనందం అనుభవింప

గోరిన ఒక రాజమహిషి తన నాయకుని వేటవ్యాజంతో జంతువ్యాప్తమైన ఒక మహారణ్యానికి పిలుచుకొనిపోయి గట్టిదైన ఒక పెద్దవలను వైచి మృగాలను పట్టి ఎలా తన అభీష్టం నెరవేర్చుకొనునో; అట్లే, ఓ దయాదేవీ! నీవుకూడా చేయవలెనని ప్రార్థిస్తున్నారు.

శ్రీనివాసుడగు నీ నాథుడు అడవిరాజు. ఆతని మహిషివగు నీకు అడవిలో మృగము లెక్కడెక్కడ సంచరించునో చక్కగా తెలుసు. అనగా, విషయమనే అరణ్యంలో సంచరించే నాబోటివారిగతి బాగుగా నీవెరుగుదువని భావం. అట్టి విషయకాంతారంలో సంతత సంచార జంతువగు నన్ను పట్టుకోవాలి. ఓ దయాదేవీ! అందుకు నీవే దృఢమైన, దీర్ఘమైన ఒక వలగా అమరాలి. వల దారాలతో (గుణాలచే) చేయబడి ఉంటుంది. నీవును గుణరూపవే. అనగా, భగవంతుని ప్రధానగుణరూపవని భావం. నేనట్టివలలో చిక్కుకొనక చాలదూరం పరుగెత్తి దాగుకొనజూస్తాను. నే నెంతదూరం పరుగెత్తినా, దానికంటె పొడవుగా నీవు అమరాలి. ఒకవేళ వలలోచిక్కితే నఖదంతాదులతో ఆ వలను ఛేదించి మృగాలు పారిపోవునట్లు నేనును పారిపోతాను. అలాంటి అవకాశం ఇవ్వకుండా నీవు చాల గట్టిగా ఉండాలి. నీవిట్టి వలగా ఉండి నన్నుబట్టి యేతద్దశకారంభ శ్లోకంలో ప్రార్థించినట్లు నీ నాథునికి సమర్పింపుమని ప్రార్థిస్తున్నారు. భగవంతునిదయ మనపై ప్రసరించుటకు వీలులేనట్లు ఉపర్యుపరి పాపాలు చేసి భగవద్దయకు చాల దూరంగా పారిపోతున్నాం. అలా పరుగెత్తినా పూర్వకృతమగు ఏదో ఒక సుకృతం వ్యాజంగా మనలను విషయీకరింప వచ్చునపుడు సైతం సాధ్యమైనంతవరకు ఆ కృత్యాలనే చేసి ఆ దయను వదలించుకొన జూతుము. అలా ఉన్నా, దయాదేవి చాల గట్టిదైన వలవంటిది కాబట్టి మన తిరుగుబాటును లక్ష్యం చేయక గట్టిగాపట్టి స్వాధీనం చేసుకొని తన నాథునికి సమర్పిస్తున్నదని తాత్పర్యం.

ఈ సందర్భంలోగల శ్లోకాలను ప్రపత్త్యుత్తరకాలాన సంభవించే బుద్ధిపూర్వోత్తర పాపాలను శమింపజేయు విషయంగా వ్యాఖ్యానించ



వచ్చునని గతశ్లోకాలలో నిరూపించడం జరిగింది. కావున ఈశ్లోకాన్ని కూడా తదనుగుణంగానే అన్వయించుకోవలసి ఉంటుంది.

ఒకసారి ప్రపత్తి చేసిన పిదప ప్రారబ్ధకర్మవశంగా బుద్ధిపూర్వకమైన క్రూరపాపాలేర్పడినా మనం చేసే అత్యల్పమైన పునశ్శరణాగతి అనే కారణంవలన ఆ పాపాలను క్షమించి దయాదేవి మనం కోరిన మోక్ష ఫలాన్ని నిరాటంకంగా ఇచ్చుననే శాస్త్రార్థం ఈ ప్రకరణానికి సారార్థం.

కాగా, ఇట్లునేను పరుగెత్తినా నీవే నన్ను పట్టుకొని స్వాధీనం చేసుకొనినయెడల నాకు మరల అట్టిపాపకార్యాలు చేయడానికి అవకాశం ఉండదు. అనగా, భగవద్దయాదేవియొక్క అనుగ్రహం పూర్ణంగా ఏర్పడిన పిదప పాపంలో రుచి ఉండదు. నన్ను పాపాలనుండి నివర్తింపజేయుటకు ఇదే ఉపాయమని భావం. లోకంలో రాజుల వేటలో ప్రాణులకు నష్టం ఉంటుంది. ఈ వేటలో దయాదేవి సంబంధపడి ఉండుటచే పట్టుకొనబడిన ఏ ప్రాణులకు చావులేదనుట మాత్రమేగాక విశేషభోగాలు కూడా ఉంటాయి.

“స్వాధీనసత్త్వసరణిః” అనే శ్లిష్టపదంవలన భగవద్దయాదేవి అనుగ్రహం చేతనే సత్త్వగుణం, తత్కార్యాలైన సమీచీనజ్ఞానం మొదలగునవి కలుగుతాయి అనే తత్త్వార్థం బోధింపబడుతున్నది.

**శ్లో॥ సంతన్యమానమపరాధగణం విచింత్య**
**త్రస్యామి హంత! భవతీం చ విభావయామి ।**
**అహ్నాయ మే వృషగిరీశదయే! జహీమా**
**మాశీవిషగ్రహణకేళినిభామవస్థామ్ ॥ 96**

**ప్రతి :** హే వృషగిరీశదయే!= ఓ వేంకటాద్రీశుని దయాదేవీ!, సంతన్యమానం= (నాచే) అవిచ్ఛిన్నంగా చేయబడుతున్న, అపరాధగణం= అపరాధ సమూహమును, విచింత్య= తలచి, త్రాస్యామి= భయపడుతున్నాను, భవతీంచ= నిన్నును, విభావయామి= స్మరిస్తున్నాను, హన్త= ఆశ్చర్యం!,

ఆశీవిషగ్రహణకేళినిభాం= దుష్టసర్పమునుబట్టి ఆటాడుటతో సమమైన, మే= నాదగు, ఇమాం= ఈ, అవస్థాం= దశను, అహ్నాయ= త్వరగా, జహి= నశింపజేయి.

**అవ :** గతశ్లోకంలో పాపాలనుండి తన్ను విడిపించుటకు ఒక ఉపాయం చెప్పినారు. ఇది మొదలు దశకాంతంవరకు అట్టి పాపాలనుండి స్వయంగానే విడివడడం వీలు పడదు. నీవే నీ మాతృత్వానికి అనుగుణంగా నన్ననుగ్రహించి ఆ పాపాలనుండి నిరోధించాలి. నీ స్వభావం అట్టిదే అని ప్రార్థించి దయకుగల పరమోదారత్వాన్ని స్వపాపాపనోదనమను ప్రకృతి విషయానికి అనుగుణంగా కీర్తిస్తున్నారు.

**తా :** అడుగడుగున నే నాచరించే అపరాధాలను, వాటికి రాబోయే ఫలాలను తలచి మిక్కిలి భయపడుతున్నాను. వడవడ వడకుతున్నాను. అయినా ఉత్తరక్షణంలో నిన్ను, నీ స్వభావాన్ని తలుచుకొంటున్నాను. అప్పుడు కొద్దిగా తేరుకొంటున్నాను. ఎలాగైనా పుత్రవాత్సల్యోపేతవగు నీవు నన్ను కాపాడతావని అనుకొంటున్నాను. మళ్లీ అపరాధాలు చేస్తున్నాను, భయపడుతున్నాను. ఇట్లు క్రూరవిషసర్పాన్ని పట్టుకొని ఆటలాడుటతో సమమైన నా స్థితిని శీఘ్రంగా తొలగించు. అనగా అడుగడుగున అపరాధాలు చేసే ఈ సంకటపరిస్థితిని పోగొట్టి ఇకపై నేనపరాధాలు చేయకుండా అడ్డుపడి నన్ను ముక్తతుల్యునిగా చేయుమని ప్రార్థిస్తున్నారు. పాము నన్ను కరచి చంపడానికి ముందే ఈ పాముతో ఆటలాడాలనే నా ఆశను నీవు చంపుతానడంవల్ల, సంసారరుచి కించిత్తుకూడా నాకు లేకుండునట్లు అనుగ్రహింపదగునని భావం.

ఈ ప్రకరణాన్ని అనుసరించి “భవతీం చ విభావయామి” అనుటచే ప్రపత్త్యుత్తరకాలంలో కూడా పాపారంభక పాపాలకు నివర్తకంగా మరొక ప్రపత్తిచేయవచ్చుననే శాస్త్రార్థం బోధించి తాను కూడా అనుష్ఠించిరని పూర్వులు వ్యాఖ్యానించారు.



**శ్లో॥ ఔత్సుక్యపూర్వముపహృత్య మహాపరాధాన్**
**మాతః! ప్రసాదయితుమిచ్ఛతి మే మనస్త్వామ్ ।**
**ఆలిహ్య తాన్ నిరవశేషమలబ్ధతృప్తిః**
**తామ్యస్యహో! వృషగిరీశధృతా దయే త్వమ్ ॥ 97**

**ప్రతి :** హే మాతః!= ఓ తల్లీ! దయాదేవీ!, మే= నాయొక్క, మనః= మనస్సు, మహాపరాధాన్= గొప్ప అపరాధాలను, ఔత్సుకపూర్వం= ఎంతో ఆశతో, ఉపహృత్య= కానుకగా ఇచ్చి, త్వాం= నిన్ను, ప్రసాదయితుం= సంతోషపరచుటకు, ఇచ్ఛతి= ఇచ్ఛగిస్తున్నది, దయే!= ఓ దయాదేవీ!, వృషగిరీశధృతా= వేంకటాద్రీశుడగు శ్రీనివాసునిచే ధరింపబడిన త్వం= నీవు, తాన్= ఆ అపరాధాలను, నిరవశేషం= నిశ్శేషంగా, ఆలిహ్య= ఆస్వాదించి (భుజించి), అలబ్ధతృప్తిః= తృప్తినొందని దానవై, తామ్యసి= తహతహపడుతున్నావు, అహో!= ఆశ్చర్యం!

**అవ :** కిందిశ్లోకంలో తనకికపై అపరాధం సంభవించకుండా ఉండడానికి పాపారంభక పాపనివర్తక ప్రపత్తిని అనుష్ఠించారు. కాగా, ఇంతవరకు పలువిధాల ప్రపత్తి చేశారు. ఇచట ప్రపత్తి చేయడమంటే అనగా, తాను చేసిన అపరాధాలకు ఫలమివ్వక అడ్డగింపుమని ప్రార్థించుటయే. ఇలా ఎన్నిసార్లు ఎన్ని విధాల ప్రార్థించినప్పటికి ఆయా అపరాధాలను ఆయారీతిలో ఆమె క్షమిస్తుంది. ఆమె స్వభావం అలాంటిది అనే విషయాన్ని ఇక్కడ చిత్రంగా కీర్తిస్తున్నారు.

**తా :** దయకు ఆకలి కలిగినయెడల ఆమె అభిలషించి స్వీకరించే ఆహారం మన అపరాధాలే. అనగా అపరాధులయొక్క అపరాధాలను క్షమించి వారిని అనుగ్రహించుట దయాస్వభావమని భావం. అలా ఆమె కోరే ఆహారమైన అపరాధాలను మూటలు మూటలుగా పలుసార్లు పలువిధాలుగా నేను సమర్పించి ఆమెను తృప్తి పెట్టగోరుతున్నాను. అనగా మోక్షార్థశరణాగతి, పునశ్శరణాగతి, పాపారంభక పాపనివర్తక శరణాగతి అనునట్టి

శరణాగతులను చేస్తున్నానని భావం. కాని, ఆ దయాదేవి నాచే సమర్పింపబడిన సమస్తపాపాలను నిరవశేషంగా మింగివేసి తన ఆకలి తీరనందున తృప్తిలేకుండా తపిస్తున్నది. ఆమెయొక్క కడుపుగలిగిన తనమెంతటిదో ఆశ్చర్యం కలిగిస్తున్నది గదా! అనే చిత్రోక్తిచే దయాదేవికి గల పరమోదార స్వభావాన్ని ప్రకటిస్తున్నారు. ఒకడెంత క్రూరపాపాలు ఆచరించినా శ్రీనివాసుని పాదారవిందాలపైపడి తనను కాపాడవలెనని హృదయపూర్వకంగా ప్రార్థించినయెడల (ప్రపత్తిచేసినచో) ఆయన అంతటిని పరమదయతో క్షమించి ఇతనికి సద్గతిని కలిగిస్తాడు. అట్టి పరమోదార స్వభావంకలవాడతడని భావం.

**శ్లో॥ జహ్యాద్వృషాచలపతిః ప్రతిఘేఽపి న త్వాం**
**ఘర్మోపతప్త ఇవ శీతలతాముదన్వాన్ ।**
**సా మామరుంతుదభరన్యసనానువృత్తిః**
**తదీక్షణైః స్పృశ దయే! తవ కేళిపద్మైః ॥ 98**

**ప్రతి :** హేదయే!= ఓ దయాదేవీ!, వృషాచలపతిః= వేంకటాద్రీశుడగు శ్రీనివాసుడు, ప్రతిఘే (సత్యపి)= కోపమేర్పడియుండినను, ఘర్మోపతప్తః= గ్రీష్మాతపంచే ఉపతప్తమైన, ఉదన్వాన్= సముద్రము, శీతలతాం ఇవ= తనకు స్వాభావికమైన చల్లదనంవలె, త్వాం= నిన్ను, నజహ్యాత్= వీడడు, సా= అట్టి, అరుంతుద భరన్యసనాఽనువృత్తిః= మనసుకు వేదనగల్గించు పునఃపునః శరణాగతియను భరన్యాసం యొక్క అనువృత్తిని గల్గియున్న, త్వం= నీవు, మాం= నన్ను, తవ= నీ యొక్క, కేళిపద్మైః= లీలారవింద రూపాలైన, తదీక్షణైః= ఆ శ్రీనివాసుని కటాక్షములచే, స్పృశ= తాకుము.

**అవ :** గత శ్లోకంలో దయాదేవి మనబోటివారుచేయు క్రూరాపరాధాలను క్షమిస్తున్నదని వర్ణించారు. ఆ దయాదేవి ఎప్పుడూ భగవానునితో ఉండిననే కదా భగవంతుని మన ఆపరాధాలను క్షమించునట్లు చేయగలదు. కొన్ని సమయాలలో (మనం అపరాధం చేయునపుడు) భగవంతునికి



కోపమేర్పడును గదా! అప్పుడు దయాదేవీసంబంధం లేనందున మన అపరాధాలను క్షమింపజేయు వారెవరూ లేనందున ఆ పాపాలకు ఫలం లభించియే తీరునుగదా! అనే సంశయాన్ని పోగొట్టుటకై దయాదేవి ఒక క్షణమైనా భగవానుని వదిలి ఉండుట లేదు. కావున మన అపరాధాలకు ఫలం సంభవించదని ఈశ్లోకాలలో నిరూపిస్తున్నారు.

**తా :** సముద్రం వేసవికాలంలో సూర్యాతపంచేత ఎంతవేడి కలిగినప్పటికి అడుగుభాగంలో తనకు స్వాభావికమైన శైత్యగుణాన్ని కలిగే ఉంటుంది. ఆ గుణాన్ని అది ఎప్పుడూ వదలదు. అలాగే భగవంతునికి మనం చేసే అపరాధాలవలన కొన్ని సమయాలలో కోపమేర్పడినా ఆ సమయాలలోకూడా ఓ దయాదేవీ! నీవు లోపల దాగి ఉన్నావు. కోపంతో ఒకవేళ దండన ఏర్పడినా దానిని హితపర్యవసాయిగా మార్చి ఆ జీవుని కాపాడుతున్నావు. ఇట్లు ఒక క్షణంకూడా భగవానుని వీడక అతనికి పరమప్రీతిపాత్రవగు నీవు ఒక ఫలాన్నుద్దేశించి రెండవసారి ప్రపత్తిచేసినయెడల దానిని సహించుటలేదు. ప్రథమ పర్యాయం శరణాగతి చేసినప్పుడే మనసు ద్రవించి కోరినఫలమునిచ్చుటకు సిద్ధంగా ఉన్నపుడు మరల ఇంకొకసారి దానినే అడగడం గోరుచుట్టుపై రోకటిపోటువలె నీ మనస్సుకు చాల వేదన కలుగజేస్తున్నది. అపరాధాలను ఎన్ని పర్యాయాలు చేసినా క్షమిస్తావుగాని శరణాగతిని మాత్రం ద్వితీయ పర్యాయం చేస్తే క్షమించవు. నీ వంత మృదుస్వభావం కలదానవు. ఇట్టి నీవు లీలార్థమై చేతబట్టుకొన్న తామరవలె ఉన్న నీ నాథుని శీతల కటాక్షాలతో నన్ను స్పృశిస్తావు. అనగా, నీ నాథునికటాక్షం నాపై ప్రసరించునట్లు అనుగ్రహించమని భావం. లీలారవిందం ఎలా స్వాధీనంగాను, స్వేచ్ఛానుసారంగాను, వినియోగార్హంగాను ఉంటుందో, అట్లే భగవానుని కటాక్షంకూడా దయాదేవికి అధీనంగాను, తదిష్టవినియోగార్హంగాను ఉంటుందనే భావం ఈ దృష్టాంతంచేత ఎరుగదగింది. భగవంతుడు దయాపరాధీనుడని పిండితార్థం.

తామరకున్న శైత్య మనోరమత్వాదిగుణాలు భగవత్కటాక్షానికి ఉన్నాయనడం ఇక్కడ వివక్షితం.

ఒకే ఫలాన్నుద్దేశించి రెండవసారి శరణాగతి చేయడం శాస్త్ర సమ్మతం కాదు. అది భగవంతునికి మనోవేదనను కలిగిస్తున్నదను రహస్యార్థం ఇక్కడ "అరుంతుదభరన్యసనాఽను వృత్తిః" అను సమాసంచేత బోధింప బడుతున్నది.

**శ్లో॥ దృష్టేఽపి దుర్బలధియం దమనేఽపి దృప్తం**
**స్నాత్వాఽపి ధూళిరసికం భజనేఽపి భీమమ్ ।**
**బద్ధ్వా గృహాణ వృషశైలపతేర్దయే! మాం**
**త్వద్వారణం స్వయమనుగ్రహశృంఖలాభిః ॥ 99**

**ప్రతి :** హే వృషశైలపతేః దయే= ఓ వేంకటాద్రీశుని దయాదేవీ! దృష్టేఽపి= కంటితోచూడబడియుండినప్పటికి, దుర్బలధియం= కలతజెందిన బుద్ధిని గల్గినదియు (కల్గినవాడును), దమనేఽపి= శిక్షించినప్పటికి, దృప్తం= దర్పం కలిగినదియు(కలిగివాడును), స్నాత్వాఽపి=స్నానం చేసినను, ధూళిరసికం= దుమ్మునందాశ కలిగినదియు (కలిగినవాడును) భజనేఽపి= (ఆశతో) సేవ చేసినను, భీమం= భయంకరం (రుడు) గానుండు, త్వద్వారణం= నీ ఏనుగైన, (నిన్నువద్దని అడ్డగించుచున్న), మాం= నన్ను, స్వయం= నీవుగనే, అనుగ్రహశృంఖలాభిః= అనుగ్రహమను సంకెళ్లచే (వెనుకనుండివచ్చి పట్టుకొనుట కనుకూలమైన సంకెళ్లచే), బద్ధ్వా= కట్టి, గృహాణ= పట్టుకో.

**అవ :** కిందిశ్లోకంలో భగవత్కటాక్షాలచే నన్ను స్పృశింపుమని ప్రార్థించారు. భగవంతుడు నన్ను కటాక్షించునట్లు చేయుమని భావం. ఈశ్లోకంలో అలా భగవంతుడు నన్ను కటాక్షించినా నాకు అనాదికాలంగా ఉండే విషయవాసనచే మరల నేను విషయభోగాలలో ఆసక్తుడను కాగలను. నా



స్వభావమంత నీచమైంది. కాన నన్ను నీవే కట్టిపెట్టుకొని కాపాడవలెనని ప్రార్థించు వ్యాజంతో, జీవునికి భగవద్దయా కటాక్షమేర్పడినను ప్రకృతిమీది మోహం త్వరలో వదలదు. అది కేవలం ఈశ్వరానుగ్రహైక సాధ్యమనే శాస్త్రార్థాన్ని మదించిన ఏనుగు దృష్టాంతీకరించి నిరూపించి, కడపట తన అపరాధాలను మొరపెట్టి నిర్వేదపడుతున్నారు.

ఏనుగును మావటీడు తనకంటి చూపులతోనే శమింపజేయుట కద్దు. ఐనను దానికి మదముపట్టినపుడు దానిబుద్ధి విపరీతమై అది అఙకువతో ఉండదు. అట్లే అంకుశం మొదలగు వానితో శిక్షించినా తద్దర్పమణగదు. దానిని బాగుగా మంచినీటితో కడిగినను తత్క్షణమే అది సర్వాంగములలో స్వయంగానే దుమ్ము పూసుకొంటుంది. దానికెంత ప్రీతితో పరిచర్య చేసినప్పటికి మదంతో భయంకరంగా ఉంటుంది. అట్టి ఏనుగును దాని యజమాని మిగుల గట్టిదైన ఇనుపసంకెలచే వెనుకనే వెళ్ళి పట్టుకొని కట్టివేసి ఎలా స్వవశం చేసుకొంటాడో, అట్లే మత్తగజసముడనగు నన్ను నాస్వామివగు నీవు కట్టిపెట్టుకొని కాపాడుమని వేడుకొంటున్నాను.

భగవంతునిచే కటాక్షింపబడినప్పటికి సన్మార్గంలో దృఢచిత్తత లేక దుర్మార్గంలోనే వెళ్లదలతును. పాపాలకు తగిన శిక్షలను పొందుతూ ఉండినా నాదర్పం శమించుట లేదు. మరల ఆ పాపాలనే చేస్తాను. ఓ దేవీ! నీ ప్రవాహమనే గంగానదిలో స్నానంచేసిన పిదప (ప్రపత్తి చేసిన పిదప) దుమ్ముతో సమానమైన ప్రాపంచిక విషయాలలో ఆసక్తుడనగుదును. బురదనెత్తి పూసుకొందును. తల్లి బిడ్డకు సేవచేయునట్లతిప్రీతితో నీవు నన్ను గ్రహించినా నేను అతిభయంకరుడుగనే ఉందును. ఏనుగును రాజభవనంలో ఉంచి ఎంత లాలనచేసినా మదం పట్టినపుడు అరణ్యాన్ని తలచుకొని పారిపోవునట్లు, నేనుకూడా విషయారణ్యాలను తలచుకొని నీపట్టునుండి వదలిపోవుదును. నీవు వద్దని నిన్నడ్డగింతును. అట్టి నన్ను "నేను నిన్ను చేరినవాడను. నీయందు ప్రపత్తిచేసినవాడను" అనే కారణంచేత

నీ అనుగ్రహమనే సంకెలచే కట్టిపెట్టి రక్షించు. సన్మార్గంలో స్థిరపరచుమని భావం. విషయవాసన అంతక్రూరమైనది. దానిని దూరం చేయడం చాల కష్టమనే విషయాన్ని ఆచార్యులిచట స్పష్టం చేశారు.

అనంతర శ్లోకంతో అంతమయ్యే ఈ దశకం, స్తోత్రంకూడా ఒక విధంగా సమాప్తి పొందుతున్నది. తత్పూర్వమైన ఈశ్లోకంలో ప్రధానమగు ఈ విషయాన్ని (విషయవైరాగ్యాన్ని తనకు కలుగజేయునట్లు) ప్రార్థిస్తున్నారు.

''త్వద్వారణం'' అనుదానికి నీయొక్క ఏనుగును, నిన్ను నిరోధించువానిని" అని "అనుగ్రహ" అను దానికి "అనుక్రమం, వెనుక వెళ్లి పట్టుకొనుట" అని అర్థం.

**శ్లో॥ నాతఃపరం కిమపి మే త్వయి నాథనీయం**
**మాతర్దయే! మయి కురుష్వ తథా ప్రసాదమ్ ।**
**బద్ధాదరో వృషగిరిప్రణయీ యథాఽసౌ**
**ముక్తానుభూతిమిహ దాస్యతి మే ముకుందః ॥ 100**

**ప్రతి :** హే మాతఃదయే= ఓ తల్లీ దయాదేవీ!, వృషగిరిప్రణయీ= వేంకటాద్రివాసమునందత్యంతాసక్తుడైన, అసౌముకుందః= మోక్షప్రదాన సమర్థుడగు ఈ శ్రీనివాసుడు, బద్ధాదరః= (నాయందు) ఆదరం కలవాడై, ఇహ= ఇక్కడే, ముక్తాఽనుభూతిమ్= ముక్తులయొక్క అనుభవాన్ని, యథా దాస్యతి= ఎట్లిచ్చునో, తథా= అట్లు, మయి= నాయందు, ప్రసాదం= అనుగ్రహం, కురుష్వ= చేయుము, అతఃపరమ్= దీనికంటె, మే= నాకు, త్వయి= నీయందు, నాథనీయమ్= యాచింపదగింది, కిమపి న= ఏమీ లేదు.

**అవ :** కింది శ్లోకంలో"పరమాత్మని యోఽరక్తో విరక్తో పరమాత్మని" అనురీతిగా విషయవైరాగ్యం కలిగిన పిమ్మట మాత్రమే పరమపురుషుని యందు ప్రకంప్యమైన భక్తి కలుగును కాని మొదట తనకు విషయ వైరాగ్యం



కలిగించమని ప్రార్థించారు. అంత్యమైన ఈ శ్లోకంలో అతిప్రధానఫలమైన ముక్తులకేర్పడునట్టి పరమాత్మాఽనుభవం తనకు తిరుమలలోనే లభించాలని ప్రార్థిస్తున్నారు.

**తా :** తల్లీ! దయాదేవీ! కడపట నాకిదొక్కటే నిన్ను యాచింప దగినవస్తువు. ఇదిదప్ప వేరేదీ లేదు. మహాలక్ష్మితోకూడిన శ్రీనివాసుడు పరమాదరంతో దుఃఖసంబంధంలేక ముక్తులనుభవించే బ్రహ్మాఽనందానుభవాన్ని ఈ కొండయందే నాకిచ్చునట్లు నీవు నాపై దయచూపు. నావంటివారికి మరొక ఫలంమీద ఆశ గలుగదు. ఎప్పుడును అవిచ్ఛిన్నంగా భగవత్స్మరణాఽనుభవాదులే అభిలషణీయాలు. వైకుంఠలోకంలో ఏర్పడే అనుభవం సాక్షాన్ముక్తాఽనుభవం. దానివలె నేనున్నంతవరకు ఈ వేంకటాద్రియందే ఆ అనుభవం నాకు ఇవ్వవలెనని పరమతాత్పర్యం. పరమవిరక్తాగ్రేసరులైన ఆచార్యులకు ఈ ముక్తానుభవం ఇంతకుముందు లేదనుట లేదు. అయినా, ఆ వస్తువులోగల ఆదరాతిశయంచేత అది స్థిరంగా ఉండవలెనను అభిప్రాయంచేత అపూర్వకంగా దానిని కోరునట్లు కోరుతున్నారు.

"బద్ధాదరః" అనే పదానికి "బద్ధేషు ఆదరో యస్య సః" అను వ్యుత్పత్తిచే బద్ధజీవులయందధికమగు ఆదరం చూపించి వారి కోరికలను పూర్తిచేసి "కలౌ వేంకటనాయకః" అనురీతిగా సర్వదేవతాసార్వభౌముడుగా నిలుచుస్థితి మన వేంకటేశ్వరస్వామికి కలదని ఆచార్యులు సూచిస్తున్నారని పెద్దలు వ్యాఖ్యానిస్తారు.

***దశమదశకం సమాప్తం.***

***శ్రీమతే నిగమాంతమహాదేశికాయ నమః***

## ఉపసంహారాష్టకం

శ్లో॥ నిస్సీమవైభవజుషాం మిషతాం గుణానాం
స్తోతుర్దయే! వృషగిరీశగుణేశ్వరీం త్వామ్ ।
తైరేవ నూనమవశైరభినందితం మే
సత్యాపితం తవ బలాదకుతోభయత్వమ్ ॥ 101

ప్రతి : హేదయే!= ఓదయాదేవీ!, నిస్సీమవైభవజుషాం= ఎల్లలులేని మహత్త్వం కల, గుణానాం= భగవంతుని జ్ఞానబలైశ్వరాదిగుణాలు, మిషతాం (సతాం)= మేలుకొనుచుండునప్పుడే, వృషగిరీశగుణేశ్వరీం= వేంకటాద్రీశుని గుణములకీశ్వరివగు, త్వాం= నిన్ను, స్తోతుః= స్తోత్రముచేయుచున్న, మే= నాయొక్కవిషయంలో, అవశైః= పరవశాలైన, తైఃఏవ= ఆ గుణాలచేతనే, అభినందితం= అభినందింపబడింది, (కాన) తవ= నీయొక్క, బలాత్= బలముచే కలిగిన, (నిన్నాశ్రయించియుండుటచే) అకుతోభయత్వం= ఎవరి దగ్గరనుండి భయం లేనితనం, (తైరేవ= ఆ గుణముల చేతనే), సత్యాపితం= సత్యమని నిరూపింపబడింది, నూనం= నిశ్చయం.

అవ : గతదశదశకాలలోని తొమ్మిదిదశకాలతో దయాదేవిని పలురీతుల స్తోత్రం చేసి, దశమదశకంలో తన కభీష్టాలైన ఫలాలను ప్రార్థించి వందశ్లోకాలతో స్తోత్రం పూర్తి చేశారు. ఇకపై ఉన్న ఎనిమిది శ్లోకాలలో, భగవద్గుణాలను తాను స్తోత్రం చేయడానికి దయనే పరిగ్రహించుటలోగల ఔచిత్యాన్ని, అపరాధ క్షమను, సాత్త్వికత్యాగాన్ని, ఈ స్తోత్రాన్ని అనుసంధించు వారికి కలుగు ఫలసిద్ధి మొదలగు విషయాలను ఉపసంహారరూపంగా ప్రకటిస్తున్నారు.

కింది శ్లోకంలో ''ముక్తాఽను భూతిమిహ దాస్యతీ" అనుటచే ముక్తులనుభవించే అనుభవం తన కిక్కడనే లభించాలని ప్రార్థించారు. ఈ శ్లోకంలో, అట్టి అనుభవం తనకొక విధంగా లభించిందని చెపుతున్నారు.



ముక్తానుభవమంటే "న బిభేతి కుతశ్చనేతి" అని ఉపనిషత్తులు చెప్పిన విధంగా ఏ వస్తువునుండికూడా భీతి పొందక ఉండడం. అది తనకు సంభవించిందనే విషయాన్ని ఒక ఉత్ప్రేక్షమూలంగా ప్రకటించి భగవద్గుణాలతో దయను స్తోత్రం చేయడానికి పరిగ్రహించుటలోగల ఔచిత్యాన్ని స్పష్టీకరిస్తున్నారు.

తా : తల్లీ! దయాదేవీ! నేను భగవద్గుణాలన్నింటికి ఈశ్వరివగు నిన్ను స్తోత్రం చేయునపుడు జ్ఞానబలైశ్వర్యాదులను, మహాప్రభావశాలులును అగు మిగిలిన భగవద్గుణాలను రెప్పలార్పకుండా చూస్తూనే ఉన్నాయి.

"వృషగిరి గృహమేధిగుణా బోధబలైశ్వర్యవీర్యశక్తిముఖాః ।
దోషా భవేయు రేతే యది నామ దయే! త్వయా వినాభూతాః"॥

అని, "గుణేషు సార్వభౌమీ" అని కింద చెప్పిన ప్రకారం సర్వ గుణాలకు నీ చేతనే మహత్త్వం కలుగుతున్నది. నీవే ఆ అన్నింటికి స్వామినివని తలచి అట్టి గుణాలను అనాదరించి నిన్ను స్తోత్రం చేశాను. ఈ స్తోత్రం వింటూ ఉండిన ఆ గుణాలు పరవశంతో శిరఃకంపం చేసి నిన్నామోదించాయి. చెట్టుకు వేరున నీరుపోసినయెడల చివుళ్లు, పుష్పాలు, ఫలాలు మొదలగువానికి పుష్టి ఏర్పడునట్లు సర్వభగవద్గుణాలకు, "గుణము" అనే తత్త్వాన్ని కలిగించు దయను స్తుతించినయెడల తద్వారా మిగత గుణాల ప్రభావం కూడా స్థిరీకరింపబడినట్లే. ఇదే శాస్త్రరహస్యం కావున ఈ విషయం తెలిసిన ఆ గుణాలు ఈ స్తోత్రమును ఆమోదిస్తున్నాయని భావం. కావుననే నే నా గుణాలకు భీతిల్లక నిన్నే స్తుతించాను. నీయొక్క బలం నాకేర్పడినందున అందరినుండి నిర్భయత్వదశ నా కేర్పడింది. ఇది నిజమేనన్న విషయం నాగుణాలే నిరూపించాయి. అతిప్రబలమైన ఆ గుణముల దగ్గరకూడా నేను భయపడలేదుగదా! దీనిని అవికూడా ఆమోదిస్తున్నాయికదా! ఇంతకును, హే దయే! నీ బలమే కారణమను ఈ చమత్కారోక్తిచే భగవద్దయానుగ్రహం కలిగితే అకుతోభయత్వమనే ముక్తానుభవం ఇక్కడనే కలుగవచ్చునను శాస్త్రార్థాన్ని తననే ఉదాహరించి ఆచార్యులు నిరూపించారు.

**శ్లో॥ అద్యాపి తద్వృషగిరీశదయే! భవత్యా**
**మారంభ మాత్రమనిదం ప్రథమస్తుతీనామ్ ।**
**సందర్శిత స్వపరనిర్వహణా సహేథాః ॥**
**మందస్య సాహసమిదం త్వయి వందినో మే ॥ 102**

**ప్రతి :** హే వృషగిరీశదయే!= ఓ శ్రీనివాసుని దయాదేవీ!, భవత్యాం= నీయందు, అనిదం ప్రథమస్తుతీనాం= "ఇది" అని గుర్తింపదగిన ఒకకాలం ఉత్పత్తి కాలం కాగలది అనుట లేకుండా సర్వకాలాలలోను నిత్యమూ ఉండే వేదమనే స్తోత్రాలకు, అద్యాఽపి= నేటివరకు, ఆరంభమాత్రమ్= ఆరంభం మాత్రమే కలదు, తత్= అందుచే, త్వయి= నీ విషయంలో, మందస్య= మందుడగు, వందినః= స్తుతి పాఠకుడైన, మే= నాయొక్క, ఇదం= ఈ, సాహసం= సాహసాన్ని, సందర్శిత స్వపరనిర్వహణా= చూపబడిన స్వపర నిర్వాహకత్వంకల నీవు, సహేథాః= సహింతువు గాక!

**అవ :** గత శ్లోకంలో భగవద్గుణాలయందు దయకుగల ఉత్కర్షం చూపి తదవలంబంచేతనే తనకు నకుతోభయత్వమేర్పడిందని చెప్పి దయా దేవియొద్ద తనకృతజ్ఞతను ఆవిష్కరించారు. ఈ శ్లోకంలోను, ఉత్తర శ్లోకంలోను అట్టి మహాప్రభావంకల దయాదేవిని మందబుద్ధినగు నేను స్తుతించడం చాల సాహసమైన కార్యం. ఇలా చేసిన నన్నామె క్షమింపగలదని వేడుకొంటున్నారు. ఈ శ్లోకంలో దయాదేవికి వేద ప్రతిపాద్యత్వాన్ని, ఉత్తరశ్లోకంలో ప్రధాన వేదోపబృంహణమైన ఇతిహాసరత్న రామాయణ ప్రభృతి ప్రతిపాద్యత్వాన్ని వర్ణిస్తున్నారు.

**తా :** పురుషనిర్మితం కానందున ఎట్టి దోషాలకు అవకాశంలేక ఎప్పుడూ నిత్యంగా వెలుగుతున్న వేదాలు భగవత్ప్రభావాన్ని వర్ణింప వచ్చిన అనాది స్తోత్రాలే. అట్టి వేదరూపమైన స్తోత్రాలు కూడా భగవద్గుణాలను వర్ణింపనారంభించి ఈదినంవరకు ఆరంభదశలోనే ఉన్నాయి. ఒక గుణాన్ని కోటిలో ఒక భాగంకూడా వర్ణించలేక ఆరంభదశలోనే ఉన్నాయని భావం.



అట్టి మహాప్రభావం పొందిన గుణసార్వభౌమివగు నీ విషయాన్ని అతిమందబుద్ధినైన నేను స్తుతించడం సాహసమే. అపరిచ్ఛిన్న ప్రభావంగల నిన్నొక పరిచ్ఛేదంలో నిలిపి నీ ప్రభావం తగ్గించునట్లుగా ఈ కార్యం ఉన్నదని చెప్పవచ్చు. అట్టి కార్యం నిర్వహించే స్తుతిపాఠకుడనగు నా కృత్యాన్ని స్వపరనిర్వహణ స్వభావంగల నీవు క్షమించాలని ప్రార్థిస్తున్నారు. స్వపర నిర్వహణమంటే ఇతర పదార్థాలను తాను నిర్వహించునట్లు తనను గూడ తానే నిర్వహించుకోవడం. చీకటిలోని వస్తువులను (వెలిగించబడిన) దీపం తెలియజేస్తుంది. ఆ దీపాన్ని తెలియజేయడానికి మరొక దీపం వెలిగించవలసిన అవసరం లేదు. దీపం తననుతానే ప్రకాశపరచుకొని ఇతర వస్తువులను ప్రకాశపరచుటచే దానిని స్వపరనిర్వాహకమని చెప్పవచ్చు. అట్లే "సంబంధము" అనే ధర్మంలో స్వపరనిర్వాహకత్వాన్ని శాస్త్రజ్ఞులు ఉపపాదిస్తారు. దయకూడా ఇట్టిదే. దయ ఇతరుల మనస్సులలో ప్రవేశించి అపరాధులయొక్క అపరాధాలను క్షమించునట్లు చేస్తుంది. స్వవిషయంలో చేసే అపరాధాలను క్షమించడానికి మరొక దయను ఆశ్రయించదు. స్వవిషయంలో ఏర్పడే అపరాధాలను ఇతర పురుషకారం లేకుండా స్వయంగానే క్షమించి ఇతరుల విషయంలో ఏర్పడెడి అపరాధాలను క్షమించవలసిన సమయంలో వారి మనస్సులో ప్రవేశించి వారికి పురుషకారంగా ఉండి వారిని కూడా క్షమింపజేస్తున్నట్లు చేస్తున్నదని భావం. ఇట్టి స్వభావం గలదానవు గనుక నిన్ను స్తోత్రం చేయడం అనే ఈ అపరాధాన్ని నీవే క్షమించాలని ప్రార్థిస్తున్నారు.

**శ్లో॥ ప్రాయో దయే! త్వదనుభావమహాంబురాశౌ**
**ప్రాచేతసప్రభృతయోఽపి పరం తటస్థాః ।**
**తత్రావతీర్ణమతలస్పృశమాప్లుతం మాం**
**పద్మాపతేః ప్రహసనోచితమాద్రియేథాః ॥ 103**

**ప్రతి :** హే దయే= ఓ దయాదేవీ!, త్వదనుభావమహాంబురాశౌ= నీ మహిమ అనే పెద్ద సముద్రమునందు, ప్రాచేతసప్రభృతయోఽపి= వాల్మీక్యాది మహర్షులుకూడ, ప్రాయః= తరచుగా, తటస్థాః పరం= గట్టుననే నిలిచినవారైరి, తత్ర= ఆ సముద్రమునందు, అవతీర్ణం= దిగినట్టియు, అతలస్పృశం= అడుగునేలను పొందనట్టియు, ఆప్లుతం= తేలుచున్నట్టియు (అడుగడుగున మునుగుచున్నట్టియు), అతఏవ= కావుననే, పద్మాపతేః= శ్రీనివాసునియొక్క, ప్రహసనోచితమ్= హాస్యాస్పదుడనగు, మాం= నన్ను, ఆద్రియేథాః= ఆదరింతువుగాక!

**అవ :** కింది శ్లోకంలో స్తోత్రంచేయుట అనే సాహసకృత్యం చేసిన తనను క్షమించాలని ప్రార్థించారు. ఈ శ్లోకంలో అట్లు క్షమించడమేగాక నన్నుకూడా ఆదరించాలని ప్రార్థిస్తున్నారు. ఎందుకాదరించాలంటే నీ నాథుడగు శ్రీనివాసునకు, తద్దివ్యమహిషియగు పద్మావతికి ఒకవిధమగు హాస్యం కలిగించుట చేతనే అను ఒక కారణం చూపే వ్యాజంతో మరెవ్వరిచేతా చేయబడని ఒక విలక్షణమైన దయాస్తోత్రాన్ని తాను చేసి భగవద్దయకున్న ప్రభావాన్ని వెల్లడించిన ప్రక్రియను సూచిస్తున్నారు.

**తా :** భగవద్గుణాలను, తచ్చరిత్రను వర్ణించడానికి ప్రయత్నించిన ఆదికవియగు వాల్మీకి, తదనుసారులైన తదితర మహర్షులు భగవద్గుణాలలో ప్రధానమైన దయయొక్క మాహాత్మ్యాన్ని విశదీకరింపక "అదొక పెద్దసముద్రం. దానిలో దిగడం సాధ్యంకానిపని" అని తలచి గట్టుననే నిలిచిపోయారు. అనగా ఆ దయకు గట్టువలెనున్న భగవానునియందే నిలిచిపోయారని భావం. ఆదికవి మొదలగు మహర్షులే అట్లుండ ఇతర కవులనుగూర్చి చెప్పదగిన దేమున్నది? ఇట్లు వారిచేతనే అసాధ్యమని తలచి వదలబడిన ఈ దయాప్రభావ సముద్రంలో దిగడం అనే సాహసకృత్యం అనగా దయాప్రభావాన్ని వర్ణించుట అను పనిని చేయదలచి నేను దానియందు దిగినాను. కాని ఆ సముద్రంలోని అడుగుభాగాన్ని కనిపెట్టి, అంతవరకు వెళ్లి అందున్న సమస్త విశేషాలను తెలుసుకోలేక వ్యథ పొందుతున్నాను. దానిలోతు అంతది. దయాప్రభావం అపరిచ్ఛేద్యమని భావం. అడుగునేల కనిపించకపోవుటచే అడుగడుగునా మునుగ యత్నించినప్పటికి తేలిపోతున్నాను. ఈ స్థితిలో ఉన్న నన్ను చూచి దివ్యదంపతులు నవ్వుతున్నారు. ఇట్లు వారికొక వినోదం కలిగించే కారణాన్ని గుర్తించి నన్ను నీవు ఆదరించాలని ప్రార్థిస్తున్నాను.



ఎందరో పెద్దలుగూడ చేయక వదలిన విషయంలో సాహసంతో దిగి పూర్ణంగా ఆ విషయాన్ని వివరించలేక అగచాట్లపాలగు నన్నాదరించాలని ప్రార్థించే వ్యాజంతో తన నైచ్యాన్ని, దయకున్న విపుల ప్రభావాన్ని బోధిస్తున్నారు.

ఎవరిచేతను చేయబడనిది, చేయుటకు వీలుగానిది అగు ఈ దయాప్రభావవర్ణనమనే ఉత్తమకైంకర్యం ఆచరించిన స్వవిషయంలో దివ్యదంపతులు చాల సంతసిల్లి మందహాసం చేస్తున్నారు. కావున వారికి హృదయాహ్లాదకమైన ఈ కైంకర్యం చేసిన నన్ను ఓ దయాదేవీ! నీవు తప్పక ఆదరించాలని ప్రార్థిస్తున్నారనుట ఇచటి ఆంతర తాత్పర్యమని కొందరు వర్ణిస్తారు.

**శ్లో॥ "వేదాంతదేశిక" పదే వినివేశ్య బాలం**
**దేవో "దయాశతక" మేతదవాదయన్మామ్ ।**
**వైహారికేణ విధినా సమయే గృహీతం**
**వీణావిశేషమివ వేంకటశైలనాథః ॥ 104**

**ప్రతి :** వేంకటశైలనాథః= వేంకటాద్రీశుడగు, దేవః= దేవతాసార్వభౌముడైన శ్రీనివాసుడు, బాలం= బాలుడగు నన్ను, వేదాంతదేశికపదే= వేదాంతాచార్య పదములో, వినివేశ్య= ఉంచి, వైహారికేణవిధినా= విహారార్థమగు ఒక రీతిచే, సమయే= ఒక సందర్భమునందు, గృహీతం= పరిగ్రహింపబడిన,

వీణావిశేషమివ= ఒకవిధమైన వీణవలె, మాం= నన్ను (నామూలంగా), ఏతత్= ఈ, దయాశతకం= దయాశతకమను స్తోత్రాన్ని, అవాదయత్= నినదింపజేసెను.

**అవ :** కింది పద్యద్వయంచే ఈ సాహసం చేసిన తన్ను క్షమించి ఆదరించాలని ప్రార్థించారు. ఈ పద్యమునందీ స్తోత్రాన్ని నేను రచించ లేదు. సాక్షాత్పరమపురుషుడగు శ్రీనివాసుడే నన్నొక ఉపకరణంగా చేసుకొని రచించెనని భావించి సాత్త్వికత్యాగాన్ని అనుష్ఠిస్తున్నారు. దీనిచే ఈ గ్రంథంయొక్క ప్రభావంకూడా వెల్లడించినట్లవుతున్నది. పండ్రెండవ శ్లోకం మొదలు గతశ్లోకంవరకు దయాదేవిని నేరుగా సంబోధించి విన్నవించారు. ఇది మొదలైదుపద్యాలు తనకంతరంగులకు వారినిగూర్చి ఈ స్తోత్రప్రభావం. దీనినభ్యసించువారికి కలుగు ఫలం మొదలగు విషయాలను ఉపదేశించేవిగా అమరి ఉన్నాయి.

ఒక ప్రభువు విహారసమయంలో ఒకవీణను చక్కగా మీటి తనకిష్టమైన ఉత్తమ పద్యాలను పాడించి స్వయంగా సంతసించి స్వకీయులనుకూడా ఎలా సంతసింప జేస్తాడో, అట్లే జగద్వ్యాపారలీలారసి కుడైన శ్రీనివాసుడు ఎట్టి జ్ఞానంలేక అచేతనమైన వీణతో సమానుడనైన నన్ను "వేదాంతాచార్యుడు" అనే స్థానంలో ఉంచి "దయాశతక" మనే ఈ స్తోత్ర పద్యాలను నా ద్వారా పాడించాడు. వీణతో పాడునపుడు ఆ గౌరవమంతా శ్రీనివాసునికే చెందుతున్నది. తనకు దీనిలో ఎలాంటి భాగంలేదని తన తక్కువతనాన్ని, భగవదుక్తమనుటచే ఈ స్తోత్రానికి గల ఉత్కర్షను బోధించి సాత్త్వికత్యాగం ప్రకటిస్తున్నారు. "వేదాంతాచార్య" పదవిలో ఉంచి నా ద్వారా ఈ స్తోత్రాన్ని రచింపజేసెనని చెప్పుటచే ఈ స్తోత్రంలో సర్వ వేదాంతరహస్యార్థాలు ఇమిడి ఉన్నాయని సూచితమవుతున్నది. అట్టి ఉన్నతపదవి నధిష్ఠించినవారు కాక మరొకరిచే చేయుటకు సాధ్యంకాని కార్యమిది అని మనం తెలుసుకోవాలి. ఇట్లే "బాలం" అనే పదాన్ని ఇక్కడ



ప్రయోగించునట్లు చేసిన పరమపురుషుని ఆశయమేమనగా – "పాండిత్యం నిర్విద్యబాల్యేన తిష్ఠాసేత్" అను ఉపనిషదుక్త ప్రక్రియ ననుసరించి విశేషప్రభావం పొందిన మన ఆచార్యులే (వేదాంతదేశికులే) ఈ "వేదాంతదేశిక" పదానికి అర్హులని సూచించడమే.

"వేంకటశైలనాథోఽవాదయత్" అని చెప్పడంవల్ల ఆచార్యులకు "వేంకటనాథు" డనేది పితృకృత నామం కావున, సాక్షాచ్ఛ్రీనివాసావతారమే ఆచార్యులు అనే విషయాన్ని "వేంకటేశావతారోఽయమ్" ఇత్యాది మాటలతో ఆచార్యుల కుమారుడు మొదలగు మహనీయులు కీర్తించారు. కావున ఈస్తోత్రంలో ప్రయోజకకర్తృత్వం, ప్రయోజ్యకర్తృత్వం రెండూ (శ్రీనివాసవేదాంతదేశికరూపాన) శ్రీనివాసునికే కలవని చెప్పడంలో ఆటంకమేమీ లేదు. ఆచార్యచరిత్రలో శ్రీరంగనాథుడు "వేదాంతాచార్య" బిరుదును ఆచార్యులకు ప్రసాదించినట్లు చెప్పడం ఉంది. ఇక్కడ శ్రీనివాసుడు తనకాపదమునిచ్చినట్లున్నది. శ్రీనివాసుడు, రంగనాథుడు ఇరువురు ఒకరే కావున రంగనాథుడు ఇచ్చిన బిరుదును శ్రీనివాసుడు ఇచ్చినాడని చెప్పడంలో విరోధం లేదు. అంతేగాక ఇప్పుడు సర్వుల అనుసంధానంలో గల "వేంకటేశాష్టోత్తరశతనామ' స్తోత్రాలలో "కృష్ణాఖ్య విప్రవేదాంత దేశికత్వప్రదాయ చ" అని ఒక నామం ఉంది. దీనిచే "కృష్ణ" దను ఒక బ్రాహ్మణోత్తమునికి "వేదాంతదేశికు" దను బిరుదును శ్రీనివాసుడిచ్చినట్లు తెలుస్తున్నది. కావున మన ఆచార్యులే పూర్వజన్మలో "కృష్ణద" ను బ్రాహ్మణుడని చెప్పడంలో ఎట్టి ఆక్షేపణలకు తావు లేదు. కనుక మొదట శ్రీనివాసుడిచ్చిన బిరుదునే ఆచార్యావతారదశలో రంగనాథుడు స్థిరపరచినాడని చెప్పవచ్చు. మొదట ఆ బిరుదును తనకు శ్రీనివాసుడే ప్రసాదించాడు కాబట్టి ఇక్కడ "వేంకటశైలనాథః వేదాంతదేశికపదే వినివేశ్యబాలం" అని శ్రీనివాసుని విషయాన్ని అనుసరించి ఉన్నారనడం సమాధానంగా భావించవచ్చు.

శ్రీనివాసుడు తనను తానే స్తుతించుకొన్నాడనే దోషానికి అవకాశం లేకుండా దయనే స్తుతించియుండుటచే ఏమాత్రం సంకోచం లేకుండా ఆమెప్రభావాన్ని సంపూర్ణంగా, చక్కగా ఈ స్తోత్రంలో వెల్లడించాడు. ఇది "దయాశతకమే" గాని శ్రీనివాసశతకం కాదుగదా! ఇదే "దయాశతక" పదాన్ని గురించి తెలిపే రహస్యార్థం.

**శ్లో॥ అనవధిమధికృత్య శ్రీనివాసానుకంపా**
**మవితథవిషయత్వాద్విశ్వమవ్రీడయంతీ ।**
**వివిధకుశలనీవీ వేంకటేశప్రసూతా**
**స్తుతిరియమనవద్యా శోభతే సత్త్వభాజామ్ ॥ 105**

**ప్రతి :** అనవధిం= ఎల్లలులేని, శ్రీనివాసానుకంపాం= శ్రీనివాసునిదయను, అధికృత్య= విషయంగా చేసి, వేంకటేశప్రసూతా= వేంకటేశునిచే నిర్మింపబడినదియు, అవితథ విషయత్వాత్= అసత్యంగాక సత్యమైన విషయాన్నే కలిగియుండుటచే, విశ్వం= అందరిని, (ఏ ఒక్కరినైనను), అవ్రీడయంతీ= సిగ్గుపడునట్లు చేయనిదియు, వివిధకుశలనీవీ= సకలవిధక్షేమాలకు మూలధనమైనదియు, అనవద్యా= ఎట్టిదోషం లేనిదియు అగు, ఇయంస్తుతిః= ఈ స్తోత్రం, సత్త్వభాజాం= సత్త్వగుణోపేతులకు, శోభతే= సమీచీనమని స్ఫురిస్తుంది.

**అవ :** కింది శ్లోకంలో సాత్త్వికత్యాగం ఆచరించారు. ఇక్కడ ఈ స్తోత్రానికి గల మహత్త్వం ప్రకటిస్తున్నారు. ఇంతేగాక గతశ్లోకంలో వక్తృవైలక్షణ్యంతో గ్రంథానికిగల ఉత్కర్షనుచూపి, ఇక్కడ విషయవైలక్షణ్యం వలన కలిగే ఉత్కర్షను నిరూపిస్తున్నారనే సంగతి చెప్పవలసి ఉంది. సర్వఫలాలను ఈ స్తోత్రం ప్రసాదిస్తుందని చెప్పడంవలన ఫలశ్రుతిపరంగాను చెప్పవచ్చు.

**తా :** శ్రీనివాసునిదయకు ఎల్లలులేవు. తత్ప్రభావమపారమని భావం. అట్టి దయావిషయమైన ఈ స్తోత్రమెవరికీ సిగ్గును కలిగించడం లేదు. అనగా-



లోకంలో ఒకరిని స్తుతించేటపుడు వారిదగ్గర లేని గుణాలను గణించి చెపితే అది మిథ్యాస్తుతి కావున ఆస్తోత్రం చెప్పువానికి, స్తుతింపబడువానికి, పక్కనుండి వినువారికి ఒక విధమైన లజ్జ కలగడం లోకసహజం. అది పరిహాసం చేసినట్లు అనుకోవడానికి అవకాశముంది. ఈ స్తోత్రంలో దయావిషయంగా చెప్పిన మాటలన్నీ సత్యాలుగాను, మిథ్యాసంబంధలేశం లేనివిగాను ఉండుటచే స్తోత్రం చేసిన నాకును, స్తుతి విషయీభూతయైన దయాదేవికి, లేక పక్కనుండి వినే శ్రీనివాసునికి, ప్రాపంచికులకు – ఎవ్వరికీ సిగ్గుగల్గుట కవకాశం లేదని భావం. వక్తృవిషయవైలక్షణ్యాలు పూర్ణంగా కలిగి ఉండడంవలన ఈ స్తోత్రం సకలవిధక్షేమాలను ఇస్తుంది. త్రివర్గం అపవర్గం అనబడే చతుర్విధ పురుషార్థాలనిస్తుందని భావం. ఇది వేంకటేశునిచే చేయబడింది. వేంకటేశుడని శ్రీనివాసునికి, ఆచార్యులకు పేరు. కాగా కింద చెప్పిన విధంగా ఒకే వేంకటేశుడు ఒకరూపంలో ప్రయోజకకర్తగాను, ఒకరూపంలో ప్రయోజకర్తగాను ఉన్నాడు. ఇది "ప్రసూతా" అనే పదంతో సూచితమవుతున్నది. ఇది పరమపురుషుడే చేసింది కనుక తదుత్కర్షం అతివిలక్షణమని భావం. శబ్దార్థాలంకారాది సర్వవిషయాలలోను కావ్యదోషాదులైన ఎలాంటి దోషాలకు అవకాశం లేదు. అట్టి ఈ స్తోత్రం సత్త్వోద్రిక్తులగు సాత్వికులకు శోభిస్తుంది. అనగా వారే అసూయారహితులై ఈ స్తోత్రసారాన్ని పూర్తిగా గ్రోలి సంతోషిస్తారు. భగవంతునియందు అసూయ లేనివారే తద్గుణకీర్తనను క్షమతో విని, సంతసించి సద్గతిని పొందుతారని భావం. ఇట్లు సకలవిధాల ఉత్కర్షను పొందినదీ స్తోత్రమని తన అంతరంగులైన భక్తులకు ఆచార్యు లుపదేశించారు.

**శ్లో॥ శతకమిదముదారం సమ్యగభ్యస్యమానాన్**
**వృషగిరిమధిరుహ్య వ్యక్తమాలోకయంతీ ।**

**అనితర శరణానామాధిరాజ్యేఽభిషించేత్**
**శమితవిమతపక్షా శార్ఙ్గధన్వాఽనుకంపా ॥ 106**

**ప్రతి :** ఉదారం= సర్వఫలప్రదమగుటచే అత్యుదారమైన, ఇదం శతకం= ఈ దయాశతకాన్ని, సమ్యక్ అభ్యస్యమానాన్= చక్కగా మరల మరల అభ్యసించువారిని, వృషగిరి= వేంకటాద్రిని, అధిరుహ్య= ఎక్కి, వ్యక్తం= స్పష్టంగా, ఆలోకయంతీ= చూస్తున్న, శార్ఙ్గధన్వాఽనుకంపా= శార్ఙ్గధరుడగు శ్రీనివాసునిదయ, శమిత విమత పక్షానతీ= శమింపజేయబడిన విరోధిపక్షాలను కలిగినదై, అనితరశరణానాం= గత్యంతరంలేని అకించనులయొక్క (శరణాగతులయొక్క), ఆధిరాజ్యే= ఉన్నతరాజపదవి యందు (మోక్షసామ్రాజ్యమునందు), అభ్యషించేత్= అభిషేకిస్తుంది.

**అవ :** గతశ్లోకంలో విషయవైలక్షణ్యప్రయుక్తోత్కర్షను చూపారు. ఇక్కడ ఈ స్తోత్రాభ్యాసకులకు కలిగే ఫలం ఉపదేశిస్తున్నారు. లేక కింది శ్లోకంలో ఈ స్తోత్రం త్రివర్ణమనబడే ధర్మార్థకామాలనిచ్చునని చెప్పి ఈ శ్లోకం మోక్షమనబడే ఉత్తమ పురుషార్థం ఇస్తుందని బోధిస్తున్నారు.

**తా :** ఈ దయాశతకం చాల ఉదారమైంది. ఎవరు దేనినడిగినా దయాదేవి ఎలా ఫలాలను ఇస్తుందో అట్లే తద్విషయమైన ఈ స్తోత్రం పరమోదారమైంది. ఈ స్తుతిని శబ్దార్థాలలో మార్పులేకుండా చక్కగా అభ్యసించువారిని వేంకటాద్రి శిఖరమెక్కి నిలుస్తున్న శ్రీనివాసుని దయాదేవి చక్కగా కటాక్షిస్తున్నది. ఎత్తైన చోటున ఉండువారికే కింద ఉన్నవారిని పూర్ణంగా చూచుట కవకాశమేర్పడుతుంది. ఇట్లామె సంపూర్ణంగా కటాక్షించి భగవంతుడు ఒకడే శరణు కాబట్టి గత్యంతరం లేక ఉండే ప్రపన్నులను, భక్తులని చెప్పబడు ముముక్షువులను వారికేర్పడిన సామ్రాజ్యంలో, అనగా మోక్షమనే కైంకర్యసామ్రాజ్యంలో పట్టాభిషిక్తులను చేస్తుంది. ఇట్లామె మోక్షం ఇచ్చునపుడు ఆమెకు (దయకును), తదితరజ్ఞానాది భగవద్గుణాలకు వివాదమేర్పడి



జ్ఞానాదిగుణాలు అపరాధియగు జీవుని తప్పక దండించాలని వాదించునపుడు దయాదేవి ఆ వాదాలను చెదరగొట్టి, స్వపక్షాన్ని స్థాపించి జీవులకు మోక్షాన్ని ఒసగుతున్నదని కింద జెప్పిన విషయాన్ని "శమిత విమతపక్షా" అను పదంచేత ఆచార్యులు బోధిస్తున్నారు.

ఈ స్తోత్రాన్ని అభ్యసించువారికే మోక్షంకలుగుతుందని చెపితే భక్తి ప్రపత్తులు చేసినవారికే మోక్షంకలుగునని చెప్పుశాస్త్రంతో విరోధం కలుగుతుందని సందేహం అక్కరలేదు. ఈ స్తోత్రం అభ్యసిస్తే ఏతద్వీర్యబలంతో మోక్షోపాయవిరోధులైన పాపాలు తొలగి శీఘ్రంగా మోక్షోపాయ సంబంధమేర్పడి పిదప మోక్షం కలుగుతుంది. కనుక సందేహం అవసరం లేదు. ఈ శాస్త్రార్థంకూడా "శమిత విమతపక్షా" అను పదంచేత వివక్షితం.

**శ్లో॥ విశ్వానుగ్రహిమాతరం వ్యతిషజత్స్వర్గాపవర్గాం సుధా**
**సధ్రీచీమితి వేంకటేశ్వరకవిర్భక్త్యా దయామస్తుత**
**పద్యానామిహ యద్విధేయ భగవత్సంకల్పకల్పద్రుమాత్**
**ఝంఝామారుతధూత చూతనయతః సాంపాతికోఽ**
**యం క్రమః ॥ 107**

**ప్రతి :** విశ్వానుగ్రహిమాతరం= ఎల్లరకు అనుగ్రహంచేయు తల్లియు (సర్వానుగ్రహప్రదాత్రియగు తల్లియు), వ్యతిషజత్స్వర్గాపవర్గాం= స్వర్గం, అపవర్గం అనే ఫలము నొసంగునదియు, సుధాసధ్రీచీమ్= అమృతోపమ యునగు, దయాం= దయను, వేంకటేశ్వరకవిః= వేంకటేశుడనే కవి, భక్త్యా= భక్తిచే, ఇతి= ఇట్లు, అస్తుత= స్తుతించెను, ఇహ= ఈ స్తోత్రంలో, యద్విధేయ భగవత్సంకల్ప కల్పద్రుమాత్= ఏదయకు వశుడైన భగవంతుని సంకల్పమను కల్పవృక్షంనుండి, ఝంఝామారుతధూత చూతనయతః= మహావాత్యచే ఊపివేయబడిన మామిడిచెట్టునుండి యుగపత్తుగా రాలిపోయిన

వందలకొలది మామిడిపండ్లవలె, పద్యానాం= పద్యములయొక్క అయం= ఈ, క్రమః= క్రమము (ప్రక్రియ), సాంపాతికః= (కవియొక్క ఇచ్ఛలేకయే) స్వయంగానే అపతిత మైనదిగా, (అస్తి= ఉన్నది).

**అవ :** కింది శ్లోకాలలో వక్తృవిషయ వైలక్షణ్యాదులను చెప్పినారు. ఈ శ్లోకంలో ప్రబంధ వైలక్షణ్యాన్ని గుర్తిస్తున్నారు. మరియు సర్వఫలాలను ఒసగే దయాదేవి తనకై ప్రసాదించిన ఒక అద్వితీయమైన ఫలమును కూడా ఇక్కడ కీర్తిస్తున్నారు.

**తా :** సర్వులకు సర్వవిధానుగ్రహాలను చేయు స్వభావం దయాదేవికి ఉంది. కావుననే ఆమెను ఎందరో బిడ్డలను కలిగిన తల్లితోసమానంగా చెప్పవచ్చు. ఏబిడ్డ యెప్పుడేవస్తువును కోరుతుందో, ఆ బిడ్డ కప్పుడావస్తువును ఇవ్వడానికి ఆ యా వస్తువులను తల్లి సిద్ధంగా పెట్టుకొని ఉండేవిధంగా దయాదేవి ప్రాణులు స్వర్గమనబడే చతుర్ముఖ బ్రహ్మపద పర్యంతమైన ఐశ్వర్యాన్నో, అపవర్గమనబడే మోక్షాన్నో అపేక్షిస్తే ఇవ్వడానికి సిద్ధంగా ఆ వస్తువులను తనకధీనం చేసుకొని ఉంది. ఈ దయ స్వస్వరూపంచేత, ఫలంచేత అమృతానికి సమానమైంది. అట్టి దయను వేంకటేశ్వరుడను కవి పరమభక్తితో స్తుతించాడు., ఈస్తోత్రం భక్తిహృదయంలో ఇమడక పరీవాహరూపమై వెలుపలకు వచ్చి శ్లోకరూపం పొందినట్లున్నదని భావం. ఈ స్తోత్రంలోగల పద్యక్రమం కవి బుద్ధిచే ఆలోచితమైందికాదు. దశదశకాలుగా ఒక్కొక్క దశకంలో ఒక్కొక్క వృత్తం కలదిగా, క్రమేణా శృంఖలాబద్ధంగా అనేక శాస్త్రార్థాలను ప్రకటించేదిగా అమరి ఉండడం కవి ప్రయత్నంతో కాకుండా, భగవత్సంకల్పంచేతనే అని భావం. పెద్దగాలికి మామిడిచెట్టులోని మాగిన వందలకొలది పండ్లు ఒకే సమయంలో ఎలా రాలిపోతాయో, అట్లే దయనే అనుసరించి కలుగు భగవత్సంకల్పమగు కల్పవృక్షంనుండి ఆ దయ అనే మహావాత్యచే పూర్వోక్త ప్రకారంగా క్రమవిశిష్టంగా ఈ వంద శ్లోకాలు అనే పండ్లు రాలాయి. భగవత్సంకల్పం ప్రార్థితమైన సర్వవస్తువులను ప్రసాదించే



స్వభావం కలిగి ఉండడంవల్ల కల్పవృక్షంగా రూపింపబడింది. అట్టి భగవత్సంకల్పాన్ని దయాధీనమంటున్నారు. దయచేతనే ఈశ్వరుడు సంకల్పిస్తున్నాడని భావం. ఈశ్వరసంకల్పమంతా దయాధీనమని పరమార్థం. అట్టి దయను ఆచార్యులు స్తుతించారు.

ఇట్లు తనభక్తి పరీవాహరూపంగా భగవత్సంకల్పవశంగా ఈ స్తోత్రం రూపొందింది కాబట్టి ఈ ప్రబంధానికొక విలక్షణమైన ఉత్కర్ష కలిగింది. పద్యాలను మాగిన మామిడిపండ్లతో సమానంగా గుర్తించుటచే ఈ పద్యాలలోని రసం ఎంతో ఉత్కృష్టమైనదని చెప్పవలసి ఉంది..

**శ్లో॥ కామం సన్తు మిథః కరమ్బితగుణావద్యాని పద్యాని నః**
**కస్యాస్మిన్ శతకే సదమ్బుకతకే దోషశ్రుతిం క్షామ్యతి ।**
**నిష్ప్రత్యూహవృషాద్రినిర్ఝరఝరత్కారచ్ఛలే నోచ్చలన్**
**దీనాలమ్బన దివ్యదమ్పతి దయాకల్లోల కోలాహలః ॥ 108**

**ప్రతి :** నః= మాయొక్క, పద్యాని= పద్యాలు, మిథః కరమ్బితగుణావద్యాని= పరస్పరం కలిసిన గుణదోషాలు కలిగినవిగా, కామం సన్తు= ఉంటే ఉండనీ, నిష్ప్రత్యూహ వృషాద్రినిర్ఝరఝరత్కారచ్ఛలేన= నిరాటంకంగా వేంకటాద్రిమీద ప్రవహించే జలపాతాలయొక్క ఝురఝురమను ఝురత్కారశబ్దమనెడు వ్యాజంచే, ఉచ్చలన్= వెలుపలికుబుకుతున్న, దీనాలమ్బనదివ్యదమ్పతి దయాకల్లోలకోలాహలః= అకించనులకవలంబ భూతులైన దివ్యదంపతులయొక్క (మహాలక్ష్మీ శ్రీనివాసులయొక్క), దయయొక్క అలలసంబంధమైన కోలాహలశబ్దం, సదంబుకతకే= సత్తులయొక్క మనస్సు అనే శుద్ధజలానికి చిల్లగింజవలె నున్న (మంచినీటికి చిల్లగింజవలెనున్న) అస్మిన్‌శతకే= ఈ శతకమునందు, కస్య= ఎవనియొక్క, దోషశ్రుతిం= దోషోద్ఘాటనశబ్దధ్వనిని, క్షామ్యతి= ఓర్చును? (ఎవరి యొక్క దోషోద్ఘాటనమును కూడా క్షమింపదని భావం).

**అవ :** గతశ్లోకంలో దయాదేవి ఈ పద్యాలను తన బుద్ధిలో స్ఫురింపజేసిన ఉపకారాన్ని గుర్తు చేశారు. ఈ శ్లోకంలో ఆ దయాదేవియే ఈ స్తోత్రం ద్వారా ప్రపంచస్థులుజ్జీవించువిధంగా వారికి చేయగల అసమానమైన ఉపకారాన్ని అనుసంధించి తద్ద్వారా దయాదేవి ప్రభావాన్ని పొగడి స్తోత్రం ముగిస్తున్నారు.

**తా :** ఈ మా పద్యాలు వలయునంతవరకు గుణదోషమిశ్రితాలుగానే ఉండుగాక! ఐనను ఆ దోషాలు మహాజనం ఈ స్తోత్రాన్ని పరిగ్రహించుటకు ప్రతిబంధాలుగా నిలువలేవు. ఎందుకంటే అన్ని అపరాధాలను క్షమించే దయాదేవి స్వవిషయంగా భగవత్సంకల్పంతో ఆవిర్భవించిన ఈ స్తోత్రంలో దోషాలను చూపడం అనే అపరాధాన్ని మాత్రం క్షమించదు కాబట్టి. ఆమె అజ్ఞాతనిగ్రహ కనుక దోషోద్ఘాటకులను దండించదు. కాని వారి దోషోద్ఘాటన విషయాన్ని ఇతరుల చెవిలో పడనట్లు చేసి, వారి ప్రయత్నాన్ని వ్యర్థంచేసి ఈ స్తోత్రానికి మహాజనపరిగ్రహంలో ఎలాంటి ప్రతిబంధం ఏర్పడనట్లు రక్షిస్తున్నది. ఇదే ప్రాపంచికులకు ఈమె చేసే మహోపకారం. "స్తుతిరియ మనవద్యా" అని కింది చెప్పినట్లే స్తోత్రమునందెట్టి దోషం లేదు. ఐనను కొందరు స్వస్వభావాన్నిబట్టి దోషాలున్నాయని చెప్పినా అవి కనిపించవు. దయానుగ్రహంతో ఉత్తమరీతిగా అమరిన ఈ స్తోత్రాన్ని మహాజనులు నిశ్చయంగా పరిగ్రహిస్తారని భావం.

దోషాలను చెప్పువారి అభిమతాన్ని అనుసరించి ఈస్తోత్రం దోషయుక్తంగా ఉండినా ఉండుగాక! అయినా సత్తులనే తీర్థానికి ఈ శతకం చిల్లగింజవలె ఉంది. సత్పురుషులు తీర్థాలవలె తమనాశ్రయించు వారిని శుద్ధిచేయుటచే వారిచట తీర్థంగా రూపింపబడినారు. అట్టి సత్పురుషులను ఈ స్తోత్రం నిర్మలీకరిస్తున్నదని భావం. సత్పురుషులు స్వయంగానే నిర్మలులుగదా అని శంకించకూడదు. ఎట్టి పెద్దలకైనా (ఆస్తికులకైనా) కొన్ని శాస్త్రార్థాలలో నిశ్చయమేర్పడక సందేహాలు కలుగుతాయి. మన ఆచార్యులయొక్క (వేదాంతదేశికులయొక్క) పలుగ్రంథాలు పలువురు



పెద్దలయొక్క ప్రార్థననుసరించి వారి సంశయాన్ని పోగొట్టుటకై ఆవిర్భవించాయనే విషయం సుప్రసిద్ధమే. ఈ స్తోత్ర ప్రపత్తి విషయంలో పలువురు పెద్దలకు కలిగే నా నా సంశయాలను పోగొట్టునట్లు అనేక శాస్త్రార్థాలు ఉండడంవల్ల దీనిని సదంబుకతకమని చెప్పవచ్చు. ఇక్కడ "అనదంబు కతకే" అని పదచ్ఛేదం చేస్తారు. అప్పుడు అసత్తులనే కలత చెందిన నీటికి చిల్లగింజవలె ఉన్నదని అర్థం. అసత్తులను కూడా సద్గతిస్థులను చేసేది అని భావం.

పెద్ద కోలాహలంతోను, బ్రహ్మాండమైన అలలతోను గిరిశిఖరంనుండి కిందికి దుమికే గొప్ప జలపాతం పక్కన ఒకడు మాట్లాడితే అతనిధ్వని ఆ మహాశబ్దంలో ఎవరి చెవిలోనూ పడదు. అట్లే వేంకటాద్రిమీద పెద్ద శబ్దంతో ప్రవహించే అనేక మహాజలప్రపాతాలయొక్క మహాధ్వని దోషాలు చెప్పువారి ధ్వనిని ఎవరి చెవిలో పడకుండా నిరోధిస్తున్నదట. ఈ కొండపైగల సెలయేళ్లన్నీ శ్రీనివాసుని దయారూపాలే అని ఈ స్తోత్రంలో అనేక పర్యాయాలు బహుసాదృశ్యాలను బట్టి రూపింపబడింది. కాగా, దయాదేవియే ఈ నిర్ఝరరూపమెత్తి అమ్మహాధ్వనిచే దోషోద్ఘాటకుల ధ్వనిని అణచివేస్తున్నది. దోషశబ్దాలు ఎవరి చెవులలోను పడనప్పుడు అందరూ ఈ స్తోత్రాన్ని ఆదరిస్తారు. ఇది దయాదేవి ప్రాపంచికులకు చేసే ఉపకారాలలో ప్రధానమైంది. పెద్ద జలప్రవాహం ఎలాంటి ప్రతిబంధాన్ని లక్ష్యపెట్టక ఎలా నిరాటంకంగా ప్రవహిస్తుందో అట్లే దయాప్రవాహంకూడా ప్రవహింప నారంభించినప్పుడు ఎవరూ దానినడ్డగించుటకు వీలుకాదు. మరియు గత్యంతరహీనులైన దీనులకు దయాదేవి అవలంబంగా ఉంది. ఇట్లు కూలంకషమైన దయ భగవంతునికి కలగాలంటే మహాలక్ష్మి సాన్నిధ్యం ఉండి తీరాలనే విషయాన్ని "దివ్య దమ్పతి దయా" అనే పదంతో ఆచార్యులిక్కడ సూచిస్తున్నారు.

***దయాశతకం సమాప్తం***

ఇది జగద్విఖ్యాత పరమహంస పరివ్రాజకాచార్య శ్రీమద్రంగరామానుజ యోగివర్య పాదారవిందసేవాసమాసాదిత సకలశాస్త్రరహస్యార్థుండగు భారద్వాజ శఠకోపాచార్యశిరోమణిచే ప్రణీతంబైన దయాశతకాంధ్ర వ్యాఖ్యానం సమాప్తం.

**తన్త్ర వేదాంతతర్కాది శాస్త్రోద్యానేషు సర్వదా ।**
**విహారీ శఠకోపాఖ్యో వ్యాఖ్యాదిత్థం దయాస్తవమ్ ॥**

**సీ॥ వినుత భారద్వాజ విమలగోత్రోద్భవుం**
**డమల వంగ్యన్వయ సముదితుండు**
**రంగలక్ష్మణయతి ప్రసదనాసాదిత**
**ప్రథిత శాస్త్రజ్ఞాన భవ్యగుణుడు**
**తంత్ర వేదాంత సత్తర్క శాస్త్రోద్యాన**
**లీలా విహారైక శీలచణుదు**
**"శాస్త్రరత్నాకర" శఠకోపనాముడు**
**మహి భగవద్దయామహిమ నిట్లు;**

**గీ॥ దేశికవరప్రణీత "దయాశతకము"**
**ద్రావిడంబున జేసిన యావిధమున**
**తెనుగు వ్యాఖ్యానయుతముగా దనరజేసి**
**శ్రీనివాసునకర్పించె చిత్తమలర ॥**

**కవితార్కిక సింహాయ కల్యాణగుణశాలినే ।**
**శ్రీమతే వేంకటేశాయ వేదాంతగురవే నమః ॥**

***శ్రీమతే నిగమాంత మహాదేశికాయ నమః ।***
***శ్రీపద్మావతీసమేత శ్రీనివాసపరబ్రహ్మణే నమః***
***శుభమస్తు***

* * *